తెలుగు

కుమారభారతి

తొమ్మిదవ తరగతి



భారత సంవిధానము

పార్ట్ – IV A

ప్రాథమిక బాధ్యతలు

51 ఎ) ప్రాథమిక బాధ్యతలు

ప్రతి పౌరుడు ఈ క్రింది బాధ్యతలను మనసారా స్వీకరించి బాధ్యతాయుతంగా ప్రవర్తించవలెను.

ఎ) రాజ్యాంగ శాసనబద్ధుడై యుండుట. శాసనమందలి ఆశయములనూ, శాసనం స్థాపించే సంస్థలనూ, జాతీయ పతకాన్ని, జాతీయ గీతాన్ని అంకితభావంతో గౌరవించుట.

బి) స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో అన్ని రంగాలలో వ్యవహరించుట.

సి) దేశ సార్వభౌమత్వాన్ని, సమన్వయతనూ, సమగ్రతను రక్షించుట.

డి) దేశరక్షణలో అనుక్షణం సంసిద్ధుడై ఉండుట.

ఇ) ప్రజాజీవనంలో అన్యోన్యతనూ, భ్రాతృభావాన్ని పోషించుట, మత, భాష, ప్రాంతీయతత్త్వాలకు వర్గవైరుధ్యములకు అతీతముగా ఉండుట. స్త్రీలను అగౌరవపరచే ఆచారములను విడనాడుట.

ఎఫ్) అమూల్యమైన భారతీయ చారిత్రక సంపదనూ, సుసంపన్న సంస్కృతినీ పరిరక్షించుట.

జి) పర్యావరణాన్ని అడవులను, కొలనులనూ, నదులనూ రక్షించుట, అభివృద్ధి పరచుట, మృగరక్షణ జలజంతు జీవరాసులపై కరుణార్ద్రత.
హెచ్) శాస్త్రీయ మరియు మానవతా దృక్పథాలను అలవరచుకొనుట, జిజ్ఞాసను పెంపొందించు కొనుట, సంస్కరణ తత్వమును పెంపొందించుట.

ఐ) హింసను విడనాడుట, ప్రజల ఆస్తుల విధ్వంసం చర్యలను నిరోధించుట.

జె) వ్యక్తిత్వ శక్తి సామర్థ్యాల ఔన్నత్యాన్ని పెంపొందించుకొనుట ద్వారా మరియూ సమిష్టి కృషి ద్వారా అన్ని రంగాలలో గణనీయమైన స్థాయిని చేరుటకొరకు, శిఖరాగ్ర సాధనకొరకు నిరంతరం కృషి సల్పుట.

కె) రక్షకులు లేదా సంరక్షకులుగా ఉన్నవారందరూ ఆరు నుంచి 14 సంవత్సరముల లోపల పసివారికి విద్యాభ్యాసము చేయు అవకాశమును కల్పించవలెను.

ప్రభుత్వ తీర్మానం క్రమ సంఖ్య : అభ్యాస్-2116/(ప్ర.క్ర.43/16) ఎస్‌డి-4 తేదీ 25.4.2016 అనుసారం స్థాపించబడిన సమన్వయ సమితి యొక్క తేదీ 3.3.2017 రోజున జరిగిన సభలో ఈ పాఠ్య పుస్తకమును నిర్దేశించుటకుగాను అనుమతి ఇవ్వబడినది.



మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411 004.

ప్రక్కనున్న అలాగే ఈ పుస్తకంలో ఇతర చోట్ల ఇచ్చిన 'క్యూ ఆర్ కోడ్' (క్విక్ రెస్పాన్స్ కోడ్) లను స్మార్ట్ 'ఫోన్‌తో స్కాన్ చేయవచ్చు. తద్వారా పాఠ్యపుస్తక అధ్యయన-అధ్యాపనకై అవసరమైన లింక్/లింక్స్ (URL) మనకు లభిస్తాయి.

First Edition : 2017 / ప్రథమ ప్రచురణ : **2017**
Reprint : 2022/ పునర్ముద్రణ : *2022*

© మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411004

ఈ పుస్తకమునకు సంబంధించిన సర్వహక్కులు మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థవి. మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్య ప్రణాళిక పరిశోధన సంస్థ సంచాలకుల లిఖితపూర్వక అనుమతి లేనిదే ఈ పుస్తకమునందలి ఏభాగమును ఉటంకించుటగాని లేదా పునర్ముద్రించుటగాని చేయరాదు.

Telugu
Language Committee

Smt. B. Sarada, Chair person
Smt. T. Suseela, Member
Smt. M. Vidya Benerji, Member
Smt. K. Anuradha, Member
Sri B. Vijayabhaskar Reddy, Member
Dr.smt. Thulasi Bharat Bhushan, Member -Secretary

తెలుగు భాషా సమితి

శ్రీమతి భమిడిపాటి శారద-అధ్యక్షులు
శ్రీమతి టి. సుశీల - సభ్యులు
శ్రీమతి ఎమ్. విద్యా బెనర్జీ - సభ్యులు
శ్రీమతి కె. అనురాధ - సభ్యులు
శ్రీ భూమనపల్లి విజయభాస్కర్‌రెడ్డి - సభ్యులు
డా॥శ్రీమతి తులసీ భారత్ భూషణ్ - సభ్య కార్యదర్శి



Co-ordination

Dr. Smt. Thulasi Bharat Bhushan
Special Officer, Telugu

సమన్వయకులు

డా॥ శ్రీమతి తులసీ భారత్ భూషణ్,
విశేషాధికారిణి - తెలుగు,
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి
మరియు పాఠ్యప్రణాళిక
పరిశోధన సంస్థ, పుణె.

Cover
Smt. Abha Bhagwat
Illustrations
Sri Ganduri Srinivas

ముఖచిత్రం
శ్రీమతి ఆభా భాగవత్
చిత్రములు
శ్రీ గండూరి శ్రీనివాస్

Telugu Language
Study Group

Smt. V. Rajeswari
Sri K. Y. Kondanna

తెలుగు భాషా
అధ్యయన మండలి
శ్రీమతి వి. రాజేశ్వరి
శ్రీ కె. వై. కొండన్న

Publisher

Sri. Vivek Uttam Gosavi
Controller

ప్రకాశకులు

శ్రీ వివేక్ ఉత్తం గోసావి
నియంత్రకులు
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి
మరియు పాఠ్యప్రణాళిక
పరిశోధన సంస్థ, ప్రభాదేవి,
ముంబయి-25.

Photo Courtesy
Dr. Sheetal Amte-Karajgi

ఛాయాచిత్రాల సౌజన్యం
డా. శీతల్ ఆమ్టే-కరాజ్‌గీ

Typesetting
M/s.Vijay Art Printers,
Pune

అక్షరకూర్పు
మె. విజయ్ ఆర్ట్ ప్రింటర్స్,
పుణె

Production

Sri. Sachchidanand Aphale
Chief Production Officer
Sri. Rajendra Chindarkar
Production Officer
Sri. Rajendra Pandloskar
Asst. Production Officer

నిర్మితి
శ్రీ సచ్చిదానంద అఫ్లే
ముఖ్య నిర్మితి అధికారి
శ్రీ రాజేంద్ర చిందర్‌కర్
నిర్మితి అధికారి

Paper:
కాగితము : 70 GSM Creamwove

Print Order No :
ముద్రణాదేశము :

Printer:
ముద్రణ :

భారత సంవిధానము

ప్రస్తావన

భారతదేశ ప్రజలమగు మేము, భారతదేశమును **సార్వభౌమ్య సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణరాజ్యముగ** నెలకొల్పుటకు మరియు అందలి పౌరులెల్లరకు

సామాజిక, ఆర్థిక, రాజకీయ **న్యాయమును**,

భావము, భావప్రకటన, విశ్వాసము,

ధర్మము, ఆరాధన -- వీటి **స్వాతంత్ర్యమును**,

అంతస్తులోను, అవకాశములోను **సమానత్వమును**

చేకూర్చుటకు; మరియు వారందరిలో

వ్యక్తి గౌరవమును, జాత్యైక్యతను,

అఖండతను తప్పక ఒనగూర్చు **సౌభ్రాత్రమును**,

పెంపొందించుటకు; సత్యనిష్ఠా పూర్వకముగ తీర్మానించుకొని,

ఈ 1949వ సంవత్సరము నవంబరు ఇరువది యారవ

దినమున **మా సంవిధాన సభయందు ఇందుమూలముగ,**

ఈ సంవిధానమును అంగీకరించి, అధిశాసనము చేసి

మాకు మేము ఇచ్చుకొన్నవారమైతిమి.

జాతీయ గీతము

జనగణమన – అధినాయక జయ హే
భారత – భాగ్యవిధాతా
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కల, బంగ,
వింధ్య, హిమాచల, యమునా, గంగా,
ఉచ్ఛల జలధితరంగ,
తవ శుభ నామే జాగే, తవ శుభ ఆశిస మాగే,
గాహే తవ జయగాథా,
జనగణ మంగలదాయక జయ హే,
భారత – భాగ్యవిధాతా
జయ హే, జయ హే, జయ హే,
జయ జయ జయ, జయ హే

ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరు నా సహోదరులు.

నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషిచేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

ప్రస్తావన

ప్రియమైన విద్యార్థి మిత్రులారా!

మిమ్ములనందరిని తొమ్మిదవ తరగతిలో ఆహ్వానిస్తున్నాను. అలాగే ఈ తొమ్మిదవ తరగతి ''కుమారభారతి'' నేస్తం, చిత్రాలు, ఛాయాచిత్రాలు మరియు వర్ణచిత్రాలతో కొత్త హంగులు సంతరించుకొని మీకు హృదయ పూర్వకంగా స్వాగతం పలుకుచున్నది.

ఈ పుస్తక నేస్తాన్ని మీ కందించుచున్నందులకు మిక్కిలి ఆనందంగా నున్నది.

విన్నదానికన్నా – చూసినది – చూసినదానికన్నా చేసిచూసినది మనస్సులో స్థిరంగా నిలుస్తుంది. అందుకే ఈ పుస్తకంలోని ప్రతిపాఠంలో కృత్యాలు ఇవ్వబడినవి. ఆసక్తిరంగా రూపొందించబడిన వాటినన్నింటిని చక్కగా సాధనచేయండి. అధ్యయనంలో ఉపాధ్యాయులేకాక పెద్దల సహాయం కూడా తీసుకోండి. ఈ పుస్తకంలోని పాఠాలు, వాటికి సంబంధించిన అభ్యాసాలు, కృత్యాలు, అదనపు సమాచారం, చాలా వరకు మీరు స్వయంగా ఆలోచించి ఆనందంగా అభ్యసించుటకు వీలుగా ఉన్నాయి. వాటన్నంటిని బాగుగా అభ్యసిస్తే మీరు చక్కని భాషాజ్ఞానాన్ని పొందుతారు.

భాషను మౌఖికంగాను, లిఖితరూపంలోను చక్కగా నేర్చుకొని ప్రతిభావంతంగా ఉపయోగించుటకు తోడ్పాటుగా లేఖన, మౌఖిక భాషా కౌశల్యాలు, సమాచార మార్పిడి నమూనాలతో సహా పొందుపరచబడ్డాయి.

పాఠ్యాంశాలేగాక వాటికి ఆవల గ్రంథాలయాలు, అంతరజ్జాలంలోని సముచిత సాహిత్యాన్ని, సంప్రదింపు (రిఫరెన్స్) సాహిత్యంగా ఉపయోగించుకొనే రిఫరెన్స్ స్కిల్స్ మీలో పెంపొందించే ప్రయత్నం కూడా చేయబడింది. జ్ఞాపకశక్తిని పరీక్షించుటకు కాక అవగాహన, ఆలోచన, పరిశోధించి తెలుసుకొనుట, తెలుసుకొన్న వాటిని అన్వయించుట మీరు నేర్చుకోవాలి. పాఠశాల విద్య జీవితానికి ఉపయోగపడాలనుటకు ప్రాధాన్యత ఇవ్వబడింది. 'నేర్చుకోవడమేగాక ఎలా నేర్చుకోవడం' అనేది నేర్పే సాధనం ఈ పుస్తకం.

దీనిని ఆనందంగా అభ్యసించండి. ఈ పుస్తకాన్ని గురించిన మీ భావనలు, అభిప్రాయాలను మాకు తప్పక తెలియజేయండి. మీ అందరికీ శుభాభినందనలు.

(డా।। సునిల్ మగర్)

సంచాలకులు

మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు

పాఠ్య ప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె–411004.

పుణె :

తేది : 28 ఏప్రిల్ 2017

౨వ తరగతి - తెలుగు (ప్రథమభాష) - భాషాధ్యయన సామర్థ్యాలు

1. శ్రవణం

- సంవాదములు, సంభాషణలు ప్రసంగాలు, ఉపన్యాసాలు, వక్తృత్వాలు, చర్చలు ముఖాముఖి, పాఠశాలలోని ప్రకటనలు మొదలగు వాటిని అవగాహనలతో విని ప్రతిస్పందిస్తారు.
- ప్రసార మాధ్యమాలలోని అంశాలపై తార్కికంగా ప్రతిస్పందిస్తారు.
- పాఠ్య, పాఠ్యేతర గద్యము, పద్యము, బుర్రకథ మొదలగు ప్రక్రియలను విని తారతమ్యాలు గుర్తిస్తారు.
- స్థానిక కళారూపాలను, ప్రదర్శనలను చూసి, విని అర్థం చేసుకుంటారు.
- అవసరమైన సమాచారాన్ని అంతర్జాలంలో అన్వేషించి, విని తగిన విధంగా ఉపయోగించుకుంటారు.

2. భాషణం/సంభాషణం

- కవితలు, గేయాలు భావానుగుణంగా పాడతారు.
- పాత్రోచితంగా నాటకీకరణ చేస్తారు.
- పాఠ్య, పాఠ్యేతర అంశాలను చదివి వారి భావాలను సొంతమాటల్లో వ్యక్తపరుస్తారు.
- సందేశాలు, సూచనలు, వార్తలు మొదలగు వానిలోని ముఖ్యాంశాలను స్పష్టంగా చెప్తారు.
- సంవాదాలు, చర్చలలో పాల్గొంటారు. ఇచ్చిన అంశంపై అప్పటికప్పుడు ఆసక్తితో ఉపన్యసిస్తారు.
- వివిధ రంగాలలోని వ్యక్తులతో ముఖాముఖి సంభాషించి విషయసేకరణ గావిస్తారు.
- వివిధ కార్యక్రమాలు, విహారయాత్ర మొదలగు వాటిని ఎలా నిర్వహించాలో చర్చించి ప్రణాళిక ఏర్పాటుచేస్తారు.
- తెలియని అంశాలను తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయులు, సహాధ్యాయులు మొదలగువారిని అడిగి తెలుసుకుంటారు.

3. పఠనం

- విభిన్న రూపాలలోని సాహిత్య ప్రక్రియలను అవగాహనతో చదువుతారు.
- వ్యాసరూపంలోని అంశాలను చదివి అర్థం చేసుకుంటారు. నియత, అనియత లేఖలను చదివి అర్థం చేసుకుంటారు.
- వార్తా పత్రికల్లోని స్థానిక వార్తలతోపాటు ప్రాచుర్యం పొందిన సంఘటనలకు చెందిన వార్తలను అవగాహనతో చదువుతారు.
- పరిసరాలలోను, విహారయాత్రా స్థలాలలో ఉన్న బోర్డులపై ఉన్న వివరాలను అర్థవంతంగా, అవగాహనతో చదువుతారు.
- బాల సాహిత్యాన్ని ప్రకాశ పఠనం చేస్తారు. పఠనపోటీలలో పాల్గొంటారు.
- ఇచ్చిన ప్రశ్నలకు సమాధానం తెలిసికొనుటకు మౌనపఠనం చేస్తారు.
- తమకు కావలసిన విషయాల గురించి అంతర్జాలంలో చదివి ఆ పరిజ్ఞానాన్ని అవసరమైన చోట్ల ఉపయోగిస్తారు.
- వివిధ ప్రక్రియలను చదవడం ద్వారా మాట్లాడే భాషకు-రాసే భాషకు ఉన్న తేడాను గ్రహించగలుగుతారు.
- సూచించబడిన జీవన కౌశల్యాలను, పాఠ్య, పాఠ్యేతర అదనపు సాహిత్యాన్ని చదివి వాటి ద్వారా నైతిక విలువలు గ్రహిస్తారు.

4. లేఖనం

- దృశ్య శ్రవణ ప్రసార మాధ్యమాలకు చెందిన కార్యక్రమాలపై అభిప్రాయాలను సొంతమాటల్లో లిఖిత రూపంలో వ్యక్త పరుస్తారు.
- కార్యక్రమాలు, అతిథుల ప్రసంగాలు వింటూ వాటిలోని ముఖ్యాంశాలను నోటుపుస్తకంలో రాస్తారు.
- వార్తా పత్రికల్లోని వార్తలు, దినవిశేషాలు మొదలగువానిని పాఠశాలలోని సూచనాఫలకంపై రాస్తారు.
- పరిచిత, అపరిచిత గద్య పరిచ్ఛేదాలపై అడిగిన ప్రశ్నలకు జవాబులను కనుగొని సొంతంగా రాస్తారు.
- అపరిచిత పరిచ్ఛేదంపై ప్రశ్నలను తయారు చేస్తారు.
- ఉపవాచక పరిచ్ఛేదాలపై అడిగిన ప్రశ్నలకు సొంత వాక్యాలలో సమాధానం రాస్తారు.
- అడిగిన ప్రశ్నలకు స్వయంగా స్పందిస్తారు.
- ఇచ్చిన అంశాల ఆధారంతో అంశ విభజన, ప్రారంభం, ముగింపులు దృష్టిలో పెట్టుకొని అలంకారాలు, జాతీయాలు మొదలగు వాటిని ఉపయోగిస్తూ తగిన విధంగా వ్యాసరచన చేస్తారు.
- నియత, అనియత లేఖలను క్రమపద్ధతిలో రాస్తారు.

5. భాషావగాహన

- స్వీయ అధ్యయనం ద్వారా సందర్భాన్నిబట్టి నిఘంటువులను సంప్రదించి పదాల అర్థాన్ని గ్రహిస్తారు.
- చదువుతున్న, చదివిన అంశాల్లోని జాతీయాలను, సామెతలను గుర్తించి అవగాహనతో నిత్యవ్యవహారంలో తిరిగి సందర్భోచితంగా ప్రయోగిస్తారు.
- గడినుడి, ఫజిల్స్, మొదలగు భాషాక్రీడల ద్వారా పదజాలాన్ని పెంపొందించుకుంటారు.
- సంధి, సమాసపదాల్ని గుర్తించి సందర్భోచితంగా ప్రయోగిస్తారు. రూపక సమాసము, బహువ్రీహి సమాసములను

తెలుసుకుంటారు. త్రికసంధి, ఆమ్రేడితసంధి, యణాదేశసంధి, వృద్ధిసంధి తెలుసుకుంటారు. శబ్దాలంకారాలను గుర్తించి వాక్యరచనలో ప్రయోగిస్తారు. మత్తేభము, శార్దూలము, కందము పద్య లక్షణాలను తెలుసుకొని గణవిభజన చేస్తారు. అర్థాలంకారంలోని ఉపమా, ఉత్ప్రేక్షా, రూపకాలంకారాలను, వాక్యాంగాలను, భాషాభాగాలను గుర్తిస్తారు.

6. అధ్యయన నైపుణ్యాలు

- విభిన్న సాహితీ ప్రక్రియలను చదివి రసాస్వాదన చేస్తారు.
- భిన్నత్వంలో ఏకత్వం ప్రతిబింబించే విధంగా విభిన్న సంస్కృతుల కార్యక్రమాల్లో పాల్గొని వాటిని అర్థం చేసుకొని ప్రశంసిస్తారు.
- తనకు లభించిన ప్రామాణిక అంశాలను వికీపీడియా,బ్లాగులకు సమర్పిస్తారు.
- దివ్యాంగుల సాధక బాధకాల్ని అర్థంచేసుకుంటారు. వారిలోని గొప్పతనాన్ని, నైపుణ్యాన్ని గుర్తిస్తారు. వారికి తగిన సహాయ సహకారాలు అందిస్తారు.
- తెలిసిన, చదివిన, విన్న అంశాలను వర్ణిస్తారు.
- ప్రకటనలు, ఆహ్వాన పత్రికలు శుభాకాంక్షలు తెలిపే పత్రికలు సొంతంగా రాస్తారు.
- మిత్రులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతారు. కార్యాలయాలకు దరఖాస్తులు రాస్తారు.
- నాటకీకరణకు సంభాషణలు, చిన్న చిన్న కథలు, గేయాలు రాస్తారు.
- అడిగిన విషయాల ఫ్యాక్ట్‌ఫైల్ తయారీకి అంతర్జాలాన్ని తగిన విధంగా ఉపయోగించుకుంటారు. తమ దగ్గరనున్న ప్రామాణికమైన అంశాలను బ్లాగులకు అందిస్తారు.
- ఫ్యాక్ట్‌ఫైల్, ప్రవాహాకృతి (ఫ్లో చార్ట్), అల్లిక (వెబ్), వృత్తాకార (pie) చార్ట్, బార్ గ్రాఫ్‌లోని అంశాల ఆధారంగా నివేదిక రాస్తారు. సంకేత స్థలాల (వెబ్‌సైట్ల) లింకులను అర్థం చేసుకొని వాటిలోని వివిధ అంశాలను తగిన రీతిలో ఉపయోగించ గలుగుతారు.
- వివిధ స్వరూపాలలోని డిజిటల్ సాహిత్యాన్ని (ఈ బుక్స్, ఆడియో బుక్స్, ఇంటెరాక్టివ్ మెటీరియల్స్, భాషా క్రీడలు మొదలగునవి) ఉపయోగించగలుగుతారు.
- సోషల్ మీడియాను తగిన రీతిలో బాధ్యతాయుతంగా ఉపయోగించాలనే జ్ఞానాన్ని గ్రహిస్తారు.

ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు....

1. ఈ పాఠ్యపుస్తకం జ్ఞాననిర్మితి సిద్ధాంతాన్ని అనుసరించి కృత్య ప్రధానంగా రూపొందించబడినది. కనుక విద్యార్థులే స్వయంగా కృత్యాలు చేస్తూ భాషాధ్యయనం చేసే విధంగా అధ్యాపనం నిర్వహించాలి. విని నేర్చుకోవడం – చూసి నేర్చుకోవడం–చేసి నేర్చుకోవడం ఉత్తరోత్తర ప్రభావవంతాలు. అందుకుగానూ ప్రతి పాఠానికి 'అ, ఆ, ఇ, ఈ' అను 4 అంచెల భాషాకృత్యాలు ఇవ్వబడ్డాయి. అందులో 'అ' అనునది కృత్యానికి పూర్వసంసిద్ధత. దాని తర్వాత దేని ఆధారంగా కృత్యాన్ని చేయాలో ఆపరిచ్ఛేదం/గేయ/పద్యభాగం 'ఆ' అనునది అవగాహన, 'ఇ' భాషావగాహనకు, 'ఈ' అనునది స్వీయ స్పందన/వ్యక్తీకరణాదులకు సంబంధించినవి.
2. పాఠ్యాంశాలతో అనుసంధానం కలిగిన అంశాలను చర్చించి, తెలుసుకొని ఆ పిదప పాఠంలోకి ప్రవేశించుట ద్వారా విద్యార్థులు ఇనుమడించిన ఉత్సాహంతో, ఉత్కంఠతో పాఠాన్ని నేర్చుకోవడం జరుగుతుంది. అందుకుగాను నేపథ్యాలు ఇవ్వబడ్డాయి.
3. కొత్త, పాత మేలు కలయికగా కూర్చబడిన పాఠ్యాంశాలను ప్రాచీన–ప్రస్తుత విషయాలతో అనుసంధానం చేస్తూ, ఇతర విషయాలతో సహ సంబంధాన్ని కూరుస్తూ బోధించినచో పాఠశాల విద్య విద్యార్థులకు మనస్సులో హత్తుకుంటుంది. నిజజీవితంలో ఉపయోగపడు తుంది.
4. ఈ తరగతికి కేటాయించిన భాషాధ్యయన సామర్థ్యాలను సాధించు రీతిలో అలాగే విద్యార్థులకు గరపవలసిన నైతిక, మానసీయ విలువలు, జీవన కౌశల్యాలు, శాస్త్రీయ దృక్పథం మొదలగు వాటినన్నింటని సందర్భానుసారంగా, పాఠ్యాంశాల ఆధారంగా నేర్పుటకు తగిన బోధనా వ్యూహాలను ఎంపిక చేసుకోవాలి. ప్రతి విద్యార్థి అధ్యయన, అధ్యాపన ప్రక్రియలో భాగస్వాములయ్యేలా శ్రద్ధ వహించాలి.
5. జ్ఞాపకశక్తిని పరీక్షించుటకు గాక అవగాహన, ఆలోచన, పరిశోధన, అనువర్తన (అప్లికేషన్), విశ్లేషణలకు ప్రాధాన్యతనివ్వాలనునది మీకు తెలిసిన విషయమే. అంతేగాక గ్రంథాలయం, అంతర్జాలం, జ్ఞానార్జనకు ఉపయోగించుకొనే రెఫరెన్స్ స్కిల్స్, 'మౌఖిక, లేఖన కౌశల్యాలు పెంపొందించుట మిక్కిలి ఆవశ్యకము.
6. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందించే రీతిలో స్వీయాభిప్రాయాలను, సృజనాత్మకతలను ప్రకటించే అవకాశం కల్పించాలి. వారి భావనలను కించపరచడం, ఖండించడం ఎట్టి పరిస్థితులలో చేయరాదు.
7. భాష–గమ్మత్తు, సౌందర్యం మొదలగునవి పరీక్షించుటకు కాదు. కేవలం పఠనాసక్తిని పెంపొందించుటకు భాషామాధుర్యాన్ని గ్రహించుట కొరకు ఉద్దేశింపబడినవి.

విషయసూచిక

క్రమ సంఖ్య	పాఠం	రచయిత	పుట సంఖ్య
	పద్య భాగం		
*1	పాడుదమా	శ్రీ గంటేడ గౌరునాయుడు	01
2	అంగుళీయకం	కవయిత్రి మొల్ల	04
*3	చీమ-చెలది	కీ.శే. నాళం కృష్ణారావు	10
*4	లోకాలోకనము	డా॥ సి. నారాయణ రెడ్డి	16
5	తేనెపట్టు	కీ.శే. గుర్రం జాషువా	21
6	అజంతా శిల్పి	కీ.శే. ఉండేల మాలకొండారెడ్డి	26
*7	సంక్రాంతి	కీ.శే. తుమ్మల సీతారామమూర్తి చౌదరి	32
8	శతకమాధుర్యాలు	వివిధ కవులు	36
	గద్యభాగం		
*1	ఏకాగ్రత	డా॥ బి.వి. పట్టాభిరామ్	42
2	బహుమతి	శ్రీ పెండెం జగదీశ్వర్	48
*3	వీల్ ఛైర్ నుండి విజయాలు		53
	వార్తావని (పఠనం)		58
4	పరిష్కారం	కీ.శే. సహవాసి	60
*5	శిష్యవత్సలులు మా గురువులు	డా॥ తిరుమల రామచంద్ర	65
*6	విశ్వాసం	డా॥ రావూరి భరద్వాజ	70
7	ఆనందవనం ఆదరించేవనం		77
8	సచ్ఛీలత	కీ.శే. బుడ్డిగ సుబ్బరాయన్	83
*9	తెలుగు వైభవం (బుర్రకథ)	డా॥ వడ్డెపల్లి కృష్ణ	89
*10	తుమ్మ చెట్టు	కీ.శే. గోపీచంద్	96
	అనుబంధం : సమాచార మార్పిడి		102
	ఉపవాచకం		
*1.	బారిష్టర్ పార్వతీశం-I	మొక్కపాటి నరసింహారావు	106
*2.	బారిష్టర్ పార్వతీశం-II	మొక్కపాటి నరసింహారావు	108
*3.	మర్యాదరామన్న-I	రెంటాల గోపాలకృష్ణ	111
*4.	మర్యాదరామన్న-II	రెంటాల గోపాలకృష్ణ	113
*5.	తెనాలి రామకృష్ణుడు-I		114
*6.	తెనాలి రామకృష్ణుడు-II		117

గమనిక: ప్రథమ భాషకు విషయసూచికలోని పాఠములన్నియు ఉద్దేశింపబడినవి.
కాని ద్వితీయభాషకు కేవలం * గుర్తుగల పాఠములు మాత్రమే ఉద్దేశింపబడినవి.

1 పాడుదమా!

పద్యభాగం

నేపథ్యం

- కింది నినాదాలు ఎవరివో రాయండి.

పల్లవి : పాడుదమా స్వేచ్ఛాగీతం
ఎగరేయుదమా జాతిపతాకం
దిగంతాలు నినదించే గేయం
విశ్వవిఖ్యాతి నొందు జాతిగౌరవం ॥పాడు॥ 1

చ : వందేమాతరమని నినదించిన
వీరుల శౌర్యము నలదికొని
స్వాతంత్ర్యం నా జన్మహక్కని
గర్జించిన గళమందుకుని
పోరాటబలం – స్వాతంత్ర్యఫలం
కలకాలం కాపాడుకుని
కడుగర్వంగా కొనియాడుకొని... ॥పాడు॥ 2



చ: మన్యం గుండెల మంటైరగిలిన
విప్లవ జ్యోతి స్ఫూర్తియని
గుండుకెదురుగా గుండెను నిలిపిన
తెలుగు సింగములు తెగువగని
చీకటి గుండెల – బాకై మెరిసిన
గరిమెళ్ళను గురుతుంచుకుని
మన తెలుగు తేజమును నింపుకునీ ॥పాడు॥ 3

చ: జనగణ మనముల జాగృతినింపిన
జండాగాథలు చెప్పుకుని
జయహే జయహే జననీయని
జయగీతమ్ములు పాడుకుని
పావన చరితం పరిమళ భరితం
మన అఖండ భారతఖండం
అది అక్షయామృత భాండమనీ ॥పాడు॥ 4

కవిపరిచయం : శ్రీ గంటేడ గౌరునాయుడుగారు విజయనగరం జిల్లా కొమరాడ మండలంలోని దళాయిపేటలో సత్యం నాయుడు మరియు సోములమ్మ దంపతులకు 7వ ఆగష్టు 1954 న జన్మించారు. ఇతడు కవి, రచయిత మాత్రమేకాక చిత్రకారుడు కూడా. క్రాంతి, గౌన అనే కలం పేర్లతో సుమారు 60 పైగా కథలు రాశారు.

గురజాడ సాహితీ పురస్కారంతో బాటు ఎన్నో పురస్కారాలు ఈయనను వరించాయి. ప్రస్తుత పాఠ్యభాగం ''పాడుదమా స్వేచ్ఛా గీతం నుండి గ్రహించబడింది.

I. చదవండి - ఆలోచించండి - రాయండి.

అ) పదజాలాన్ని పెంపొందించుకుందాం:

దిగంతాలు = దిక్కులంతటా; నినదించు = ప్రతిధ్వనించు; శౌర్యము = శూరత్వము; అలదికొని = ఉత్తేజమును పొంది; గళము = కంఠము; తెగువ = ధైర్యము, సాహసము; సింగము = సింహము; పరిమళము = సువాసన.

ఆ) భావాలు తెలుసుకుందాం.

1. భారత జాతిగౌరవం దిక్కులంతటా ప్రపంచఖ్యాతి పొందునట్లుగా స్వేచ్ఛాగీతం పాడుదాం, జాతి పతాకమును ఎగురవేద్దాం.
2. 'వందేమాతరమని' గళమెత్తిపాడిన వీరుల పరాక్రమముతో ఉత్తేజమును పొంది 'స్వాతంత్ర్యము నాజన్మహక్క'ని గర్జించిన తిలక్ గళము అందుకొని పాడుదాం. పోరాటబలంతో సంపాదించిన స్వాతంత్ర్యాన్ని కలకాలం కాపాడుకుందాం. దేశ గొప్పదనాన్ని గర్వంగా కొనియాడుదాం.
3. మన్యం ప్రజల స్వాతంత్ర్యానికి ప్రాణాలర్పించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు శౌర్యాన్ని, ఆంగ్లేయుల తుపాకీ గుండుకు ఎదురుగా తన గుండెను పెట్టి కాల్చమని గర్జించిన టంగుటూరి ప్రకాశం పంతులుగారి సాహసాన్ని, బానిసత్వాన్ని చీల్చిచెండాడి మెరుపై ప్రకాశించిన సమరయోధులు గరిమెళ్ళ సత్యనారాయణరాజు మొదలగువారి తెలుగు తేజముతో మనగుండెలను నింపుకొని స్వేచ్ఛాగీతం పాడుదాం.
4. భరతజాతిని జనగణమనతో మేల్కొల్పిన జండాగాథలను చెప్పుకుందాం. 'జయహే! జయహే! 'జయజయ జయహే! అని జయగీతములను పాడుకుందాం. మన భారతదేశం అఖండ భారతఖండమనీ, అమృతభాండమనీ పాడిపంటలతో, సిరి సంపదలతో నిండిన దేశం), మన స్వేచ్ఛాగీతం పాడుకుందాం.

II. చర్చించండి - రాయండి.

1. గణతంత్ర దినోత్సవం.
2. టంగుటూరి ప్రకాశం పంతులు గారు.
3. స్వాతంత్ర్యం నా జన్మహక్కు.
4. మన్యం వీరుడు - మన సీతారామరాజు.

III. కృత్యం:

పాఠ్యభాగంలోని కింది గేయచరణాలను చదివి, సూచనానుసారంగా కృత్యాలు చేయండి.

అ) జతపరచండి.

అ. బంకించంద్ర ఛటర్జీ	ఆ. రవీంద్రనాథ్ ఠాగూర్
1. స్వాతంత్ర్యం నా జన్మహక్కు	2. మన్యం వీరుడు
3. జనగణమన	4. వందేమాతరం
ఇ. తిలక్	ఈ. అల్లూరి సీతారామరాజు.

1	
2	
3	
4	

పుట సంఖ్య 1లోని 2, 3, 4 గేయాలు

ఆ) కింది గేయపాదాలను సరైన క్రమంలో అమర్చి రాయండి.

పావన చరితం పరిమళ భరితం	మన అఖండ భారతఖండం	తెలుగు సింగములు తెగువగని	పోరాటబలం స్వాతంత్ర్యఫలం

ఇ) కింది పదాలకు అర్థాలు రాయండి.

1) నినదించు = ______ 2) గళము = ______

3) తెగువ = ______ 4) పరిమళము = ______

ఈ) స్వీయస్పందన

'దేశభక్తి'ని ఎట్లు ప్రకటించెదరో సొంతవాక్యాలలో రాయండి.

IV. భాషావగాహన :

1) విడదీసి సంధిపేరు రాయండి.

1) వందేమాతరమని = ______ + ______ = ______

2) తెగువగని = ______ + ______ = ______

2) విగ్రహవాక్యం రాసి, సమాసనామం రాయండి.

1) జాతి పతాకం ______ ______

2) కడుగర్వం ______ ______

3) అక్షయము ______ ______

V. సృజనాత్మకత

- దేశభక్తి గేయాలను అంతర్జాలంలో చదివి తెలుసుకోండి.
- 'గేయాలు-కవులు' పేరుతో ఆల్బమ్ తయారు చేయండి.

భాషాకౌశల్యాలు (మౌఖికం) – సంభాషణ :

మీ పాఠశాలలో జరిగిన 'స్వాతంత్ర్యదినోత్సవం' గురించి కింది అంశాలు ఆధారంగా మీ నానమ్మతో సంభాషించండి.

- పాఠశాలలో స్వాతంత్ర్యదినోత్సవం.
- ముఖ్యఅతిథి
- జెండా ఎగురవేత
- జెండా వందనం
- దేశభక్తి గీతాలు
- ఉపన్యాసములు
- ప్రధానోపాధ్యాయురాలి ఉపన్యాసం
- వందన సమర్పణ
- మిఠాయిల పంపిణీ

2 అంగుళీయకం

నేపథ్యం :

- విషయ నిరూపణకు నిదర్శనాన్ని, ఋజువును చూపాల్సి ఉంటుంది. ఉదా: మీరు 8వ తరగతతి ఉత్తీర్ణులైనా రనుటకు రిపోర్టుకార్డు, మీరు పుట్టిన తేదీని ఋజువు చేయటానికి జన్మపత్రిక (బర్త్ సర్టిఫికెట్) అలాగే ఆధార్‌కార్డ్ మొదలగునవి.
- వివిధ పరీక్షలు, రైలు–విమానం మొదలైన ప్రయాణాల సందర్భాలలో సంబంధిత వ్యక్తి తానేనని నిరూపించుకోవడానికి తన గుర్తింపు (ఐడెంటిటి) కార్డు, ఆధార్‌కార్డు వంటివి చూపెట్టాల్సి వుంటుంది. అలాగే విదేశీ ప్రయాణాల సందర్భంగా పాస్‌పోర్ట్ అవసరం.
- పూర్వకాలంలో గుర్తింపుకు చిహ్నంగా రాజముద్ర, ఉంగరం మొదలైన వాటిని ఉపయోగించేవారు. ఇప్పుడు హనుమంతుడు తాను చెప్పుతున్న విషయం 'అసత్యముకాదు' అని తెలియపరచటానికి ఏ ఋజువును చూపాడో తెలుసుకుందామా!

కం. ఉన్నాఁడు లెస్స రాఘవుఁ
డున్నాఁ డిదె కపులఁ గూడి యురుగతి రానై
యున్నాఁడు నిన్ను గొనిపో
నున్నాఁ డిది నిజము నమ్ము ముర్వీతనయా! 1

సీ. ఆ మాట లాలించి భూమిజ తనలోన
వెఱఁగంది శింశుపావృక్ష మరసి
చూడంగ నప్పుడు సూక్ష్మరూపంబున
నొడికమౌ శాఖల నడుమ నున్న
కపికుమారుని రూప మపురూపముగఁ జేసి
స్వాంతంబులోన హర్షంబు నొంది
దనుజ మాయలచేతఁ దఱచు వేగుటఁజేసి
మాఱాడ నేరక యూరకున్న
భావ మూహించి తన్ను నా దేవి యాత్మ
నమ్మకుండుట దెలిసి యా కొమ్మమీఁది
నుండి క్రిందికి లంఘించి నిండు భక్తి
మ్రొక్కి నిలుచుండి కరములు మోడ్చి పలికె 2

*ఉ. తమ్మునిఁగూడి పుణ్యగుణధాముఁడు రాముఁడు వచ్చి మాల్యవం
తమ్మున సైన్యసంఘము ముదంబునఁ గొల్వఁగనుండి భూమిపై
మిమ్ములం జూచి రండనుచు మేటి కపీంద్రులంబుచ్చి యందు మొ
త్తమ్ముగ మమ్ముఁ గొందఱను దక్షిణభాగము చూడఁ నంపుచున్ 3

కం అంగనఁ బొడఁగఁగన, నీ వి
య్యంగను గడుఁజాలువాఁడ వంచును నాచే
నుంగర మంపెను శ్రీరఘు
పుంగవుఁ డిదె కొమ్మటంచు భూమిజ కిచ్చెన్ 4

*ఉ. ఇచ్చినఁ జూచి రామధరణీశ్వరు ముద్రికగా నెఱింగి తా
నిచ్చను మెచ్చి యా కువలయేక్షణ యాత్మగతంబునందు నీ
నచ్చినదాని భావమును వల్లభు చందము నేర్పడంగానేఁ
జెచ్చెర నంతయుం దెలియం జెప్పుము నమ్మికపుట్టు నట్లుగన్ 5

కవి పరిచయం: ఆతుకూరి మొల్ల ప్రాచీనాంధ్ర కవయిత్రులలో ప్రథమగణ్యురాలు. అంతేకాక పద్యకావ్య రచన చేసిన మొదటి కవయిత్రి. ఈమె 15వ శతాబ్దానికి చెందినది. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా కోవూరు మండలం గోపవరం గ్రామం ఈమె జన్మస్థలం. ఈమె రచించిన 'మొల్ల రామాయణం' ప్రసిద్ధమైంది. దీనిని ఆమె తేనెసోక-నోరు తీయనగురీతిలో వ్రాయుదనెను. ఈ కావ్యాన్ని ఆమె శ్రీరామచంద్రునికే అంకితం గావించింది.

ప్రస్తుత పాఠ్యభాగము '**మొల్లరామాయణం**' నుండి గ్రహింపబడింది.

I. చదవండి - ఆలోచించండి - రాయండి.

1. పదజాలం పెంపొందించుకుందాం - భావాలు తెలుసుకుందాం.

అర్థాలు - భావాలు

1. **లెస్స = బాగుగా, క్షేమంగా; కపులు = వానరులు; ఉరుగతి = గొప్ప విధము; కొనిపోనున్నాడు = తీసుకొని వెళ్ళుటకు సిద్ధముగా ఉన్నాడు; ఉర్వీతనయా = ఓ సీతాదేవీ.**
   ఓ సీతాదేవీ! రాఘవుడు క్షేమంగా నున్నాడు. కపిసైన్యంతో కూడి శ్రేష్ఠమైన రీతిలో వచ్చి నిన్ను తీసికొని వెళ్ళుటకు సిద్ధంగానున్నాడు. ఇది నిజం నమ్ముము.
2. **ఆలించి = విని; వెఱగు + అంది = ఆశ్చర్యపడి; అరసి చూడంగా = పరీక్షించి చూడగా, తేరిపార చూడగా; ఒడికమౌ = మనోజ్ఞమైన, మనోహరమైన; శాఖల=కొమ్మల; కపి=వానర; స్వాంతంబులోన = మనస్సులో; హర్షంబు = సంతోషంబున; దనుజులు = రాక్షసులు; వేగుట = బాధింపబడుట; లంఘించి = దూకి; కరములు మోడ్చి = నమస్కరించి.**
   ఆంజనేయుని మాటలు విన్న సీత భయపడి శింశుపా వృక్షమును పరీక్షగా చూసెను. అప్పుడు ఆమె మనోహరమైన కొమ్మల నడుమ నున్న కపికుమారుని చూచి మనసులో సంతోషము పొందెను. కానీ రాక్షస మాయలకు బాధపడి ఉండుట వలన ఏమియు మాటాడలేదు. ఆమె భావాన్ని గ్రహించి, తనను ఆమె నమ్ముట లేదని తెలిసికొని, క్రిందికి దూకి భక్తితో ఆమెకు నమస్కరించి ఈ విధంగా పల్కెను.
3. **పుణ్య గుణధాముడు = పుణ్యగుణములచే శ్రేష్ఠుడు; కొల్వంగ = సేవించు చుండగ; మేటి = శ్రేష్ఠులైన;**
   పుణ్యగుణములచే శ్రేష్ఠుడైన రాముడు తమ్ముడైన లక్ష్మణునితో మాల్యవంత పర్వతానికి వచ్చినాడు. అచ్చట సైన్య సమూహములు సేవించుచుండగా మిమ్ము చూచి రమ్మని కపిశ్రేష్ఠులను పంపించుచు అందు కొందరు శ్రేష్ఠులైన వానరులను దక్షిణ దిక్కుకు పంపించెను.
4. **అంగన = సీతాదేవి; కొమ్ము + అటంచు = తీసికొనమని పలుకుచు; భూమిజ = సీతాదేవి.**
   నీవు సీతాదేవిని కనుగొనగలవు. ఆమెను చూచినంతనే ఈ ఉంగరాన్ని ఇమ్మని శ్రీరాముడు పలికెననుచు, ఆ ఉంగరాన్ని ఆంజనేయుడు సీతాదేవికిచ్చెను.

5. **రామధరణీశ్వరు ముద్రికగా = శ్రీరాముని ఉంగరంగా; కువలయ + ఈక్షణ = కలువల వంటి కన్నులు గలది (సీతాదేవి); ఆత్మగతంబున = మనసునందు; వల్లభుచందం = భర్త వృత్తాంతం; చెర+చెర = శీఘ్రంగా.**
ఇచ్చిన ఉంగరాన్ని చూచి అది శ్రీరామచంద్రుని ఉంగరంగా తెలిసికొని మనసులో ఎంతో సంతోషించెను. నాకు నమ్మకం కలుగునట్లుగా నీవు ఇక్కడకు వచ్చిన విధానాన్ని ఆ ప్రభువు గుణగణాలను శీఘ్రంగా చెప్పుము.

II చర్చించండి – రాయండి.

అ)
1. రాముడు ఈ విధంగా రానున్నాడని ఆంజనేయుడు పల్కెను.
2. సీతాదేవి శింశుపావృక్షముపై చూసినది.
3. ఆంజనేయుడు చెట్టుకొమ్మ మీద నుండి కిందకు దుముటకు కారణము.
4. శింశుపావృక్షము కిందనున్న సీతాదేవితో హనుమంతుని సంభాషణ.

ఆ) ఎవరు ఎవరితో అనిరి.
1. "భూమిపై మిమ్ములం జూచి రండనుచు"
2. "చెచ్చెర నంతయుం దెలియంజెప్పుము"

ఇ) అర్థవంతమైన పదంతో పూరించి పద్యపాదాన్ని తిరిగి రాయండి.
1. మమ్ము గొందఱను .... చూడనంపుచున్
2. తెలియ జెప్పుము .... నట్లుగన్
3. రామధరణీశ్వరు .... గా నెఱింగి.
4. నమ్మకుండుట .... యా కొమ్మ మీద

III కృత్యం

పాఠభాగంలోని కింది పద్యాలను చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ) కింది వాటికి సరైన సమాధానాన్ని గుర్తించి పూర్తి వాక్యంలో తిరిగి రాయండి.
1. ఉంగరము పంపించినది.
2. ఉంగరము జూచి రామధరణీశ్వరముద్రికగా నెరింగినది.
3. తమ్మునితోగూడి రాముడు వసించిన పర్వతము.

పుటసంఖ్య 4,5 లోని 3, 4, 5 పద్యాలు

ఆ) తప్పొప్పులను గుర్తించండి.
1. నాచే యుంగరమంపెను. ( )
2. నేలపై మిమ్ములం జూచి రండు. ( )
3. చెచ్చెర నంతయు దెలియం జెప్పుము ( )
4. తీసి కొమ్మటంచు భూమిజకిచ్చెన్. ( )

ఇ) ఏ వాచకమో రాయండి.
1. కపి
2. అంగన

ఈ) స్వీయస్పందన
ఉంగరాన్ని ఇచ్చిన హనుమంతునితో సీతాదేవి ఏం పలికిందో మీ సొంతవాక్యాల్లో రాయండి.

IV. భాషావగాహన

అ అడిగిన విధంగా సమాధానాలు రాయండి.

1.	ఉన్నాడిదె	=		+		→	ఉకారసంధి
2.	కపీంద్రుడు	=		+		→	
3.		=	ధరణి	+	ఈశ్వరుడు	→	
4.	కువలయేక్షణ	=		+		→	
5.	ఊరకున్న	=		+		→	

ఆ అడిగిన విధంగా సమాధానాలు రాయండి.

పదం	విగ్రహవాక్యం	సమాసము
1. ఉరుగతి		
2. ఉర్వీతనయ		
3.	దనుజుల యొక్క మామ	
4. కపీంద్రుడు		
5. దక్షిణ భాగము		

ఇ కింది పద్యపాదాలు గణవిభజన చేసి ఏ పద్యపాదమో తెలపండి.

1. తమ్మునిగూడి పుణ్యగుణధాముడు రాముడు వచ్చి మాల్యవం
2. ఇచ్చిన జూచి రాము ధరణీశ్వరు ముద్రికగా నెఱింగి తా

V సృజనాత్మకత :

1 కింది ప్రవాహాకృతిని ఆధారంగా చేసుకొని ఒక పరిచ్ఛేదం రాయండి.



2. రామాయణాన్ని సంస్కృతంలో రచించిన వారు.....

1) వాల్మీకి 2) వ్యాసుడు 3) యాజ్ఞవల్క్యుడు

కవయిత్రి మొల్ల, తిక్కనవలె పాత్రలను కండ్లకు కట్టునట్లు చిత్రించగలదు. ఈ విధమైన కవిత్వాన్ని **‘చిత్ర కవిత్వ’** మంటారు. క్రింది పద్యంలో హనుమంతుడు సముద్రాన్ని దాటడాన్ని వర్ణించిన వైనం గమనిస్తే ... ఆ దృశ్యాన్ని ఈమె ప్రత్యక్షంగా చూచినదిగాబోలు అనిపించును.

భాష-సౌందర్యం

“మొగము బిగించి, పాదములు మొత్తముగా వడి నూదిత్రొక్కి,నీ
టుగ మొగమెత్తి భీకర కఠోర రవంబున నార్చి, బాహుల
త్యగణితలీలనూచి, వలయంబుగ వాలము ద్రిప్పి, వ్రేగునన్
నగము సగమ్ము గ్రుంగ, గపినాథుడు నింగికి దాటె రివ్వునన్!”

(ఈ పద్య సౌందర్యాన్ని మీ ఉపాధ్యాయులనడిగి తెలుసుకోండి – తెలుగు సాహిత్యంలోని ఘనతను గుర్తించండి)

ఛందస్సు

ఇంద్రగణములు		సూర్యగణములు	
IIII	నల	UI	గల
IIIU	నగ	III	న
IIUI	సల		
UII	భ		
UIU	ర		
UUI	త		

కంద పద్య లక్షణములు

- పద్యమునకు 4 పాదములు ఉండును.
- 1, 3 పాదములందు 3 గణములు; 2, 4 పాదములందు 5 గణములు రావలెను.
- ‘భ, జ, స, నల, గగ’ అను గణములు రావలెను.
- 2, 4 పాదములందు చివర అక్షరం గురువు రావలెను.
- 2, 4 పాదములందు 3వ గణము జగణము కాని, నలము కాని రావలెను.
- 1, 3 పాదము లందు 3వ గణము జగణము కారాదు.
- 2, 4 పాదములలో నాల్గవ గణము మొదటి అక్షరము యతిస్థానం.
- ప్రాస నియమం కలదు.
- గ గ – అనగా రెండు గురువులు.

వృద్ధి సంధి

‘ఐ, ఔ’ లకు వృద్ధులని పేరు.

సూత్రం : అ కారమునకు ‘ఏ, ఐ’లు పరమైన ‘ఐ’ కారము, ‘ఓ, ఔ’ లు పరమైన ‘ఔ’ కారము ఏకాదేశమగును.

కింది ఉదాహరణలు చూడండి.

ఏకైక ---- ఏక + ఏక

ఏక్ + [అ + ఏ] క = మొదటి పదంలోని అకారమునకు ‘ఏ’ అను అచ్చు పరమైనది.

వృద్ధిసంధి సూత్రం ప్రకారం ‘ఏ’ అను అచ్చు పరమగునపుడు ‘ఏ’ స్థానములో ‘ఐ’ వచ్చును.

ఏక్ + [ఐ] క = ఏకైక అన్న రూపం ఏర్పడును.

ఇదే విధంగా అష్ట్ + [అ + ఐ] శ్వర్యము = అ ష్ట్ + ఐ శ్వర్యము = అష్టైశ్వర్యము అను రూపం ఏర్పడును.

మహౌషధి	–	మహ్ + [ఆ + ఓ] షధి	‘ఓ’ స్థానంలో ‘ఔ’ వచ్చి ఔషధి అగును.
దివ్యౌషధము	–	దివ్య్ + [ఆ + ఔ] షధము	
గంగౌఘము	–	గంగ్ [అ + ఓ] ఘము	‘ఓ’ స్థానంలో ‘ఔ’ వచ్చి ఔఘము అగును.

లేఖననైపుణ్యాలు-ఉపన్యాసం

ఒక వక్త ఒక అంశాన్ని గురించి శ్రోతలను ఉద్దేశించి సమగ్రంగా వివరించి, విశ్లేషించి మాట్లాడటాన్ని 'ఉపన్యసించటం' అంటారు ఈ ఉపన్యాసాన్ని ఆసక్తిదాయకంగా ఎన్నుకొన్న విషయంపై దృష్టిని కేంద్రీకరించి అంశాల వారిగా చక్కని ముగింపుతో ఉండే విధంగా రూపకల్పన చేసుకోవాలి.

ఇప్పుడు 'భాతృప్రేమ' అన్న అంశంపై 2 నిమిషాలు మాట్లాడటానికి ఇచ్చిన అంశాల ఆధారంగా తగిన ఉపన్యాసాన్ని తయారు చేసుకుందామా!

అంశాలు :

అన్నదమ్ముల మధ్య ఉండవలసిన అనుబంధం

రామలక్ష్మణుల అనుబంధం

భరతుడికి అన్నగారిపై గల ప్రేమ

మీకు, మీ సహోదరులకు మధ్యగల ప్రేమానురాగాలు.

మాదిరి:

భ్రాత అనగా సోదరుడు, 'భ్రాతృప్రేమ' అనగా అన్నదమ్ముల మధ్యనున్న ప్రేమ, అన్నదమ్ములు ఒకరితోఒకరు కలిసిమెలిసి ఉండాలి. కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలి. ఏ ఒక్కరికి కష్టమెచ్చినా ఇంకొకరు చూస్తూ వూరుకోకుండా సహాయపడాలి.

రామలక్ష్మణుల మధ్యనున్న అనుబంధం విడదీయరానిది. శ్రీరాముడు అరణ్యవాసానికి వెళ్ళినపుడు తమ్ముడు లక్ష్మణుడు అన్నతో పాటు అరణ్యానికి వెళ్ళాడు. అన్నావదినలకు సేవలు చేస్తూ అరణ్యంలో గడిపాడు. అట్టిది రామలక్ష్మణుల మధ్యనున్న అనుబంధం. రాముడు అరణ్యవాసానికి వెళ్ళిన తరువాత మేనమామ ఇంటినుంచి భరతుడు తిరిగి వచ్చాడు విషయం తెలుసుకొని అన్నగారిని తీసుకొచ్చి, రాజ్యపాలన అప్పగించెదనని పల్కి అరణ్యాలకు వెళ్ళాడు. కానీ శ్రీరాముడు అందుకు అంగీకరించకపోవుటచే, భరతుడు అన్నగారి పాదుకలను తెచ్చి సింహాసనంపై పెట్టి తాను వాటిని పూజిస్తూ 14సంవత్సరాలు రాజ్యపాలన చేసాడు.

నాకు నా తమ్ముడంటే ప్రాణం. మేమిద్దరం కలిసి ఆడుకుంటాం. ఒకరికొకరు సహాయం చేసుకుంటాం. నాతమ్ముడికి నేనంటే అంతులేని ప్రేమ. మేమిద్దరం రామలక్ష్మణుల్లా ఉంటామని అందరూ అంటుంటారు.

అభ్యాసాలు :

'నిరుద్యోగం' అనే సాంఘిక సమస్యను గురించి కింది అంశాల ఆధారంగా ఉపన్యాసం తయారు చేయండి.

- ఉద్యోగం అనగా....,
- వివిధ రకాల ఉద్యోగాలు,
- వృత్తి విద్యలు
- నిరుద్యోగం ఏర్పడటానికి కారణాలు, నివారణోపాయాలు.

కథాకథన సమయం

ముగింపు వాక్యంతో మొదలుపెట్టి, ఏదైనా ఒక సంఘటన/కథను పూర్తిగా చెప్పాలి.

❖ నెమ్మదిగా నడిచే తాబేలు చెంగు చెంగున వేగంగా పరుగిడే కుందేలుపై విజయం సాధించింది.

❖ లంకలోని అశోకవనంలో సీతాదేవి శింశుపావృక్షం కింద దుఃఖిస్తూ కూర్చుని ఉంది.

3 చీమ – చెలది

నేపథ్యం :

- ప్రకృతిలో నిరర్థకమైనది ఏదీ లేదు. సృష్టిలో ప్రతిదానికి కార్యకారణ సంబంధం ఉంటుంది.
- పై చిత్రాల ఆధారంగా కథను రాయండి. దానికి శీర్షిక పెట్టండి.

- జీవవైవిధ్యం (బయోడైవర్సిటి) – దాని ప్రాధాన్యత గురించి అంతర్జాలంలో సమాచారాన్ని సేకరించండి–తరగతిలో చర్చించండి.

ఇప్పుడు కింది పాఠంలోని అల్పజీవులు ఏం చేశాయో చూద్దామా!

సమరతలమున నోడి రాకొమరుఁ డొకఁడు
అరులు చెల రేఁగి తన్ను వెన్నంటి తఱుమ,
వడిగఁ బరుగెత్తి యొక్క కారడవిఁ జేరి
వృక్షములచాయ నించుక విశ్రమించె. 1

బడలికలు వాయ నొక్కింత తడ వతండు
నిద్రవో నెంచి చేలంబు నేలఁ బఱవ,
చీమలును సాలెపురుగులు చేరి, వాని
పాన్పుపైఁ బ్రాఁకి చీకాకుపఱచె మిగుల. 2

'ఇలనుదైవము కటకటా! ఏల కూర్చె
క్షుద్రజంతుల మనుజులనిద్ర చెఱుప?
శత్రువులబాధ నెటు లైన సైపవచ్చు,
వీనిబాధల సైప నెవ్వానివశము?' 3

అనుచు నీరీతిఁ దలపోసి యాతఁ డెట్లో
తుదకు నిదురించె; వానిని వెదకికొనుచు
వచ్చి నిలిచె తటాలున వైరివీరుఁ
డొక్కరుఁడు వాఁడు నిద్రించుచున్నయెడకు 4

'ఏమిచిత్రమొ–అంతలో చీమ యొకటి
కఱచె రాజకుమారుని కరతలంబు;
ఉలికిపడి లేచి యాతండు తెలివి నొంది
కాంచె వెసఁ దన్ను జంప నుంకించు వైరి. 5

కని, జరీలున నొఱనుండి కత్తి దూసి
ఒక్క వ్రేటున పగతుని నుక్కడంచి
కడమశత్రులు తనపైని పడకమున్నె
గంతుగొని దాఁగె నాచెంత గహ్వరమున. 6

తరణి గ్రుంకిడె; నంత శాత్రవులు రాత్రి
రాకుమారుని కనుఁగొనఁ లేక విసిగి,
ఉదయమున లేచి యటునిటు వెదకి వెదకి
చేరి నిలిచిరి గహ్వరద్వారముకడ. 7

'సందియం బేల? ఈగుహాయందె యతడు
జొచ్చి తలదాఁచుకొని యుండవచ్చు నిజము''
అనుచు వచియించె నొక్కఁడు; ''అట్లు కాదు
ఇందు లేఁ డని నే వచియింపఁ గలను. 8

సఖుఁడ! అల్లదె చూడుమా సాలెగూఁడు
అల్లిబిల్లిగ ద్వారంబు నల్లికొనియె;
వచ్చి రాకొమరుం డిందుజొచ్చె నేని
చెక్కు చెదరక నిలుచునే చెలఁదిగూఁడు?'' 9

అనుచు నీరీతి రెండవయతఁడు పలికె;
''సర్పములు క్రూరమృగములు సంచరించు
నిందు జొర నేల? చావంగ నేల?'' యంచు
వారు నెడలిరి వచ్చినదారిఁ బట్టి. 10

'బ్రతుకు జీవుఁడ' యంచు నీవలికి వచ్చి,
రాజసుతుఁ డంత తనయంతరంగమందు
నిట్లు తలపోసె, అక్కటా! యింతదనుక
అల్పజంతువులను నింద సల్పినాఁడ. 11

చిన్నజంతుల నేల సృష్టించె నంచు
నోరికొలఁదిని దైవంబు దూఱియుంటి,
చీమచెలఁదుల సాయంబుచేతఁ గాదే
నిలిపె దైవంబు నాజీవనములను నేఁడు' 12

కవిపరిచయం : కీ.శే. నాళం కృష్ణారావు గారు 1881 జనవరి 18వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా మండపేట గ్రామంలో లక్ష్మమ్మ, కామరాజు అను పుణ్యదంపతులకు జన్మించారు. వీరికి 'బాలసాహిత్యబ్రహ్మ', మధురకవి, తెలుగు వైతాళికుడు మొదలగు బిరుదులు కలవు. గోరువ ఖద్దలు, మీగడతరకలు, తేనె చినుకులు, పాలతరగలు మొదలగునవి వీరి ఇతర రచనలు. ప్రస్తుత పాఠ్యభాగం "మీగడతరకలు" నుండి గ్రహించబడినది.

I చదవండి-ఆలోచించండి-రాయండి.

అ) పదజాలం పెంపొందించుకుందాం.

సమరతలము = యుద్ధభూమి; అరులు = శత్రువులు; వడి = వేగము; ఛాయ = నీడ; బడలిక = అలసట; చేలము = వస్త్రము; మిగుల = మిక్కిలి; కూర్చుట = రూపొందించుట/సృష్టించుట; క్షుద్ర=సూక్ష్మ (అతిచిన్న) చెఱుపుట = చెడగొట్టుట; సైపుట=ఓర్చుకొనుట; తలపోయుట = ఆలోచించుట; వైరులు = శత్రువులు; కాంచెను = చూచెను; వ్రేటు = దెబ్బ; పగతుని = శత్రువుని; కడమ = మిగిలిన; గహ్వరమున = గుహయందు; సందియము = అనుమానం; తరణి = సూర్యుడు; వచించి = పలికి; చెలది = సాలెపురుగు; సంచరించు = తిరుగు; అంతరంగమున = మదిలో, జీవము = ప్రాణము.

ఆ) భావాలు తెలుసుకుందాం.

1. యుద్ధంలో ఓడిన ఒక రాకుమారుడు, శత్రువులు తనను వెంబడించుచుండగా ఒక కారడవిని చేరెను. అచట చెట్టు నీడన విశ్రాంతి పొందెను.
2. అలసట పోగొట్టుకొనుటకతడు కొంతసేపు నిద్రపోదలచెను. తన వద్దనున్న వస్త్రాన్ని నేలపై పరచగా చీమలు, సాలెపురుగులు పాకుచు అతన్ని చీకాకు పరచెను.
3. భగవంతుడు మనుష్యుల నిద్ర పాడు చేయుటకు కాక ఈ చిన్న జంతువులను ఎందుకు సృష్టించెనోకదా? శత్రువుల బాధనైనా భరింప వచ్చుగాని ఈ జంతువుల బాధను ఎవరు భరింపగలరు?
4. అని ఆలోచించుచు అతడు చివరకు నిద్రపోయెను. అతనిని వెదుకుచూ వచ్చి, శత్రువీరుడు ఒకడు రాకుమారుడు నిద్రించుచున్న చోటికి చేరెను.
5. అంతలో చిత్రంగా చీమ యొకటి రాకుమారుని చేతిని కుట్టెను. ఉలికిపడి నిద్రనుండి లేచిన రాకుమారుడు తనను చంప ప్రయత్నించుచున్న శత్రువుని చూచెను.
6. వెంటనే తన ఒర నుండి కత్తి దూసి ఒక్క వేటుతో శత్రువుని చంపి, మిగిలినవారు వచ్చి తనపై పడకముందే దగ్గరలోని ఒక గుహలో దాగెను.
7. సూర్యాస్తమయం కావడంతో శత్రువులు చీకటిలో రాకుమారుని పట్టుకొనలేక విసిగిపోయిరి. ఉదయాన్నే లేచి అటుఇటు అంతా వెదకి గుహద్వారం దగ్గరకు వెళ్ళి నిలిచిరి.
8. శత్రువీరులలో ఒకడు "అనుమాన మెందుకు? ఈ గుహయందే అతడు తలదాచికొనియుండవచ్చు' అని పలికెను. అలాకాదు ఇక్కడ లేడని నేను చెప్పగలను.
9. ఆ సాలెగూడు అల్లిబిల్లిగా అల్లుకొని వున్నది. ద్వారం వద్ద చూడుము. రాకుమారుడు వచ్చి ఈ గుహలో దాగివుంటే ఈ సాలెగూడు చెక్కు చెదరక ఎలా వుండగలదు?
10. అని అనగా రెండవ వాడు ఈ విధంగా పలికెను. "పాములు, క్రూరమృగాలు తిరుగుతున్న ఇందులోనికి వెళ్ళుట యెందులకు? ప్రాణాలు పోగొట్టుకొనుట ఎందులకు" అనుచు వారు వచ్చిన దారినే వెళ్ళిపోయిరి.

11. "బ్రతుకు జీవుడా" అంటూ రాకుమారుడు బయటకు వచ్చి తన మనస్సులో ఇట్లు తలపోసెను. అయ్యో! ఇప్పటి వరకు అల్పజంతువులు అని వీటిని నిందించితిని.

12. చిన్న జంతువులను ఎందుకు సృష్టించితివని దేవుని కూడా నిందించితిని. చీమ, సాలెపురుగు చేసిన సాయం వల్ల కదా ఈనాడు నాప్రాణములు భగవంతుడు నిలిపినాడు.

II. చర్చించండి – రాయండి.

1. రాకుమారుడు నిద్రనుండి మేల్కొనుటకు కారణము.
2. రాకుమారుడు గుహలోనికి వెళ్ళి వుండడని శత్రువీరుడు తెలియజేసిన విధము.
3. రాకుమారుడు శత్రువీరులనుండి తన్నుతాను కాపాడు కొన్న విధం.
4. అల్పజంతువుల వలన రాకుమారుడు పొందిన ప్రయోజనం.
5. భగవంతుని దూషించి తాను తప్పు చేశానని రాకుమారుడు అనుకోటానికి కారణం.
6. "ఉదయమున లేచి అటునిటు వెదకి వెదకి చేరి నిలిచిరి గహ్వరద్వారముకడ" వెదకి, వెదకి – అని రెండు సార్లు ఒకే పదాన్ని ప్రయోగించడంలో కవి అభిప్రాయమేమిటి? మీ మిత్రులతో చర్చించి రాయండి.

III కృత్యం :

i) పాఠ్యభాగంలోని కింది పద్యాలను చదివి, సూచనానుసారంగా కృత్యాలు చేయండి.

అ సరియైన సమాధానం గుర్తించి రాయండి.

1. రాకుమారుడు విశ్రమించినది.
   అ) రాజభవనంలో ఆ) ఉద్యానవనంలో ఇ) కారడవిలో
2. అతడు నిద్రవోదలచి నేలమీద పరచినది.
   అ) చేలము ఆ) చాప ఇ) దుప్పటి
3. రాకుమారుని చీకాకు పరచినవి.
   అ) పులులు, సింహాలు ఆ) చీమలు, సాలెపురుగులు ఇ) ఈగలు, దోమలు
4. రాకుమారుని ఎదుట నిలచినది.
   అ) శత్రువీరుడు ఆ) క్రూరసింహం ఇ) దైవం

(పుటసంఖ్య 11 లోని 1, 2, 3, 4 పద్యాలు)

ఆ తగిన పదాలతో పూరించి వాక్యాన్ని తిరిగి రాయండి.

1. అరులు చెలరేగి తన్ను .... తఱుమ.
2. నిద్రవోనెంచి .... నేల బఱవ.
3. ఆతడెట్లో .... నిదురించె.
4. వచ్చి నిలిచె .... వైరి వీరుడొక్కరుడు.

ఇ కింది పదాలను సొంత వాక్యాలలో ప్రయోగించండి.

1) చీకాకుపఱచు : ....

2) తటాలున : ....

ఈ స్వీయ స్పందన

రాకుమారుడు దైవాన్ని నిందించడానికి గల కారణాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

కృత్యం :

ii) పాఠ్యభాగంలోని కింది పద్యాలను చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ) ఎవరు, ఎవరితో పలికిరి.

1. 'సర్పములు క్రూరమృగములు సంచరించు నిందు జొరనేల?

2. 'నోటికొలదిని దైవంబు దూటియుంటి.'

పుట సంఖ్య 11 లోని 9, 10, 11, 12 పద్యాలు

ఆ ఖాళీలను పూరించుము.

1. సాలెగూడు .... ద్వారంబు నల్లికొనియె.
2. చెక్కు .... నిలుచునే చెలదిగూడు.
3. చావంగ నేల యంచు వారు .... వచ్చిన దారి బట్టి.
4. నిలిపె .... నా జీవనములను నేడు.

ఇ. వచనములు మార్చి రాయండి.

1. సుతుడు: ______ 2. జంతువులు : ______

ఈ. స్వీయ స్పందన :

సాలెగూడు చెక్కు చెదరక పోవడానికి శత్రువీరుడు తెల్పిన కారణాన్ని మీ సొంత మాటల్లో రాయండి.

IV భాషావగాహన

1 పదాలను విడదీసి సంధి పేర్లను రాయండి.

1) రాకుమారుడొకడు		+		=		
2) చీమ యొకటి		+		=		
3) తెలివినొంది		+		=		
4) సందియంబేల		+		=		

2 కింది సమాసములను జతపరచండి.

1.	రాకుమారుడు	( )	అ) పంచమీ తత్పురుష సమాసము
2.	క్షుద్రజంతువులు	( )	ఆ) ద్వంద్వ సమాసము
3.	శత్రువులబాధ	( )	ఇ) షష్ఠీ తత్పురుష సమాసము
4.	చీమచెలదులు	( )	ఈ) విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము.

3. శత్రువులు అన్న అర్థంలో కవి ప్రయోగించిన పర్యాయ పదాలు రాయండి.

శత్రువులు
- అరులు
- ______
- ______
- ______

V సృజనాత్మకత

1 అడవిలో నీవేదయినా ప్రమాదంలో చిక్కుకుంటే ఏ విధంగా ప్రవర్తిస్తావో ఊహించి రాయి.

2. నీవు ఇతరులకు ఆపదలో సాయపడిన విధము/నీవు చదివిన సంఘటనను మిత్రునితో సంభాషించు.

3. జంతు సంరక్షణ కేంద్రాలను సందర్శించి అచటి వివరాలను సేకరించండి.

VI



- గ్రంథాలయానికి వెళ్ళి ఇటువంటి మరికొన్ని కథలను చదవండి. వాటిని మీ సొంతవాక్యాల్లో రాయండి.

యణాదేశ సంధి

"య, వ, ర, ల" అనే వాటికి యణ్ణులని పేరు.

సూత్రం : "ఇ, ఉ, ఋ, ౡ" అనే అచ్చులకు సవర్ణముకాని అచ్చులు (అసవర్ణములు) పరమైన క్రమముగా "య, వ, ర, ల" లు ఆదేశమగును.

ఈ సూత్రం ప్రకారం

ప్రత్యుపకారము ⟶ ప్రతి + ఉపకారము

ప్రత్ + ఇ + ఉపకారము

'ఇ' కి అసవర్ణమైన 'ఉ' అను అచ్చు పరమైనది 'ఇ' స్థానంలో 'య' అనునది ఆదేశంగా వచ్చును.

కావున ప్రత్ + ఇ + ఉపకారము అనునది

ప్రత్ + య్ + ఉపకారము అగును

ప్రత్యుపకారము అను రూపము ఏర్పడును. అదేవిధంగా

అత్యున్నతము ⟶ అతి + ఉన్నతము

అత్ + ఇ̸ + ఉ

త్ + య్ + ఉ = త్యు

గుర్వర్థము ⟶ గురు + అర్థము

ర్ + వ్ + అ = ర్వ

పిత్రంశ ⟶ పిత్ + ఋ + అంశ

త్ + ర + అ = త్ర

లాకృతి ⟶ ౡ + ఆకృతి

ౡ + ఆ

ల్ + ఆ = లా

లేఖననైపుణ్యాలు - వ్యాసం :

వ్యాసం అంటే ఇచ్చిన అంశాన్ని గురించి వివరించి చెప్పడం. మన అభిప్రాయాలను క్రమపద్ధతిలో వెలువరించడం ఒక కళ. అనవసర విషయాలు ప్రస్తావించకుండా అభిప్రాయాలను సూటిగా వెల్లడిస్తే చదివేవారికి ఆసక్తికరంగా ఉంటుంది. కుతూహలం కలిగిస్తుంది.

ఇప్పుడు అడవుల గురించి **కింది చిత్రంలోని అంశాల ఆధారంగా** చక్కటి వ్యాసాన్ని ఎలా రాయాలో నేర్చుకుందామా!

మాదిరి:

ప్రకృతి మనకు ప్రసాదించిన వనరులలో అడవులు ఒకటి. అనేక వృక్షాల సముదాయాన్ని అడవులు అని అంటారు. వర్షాలు అధికంగా కురిసే చోట ఈ అడవులు అభివృద్ధి చెందుతాయి. వీటిలో అనేక రకాలున్నాయి. అవి సతతహరితారణ్యాలు, పర్వతారణ్యాలు, ఋతుపవనారణ్యాలు, చిట్టడవులు మొదలైనవి.

అడవుల వల్ల వర్షాలు సకాలంలో కురుస్తాయి. పాడిపంటలు అభివృద్ధి చెందుతాయి. వరదల వేగాన్ని తగ్గిస్తాయి. పల్లపు ప్రాంతాలు జలమయం కాకుండా కాపాడుతాయి. పలురకాల జంతువులు, పక్షులు, కీటకాలకు ఆశ్రయమిస్తాయి.

భూమి మీద 70 శాతం నీరు, నేల 30 శాతం ఉన్నాయి. జనాభా అనూహ్యంగా పెరిగి పోతున్నందువల్ల అడవులను నరికి ఆ స్థలాన్ని నివాసయోగ్యంగా చేసుకునే ప్రయత్నంలో మానవజాతి ఉన్నది. అందువల్ల భూమి మీద క్రమంగా అడవుల విస్తీర్ణత క్షీణించి పోతున్నది. అడవులను నరికి వేయడం వల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోయి, వర్షాలు తగ్గిపోయి మానవ జాతి మనుగడకే ముప్పు ఏర్పడే పరిస్థితులు నెలకొంటున్నది.

కావున ఎన్నో రకాలుగ ఉపయోగపడే అటవీ సంపదను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మానవ జాతిపై ఉన్నది. అందువల్ల అటు ప్రభుత్వం, ఇటు ప్రజలు అడవుల సంరక్షణకై కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

అభ్యాసం

ఇచ్చిన అంశాల ఆధారంగా 40-50 పదాలతో చెట్టు ఆత్మకథను వ్యాసంగా రాయండి.

- ఏదేని చెట్టు ఆత్మకథ
- తనను తాను పరిచయం చేసుకోవడం
- చెట్లను కాపాడుకొనే విధానం
- ఆత్మకథ అంటే
- ప్రయోజనాలు తెల్పడం
- ప్రభుత్వం చేస్తున్న కృషి

4 లోకాలోకనము

నేపథ్యం :

- 'వసుధైవ కుటుంబం' యొక్క అర్థమేంటి? దానిలోని ఆంతర్యమేంటి?
- గ్లోబలైజేషన్ అనగా నేమి? ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- మీరు చదివే ప్రతి పాఠ్యపుస్తకంలో ఉన్నటువంటి 'ప్రతిజ్ఞ'ను మనస్సు నిలిపి చదివారా? దాని భావాన్ని గ్రహించారా? పాటిస్తున్నారా?
- విశ్వమానవప్రేమ, శ్రేయస్సుకు ఎందరో మహానుభావులు పాటుబడ్డారు. వారిని గురించి తెలుసుకోండి.
- అందరూ కలిసిమెలిసి సహాయ సహకారాలందించుకుంటే ఈ ప్రపంచం ఎంత అందంగా, హాయిగా ఉంటుందనే విషయం గురించి ఇప్పుడు నారాయణరెడ్డి గారు ఏమన్నారో చూద్దామా!

ఆకసము బీజ ప్రదాతగ
అవనియే ఒక ఆద్యమాతగ
కాన గల్గిన మానవునకు జ
గజ్జనాళి ఒకే కుటుంబము 1

నింగి లోపల లేవు ఎల్లలు
నీరధిని కనరావు ఎల్లలు
ఎందుకీ ధరణీ తలమ్మున
ఇరుకు వాడలు, ఇనుపగోడలు 2

అన్ని జాతుల కొకే సూర్యుడు
అన్ని నేలలకొకే చంద్రుడు
అయినచో జాత్యహం కారము
ఆటవిక తత్త్వమ్ము కాదా? 3

ఏ కులము వెన్నెలది? తెమ్మెర
లెట్టి జాతికి చెందినట్టివి?
అట్టిదే కద మానవత్వము
అన్నిటికి ఎత్తైన సత్యము 4

ఊహలే రెక్కలుగ జేసిమ
హోన్నతముగా ఎగిసి చూచిన,
వసుధ యంతయు కన్పడును పసి
వాడు విసరిన బంతిపోలిక 5

ఒక అహంత మనస్సులో వే
రూరు తొల్తగ; దాని బాహిర

శాఖలే 'నా దేశమిది నా
జాతి యిది' యను భావరేఖలు 6

ఆత్మ పాలసముద్రమటు నిం
డార విచ్చిన దండి మనిషికి
విశ్వగోళము పండువెన్నెల
వెన్ను లొరిగిన పంటపొలమగు 7

మనసు నంటిన అహంభావము
మంచు మాదిరి కరిగిపోయిన
మనిషి లోపలి దేవతాత్వము
మణి ముకురము వోలె భాసిలు 8

స్నేహపవ మానము ఆగస్త్య ఋ
షీంద్రు పోలిక సాగిపోయిన
నెత్తి బిగిసిన గిరులుసైతము
మెత్తబడి మును సాగిలం బడు 9

మనుషులందరు అన్నదమ్ముల
మాదిరిగ జీవించగల్గిన
మర్త్య లోకమె దివ్యపదవికి
మారు పేరై పరిమళించును 10

చంద్రమండల మందుకొన ధీ
శక్తులను వెచ్చించు కన్న
మానవుని దేవతగ మార్చెడు
మార్గమును కనుగొనుట మిన్న 11

కవిపరిచయం : డా॥ సి. నారాయణ రెడ్డి గారు 1931 జులై 29న తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లాలోని హనుమాజీ పేటలో మల్లారెడ్డి, బుచ్చమ్మ అను పుణ్యదంపతులకు జన్మించారు. వీరి రచనలు కర్పూర వసంతరాయలు, మధ్యతరగతి మందహాసం, విశ్వంభర మొదలగునవి. వీరు పద్మశ్రీ పురస్కారం, జ్ఞానపీఠ అవార్డు గ్రహీతలు.

ప్రస్తుత పాఠ్యభాగం, లోకాలోకనం వారి 'దివ్వెలమువ్వలు అనే కవితాసంపుటి నుండి గ్రహించబడింది. మానవులమధ్య అంతరాలు ఉండకూడదని చెబుతూ ఈగేయం మానవత్వపు గొప్పదనాన్ని ప్రబోధిస్తుంది.

I. చదవండి – ఆలోచించండి – రాయండి.

అ) పదజాలం పెంపొందించుకుందాం.

ఆకసము = నింగి, ఆకాశం; బీజం = విత్తనం; దాత = దానం చేయువాడు; అవని = భూమి; జగత్తు = ప్రపంచం; నీరధి = సముద్రం; ధరణి = భూమి; వసుధ = భూమి; అహంత = గర్వం; ఊరు = పుట్టు, లోపలినుండి బయటకు వచ్చు; తొలుత = మొదలు; బాహిరం = బయటి; దండి = గొప్ప; విశ్వగోళం = ప్రపంచం; పవనం = గాలి; ముకురం = అద్దం; ధీ = బుద్ధి; మర్త్యలోకం = భూలోకం; వెచ్చించుట = ఉపయోగించుట; మిన్న=ఎక్కువ, శ్రేష్ఠము.

ఆ) భావాలు తెలుసుకుందాం.

1. ఆకాశాన్ని తండ్రిగా, భూమిని తల్లిగా భావించిన మానవునకు ప్రపంచమంతా ఒకే కుటుంబం.
2. ఆకాశానికి అవధులు లేవు, సముద్రానికి ఎల్లలు లేవు. ఈ భూమిపై మాత్రమే ఇనుపగోడలలాంటి ఎల్లలు ఏర్పరచుకొనుట ఎందుకు?
3. సూర్యచంద్రులు అన్ని జాతులకు, అన్ని నేలలపైనా ఒకే వెలుగును సమానంగా ప్రసరింప జేయుచుండగా, మానవులకు మాత్రమే నా జాతి అన్న అహంకారం ఏల? ఈ అసమానతలను తొలగించుకోలేకపోవటం ఆటవికతత్వం అనిపించుకోదా (అనిపించుకొనును అని భావం)
4. వెన్నెలకు కులం లేదు. గాలికి జాతి లేదు. కులమతాలకు అతీతమైనట్టిదే మానవత అన్నది. ఇదే సత్యం.
5. మనం ఊహలనెడి రెక్కలతో పైకెగసి చూచినట్లైనచో పిల్లవాడి చేతిలోని బంతివలె భూమండలం కనిపిస్తుంది.
6. మనస్సులో మొదట స్వాభిమానమన్నది నాటుకుంటుంది. మొలకెత్తుతుంది. 'నా దేశము, నా దేశస్థులంతా ఒక జాతి' అను భావనలే దాని కొమ్మలు.
7. పాలసంద్రం వంటి మలినం లేని తెల్లని, ఆత్మకలిగిన మానవునకు విశ్వం పండు వెన్నెలగా, వెన్నులొరిగిన పంట పొలం గా కనిపిస్తుంది.
8. మన మనసులోని అహంభావం మంచువలె కరిగి తొలగిపోతే మనలోని దైవత్వము మణి దీపికలా ప్రకాశిస్తుంది.
9. అగస్త్యమునీంద్రుడు సాగిపోవుచున్న సమయాన వింధ్యపర్వతం కూడా సాగిలపడి నమస్కరించింది. అట్లే స్నేహపూరితమైన పలకరింపునకు కఠినాత్మ కూడా మెత్తబడుతుంది.
10. మానవులందరూ అన్నదమ్ములవలె జీవింపగలిగినచో భూలోకమే స్వర్గలోకానికి మారుపేరవుతుంది.
11. చంద్రమండలాన్ని చేరుకోవాలని మన ధీశక్తులను ఉపయోగించుటకన్న మానవుని దేవతగా మార్చే మార్గాన్ని కనుగొనటం మంచిది.

II చర్చించండి–రాయండి.

అ)

1. జగత్తు అంతా ఒకే కుటుంబం.
2. జాత్యహంకారము ఆటవికతత్వము.
3. మర్త్యలోకమే స్వర్గలోకముగా మారును.

ఆ) అర్థవంతమైన పదాలతో పూరించి గేయపాదాల్ని తిరిగి రాయండి.

1. నింగి లోపల లేవు ఎల్లలు
   .... కనరావు ఎల్లలు
2. జాత్యహంకారము .... తత్త్వమ్ము కాదా.
3. వసుధ యంతయు కన్పడును ....
   విసిరిన బంతి పోలిక
4. మనిషి లోపలి దేవతాత్మము
   .... వోలె భాసిలు.
5. మర్త్యలోకమె .... పదవికి
   మారుపేరై పరిమళించును.

ఎందుకంటే.....

కింది వానిని గురించి రెండేసి వాక్యాలు రాయండి.

- మొదటిది – ఎందుకు నచ్చుతుంది.
- రెండవది – ఎందుకు నచ్చదు

వాన | సముద్రం | వేసవి | చలికాలం

III. కృత్యం:

పాఠ్యభాగంలోని కింది గేయచరణాలను చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ) ఒక్కొక్క పదంలో జవాబులు రాయండి.

1. నీటిని రెక్కలుగా చేసుకోవాలి. [ ]
2. మనిషిలో దేవతాత్వము ఎప్పుడు భాసిల్లుతుంది. [ ]
3. వసుధ దీనివలె కనిపించును. [ ]
4. శ్రేష్ఠుడైన మానవునకు విశ్వం కనిపించే విధం. [ ]

పుట సంఖ్య 16లోని ఊహాలే రెక్కలుగా జేసి .... మణి ముకురము వోలె భాసిలు (5 నుండి 8 గేయాలు) వరకు

ఆ) సరియైన పదాలతో పూరించి గేయపాదాన్ని తిరిగి రాయండి.

1. పసివాడు విసిరిన .... పోలిక
   అ) రాయి ఆ) బంతి ఇ) బొమ్మ
2. ఒక అహంత .... వేరూరు.
   అ) తలపు ఆ) మనస్సు ఇ) కనుల
3. వెన్ను లొరిగిన .... పొలముగు
   అ) పంట ఆ) పాడి ఇ) బీడు
4. మనసునంటిన అహంభావం .... మాదిరి కరిగిపోయిన
   అ) కన్నీరు ఆ) మలినం ఇ) మంచు

ఇ) క్రింది పదాలను సొంత వాక్యాల్లో ప్రయోగించండి.

1. పండువెన్నెల : ....
2. అహంభావం : ....

ఈ) స్వీయ స్పందన :

మనిషిలోని దైవత్వం భాసిల్లుటకు ఏం చేయాలని కవి అన్నాడో మీ సొంతమాటల్లో రాయండి.

IV. భాషావగాహన.

1. కింది సంధులను జతపరచండి – సంధి పేరు రాయండి.

1. ఋషి + ఇంద్రుడు	అ) మహోన్నతము
2. వసుధ + అంతయు	ఆ) చెందినట్టివి
3. మహా + ఉన్నతము	ఇ) ఋషీంద్రుడు
4. చెందిన + అట్టివి	ఈ) వసుధయంతయు

2. కింది సమాసములను సరియైన వాటితో జతచేసి సమాసము పేరు రాయండి.

1. ఇనుపగోడలు
   - ఇనుము యొక్క గోడలు
   - ఇనుము నుంచి చేసిన గోడలు
   - ఇనుపవియైన గోడలు

2. నా దేశము
   - నా అనెడు దేశము
   - నా వంటి దేశము
   - నా యొక్క దేశము

3. అన్నదమ్ములు
   - అన్నకు తమ్ముడు
   - అన్నయును, తమ్ముడును
   - అన్నయొక్క తమ్ముడు

4. మర్త్యలోకము
   - మర్త్యులుండు లోకము
   - మర్త్యులదైన లోకము
   - మర్త్యుల యొక్క లోకము

3. కింది పద్యపాదాలలోని అలంకారాన్ని గుర్తించి రాయండి.

1. వసుధయంతయు కన్పడును పసి
   వాడు విసిరిన బంతి పోలిక

2. మనిషి లోపలి దేవతాత్వము
   మణి ముకురము వోలె భాసిలు

3. చంద్రమండల మందుకొన ధీ
   శక్తులను వెచ్చించు కన్న
   మానవుని దేవతగ మార్చెడు
   మార్గమును కనుగొనుట మిన్న

4 'భూమి' అన్న అర్థాన్నిచ్చే పర్యాయపదాలను రాయండి.

భూమి – అవని

V సృజనాత్మకత

అంతర్జాలం

1. అగస్త్య మునీంద్రునకు వంగి నమస్కరించిన వింధ్యపర్వత గాథను అంతర్జాలం ద్వారా తెలిసికొని రాయండి.
2. అన్నమయ్య గేయాలను చదవండి, సమానత్వాన్ని తెలుసుకోండి.

ఆమ్రేడిత సంధి

1) అచ్చునకు ఆమ్రేడితము పరమగునపుడు సంధి తరచుగ నగును.

ఆమ్రేడితము : ఒకే పదము రెండు సార్లు పలుకబడినపుడు రెండవసారి పలికిన పదాన్ని ఆమ్రేడితము అంటారు.

ఉదా:- ఆహా + ఆహా = ఆహాహా

2) ఆమ్రేడితము పరమగునపుడు కడాదుల తొలియచ్చు మీది వర్ణములకెల్ల ఆదంతమగు ద్విరుక్తటకారమగును.

ఉదా:- కడ + కడ = కట్టకడ

3) ఆమ్రేడితము పరమైనచో విభక్తిలోపము బహుళముగానగును.

ఇంచుక, నాడు ఇత్యాదులందు అంతిమాక్షర లోపంబగు.

ఉదా: ఇంటన్ + ఇంటన్ = ఇంటింటన్, ఇంచుక + ఇంచుక = ఇంచించుక, ఇంచుకించుక; నాడు + నాడు = నానాఁడు, నాడునాడు.

4) అందుకు ప్రభృతులు యథా ప్రయోగముగా గ్రాహ్యములు.

ఉదా: అందుకు + అందుకు = అందందుకు, చెదరు + చెదరు = చెల్లాచెదురు.

భాషా కౌశల్యాలు మౌఖికం – (ప్రకాశపఠనం)

పాటించవలసిన నియమాలు :

- బిగ్గరగా చదువుట
- స్వరంలో హెచ్చు తగ్గులు పాటించుట
- స్పష్టమైన ఉచ్చారణ
- తగిన లయ, విరామం పాటించుట

ఇప్పుడు సూచనానుసారం కింది చరణాలను ప్రకాశపఠనం చేయండి.

'ఒక అహంత మనస్సులో వే .... భావరేఖలు' మరియు

'ఆత్మపాల . . . . . . పంట పొలముగు'

లేఖన నైపుణ్యాలు : అనువాదం

- కింది మరాఠీ కరపత్రాన్ని తెలుగుభాషలోకి అనువదించండి, స్పదించండి.

व्यसनमुक्त समाज घडवू या......
आनंददायी जीवन जगू या.

व्यसनमुक्ती शपथ

या पृथ्वीवर माझा जन्म आणि माझे हे शरीर म्हणजे सृष्टीने दिलेली एक अनमोल देणगी आहे. माझ्या आरोग्याचे रक्षण, स्वास्थ आणि तंदुरुस्तीसाठी,

मी कु. / श्री. --

वय ---------------- ठिकाण ---------------------------

प्रतिज्ञेपूर्वक शपथ घेतो / घेते की,आयुष्यात कोणतेच व्यसन तसेच सिगारेट, बिडी. दारू, पानमसाला, खर्रा, सुगंधित सुपारी, गुटखा व तंबाखूचे सेवन करणार नाही.

दिनांक : सही

5 తేనెపట్టు

నేపథ్యం :

- సృష్టిలో ప్రతి ప్రాణికి తననుతాను కాపాడు కోవడానికి ఏదోఒక శక్తి ఆయుధంగా పని చేస్తుంది. అవేంటో జతపరచండి.

తేలు	రంగుల మార్పిడి
తాబేలు	ముడుచుకోవడం
తేనేటీగ	గుల్ల
ఊసర వెల్లి	కొండి
అత్తి పత్తి	చిప్ప
నత్త	ముళ్ళు

మనిషికి గల అత్యంత శక్తివంతమైన సాధనం అతని 'బుద్ధి'/'జ్ఞానం' ఆ జ్ఞానాన్ని మనం లోకకళ్యాణానికి ఉపయోగించాలి. కానీ అల్ప జీవులకు హాని కల్గించడానికి కాదు. ఇప్పుడు కవి తనని దృష్టాంతంగా చేసుకొని ఏమి బోధించాలని ప్రయత్నించాడో చూద్దామా!

క్రొందేనెపట్టు నొక పూ
పందిటిలో జూచి యాసపడి హస్తంబున్
ముందునకు సాచి, కదిపితి
నందొక జిరుకొమ్మ నళుల నదలించుటకై 1

ఆదమరచి తేనియల ధనాగారంబు
కాలు గదపకుండ గాచియున్న
గండుటీగగములు కదలిక గమనించి
తత్తరమున ఝాంకృతములు సలిపె. 2

కత్తులు కొని రణమున కా
యత్తంబగు వీరయోధులపట్లు మధుపముల్
మొత్తమయి లేచి పొడిచెన్
గత్తులతో నన్ను నొక క్షణకాలమునన్. 3

నిప్పు సోకినట్లు నిఖిలాంగకంబులు
జర్జరించి, గుండె జారిపోవ
తేనెపట్టుమాట దేవు డెఱుగునంచు
తొలగిపోయినాడ దూరమునకు. 4

తుమ్మెదల దృష్టి కేనొక
తుమ్మెదనై దూరమునకు దొరగెడు నన్నున్
గ్రమ్ముకొని కుట్టసాగెన్
జుమ్మనుచును వెంటనంటి చురుకుచురుకుగన్. 5

నాలో నొక లక్షాంశము
బోలని తుమ్మెదల ధైర్యమును, సాహసమున్
నాలో లేదా యనుకొని
యాలోచన చేసి, హృదయ మారాటపడన్ 6

తిరిగి వచ్చి పుట్టతేనెపట్టును బట్టి
త్రెంచి నేలమీద ద్రెళ్ళవయిచి
ఆలకించినాడ నళికుమారుల మనో
వేదనలను, ఆర్తనాదములను. 7

అందొక శిశుమధుకర మా
క్రందన ఝుంకారరవళి గావించుచు నా
ముందరకు నొరగి యశ్రుల్
జిందుచు నిట్లనియె, నింద సేయుచు నాతో 8

"ఓరీ! దురాత్మ! బిడ్డలు
లేరా? యొక్కింత కరుణలేదా? మమ్మున్
నోరెరుగనట్టి నిసుగుల
గారించుట నీకు వేడుకా? దౌష్ట్యంబా? 9

నరుడంటుకొన్న కొడుకులు
మరణితులని మామిళింద మాతలు మరలన్
గరుణించి పెంచ, రది మధు
కరకులమున కట్టుబాటు, కరుణారహితా! 10

మాతీయని నగరంబును
ఘాతుకమతి వగుచు మంట గలిపితి వకటా!
మా తల్లులం(డు "నరునకు
నీతి హుళక్కను"చు నేడు నిజమయ్యెగదా? 11

"పాప్మింక మేము నీదు ము
గమ్ముం జూడంగరాదు కలుషం" బనుచున్
దుమ్మెద పిల్లలు తమ (ప్రా
ణమ్ములు గోల్పోయె న(శునయనంబులతో 12

వంచిన తల యెత్తక నే
(త్రాంచలములు చెమ్మగిల్ల నపరాధముగా
వించితినని చెంపలు వా
యించుకొనుచు మరలి యింటి కేగితి నంతన్ 13

కవిపరిచయం : కీ.శే. గుర్రం జాషువాగారు 1895 సెప్టెంబరు 28న వీరయ్య, లింగమ్మ అను పుణ్యదంపతులకు ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లాలోని వినుకొండ గ్రామంలో జన్మించారు. గబ్బిలం, కాంది శీకుడు, ఫిరదౌసి, క్రీస్తుచరిత్ర మొదలగునవి వీరి ఇతర రచనలు. కవికోకిల, కవితా విశారద, కవిదిగ్గజ, నవయుగకవి చక్రవర్తి, విశ్వకవి సామ్రాట్, మధుర శ్రీనాథ బిరుదులు పొందారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదాంకితుని చేసింది. భారత రాష్ట్రపతి 'పద్మభూషణ్' ఇచ్చి సత్కరించారు.

ప్రస్తుత పాఠ్యభాగమైన "తేనెపట్టు' జాషువాగారి ఖండకావ్యాలు ఐదవభాగం నుండి గ్రహింపబడింది. తేనెటీగల వంశ కట్టుబాటును కవి ఈ పాఠ్యభాగంలో వివరించెను.

I. చదవండి – ఆలోచించండి – రాయండి.

అ) పదజాలం పెంపొందించుకుందాం :

తత్తరం = తొందరపాటు; ఝాంకృతం = ఒక విధమైన ధ్వని; ధనాగారంబు = కోశాగారం, ఖజానా; ఆదమరచి = ఒళ్ళుమరచి; ఆయత్తం = సిద్ధమైన; మధుపములు = తేనెటీగలు; నిఖిలం = అంతా; అంగకం = దేహం; జర్జరీ = అనేక రంధ్రాలున్న; శిథిలమైన = ముక్కలయిన; వేదన = బాధ; ఆర్తనాదం = బాధితుల కేక; మధుకరం = తుమ్మెద; ఆక్రందన = అరుపు; ఝుంకారం = తుమ్మెదలు మొదలగునవి చేయుధ్వని; రవళి=చప్పుడు; ఒరగి=వంగి; అశ్రుల్=కన్నీళ్ళు; దురాత్మ = చెడ్డస్వభావం ఉన్నవాడు; నిసుగులు = బిడ్డలు, శిశువులు; వేడుక = ముచ్చట, వినోదం; దౌష్ట్యంబు = దుష్టస్వభావము; మామిళిందము = తుమ్మెద; ఘాతుక = హింసించునది; హుళక్కి = లేకపోవడం; కలుషం = మురికి, పాపం; నయనంబులు = కన్నులు; చెమ్మగిల్లన్ = ఆర్ద్రమవగా (కళ్ళు తడియగా)

ఆ) భావాలు తెలుసుకుందాం

1. ఒక పూలపందిరిలో కొత్త తేనెపట్టును చూచి, ఆశపడి చేతిని ముందుకు సాచితిని. ఆ తేనెటీగలను అదలించుటకై అందు ఒక చిన్న కొమ్మను కదిపితిని.
2. మైమరచి కోశాగారాన్ని వదలకుండా రక్షించుచున్న తేనెటీగలు నేను చేస్తున్న కదలిక గమనించి తత్తరపాటుతో ఝుంకారం గావించెను.
3. యుద్ధవీరులు కత్తులు తీసికొని యుద్ధానికి సిద్ధమైనట్లు, తేనెటీగలన్ని తేనెపట్టు నుంచి లేచి ఒక క్షణకాలం కత్తులతో పొడిచినట్లు నన్ను పొడిచినవి.
4. శరీరమంతా అగ్నిసోకినట్లు తేనెటీగలు కుట్టినవి. ఆ బాధకు గుండె ముక్కలయినట్లు భయం కలుగగా, తేనెపట్టు విషయం దేవునికి తెలుసునని తలంచి దూరానికి తొలగిపోతిని.
5. తుమ్మెదలన్ని దూరానికి వెళ్తున్న నన్ను చూచి చుట్టుముట్టినవి. జుమ్మనుచు, నా వీపువైపునకు వ్యాపించి, చురుకు చురుకుగా కుట్టసాగినవి.
6. నా హృదయం ఆరాట పడగా నాలో ఒక లక్షాంశాన్ని పోలినటువంటి తుమ్మెదల ధైర్యం, సాహసం నాలో లేదా అనుకొని, ఆలోచన చేసితిని.

7. మరల తిరిగివచ్చి పుట్టయందలి తేనెపట్టును పట్టుకొని త్రెంచి నేలమీద పడునట్లు చేసితిని. అప్పుడు ఆ తేనెటీగల బాధలను, ఆర్తనాదాలను వింటిని.

8. ఆ తేనెటీగల గుంపులోని ఒక శిశు తేనెటీగ గట్టిగా ఏడ్చుచు, నా ముందుకు వంగి, కన్నీళ్ళు కార్చుచు, నన్ను నిందించుచు ఇట్లనెను.

9. ఓరీ! దురాత్మా! నీకు బుద్ధి లేదా? మాపైన కొంచెమైన దయలేదా! ఏమి తెలియనట్టి శిశువులను చంపుట నీకు వేడుకా! లేదా దుర్మార్గమా! చెప్పుము.

10. ఓ దయలేని వాడా! మానవుడు తాకినచో తమ బిడ్డలు మరణించినట్లేనని తల్లి తేనెటీగలు భావించును. అవి తమ బిడ్డలను మరలా పెంచవు. అది తేనెటీగల వంశపు కట్టుబాటు.

11. అయ్యో! మధురమైన మా నగరాన్ని హింసించి మంటగలిపితివి. "మానవునకు నీతిలేదని" చెప్పిన మా తల్లుల మాట ఇప్పుడు నిజమయ్యెను కదా!

12. ఇక ఇచ్చట నుండి పొమ్ము. నీ మొగాన్ని చూచుట పాపమగును అని పలుకుచు తుమ్మెద పిల్లలు కన్నీళ్ళతో ప్రాణాలు విడిచెను.

13. నా కన్నులు చెమ్మగిల్లగా నేను వంచిన తలను ఎత్తలేదు. తప్పు చేసితినని చెంపలు వాయించుకొనుచు నేను ఇంటికి వెళ్ళితిని.

II చర్చించండి – రాయండి.

అ) 1. తుమ్మెదలు కవిని కుట్టసాగిన విధం.
2. కవి తేనెపట్టు నుండి దూరంగా జరగటానికి కారణం.
3. కవి తాను అపరాధినని తలచిన విధం.

ఆ) అర్థవంతమైన పదాలతో పూరించి పద్యపాదాన్ని తిరిగి రాయండి.

1. నన్నున్ .... కుట్టసాగెన్.
2. ఆలకించినాడ .... మనో వేదనలను, ఆర్తనాదములను.
3. అది మధుకర కులమున .... కరుణారహితా!
4. మా తీయని .... ఘాతుకమతి వగచు మంట గలిపితివి.
5. .... తమ ప్రాణమ్ములు గోల్పోయె నశ్రునయనంబులతో.

III 1) కృత్యం:

ఈ పాఠ్యభాగంలోని కింది పద్యాలను చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ కుండలీకరణంలో ఇచ్చిన పదాలతో అర్థవంతంగా పూరించి పద్యపాదాన్ని తిరిగి రాయండి.

(నిఖిలాంగకంబులు, జిరుకొమ్మ, ఝూంకృతములు, మధుపముల్)

1. కదిపితి నందొక .... నళుల నదలించుటకై.
2. గండుటీగగములు కదలిక గమనించి తత్తరమున .... సలిపె.
3. వీరయోధులపట్లు .... మొత్తమయి లేచి పాడిచెన్.
4. నిప్పుసోకినట్లు .... జర్జరించెను.

(పుట సంఖ్య 21 లోని 1 – 4 పద్యాలు)

ఆ జతపరచండి.

1. ముందునకు సాచి	( )	అ)	ధనాగారంబు
2. ఆదమరచి తేనియల	( )	ఆ)	దూరమునకు
3. తేనె పట్టుమాట	( )	ఇ)	కదిపితి
4. తొలగిపోయినాడ	( )	ఈ)	దేవుడెఱుగునంచు.

ఇ కింది పదాలకు అర్థాలు రాయండి.

1. మధుపములు = ____________

2. తత్తరము = ____________

ఈ స్వీయస్పందన

తేనెపట్టు నందలి తేనె తీసుకోవాలని చేయిసాచిన అతనిని తేనెటీగలు ఏ విధంగా ఎదిరించినవో మీ సొంతమాటలలో రాయండి.

2. కృత్యం :

పాఠ్యభాగంలోని కింది పద్యాలను చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ సరైన పదాలతో పూరించి పద్యపాదాన్ని తిరిగి రాయండి.

1. నరుడంటు కొన్న ....
   మరణీతులని మామిళింద మాతలు మరలన్

2. మాతీయని నగరంబును
   ఘాతుకమతి వగచు .... వకటా

3. .... తమప్రా
   ణమ్ములు గోల్పోయె నశ్రునయనంబులతో

4. వంచిన తలయెత్తకనే
   .... చెమ్మగిల్లన్.

పుటసంఖ్య 21,22 లోని "నరుడంటుకొన్న కొడుకులు .... యుంచుకొనుచు మరలియింటి కేగితి నంతన్" (10 నుండి 13 వరకు పద్యాలు)

ఆ తప్పొప్పులు గుర్తించి రాయండి.

1) అది మధుకరకులమున కట్టుబాటుకాదు. : ....

2) నరునకు నీతి హుళక్కనుచు నేడు నిజయయ్యెకదా? : ....

3) చెంపలు వాయించుకొనుచు ఇంటికేగితి నంతన్ : ....

4) పక్షిపిల్లలు తమప్రాణమ్ములు కోల్పోయె : ....

ఇ. కింది పదాలకు వ్యతిరేకార్థములు రాయండి.

1) అపరాధము x .... 2) నిజము x ....

ఈ. స్వీయస్పందన

తేనెటీగలు తమపట్టును తాకినవానిని నిందించిన విధం మీ సొంతమాటలలో రాయండి.

IV భాషావగాహన

1. అడిగిన విధంగా పూరించండి.

పదం	విడదీసి రాయుట	సంధి పేరు
1.	ధన + ఆగారంబు	
2. నిఖిలాంగకంబులు		
3. ఇట్లనియె		
4. నిజమయ్యె		
5.	ఇంటికి + ఏగితి	
6. నిందసేయుచు		

2. జతపరచండి.

1.	మనస్సు నందలి వేదనలు	( )	అ)	షష్ఠీ తత్పురుష సమాసము.
2.	తుమ్మెదయొక్క పిల్లలు	( )	ఆ)	సప్తమీ తత్పురుష సమాసము.
3.	క్రొత్తదైన తేనెపట్టు	( )	ఇ)	సంభావన పూర్వపదకర్మధారయ సమాసము.
			ఈ)	విశేషణ పూర్వపదకర్మధారయ సమాసము.

3. కంద పద్య లక్షణాలను రాయండి.

4. కింది పాదములందలి అలంకారాన్ని గుర్తించండి.

కత్తులు గొని రణమున కా
యత్తంబగు వీరయోధులట్లు మధుపముల్
మొత్తమయి లేచి పొడిచెన్

V సృజనాత్మకత :

"తేనెటీగలు శ్రమజీవనానికి ప్రతీకలు' – అంతర్జాలం సహాయంతో తెలుసుకోండి.

VI సమాచార మార్పిడి

కీటకం జీవిత చరిత్రను గూర్చి నీ సహవిద్యార్థితో చర్చించి, అనుబంధంలో సమాచార మార్పిడి పద్ధతి సహాయంతో కింది అల్లిక ఆధారంగా 10 వాక్యాలు రాయండి.



భాషా కౌశల్యాలు – మౌఖికం (శ్రవణం, ఉక్త లేఖనం)

సూచనలు : శ్రద్ధగా అవగాహనతో విని రాయవలెను
శుభ్రంగా, గుండ్రంగా రాయవలెను
తప్పులు, కొట్టివేతలు లేకుండా రాయవలెను

ఉక్తలేఖనం :

క్రొందేనెపట్టు	పుట్టతేనెపట్టు
ఝూంకృతములు	శిశుమధుకరము
వీరయోధులు	మామిళిందమాతలు

మీకు తెలుసా!

ఒక కిలో తేనెను కూడబెట్టడానికి, తేనె పుట్టలోని తేనెటీగలు 4 మిలియన్ పువ్వులనుండి, దాదాపు భూగోళాన్ని 4 సార్లు చుట్టివచ్చేటంత దూరం ప్రయాణించి సేకరిస్తాయి.

6 అజంతా శిల్పి

నేపథ్యం :

- ఆదిమ మానవులు ఎచ్చట నివసించేవారు?
- వారు గుహలలో ఏమేమి చిత్రించేవారు? కారణమేమి?
- కుడ్య చిత్రాలని వేటిని అంటారు?
- మీరు చూసిన గుహా శిల్పాలు/చిత్రాలు గురించి తరగతిలో చర్చించండి.
- కింది వాటిని జతపరచండి.

ఎలిఫెంటా గుహలు (caves)	హన్మకొండ
ఎల్లోరా గుహలు	గుంటూరు
వేయి స్తంభాల గుడి	వేరూళ్
ఉండవల్లి గుహలు	ఘారాపురి (ముంబయి)

శిల్పిని మరాఠీ భాషలో ______, ఇంగ్లీషులో ______, హిందీలో ______ అంటారు.

ఓ అజంతా దివ్య శిల్పీ!
ఓ మహోన్నత విశ్వ శిల్పీ!
సృష్టిలో సౌందర్యమంతా
చిత్తమందలి రాగమంతా

మూగ బొమ్మల భంగిమలలో
సోగ కన్నుల యొప్పిదములో
కుప్పవోసిన నీదు రంగుల కుంచెనేమందూ? 1

నీవు మెట్టిన కొండలన్నీ
నిద్ర మేల్కొని లేచి చూచెను
నీవు తాకిన ముదిమి బండలు
నిండు జవ్వనమున హసించెను
జడములకు గిలిగింత పెట్టెడు
జాణవీవౌరా! 2

నిష్ఠురాశ్మము చేతగొని, నవ నీతమట్టులక సాగదీసితి
పూవుగా - పూవు బోణిగా, విరి
తీవగా కల్పించి చూపితి,
ఏ అపూర్వ మహేంద్ర జాలము నెచట నేర్చితివీ? 3

కటిక ఱాలను జీల్చి అచ్చర
కలికిమిన్నల వెలికి దీసిన

ప్రతిమలను కులికించి, అభినయ
గతులు నేర్పిన నీదు పోగర
మంత్రదండము కానిచో ఆ మహిమ లెక్కడివీ? 4

ఉలిని కవ్వము చేసిన యీ గిరి
తల మహాంబుధి నీవు చిలుకగ
శిలలె అలలై అప్సరసలను
శీర్షములపై మోసి తెచ్చెను
నవకళామృత ముద్భవించెను భువనభోగ్యమ్మై! 5

ఎందు చూచిన బుద్ధ దేవుని
మందహాసమె గోచరించును
ఎచట పిలిచిన కరుణదేవుని
హృదయవీణయె బదులుపలుకును
శిలలు కావివి, శాక్యమౌని సజీవరూపములే 6

గతశతాబ్దుల కళారోచులు
కన్నులకు మిఱుమిట్లు గొల్పెను
నడలకందని ఊహలేవో
ఎడదలో పరవళ్ళు త్రొక్కెను
నీ అజంతా గుహల ముందట–నిలుచుకొన్నంత 7

ఎపుడు తొలిచిన శిలాగుహలివి
ఎపుడు మొలిచిన కళాలతలివి
ఇప్పుడే ఉలిమొనలు కదలిన
చప్పుడులు విన్పించునేలా!
ఇపుడె పూచిన యట్లు వాసన లెగయగానేలా! 8



కవిపరిచయం : శ్రీ ఉండేల మాలకొండారెడ్డిగారు 1932 ఆగష్టు 23న ఇనిమెట్ల గ్రామం ప్రకాశం జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో జన్మించారు. ఎడిన్‌బరో యూనివర్సిటీ నుండి స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ సాధించారు. ఈయన ఇతర రచనలు నేతాజీ, వివేకానందుడు, కంటిచక్రాలు, మొగలిరేకులు, **'ఒడిసెలరాళ్ళు'**, **'సత్యం శివం సుందరం'** **'మాలకొండనోట మంచి మాట'** (శతకం) మొదలగునవి. వీరికి **'బాలసరస్వతి'**, కవికిరీటి, **'విద్యాభూషణ్'** అనే బిరుదులు కలవు.

ప్రస్తుత పాఠ్యభాగం **'అజంతాశిల్పి'** కావ్యమాల సంకలనం నుండి గ్రహించబడింది. శిల్పి యొక్క కళానైపుణ్యాన్ని గురించి కవి కన్నులను కట్టినట్లు వివరించెను.

I. చదవండి – ఆలోచించండి – రాయండి.

అ) పదజాలం పెంపొందించుకుందాం:

అర్థాలు :

చిత్తం = మనస్సు; ఒప్పిదం=చక్కదనం; ముదిమి=వయసు మీరిన; జవ్వనం = పడుచుదనం; హసించు = నవ్వు; జడములు = ప్రాణము లేనివి, కదలలేనివి; నిష్ఠురాశ్మం=కఠినమైన రాయి; నవనీతం=అప్పుడే చిలికియెత్తినవెన్న; అచ్చర = అప్సరస; పోగర = నగిషీ చెక్కడానికి ఉపయోగించే ఒక పనిముట్టు; మహాంబుధి = గొప్పసముద్రం.

ఆ) భావాలు తెలుసుకుందాం.

1. అజంతా శిల్పాలను చెక్కి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఓ మహాశిల్పీ! సృష్టిలోని అందమంతా, మనసులోని అనురాగమంతా బొమ్మల భంగిమల్లోను, సొగసైన కన్నుల చక్కదనంలో రాశిగా పోసి గీసిన నీ రంగుల కుంచెను ఏమని పొగడగలను? ఎంతని మెచ్చుకోగలను?
2. నీవు తిరిగిన కొండలన్నీ నిద్రనుండి లేచి చూశాయి. అనగా శిల్పి కొండలను అందమైన శిల్పాలుగా మలిచెను, నీవు తాకినంతనే ప్రాచీనమైన రాళ్ళన్నీ పడచుదనంతో నవ్వాయి. అనగా శిల్పి ఉలి తాకినంతనే బండరాళ్ళు కూడా అందమైన శిల్పాలుగా మారాయి. ప్రాణం లేని వాటికి కూడా చేతనత్వం కలిగించు నేర్పరి శిల్పి.
3. కఠినమైన రాళ్ళుకూడా నీ చేతిలో వెన్న ముద్దల వలె సాగినవి. పూవులుగా, చక్కని స్త్రీలుగా, పూలతీగలుగా వాటిని మలచి చూపించావు. ఇంతటి అపురూపమైన మహేంద్ర జాలాన్ని నీవెక్కడ నుండి నేర్చుకున్నావు? అనగా ఇంత గొప్ప అపూర్వమైన శిల్పకళను శిల్పి ఎక్కడనుండి నేర్చుకున్నాడని భావం.
4. కఠినమైన రాళ్ళను బద్దలు కొట్టి అప్సరసల వంటి ప్రతిమలను చెక్కుతావు. వాటికి భంగిమలను నేర్పించు నీ యొక్క పోగర మంత్రదండంతో సమానమైనది.
5. ఉలినే కవ్వంగా చేసి ఈ గిరులనెడి మహాసముద్రాన్ని నీవు చిలుకగా శిలలే అప్సరసలుగా ఉద్భవించి తమ శిరస్సులపై కళ అనెడి అమృతాన్ని మోసుకొచ్చాయి.
6. ఎక్కడ చూచినా బుద్ధదేవుని చిరునవ్వే గోచరిస్తుంది. ఎచట నుండి పిలిచినా ఆయన హృదయమనెడి వీణ బదులు పలుకుతుంది. రాళ్ళు కావివి. ఆయన సజీవమైన రూపాలే.
7. నీ అజంతా గుహలముందు నిలుచుంటే గడచిపోయిన వందల సంవత్సరాల కళాకాంతులు కళ్ళకు మిఱుమిట్లు గొలుపుతున్నాయి. కదిలే ఊహల మదిలో పరవళ్ళు త్రొక్కాయి.
8. ఈ రాళ్ళ గుహలు ఎప్పుడు తొలిచావు? ఈ కళాతీగలు ఎప్పుడు పుట్టాయి. ఇప్పుడే ఉలితో చెక్కుతున్నట్లు శబ్దాలు వినిపిస్తున్నాయి ఎందుకు? ఇప్పుడే పూచినట్లు పరిమళిస్తున్నాయి ఎందుకు?

II. చర్చించండి – రాయండి.

1. కటికటాల నుండి శిల్పి వెలికి దీసేవి ....
2. శిల్పి నిద్రమేల్కొని చూచినవి ....
3. శిల్పి యొక్క రంగుల కుంచె చేసిన చిత్రాలు.
4. "శిల్పి చేతిలో మంత్రదండమున్నది." ....
5. "శిల్పి జడములకు గిలిగింత పెట్టెడు జాణ" ....
6. శిల్పి ఉలిని కవ్వముగా చేస్తే ఉద్భవించినవి ....

III కృత్యం :

పాఠ్యభాగంలోని కిందిగేయాలను చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ. జతపరచండి

1.	గత శతాబ్దుల కళారోచులు	అ) వాసన లెగయగానేల
2.	ఇపుడె పూచినయట్లు	ఆ) కన్నులకు మిఱుమిట్లు గొల్పెను
3.	శిలలు కావివి	ఇ) హృదయ వీణయె బదులు పలుకును
4.	ఎచట పిలిచిన కరుణదేవుని	ఈ) శాక్యమౌని సజీవరూపములే

పుటసంఖ్య 27 లోని (6,7,8 గేయాలు) ఎందు చూచిన బుద్ధదేవుని --- పద్యం నుండి --- వాసన లెగయగానేలా!

ఆ. పద్యాల్లోని అంత్యాను ప్రాసపదాలు 4 ఏరి రాయండి.

ఇ వచనం మార్చి రాయండి.

1. కన్ను ________ 2. శిలలు ________

3. లతలు ________ 4. ఉలి ________

ఈ. స్వీయస్పందన :

అజంతా గుహల గురించి పద్యాల ఆధారంగా మీ భావనను సొంత మాటల్లో రాయండి.

IV భాషావగాహన

1 సంధులను విడదీసి సంధి నామం రాయండి.

1.	మహోన్నత	=		+		→	
2.	కుప్పవోసిన	=		+		→	
3.	నిష్ఠురాశ్మము	=		+		→	
4.	వెలికి దీసిన	=		+		→	
5.	మహాంబుధి	=		+		→	
6.	కళామృతము	=		+		→	
7.	నడలకందని	=		+		→	
8.	విన్పించునేలా	=		+		→	

2 కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాసనామము రాయండి.

1. దివ్యశిల్పి ____________ 2. సోగకన్నులు ____________
3. హృదయవీణ ____________ 4. అజంతాగుహలు ____________
5. ఉలిమొనలు ____________ 6. అభినయగతులు ____________
7. శిలాగుహలు ____________ 8. కటికటాలు ____________

IV. స్వీయ వ్యక్తీకరణ :

మీరు చేసిన ఏదేని ఒక పర్యటన గురించి ఛాయాచిత్ర సహితంగా యాత్రా వర్ణన (ట్రావెలాగ్) అనుబంధంలోని సమాచార మార్పిడి సహాయంతో తయారు చేయండి.

భాషా కౌశల్యాలు (మౌఖికం) – సంభాషణ :

- విద్యార్థులను రెండు గ్రూపులుగా చేయాలి.
- వారిలో ఒకరిని నాయకుడిగా ఎన్నుకోమనాలి.
- స్వల్ప కాలవ్యవధి ఇవ్వాలి.
- ఒకే విషయాన్ని ఇచ్చి వేర్వేరుగా చర్చించుకోమనాలి.
- నాయకుడు వచ్చి తమ గ్రూపువారి అభిప్రాయాలు చెప్పాలి.

చర్చించవలసిన అంశం : **అంతర్జాలం – సదుపయోగం**

త్రికసంధి

'ఆ, ఈ, ఏ' లను త్రికములు అందురు.

త్రికము మీది అసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగానగును. ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుడు ఆచ్ఛికంబగు దీర్ఘమునకు హ్రస్వంబగు.

అసంయుక్తము : సంయుక్తము కాని అక్షరం. ఒక హల్లు కింద వేరొక హల్లు ఉంటే అది సంయుక్తము. కానిది అసంయుక్తము.

ద్విత్వము : ఒక హల్లు కింద అదే హల్లు రావటం ద్విత్వం అంటారు. ఉదా: క్క, ట్ట మొదలగునవి.

ఆచ్ఛికము : కేవలం తెలుగు శబ్దాలు

ఆ + కన్య = 'ఆ' అనునది 'త్రికము' త్రికము తరువాత ఉన్న 'క' అసంయుక్తము. సూత్రము ప్రకారము అసంయుక్త హల్లు పరమైనపుడు ద్విత్వంబు బహుళంబుగా నగును. కావున

ఆ + కన్య → ఆ + క్కన్య గా మారును.

ద్విరుక్తంబగు హల్లు పరమగునపుడు ఆచ్ఛికంబగు దీర్ఘమునకు హ్రస్వంబగు. కావున

ఆ + క్కన్య → అక్కన్యగా మారును.

ఇదే విధంగా :

ఇవ్విధము = ఈ + విధము → ఈ + వ్విధము = ఇవ్విధము

ఎక్కాలము = ఏ + కాలము → ఏ + క్కాలము = ఎక్కాలము

అయ్యశ్వము = ఆ + ఆశ్వము

ఆ + అశ్వము అన్న చోట రెండు స్వరాల మధ్య సంధి జరగనిచో యట్ ఆగమముగా వచ్చును. అన్న సూత్ర నియమాన్ని బట్టి ఆ + య్ + అశ్వము = ఆ + య్యశ్వము → అయ్యశ్వముగా మారును.

సమాచార మార్పిడి :

అంశాలను – విజ్ఞప్తిగా మార్చుట

(సూచన: సమాచారమార్పిడి గురించిన వివరాలకు చూడుము పుట సంఖ్య : 102)

నమూనా : కింది అంశాల ఆధారంగా విజ్ఞప్తిని రాయండి.

- కమీషనర్
- నీటిపన్ను
- భీవండి మహానగరపాలిక
- డిసెంబరు 31 ఆఖరు తేది
- నీటికనెక్షన్లు తొలగింపు

జవాబు :

నగర ప్రజలకు విజ్ఞప్తి :

భీవండి మహానగరపాలిక కమీషనర్. ఇందు మూలంగా నగర ప్రజలకు తెలియ జేయడమేమనగా – మీరు నీటిపన్ను మహానగరపాలిక వారికి డిసెంబరు 31 వ తేదీలోగా చెల్లించ వలయునని విజ్ఞప్తి. నీటి పన్నును గడువులోపల చెల్లించని యెడల సదరు మీ నీటి కనెక్షన్లు తొలగించబడును. కావున మీరు నీటిపన్ను సకాలంలో చెల్లించి మహానగరపాలిక అభివృద్ధికి తోడ్పడగలరని ఆశిస్తున్నాము.

ఇట్లు,
కమీషనర్,
భీవండి మహానగరపాలిక

అభ్యాసం :

కింది అంశాల ఆధారంగా విజ్ఞప్తిని రాయండి.

- పోలీస్ కమీషనర్
- సోలాపూర్, మహానగరపాలిక సోలాపూర్
- దొంగలబెడద అధికంగానుండుట.
- ఇంటినుండి బయటికి వెళ్ళునపుడు/సెలవులందు వేరొక ఊరికి వెళ్ళునపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు.
- నగలు, విలువైన వస్తువులు, నగదు మున్నగు వాటిని ఇంటిలో ఉంచుకొనకుండుట.
- గస్తీ తిరుగుట, పోలీసులకు ఫిర్యాదు చేయుట.
- ముగింపు

7 సంక్రాంతి

నేపథ్యం :

- ''సిరుల కాంతి–సంక్రాంతి''ని పెద్దపండుగ అని ఎందుకంటారు?

సంక్రాంతి సందర్భంగా వివిధ దిన, వార ప్రతికలు, దూరదర్శిని కార్యక్రమాలు గమనించి కింది అంశాల ఆధారంగా భారతదేశం లోని వివిధ ప్రాంతాలలో సంక్రాంతి పండుగను గురించి చర్చించండి.

– గొబ్బెమ్మలు	– భైసాఖి	– గంగిరెద్దులు	– పొంగల్
– హరిదాసులు	– తిల్‌గూళ్	– బొమ్మల కొలువులు	– రంగవల్లులు

సీ॥ కొసరి నూటిన పచ్చి పసుపు బూఁత మొగాన
        గుమ్మడి పూదుమారమ్ము నద్ది
    కండరేగడ నారబండి కస్పండువై
        పొలుచు మిర్యపు బండు బొట్టువెట్టి
    వలిపెమ్మునకు నొక్కవాసి హెచ్చయినట్టి
        నునుమంచు తెరచీర నూలుకొల్పి
    బంతిపూవులకుఁ జేమంతి నెయ్యము గూర్చి
        కబరీభరమ్ము చక్కన కుదిర్చి

తే॥ పంటకళ్ళాలు మును బరాబరులు సేయ
        గూడుకట్టిన తెలిమబ్బు గొడుగునీడ
    కదలివచ్చెను భాగ్యాల కడలిబోలె
        మకరసంక్రాంతి లక్ష్మి హేమంతవీధి   1

సీ॥ లేగటి పాలలో గ్రాగి మాగిన తీయ
        తీయ కప్పుర భోగి పాయసంబు
    చవులూరు కరివేప చివురాకుతో గమ
        గమలాడు పైర వంకాయ గూర
    తరుణకుస్తుంబరీదళ మైత్రిమై నాల్క
        త్రుప్పుడుల్చెడు నక్కదోసబజ్జి
    క్రొత్త బెల్లపు దోడికోడలై మరిగిన
        ముదురు గుమ్మడిపండు ముదురు పులుసు.

తే॥ జిడ్డుదేఱియన వెన్నెల గడ్డపెరుగు
        గరగలికజాటు ముంగారు జెరుకురసము
    సంతరించితి విందుభోజనము సేయ
        రండురండని పిలిచె సంక్రమణలక్ష్మి.   2

కవిపరిచయం : తుమ్మల సీతారామమూర్తిచౌదరిగారు 1901వ సం॥లో గుంటూరు మండలంలో జన్మించారు. వీరు ఉభయ భాషాకోవిదులు. జాతీయ భావస్ఫూర్తి గలిగిన వీరు అభినవ తిక్కన బిరుదాంకితులు. వీరి రచనలలో తెలుగుతనము ఉట్టిపడుతుంటుంది.

జాతీయత తొణికిసలాడు రాష్ట్రగానము, ఉదయగానము, ఆత్మకథ, ఆత్మార్పణము, ధర్మజ్యోతి, అమరజ్యోతి, పరిగపంట, గీతాదర్శనము, సర్వోదయగానము మున్నగునవి వీరి కావ్యములు.

ప్రస్తుత పాఠ్యభాగము 'పరిగపంట' అను కావ్యమునుండి గ్రహింపబడినది. సంక్రాంతి లక్ష్మి వైభవము ఈ పాఠ్యభాగమున వర్ణింపబడింది.

I చదవండి – ఆలోచించండి – రాయండి.

పదజాలం పెంపొందించు కుందాం – భావాలు తెలుసుకుందాం.

1. గుమ్మడి పూదుమారమ్ము = గుమ్మడి పూవు పుప్పొడి; కండరేగడ = కండగల నల్లరేగడి నేల; మిర్యంపు బండు = మిరపపండు; నునుమంచు = మెత్తని మంచు; తెరచీర నూలుకొల్పి = తెల్లచీరను ధరించి; కబరీభరమ్ము = కొప్పు; కుదిర్చి = తురుముకొని; తెలిమబ్బు = తెల్లని మబ్బు; భాగ్యాల కడలి = భాగ్యము అనెడి సముద్రం.

   సంక్రాంతిలక్ష్మి కొసరి నూరిన పచ్చి పసుపు పూతగల ముఖమునందు గుమ్మడిపువ్వు పుప్పొడిని అద్దుకొనెను. కండగల నల్లరేగడి చేనిలో పండిన మిరపపండును కుంకుమబొట్టుగా ధరించెను. కడుతెల్లని సన్నని వస్త్రము కన్నను మిన్నగా ప్రకాశించు లేతమంచుతెరయను చీర కట్టుకొనెను. బంతిపూలను, చేమంతిపూలను కలిపి దండగా కొప్పున తురుము కొనెను. పంటకళ్లాల రొదలు తన పాగడ్తలుగా, తెల్లమబ్బును గొడుగుగా చేసికొని భాగ్య సముద్రంవలె హేమంత ఋతువు వీధియందు విహరించెను.

2. లేగటిపాలు = ఈని ఎన్నాళ్లో కాని ఆవు లేక గేదె పాలు; కప్పురభోగి పాయసంబు = సువాసన ద్రవ్యములతో చేసిన పాయసం; కరివేప చివురాకు = లేత కరివేపాకు; తరుణ కుస్తుంబరీదళం = కొత్తిమీర; నక్కదోస = పొట్టి దోసకాయ.

   సంక్రాంతిలక్ష్మి ప్రజలను విందుభోజనమునకై ఆహ్వానించెను. ఆ విందులో ఈని ఎన్నాళ్లోగాని ఆవులు లేక గేదెల పాలతో మఱుగునట్లు కాచబడి సువాసన ద్రవ్యాలతో మాగిన ఘుమఘుమలాడు పాయసాన్ని వడ్డించెను. కరివేపాకుతో ఉడికి సువాసనలు వెదజల్లుచున్న వంకాయకూర, కొత్తిమీరాకుతో కూడిన నక్క (పొట్టి) దోసకాయల బజ్జీలు వడ్డింపబడెను. క్రొత్త బెల్లంతో కలిసి మరగిన గుమ్మడిపండ్ల ముక్కల తీయని దప్పళాన్న, మొదటి కారున పండిన చెరకు రసాన్ని, వెన్నెలవలె తెల్లనై జిడ్డుదేరిన పెరుగును వడ్డించెను. (ఇవియన్నియు పుష్యమాసాన మిక్కుటంగా సమకూరు పదార్థములు)

II చర్చించండి – రాయండి.

అ) 1. సంక్రాంతి లక్ష్మి ముఖాన్ని అలంకరించుకొన్న విధం.

2. హేమంత వీధికి మకర సంక్రాంతి లక్ష్మి వచ్చిన విధం.

3. సంక్రమణ లక్ష్మి ఏర్పాటు చేసిన విందు భోజనం.

ఆ) **అర్థవంతమైన పదంతో పూరించి పద్యపాదాన్ని తిరిగి రాయండి.**

1. బంతిపూవులకు .... నెయ్యము గూర్చి.

2. రండు రండని పిలిచె .... లక్ష్మి.

III కృత్యం :

పాఠ్యభాగంలోని కింది పద్యాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ) తప్పులు సవరించి రాయండి.

1. కొసరి దంచిన పచ్చిపసుపు బూతమొగాన
2. ననుమంచు రంగుచీర నూలుకొల్పి.
3. గూడు కట్టిన తెలిమబ్బు చెట్టునీడ
4. మకరసంక్రాంతి లక్ష్మి శిశిరవీధి

పద్యం : మొదటి పద్యం

ఆ) జతపరచండి.

1.	కబరీభరమ్ము	( )	పూదుమారమ్ము
2.	గుమ్మడి	( )	చక్కనకుదిర్చి
3.	బంతిపూవులకు	( )	తెలిమబ్బు
4.	గూడుకట్టిన	( )	చేమంతి

ఇ) గీతగీసిన పదాలు ఏ విభక్తి ప్రత్యయాలో రాయండి.

1. వలిపెమ్ముకు ఒక్క వాసి ____________
2. పంట కళ్ళాలు మును బరాబరులు సేయ ____________

ఈ స్వీయస్పందన

సంక్రాంతిలక్ష్మి వైభవాన్ని సొంతవాక్యాలలో రాయండి.

IV భాషావగాహన

1. పదాలను విడదీసి సంధిపేరు రాయండి.

పదం
1. భోజనము సేయ
2. హెచ్చయిన
3. నెయ్యము గూర్చి
4. బరాబరులు సేయ

2. విగ్రహవాక్యాలు రాసి ఏ సమాసమో రాయండి.

పదం
1. గుమ్మడిపూవు
2. ననుమంచు
3. హేమంతవీధి
4. తెలిమబ్బు

3. అలంకారం గుర్తించండి.

1. కదలి వచ్చెను భాగ్యాల కడలిబోలె
   మకర సంక్రాంతి లక్ష్మి హేమంత వీధి
2. బంతి పూవులకు జేమంతి నెయ్యము గూర్చి
   కబరీభరమ్ము చక్కన కుదిర్చి

ప్రాజెక్టు పని : అంశం : "పర్యావరణానికి హాని కలుగని రీతిలో పండుగలు జరుపుకొనుట"

మీకు తెలుసా! మనం జరుపుకునే ప్రతిపండుగ ప్రకృతి పర్యావరణాలతో అవినాభావ సంబంధం కలిగి ఉంది.

- నీకు నచ్చిన పండుగను ఎన్నుకో
- చిత్రాలు, సమాచారం, నినాదాలు ఉపయోగించు.

హరితమార్గంలో హోలీ ఆడండి	మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించండి.

- వీటన్నింటిని చక్కగా అమర్చుకొని, ప్రవాహవృక్షాకృతులలో విశ్లేషించి చూపి ఒక మంచి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేయి.

లేఖననైపుణ్యాలు - సంక్షిప్త లేఖనం

సంక్షిప్త లేఖనం అనగా అర్థము లోపించకుండా క్లుప్తంగా సారాంశాన్ని రాయుట.

సూచనలు : 1) ఇచ్చిన గద్యంనందలి వాక్యాలను ఉన్నదున్నట్లుగా రాయకూడదు.

2) గద్యాన్ని అవగాహన చేసుకొని పూర్తి అర్థం వచ్చునట్లుగా స్పష్టంగా, సంగ్రహంగా దాని సారాంశం రాయాలి.

కింది గద్యాన్ని చదివి, గద్యసారాంశాన్ని మూడవ వంతునకు కుదించి రాయండి.

మాదిరి :

శ్రీనగరంలోకెల్లా ప్రశస్తమైన సరోవరం దాల్‌సరస్సు, దాల్‌లేక్‌లో నౌకావిహారం చేస్తూ, దారి చుట్టూ రమణీయంగా విప్పిన నెమిలిపురిలో కన్నులు కుదురుకున్నట్లుగా అమరిన పూలతోటలు చూడటం ఆవేళ మా కార్యక్రమం. సరస్సులో తిరగడానికి తీరాన నౌకలు సిద్ధంగా ఉన్నాయి. అవి అన్నీ చిన్నచిన్న పడవలు. పైన అందమైన గుడ్డలో కూర్చిన కప్పు, చుట్టూమనకవసరమైనప్పుడు వేసుకోవడానికి వీలుగా రంగురంగుల పూల తోరణాలు, లోపల కూర్చోడానికి మెత్తని సీట్లు, ముఖ్యంగా స్ప్రింగ్ పరుపుల సీట్లు! బోటువాడు కాక అందులో ఐదుగురు సుఖంగా కూర్చుని ప్రయాణం సాగించవచ్చు. ఆ యజమానుల అభిరుచులనుసరించి ప్రతి బోటుకూ ఓ అందమైన పేరు కన్పించింది. వీటినక్కడ 'షికారా' అంటారు. మేమెక్కిన షికారా పేరు హెలికాప్టర్! దాల్‌లేక్ విశాలంగా మాముందు పరుచుకొని ఉంది. ఎక్కడ చూసినా వెండిరేకులా తళతళలాడే నీటి ఉపరితలం. దాల్‌సరస్సు నాలుగుమైళ్ళు పొడవు, వెడల్పు ఒకటిన్నర మైలు. శ్రీనగరానికి తూర్పుదిశనున్న ఈసరస్సు కావలివైపున పర్వతశ్రేణి నిటారుగా, ఠీవిగా నిల్చుని సరస్సు అందాన్ని తదేకంగా పరికిస్తున్న రసహృదయుడైన వ్యక్తిలా కనిపిస్తుంటుంది.

సంక్షిప్తం : శ్రీనగరంలో కెల్లా ప్రసిద్ధిగాంచిన దాల్‌సరస్సులో తిరగడానికి నౌకలు సిద్ధంగా ఉంటాయి. అవి చిన్నచిన్న పడవలు. బోటువాడు కాక అందులో ఐదుగురు కూర్చొని సుఖంగా ప్రయాణం చేయు వీటిని 'షికారా' అంటారు. రచయిత్రిగారు, వారి బృందం ఎక్కిన షికారా పేరు 'హెలికాప్టర్'. వీరు దానిలో కూర్చొని, దారిచుట్టూవున్న పూలతోటలు చూడటం వారి కార్యక్రమం. నాలుగుమైళ్ళ పొడవు, ఒకటిన్నర మైలు వెడల్పుతో తళతళ మెరుస్తున్న ఈ సరస్సు అందాన్ని ఎదురుగానున్న పర్వతశ్రేణి తదేకంగా చూస్తున్నట్లు కన్పిస్తుంది.

అభ్యాసం :

కింది గద్యాన్ని చదివి, గద్యసారాంశాన్ని మూడవ వంతునకు కుదించి రాయండి.

ఒలింపిక్ క్రీడల విశిష్టతను నలుదిక్కులా వ్యాపింప జేయడానికి ఒలింపిక్ జ్యోతిని వెలిగిస్తారు. దీన్ని వెలిగించడానికి అగ్ని శిఖను కాగడా రూపంలో భూ,జల,వాయు మార్గాలలో గ్రీసుదేశం నుంచి తీసుకొస్తారు. ఈ జ్యోతి పోటీలు జరిగిన న్ని రోజులూ వెలుగుతుంటుంది. పదహారు రోజులు జరిగే ఈ పోటీల్లో ప్రపంచంలోని ఏ దేశమైన పాల్గొనవచ్చు. కనీసం ఇరవై అయిదు దేశాల్లో ప్రాచుర్యం ఉన్న ఏ ఆటనైనా ఈ పోటీ అంశాల్లో చేర్చవచ్చు. క్రికెట్ ఆటకు ఒలింపిక్ క్రీడల్లో చోటులేదు. పూర్వకాలంలో ఒలింపిక్ విజేతలకు ఆలివ్ ఆకులతో తయారు చేసిన కిరీటాన్ని బహుకరించేవారు. ఆధునిక కాలంలో ప్రథమంగా వచ్చిన వ్యక్తికి లేదా జట్టుకు బంగారు పతకం, ద్వితీయ, తృతీయ స్థానాలకు రజిత, కాంస్య పతకాలు మరియు యోగ్యతా పత్రాలు లభిస్తాయి. నాలుగవ, ఐదవ, ఆరవ స్థానాల వారికి యోగ్యత పత్రాలు మాత్రమే లభిస్తాయి.

8 శతకమాధుర్యాలు

నేపథ్యం :

- శతకమంటే ఏమిటి?
- మీకు తెలిసిన కొన్ని శతకాల పేర్లు రాయండి.
- కింది వాటిని జతపరచండి.

విశ్వదాభిరామ వినురవేమ	కరుణశ్రీ
భాస్కరా	వేమన
తెలుగు బిడ్డా	నార్ల చిరంజీవి
తెలుగు బాల	బద్దెన

ఇప్పుడు వివిధకవులు రాసిన శతక పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదిద్దామా!

---

1. *క. కందుకమువోలె సజ్జనుడు
గ్రిందంబడి మగుడ మీదికి న్నెగయుఁజూమీ
మందుఁడు మృత్పిండము వలెఁ
గ్రిందంబడి యడఁగియుండుఁ గృపణత్వమునన్

– ఏనుగు లక్ష్మణకవి

2. *మ. ఘనుడవ్వాడగు, వేడు త్యాగమయ దీక్షంబూని సర్వంసహా
జన దైన్యస్థితి బోనడంచి సకలాశాపేశలానంద జీ
వన సంరంభము పెంచి, దేశజననీ ప్రాశస్త్యమున్ పంచునో
అనిదంపూర్వ యశస్వి యాతడగు నన్నా! విశ్వనాథేశ్వరా!

– గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ

3. *శా. పొత్తంబై కడునేర్పుతో హితము నుద్బోధించు మిత్రుండు, సం
విత్తంబై యొక కార్యసాధనమునన్ వెల్గొందు మిత్రుండు, స్వా
యత్తంబైన కృపాణమై యరుల నాహారించు మిత్రుండు, ప్రో
చ్చిత్తంబై సుఖమిచ్చు మిత్రుడు దగన్ శ్రీలొంకరామేశ్వరా!

– నంబి శ్రీధరరావు

4. శా॥ ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాస సంత్రస్తులై,
యారంభించి పరిత్యజింతు రురు వి ఘ్నాయత్తులై మధ్యముల్,
ధీరుల్ విఘ్ననిహన్యమాను లగుచున్ ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్గావునన్

– ఏనుగు లక్ష్మణకవి

5. శా|| ఆశా సంహరణంబు, నోర్మియు, మద త్యాగంబు, దుర్దోష వాం
ఛా శూన్యత్వము, సత్యమున్, బుధమతాచారంబు, సత్సేవయున్
వైశర్యంబును, శత్రులాలనము, మాన్యప్రీతియుం, బ్రశ్రయ
శ్రీ శావిత్వము, దీనులందుఁగృపయు, శిష్టాళికిన్ ధర్మముల్

(– ఏనుగు లక్ష్మణకవి)

6. చ|| చదువది యెంత గల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణ సంయుతు లెవ్వరు మెచ్చ రెచ్చటం
బదనుగ మంచి కూర నల పాకము చేసిననైన నందునిం
పొదవెడు నుప్పు లేక రుచి పుట్టగ నేర్చునటయ్య భాస్కరా

(– మారద వెంకయ్య)

1. శ్రీ ఏనుగులక్ష్మణకవి గారు తూర్పుగోదావరి జిల్లాలో పెద్దాపురంలో తిమ్మకవి, పేరమాంబ దంపతులకు జన్మించారు. ఇతడు క్రీ.శ. 18వ శతాబ్దికి చెందినవారు. భర్తృహరి సంస్కృతంలో రచించిన సుభాషితం త్రిశతిని తెలుగులోనికి 'సుభాషితరత్నావళి' పేరుతో అనువాదం చేసిన వారిలో ఒకరు. భర్తృహరి నీతిశతకము నుండి కొన్ని పద్యాలు గ్రహించబడినవి.
2. శ్రీ గుమ్మన్నగారి లక్ష్మీ నరసింహశర్మ : తెలంగాణ రాష్ట్ర మెదక్ జిల్లా పోతారెడ్డిపేట గ్రామంలో జన్మించాడు. మూడువందలకు పైగా అష్టావధానాలు చేసిరి. వాగీశ్వరీస్తుతి, ఆద్యమాతృక, పద్యోద్యానము వీరి రచనలు. 1934–2011 కాలానికి చెందినవారు.
3. శ్రీ నంబి శ్రీధరరావు తెలంగాణ రాష్ట్ర నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ (వేముగల్లు) నివాసి. శ్రీ మన్నింబాచల మహాత్మ్యము, శ్రీ మన్నింబగిరి నరసింహ శతకం ఈయన రచనలు. 'కవిరాజు' బిరుదాంకితుడు. 1934–2000 కాలానికి చెందినవారు.
4. శ్రీ మారద వెంకయ్య : ఈయన 'భాస్కరా' అనే మకుటంలో ఎన్నో నీతులను మనసుకు హత్తుకునేటట్లు తన పద్యధారను కొన సాగించిన తెలంగాణకు చెందిన కవి. వీరు 17వ శతాబ్దానికి చెందినవారు.

I. చదవండి – ఆలోచించండి – రాయండి.

పదజాలం పెంపొందించుకుందాం–భావాలు తెలుసుకుందాం.

1. కందుకమువోలె = బంతివలె; సజ్జనుడు=సుజనుడు, మంచిగుణం కలవాడు; మగుడు = తిరిగి; మందుడు = మూఢుడు; కృపణత్వమునన్ = మూర్ఖత్వంవలన; మృత్పిండము = మట్టిముద్ద; అడిగి = అణగి

   భావం: సజ్జనుడు బంతివలె క్రిందపడి తిరిగి పైకి లేచినట్లుగా హీనస్థితి నొందినను వెంటనే ఉన్నతస్థితికి చేరుకొనును. అట్లుగాక మూర్ఖుడు కిందబడి మట్టి ముద్దవలె హీనస్థితిని పొంది అట్లే ఉండిపోవును.

2. దైన్యస్థితి = దీనత్వం; పొనపించి = రూపుమాపి, పోగొట్టి; సంరంభం = వేగిరపాటు

   భావం: విశ్వనాథేశ్వరా! త్యాగంతో కూడిన దీక్షను పూని, జనులందరి దీనస్థితిని రూపుమాపి, అందరికి సుకుమారమైన, ఆనందకర జీవిత సుఖాన్ని పంచి, మాతృదేశపు గొప్పతనాన్ని ఎవరయితే విశదపరుస్తారో వారే గొప్పవారవుతారు. అపూర్వమైన కీర్తిమంతులవుతారు.

3. పొత్తము=పుస్తకము; హితము=మేలు; విత్తము=ధనము; కృపాణము=ఖడ్గము; అరి = శత్రువు;

   భావం: ఓ లొంకరామేశ్వరా! మిత్రుడైన వాడు పుస్తకం మాదిరిగా మిక్కిలి నేర్పుతో మంచిని బోధిస్తాడు. కార్య సఫలతలో విలువైనధనం వలె ఉపకరిస్తాడు. శత్రునాశనంలో స్వాధీనమైన కత్తివలె సహాయపడుతాడు. నిండు మనస్సై సుఖాన్నిస్తాడు.

4. నీచమానవులు=అధమస్థితికి చెందిన మనుష్యులు; విఘ్న+ఆయాస=విఘ్నములచే కలుగుబాధలకు; సంత్రస్తులై = భయపడినవారై; ఉరు = పెద్దలై; విఘ్నాయత్తులై = విఘ్నాలు కలిగినవారై; పరిత్యజింతురు =వదిలివేయుదురు; ధీరులు = ధైర్యం కలవారు; విఘ్ననిహన్యమానులగుచున్ = విఘ్నాలకు సరియైనవారైనను; ధృతి+ఉన్నత+ఉత్సాహం= ధైర్యం ఎక్కువైన ఉత్సాహం కలవారై; ప్రారబ్ధార్థములు = మొదలుపెట్టిన పనులు; ఉజ్జగింపరు = వదిలివేయరు.

భావం: అధములైన మానవులు విఘ్నాలు కలుగునని ఒక కార్యాన్ని ప్రారంభించరు. మధ్యలో ఆరంభించిన కార్యాన్ని విఘ్నాలు కలుగుటచే మధ్యలోనే వదిలి వేస్తారు. ధీరులు ఎన్నిమారులు ఎటువంటి విఘ్నాలు కలిగినను తాము చేపట్టిన కార్యాన్ని వదలరు.

5. ఆశాసంహరణంబు = అత్యాశను పోగొట్టు కొనుట; ఓర్మి=ఓర్పు; మదత్యాగంబు = పొగరును విడిచిపెట్టుట; దుర్ద్రోహవాంఛ=చెడుపనుల యందు కోరిక; బుధమతాచారంబు = పెద్దలు నడిచిన విధంగానే నడచుట; వైశర్యంబు = పూజ్యులను సేవించుట; శత్రులాలనం=శత్రువును కూడా చక్కగా చూచుట; మాన్యప్రీతియు = పెద్దలయందు అణకువ కలిగియుండుట; ప్రశ్రయ శ్రీశానిత్వం = కీర్తికి భంగంరాని విధంగా చరించుట; శిష్టాలికిన్ = సత్పురుషులకు,

భావం: అత్యాశను వదిలివేయుట; ఓర్పు కలిగియుండుట, అహంకారాన్ని విడిచిపెట్టుట, దుష్కార్యము లందు మనసును పోనీయకుండుట, సత్యాన్ని పలుకుట, పెద్దలు నడచిన మార్గాన్నే నడచుట, విద్వాంసులను సేవించుట, పూజ్యులను గౌరవించుట, శత్రువునైనను మన్నించుట, పెద్దలయందు అణకువ కలిగియుండుట, కీర్తికి భంగమురాని విధంగా చరించుట, దుఃఖితుల యందు దయను గనపరచుచుండుట అనునవి సత్పురుషుని లక్షణాలు.

6. రసజ్ఞత = చదువునందలి సారం నెరుగుట; నిరర్థకం = పనికిరానిది; గుణసంయుతులు = మంచి గుణాలు కలవారు; పదునుగ = తగినట్లుగా; నలపాకం = నల చక్రవర్తి చేయువంటకం; ఇంపొదవెడు = చక్కని రుచి పుట్టించు.

భావం: భాస్కరా! నలునివలె కూరను ఎంతో రుచిగా వండినను దానియందు ఉప్పు వేయకున్న రుచి పుట్టదు. అట్లే మానవుడు ఎంత విద్వాంసుడైనను చదువునందలి సారాన్ని గ్రహింపనిచో ఆ చదువు వ్యర్థము, గుణవంతులెవ్వరూ మెచ్చరు.

II. చర్చించండి – రాయండి.

అ) కింది భావానికి తగిన పద్యపాదం రాయండి.

1. సజ్జనుడు బంతివలె పడినను పైకి లేచును.
2. "మిత్రుడు పుస్తకం మాదిరిగా మిక్కిలి నేర్పుతో మంచిని బోధిస్తాడు."
3. "కూర ఎంత మంచిగా చేసినా ఉప్పులేనిచో రుచి రాదు."

ఆ) అర్థవంతమైన పదాలతో పూరించి పద్యపాదం తిరిగి రాయండి.

1. స్వాయత్తంబైన .... యరుల నాహోరించు మిత్రుండు.
2. ప్రారబ్ధార్థములుజ్జగింపరు సుమీ .... గావునన్
3. రసజ్ఞత యించుక చాలకున్న నా చదువు ....
4. మందుడు .... వలె గ్రిందంబడి యడగియుండు.

III కృత్యం :

పాఠ్యభాగంలోని కింది పద్యాలను చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ అల్లికను పూర్తిచేయండి.

______		______
	మిత్రుని యొక్క లక్షణాలు	
______		______

రెండవ, మూడవ పద్యాలు

ఆ. **కింది వాక్యాలలోని తప్పొప్పులను గుర్తించండి.**

1. ప్రోచ్చిత్తంబై సుఖమిచ్చు మిత్రుడు. ( )
2. ఘనుడవ్వాడగు వేడు దయామయ దీక్షంబూని ( )
3. అనిదంపూర్వ యశస్వియాతడగు ( )
4. కృపాణమైయరుల నాహారించు శత్రుండు ( )

ఇ. **కింది పదాలకు అర్థాలను రాయండి.**

1) యశస్వి ______ 2) ఘనుడు ______

ఈ. **స్వీయస్పందన**

అపూర్వమైన కీర్తివంతుల గురించి కవి భావనను సొంతమాటల్లో రాయండి.

IV. భాషావగాహన.

1. పదాలను విడదీసి సంధి కార్యాలు రాయండి.

పదం	విడదీసి రాయుట	సంధి కార్యం
1. కందుకమువోలె		
2. అవ్వాడు		
3. రామేశ్వరా		
4. సుఖమిచ్చు		
5. ధృత్యున్నత		
6. ప్రారబ్ధార్థము		
7. ఇంపొదవెడు		
8. శిష్టాలి		

2. కిందిపదాలకు విగ్రహవాక్యం రాసి సమాసనామం రాయండి.

పదం	విగ్రహవాక్యం	సమాస నామం
1. దైన్యస్థితి		
2. కార్యసాధన		
3. నీచమానవులు		
4. మాన్యప్రీతి		
5. మంచి కూర		

3. కింది పద్యపాదాలను గణవిభజన చేసి ఏ పద్యపాదమో గుర్తించండి.

1. అనిదంపూర్వ యశస్వియాతడగునన్నా! విశ్వనాథేశ్వరా!
2. చిత్తంబై సుఖమిచ్చు మిత్రుడు దగన్ శ్రీలొంకరామేశ్వరా!

4. **కింది పద్యంలోని అలంకారాన్ని గుర్తించండి.**

1. "పొత్తంబై కడునేర్పుతో హితమునుద్బోధించు మిత్రుండు".
2. "మంచి కూర నలపాకము చేసినసైన ఇంపొదవెడు నుప్పులేక రుచిపుట్టదు."

5. **సొంత వాక్యాల్లో రాయండి.**

1. దైన్యస్థితి ....
2. ప్రాశస్త్యము ....
3. ఉద్బోధించు ....

జతపరచండి

పండుగలు	సందేశం
బైల్‌పోళా	– చెడుపై మంచి యొక్క విజయం
గుడ్‌ఫ్రైడే	– చీకట్లుతొలగి వెలుగును చూచుట
దసరా	– జంతువులయెడ కృతజ్ఞత
దీపావళి	– దేవుని నుండి రక్షణ సందేశం

V. కృత్యం :

పాఠ్యభాగంలోని కింది పద్యాలను చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ **జతపరచండి.**

1.	ఉప్పులేక	అ	గృపయున్
2.	శిష్టాలికిన్	ఆ	సంహారణంబు
3.	దీనులయందు	ఇ	ధర్మముల్
4.	ఆశా	ఈ	రుచిపుట్టదు

పుటసంఖ్య 37 లోని 5, 6 పద్యాలు

ఆ **అల్లికను పూరించండి.**

	సత్పురుషుని లక్షణాలు	

ఇ **కింది పదాలను సొంత వాక్యాలలో రాయండి.**

1) ప్రీతి : ______________________

2) రుచి : ______________________

ఈ **స్వీయ స్పందన**

చదువు ఎప్పుడు నిరర్థకమనిపించు కొంటుందని కవి భావించాడో మీ సొంత వాక్యాల్లో రాయండి.

ఉక్తలేఖనం :

ధరణీచక్రము	సుహృజ్జనము	శౌర్యశాలి
బాహువిస్ఫురితుడు	సంగరకౌతుకము	కృపకుంభజముఖ్యులు

తగిన అర్థాన్ని గుర్తించండి.

బరువైన వాడు		
గొప్పవాడు	**ఘనుడు**	అల్పుడు
గట్టివాడు		

విత్తనము		
ధనము	**విత్తము**	చిత్తము
పొత్తము		

తనదైన స్థితి		
దైవ స్థితి	**దైన్యస్థితి**	ఉచ్చస్థితి
దీనస్థితి		

కింది పదాలకు అర్థాలను జల్లెడలో గాలించి చుట్టూ గీతగీయండి.

1. కందుకము
2. మందుడు
3. సంరంభం
4. పొత్తము
5. అరి
6. ఉజ్జగింపరు
7. ఓర్మి
8. శిష్టాలికిన్
9. పదునుగా

యూ	శ	ర	అ	హ	వ	బం
మూ	ఢు	డు	వే	స	ది	తి
శ	త్రు	వు	గి	త్పు	లి	త
వు	క	లి	ర	రు	వే	గి
మి	స్త	య	పా	ఘ	య	న
చ	ర్పు	క	టు	ల	రు	ట్లు
ఓ	ఖ	క్ష	ము	కు	ళ	గా

ఛందస్సు

శార్దూలము :

ఈ వృత్తమునకు నాలుగు పాదములుండును. ప్రతి పాదమునందును **'మ, స, జ, స, త, త, గ'** అను గణములుండును. పదమూడవ అక్షరము యతిస్థానము. ప్రాస నియమము కలదు. ప్రతి పాదము నందు 19 అక్షరములుండును. క్రింది పద్యపాదమును గమనించుము.

మ	స	జ	స	త	త	గ
U U U	I I U	I U I	I I U	U U I	U U I	U
ఆరంభిం	పరునీ	చమాన	వులువి	ఘ్నాయాస	సంత్రస్తు	లై

మత్తేభము:

ఈ వృత్తమునకు నాలుగు పాదములుండును. ప్రతి పాదమునందును **'స,భ,ర,న,మ,య,వ'** అను గణములుండును. పదునాల్గవ యక్షరము యతిస్థానము. ప్రాస నియమము కలదు. ప్రతి పాదము నందు 20 అక్షరములుండును. క్రింది పద్యపాదమును గమనించుము.

స	భ	ర	న	మ	య	వ
I I U	U I I	U I U	I I I	U U U	I U U	I U
ఘనుడ	వ్వాడగు	వేడుత్యా	గమయ	దీక్షంబూ	నిసర్వం	సహా

1 ఏకాగ్రత

గద్యభాగం

నేపథ్యం :

నీ ధ్యేయంలో నీవు నెగ్గాలంటే నీకు ఏకాగ్రచిత్తంతో కూడిన అంకిత భావం ఉండాలి.

– కీ.శే. డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం.

ఏకాగ్రత అనునది మానవునిలో ఉత్కృష్టమైన ఉత్తమ సామర్థ్యాలన్నింటికి మూలం.

– బ్రూస్ లీ

పై వాక్యాలను చదివి అర్థం చేసుకున్నారు కదా! ఏకాగ్రతతో ఎన్నో సాధించవచ్చు. అట్టి ఏకాగ్రతను ఎలా అలవరచుకోవాలో డా॥ బి.వి. పట్టాభిరాంగారు నేర్పుతారు. నేర్చుకుందామా!

ఆ మధ్య మా క్లినిక్‌కు ఒక యువకుడు వచ్చాడు. చదువులో తనకు ఏకాగ్రత పెంపొందించుకొనేందుకు సహాయం చేయమని కోరాడు. అతను ఏవో పోటీ పరీక్షలు వ్రాయబోతున్నాడు. పరిచయం చేసుకున్న తరువాత అతనిని ఓ ప్రశ్న అడిగాను.

"అయితే చదువులో తగినంత ఏకాగ్రతలేదని భావిస్తున్నావన్నమాట!"

"అవును సార్. కొంచెం లేకపోవటం కాదు, బొత్తిగా సున్నా సార్. పుస్తకాలు ముందేసుకొని రెండు గంటలు కూర్చుంటాను. కాని సబ్జెక్టుమీద ఏకాగ్రత కుదిరితే ఒట్టు. మనసు ఎక్కడెక్కడో తిరుగుతుంటుంది. నాకే ఇలా ఎందుకు జరుగుతుందో కారణం తెలియటంలేదు సార్" అన్నాడు విచారవదనంతో.

"ఓకే దాని గురించి వర్రీ అవకు, నేను చూసుకుంటాను. అయితే ఒక ప్రశ్న? ఏకాగ్రత కుదరటం లేదని నీకు అనిపిస్తోంది గదా, మరి టెలివిజన్ షోగాని, క్రికెట్ మ్యాచ్‌గాని చూస్తున్నావనుకో, అప్పుడు ఏకాగ్రత కుదురుతున్నదా?"

"అవును సార్ టీవీ గంటలకొద్దీ ఏకాగ్రతతో చూడగలను. ఏకదమ్ముగ 3 గంటలు సినిమా ఎంజాయ్ చేస్తాను. ఈ సమస్య నేమంటారో నాకు తెలీదు."

ప్రపంచమంతటా విద్యార్థుల తీరు ఇలాగే వుంటుంది. చదువుతున్న పుస్తకాలమీద మనసు నిలపలేనప్పుడు వారు ఏకాగ్రత కోల్పోయి తమకు ఆసక్తివున్న అంశాన్ని మనస్సులో దర్శించటంగాని, లేక ఓటమి గురించో, భవిష్యత్తు గురించో భయపడటం గాని, మరేదైనా గాని చేస్తుంటారు.

ఈ భూమిమీదవున్న ప్రతిమానవుడికీ, ప్రతిప్రాణికీ కావలసినంత ఏకాగ్రత ఉంది. లేకుంటే వారి మనుగడ సాధ్యం కాదు. ఉదాహరణకు ఆకాశంలో ఎగురుతున్న గ్రద్ద నేలమీద ప్రాకుతున్న ఒక ప్రాణిని చూసి, దానిమీద కన్నువేసి ఒక్క ఉదుటునవచ్చి దాన్ని కాళ్ళతో కరుచుకొని రివ్వున ఎగిరిపోతుంది. ఆ పక్షి దూరాన్ని అంచనా వేసుకొని, అందుకు తగువిధంగా సమయాన్ని, వేగాన్ని సరిచేసుకుంటుంది.

ఏకాగ్రత అనే కళను నేర్చుకోవటం పెద్ద కష్టమేమీ కాదు. చేస్తున్న పనిమీద దృష్టి నిలిపి అన్యమనస్కతను అంతంచేసే అభ్యాసమిది. ఏకాగ్రత వహించగల సామర్థ్యం మనందరిలో వుంది.

ఒక్కొక్కసారి బయటి ఒత్తిడి కారణంగా మీరొక సబ్జెక్టును చదవాలనుకున్నా మనసు నిలకడ లేకుండా సంచారం చేస్తుంటుంది. ఆందోళనతో మీ మనసు గాడి

> **"చేతిలోవున్న పనిమీద మీ మొత్తం ఆలోచనలను కేంద్రీకరించండి.**
> **సూర్యకిరణాలను ఏకోన్ముఖం చేస్తే తప్ప వస్తువును కాల్చలేవు".**
>
> – అలెగ్జాండర్ గ్రాహంబెల్

తప్పుతుంది. మాయలేడిలా బయటి దురాకర్షణలు మీరు తెలుసుకునేలోగా మిమ్మల్ని దూరాలకు తీసుకుపోతాయి. చదువుతున్న మెటీరియల్ మీకు బోరుకొట్టేదిగాను, కష్టమైనదిగాను, అనాసక్తికరంగాను వుంటుంది.

ముందుగా ఏకాగ్రత లేకపోవటానికి కారణాలను గురించి తెలుసుకోండి. రకరకాల వ్యూహాల స్ట్రాటజీతో దానిని ఎలా అధిగమించాలో నిర్ణయించుకోండి.

టెలివిజన్, మోబైల్, సోషల్ నెట్‌వర్క్లు, పరిసర వాతావరణంలోని దురాకర్షణలు, శబ్దాలు, మ్యూజిక్, తినుబండారాలు, స్నేహితులు, కబుర్లు వగైరా బాహ్యకారణాలను అదుపు చేసుకుంటే సరిపోతుంది. లేక ఏకాగ్రతను పెంపొందించుకోవాలని మీరు సీరియస్‌గా భావిస్తుంటే ఏదైనా గ్రంథాలయానికో, పార్కుకో వెళ్ళటం మంచిది.

ఫలితం గురించిన ఆందోళన, బోర్‌డమ్, ఆరోగ్య సమస్యలు, నిరాసక్తత, ఓటమి, భయం, తిరస్కార భయం మతిమరపు భయం, పగటి కలలు కనటం ఇలాంటి సమస్యలపట్ల పాజిటివ్ మనోవైఖరి పెంపొందించుకోండి ఆరోగ్యమైన ఆహారాన్ని తీసుకోండి.

ఏకాగ్రతను పెంపొందించుకోవటం ఎలా?

1. మీ స్టడీ టేబుల్ మీద ఇప్పుడు కాదుసుమా! "NOT NOW PLEASE' అనే గుర్తుపెట్టండి. మీ మనసు ఎక్కడెక్కడో సంచరించటం మొదలు పెట్టినప్పుడు దాని వంకచూసి మళ్ళీ పుస్తకాలలో తలదూర్చండి.
2. చదివేటప్పుడు సెల్‌ఫోను, టెలివిజన్, ఛాటింగు, ఇంటర్నెట్, కంప్యూటర్ గేమ్స్ జోలికి పోకండి.
3. మీకు సంగీతం ఇష్టమైతే వాద్యసంగీతమే వినండి. కాని పాటలు, విజువల్స్ వద్దు.
4. విజయం సాధించేందుకు ఒక సమగ్రమైన టైంటేబుల్ వేసుకొని నిజాయితీగా ఆ షెడ్యూలుకు కట్టుబడి వుండండి.

ద్రోణుడు కురుపాండవులకు మల్లయుద్ధం, ధనుర్విద్య మొదలగు యుద్ధ విద్యలను నేర్పెను. ఒకనాడు ద్రోణుడు వారి అస్త్రవిద్యను పరీక్షించుటకు ఒక చెట్టు దగ్గరకు తీసుకవెళ్ళి, దానిపై నున్న కృత్రిమ పక్షిని చూపెను. మొదట ధర్మరాజుని పిలిచి "నీవు ఏమి చూచితివి?" అని అడిగెను. దానికి ధర్మరాజు "చెట్టును, కొమ్మలపై నున్న ఆకు పచ్చని చిలుకను చూచితి" ననెను. ద్రోణుడు ధర్మరాజు లక్ష్యసాధనలో పరిపక్వతనొందలేదని గ్రహించెను. తరువాత దుర్యోధనుని పిలిచి అడిగెను. దుర్యోధనుడు కూడా ధర్మరాజు వలె సమాధానమిచ్చెను. అతడు కూడా లక్ష్యసాధనకు సన్నద్ధుడు కాలేదని భావించెను. పిదప అర్జునుని వంతువచ్చెను. ద్రోణుడు అర్జునునితో చెట్టు మీద "ఏమి కన్పించుచున్నది" అని ప్రశ్నించెను. దాని కతడు వింటిని ఎక్కు పెట్టి ఒక కన్ను మూసికొని చూచుచు "నాకు కేవలం పక్షికన్ను మాత్రమే కన్పించు చున్నదనెను". వెంటనే ద్రోణుడు బాణంను వదలమనెను. అర్జునుడు తన బాణంతో దానిని ఛేదించెను. ద్రోణుడు అర్జునుని ఏకాగ్రతకు సంతోషించెను.

కవిపరిచయం : డా॥ బి.వి. పట్టాభిరామ్ అంతర్జాతీయంగా పేరుపొందిన హిప్నాటిస్టు, మెజీషియన్ మరియు ఫిలాసఫీలో నిష్ణాతులు. డా॥ పట్టాభిరామ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి "యోగ – హిప్నాటిసమ్" అనే అంశంపై పి.హెచ్‌డి. పొందారు. హిప్నాటిసమ్‌పై భారతదేశంలో డాక్టరేట్ పొందిన మొట్టమొదటి పరిశోధకులు డా॥ పట్టాభిరామ్. ప్రస్తుత పాఠ్యభాగం ఈయన గారి 'సాఫ్ట్‌స్కిల్స్' అను గ్రంథం నుండి స్వీకరించబడింది.

I చదవండి – ఆలోచించండి – రాయండి.

పదజాలం పెంపొందించు కుందాం.

ఏకాగ్రత = ఒకే విషయం మీద మనస్సు నిలపడం; పరిపక్వత = పూర్తిగా నేర్చుకోవడం; సన్నద్ధులు = సిద్ధమైన వారు; మనుగడ = జీవనం; ఛేదించు = తుంచు; అన్యమనస్కత = వేరే విషయాలను ఆలోచించడం; సంచారం చేయు = తిరుగు; అధిగమించు = దాటు; సమగ్రమైన = సంపూర్ణమైన.

II చర్చించండి – రాయండి.

1. చదువుకునేటప్పుడు వీటిజోలికి పోవద్దు
2. ఏకాగ్రతను పెంపొందించుకోవడానికి వెళ్ళవలసినది.
3. విజయం సాధించేందుకు చేయవలసినవి
4. అల్లిక పూరించండి.

ఏకాగ్రత లేకపోవడానికి బాహ్య కారణాలు.

5. ఏకాగ్రతను సాధించడానికి నాలుగు చిట్కాలు.

III కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ. ఎవరు ఎవరితో అనిరి.

1. "చెట్టు మీద ఏమి కనిపించుచున్నది?"
2. "ఆకు పచ్చని చిలుకను చూచితిని."
3. "నాకు కేవలం పక్షికన్ను మాత్రమే కన్పించు చున్నది."
4. "నీవు ఏమి చూచితివి?"

పుట సంఖ్య 43 లోని "ద్రోణుడు కురు పాండవులకు .... " నుండి "ఏకాగ్రతకు సంతోషించెను" వరకు

ఆ కుండలీకరణంలో ఇచ్చిన పదాలతో పూరించి పూర్తి వాక్యం తిరిగి రాయండి.

(ధర్మరాజు, అర్జునుడు, బాణము, పరిపక్వత, అస్త్రవిద్య)

1. ద్రోణుడు వారి .... ను పరీక్షించ దలచెను.
2. అర్జునుడు తన .... తో దానిని ఛేదించెను.
3. దుర్యోధనుడు కూడా .... వలె సమాధానమిచ్చెను.
4. ధర్మరాజు లక్ష్యసాధనలో .... పొందలేదని గ్రహించెను.

ఇ గీతగీసిన పదాలకు వచనములు మార్చి రాయండి.

1. అతడు వెంటనే ఎక్కుపెట్టి ఒక కన్ను మూసుకొని చూసెను.
2. దానిపై నున్న కృత్రిమ పక్షిని చూపెను.

ఈ స్వీయాభిప్రాయం.

అర్జునుని ఏకాగ్రతను గూర్చి మీ సొంత మాటల్లో రాయండి.

IV భాషావగాహన

1. పదాలను విడదీసి సంధి పేరు రాయండి.

పదం	విడదీయుట	సంధిపేరు
1. చదవాలనుకున్న		
2. గ్రంథాలయం		
3. సమగ్రమైన		
4. ఏకోన్ముఖం		

2. కింది పదాలకు విగ్రహ వాక్యాలు రాసి, సమాసనామం రాయండి.

పదం	విగ్రహ వాక్యం	సమాస నామం
1. కృత్రిమ పక్షి		
2. మనో వైఖరి		
3. రెండు గంటలు		
4. ఆరోగ్య సమస్యలు		

3. కింది వాటిలో సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను గుర్తించి రాయండి.

1. టీ.వి. గంటల కొద్దీ చూడగలను.
2. ద్రోణుడు కౌరవ, పాండవులకు యుద్ధవిద్యలు నేర్పెను.
3. చదివేటప్పుడు సెల్‌ఫోన్, టెలివిజన్ జోలికి పోకండి.
4. చేస్తున్న పనిమీద దృష్టినిలిపి, అన్యమనస్కతను అంతంచేసే అభ్యాసమిది.

4. భాషాభాగాలను జతపరచండి.

1. పచ్చని చిలుక	అ) క్రియ
2. పక్షి కన్ను	ఆ) విశేషణం
3. ఎగిరిపోయింది	ఇ) సర్వనామం
4. మీ గది	ఈ) నామవాచకం

N1BKPG

భాషాగమ్మత్తు

గోల్కొండను ఇబ్రహీం కుతుబ్‌షాహీ పాలించాడు. ఇతనిని మన తెలుగు కవులు మల్కిభరాముడని పిలిచారు. ఒకసారి ఆయన **'ఆకు-ఈక-మీకు-మాకు'** అనే పదాలతో పద్యాన్ని పూరించమని కోరారు. అప్పుడొక కవి కింది పద్యాన్ని చెప్పాడట.

పద్యం :-

ఆకుంటే వృక్షంబగు
ఈకుంటే హీనుడగును హీనాత్ముండౌ
మీకుంటే మాకియ్యుడు
మాకుంటే మేము రాము మల్కిభరామా!

ఆహా!!!
ఎంత బాగా
పూరించారుగదా!!!

అర్థం :-

ఓ మల్కిభ రామా!
ఆకులు గలది వృక్షము
ఇవ్వని వాడు హీనుడు
మీకున్నచో నాకు ఇవ్వండి.
మాకు ఉంటే మేము మిమ్మల్ని అడగటానికి రాము.

లేఖననైపుణ్యాలు - అధికారలేఖలు

విద్యార్థులు వివిధ సందర్భాలలో అధికార లేఖలు రాయవలసి ఉంటుంది. ఉదా: సెలవు చీటి, స్కాలర్‌షిప్, బోనఫైడ్ మొదలగు వాటికొరకు దరఖాస్తు (అప్లికేషన్) లేఖలు, రేషన్‌కార్డు, బ్యాంకులోన్ మొదలైన వాటికోసం తగిన సూచనలు పాటిస్తూ అధికార లేఖలు రాయవలసి ఉంటుంది.

సూచనలు :

1) కుడివైపు పై భాగంలో రాస్తున్నవారి పేరు, చిరునామా 4,5 వరుసల్లో రాయాలి.
2) ఎడమవైపు మార్జిన్ ప్రక్కగా ఎవరికి రాస్తున్నామో వారి హోదా, చిరునామా 3,4 వరుసల్లో రాయాలి.
3) ఆ తరువాత విషయం అను శీర్షికలో లేఖలో అడిగిన విషయం క్లుప్తంగా రాయాలి.
4) దాని కింద సంబోధన రాయాలి. ఉదా: ఆర్యా, గౌరవనీయులైన
5) అడిగిన విషయాన్ని లేఖలో వివరంగా రాయాలి.
6) ఆ తరువాత ధన్యవాదములతో అని రాయాలి. ఉదా: ఇట్లు, తమ విధేయుడు, పేరు అనునవి మూడు వరుసల్లో రాయాలి.

కింద ఇచ్చిన అంశాలతో వారం రోజులు సెలవు కావలెనని కోరుతూ ప్రధానోపాధ్యాయునికి సెలవు చీటి రాయండి.

అంశాలు :

- నీ చిరునామా
- అధికారి చిరునామా
  - ✻ ప్రధానోపాధ్యాయులు,
  - ✻ పి.టి.హైస్కూలు,
  - ✻ భీవండి.
- విషయం : క్లుప్తంగా
- సంబోధన
- లేఖలో అడిగిన విషయం
  - ✻ నీ పేరు, తరగతి, డివిజను
  - ✻ సోదరి వివాహం ఎప్పుడు జరుగుతుంది.
  - ✻ ఎన్ని రోజులు సెలవు కావాలి.
- ధన్యవాదములతో
- ఇట్లు

  తమ భవదీయురాలు

  విద్య

అధికార లేఖ : (మాదిరి)

డి. విద్య,
10వ తరగతి,
పద్మనగర్,
భీవండి.
తేది: 12-07-2017

ప్రధానోపాధ్యాయులు,
పి.టి. హైస్కూల్ ,
భీవండి.

విషయం : సోదరి వివాహమునకు వారం రోజులు సెలవు కావలయునని కోరుతూ లేఖ.

గౌరవనీయులైన ప్రధానోపాధ్యాయులకు,

నేను మీ పాఠశాలలో 9వ తరగతి 'ఏ' డివిజన్‌లో చదువుచున్నాను. మా సోదరి వివాహము 18-07-2017న జరగబోవుచున్నది. కనుక వారం రోజులు అనగా 13-07-2017 నుండి 19-07-2017 వరకు సెలవు ఇవ్వవలసినదిగా ప్రార్థించుచున్నాను. నేను రానపుడు జరిగిన పాఠాలను నేను వచ్చిన తరువాత స్నేహితులనడిగి పూర్తి చేసుకుంటాను.

ధన్యవాదాలతో,

ఇట్లు,
తమ భవదీయురాలు,
విద్య

అభ్యాసాలు :

1) కంప్యూటర్‌కోర్సు వివరాలు, ఫీజు, టైము, సెలవులు తెలియ చేయవలసినదిగా కోరుతూ డైరెక్టర్, కంప్యూటెక్, ఎ-2, రెండవ అంతస్తు, సిద్ధివినాయక బిల్డింగ్, బుధవార్‌పేట్, పుణె వారికి లేఖ రాయండి.
2) మీ ప్రాంతంలో రోడ్లు సరిగ్గా లేవని/వీధి లైట్ల సౌకర్యం కల్పించమని కోరుతూ మున్సిపల్ అధికారి, ఎఫ్.నార్త్ వార్డు, వడాల, ముంబయి-31 వారికి లేఖ రాయండి.

భాషాకౌశల్యాలు - మౌఖికం (సంభాషణ)

పిల్లలను వ్యక్తిగతంగా గాని, జట్లుగా చేసిగాని వ్యవధిని నిర్ణయించి ఈ కృత్యము చేయించవలెను.

చర్చించవలసిన అంశం : **స్వచ్ఛ భారత్**

2 బహుమతి

నేపథ్యం :

- మీరు ఏదైనా పని లేదా ప్రాజెక్టు మీ ఉపాధ్యాయులు సూచించిన విధంగా ఉత్సాహంగా చేస్తారు. దానికి ఏదైనా బహుమతిని ప్రకటించినట్లయితే మీ ఉత్సాహం ఇనుమడిస్తుందా? అటువంటి సంఘటన ఏదైనా గుర్తుందా? చర్చించండి.
- చక్రం అంటే ఏమిటి? జలచక్రం అంతరాయం లేకుండా కొనసాగాలంటే ఏమి చేయాలో చర్చించండి. చిత్రాలతో కూడిన ఒక గోడ పత్రికను తయారు చేయండి.
- ఇప్పుడు సిరిపురం గ్రామవాసులు ఎందుకు ఉత్కంఠతో ఉన్నారో చూద్దామా?

శ్రీరాములు సిరిపురం గ్రామానికి సర్పంచ్. చాలా ముందుచూపు ఉన్న వ్యక్తి. తన గ్రామంలో ప్రజా సంక్షేమం కోసం ఏ కార్యక్రమం చేపట్టాలన్న ఎంతో దూరదృష్టితో ఆలోచించేవాడు. దానివల్ల అతను చేపట్టే ప్రతి కార్యక్రమంలో చక్కని ఫలితాలు కనిపించేవి. ప్రజలకు దీర్ఘకాలం ప్రయోజనాలు కలుగుతుండేవి. అతని మిత్రుడు ఉపసర్పంచ్ యాదగిరి మంచి బుద్ధిశాలి. గ్రామాభివృద్ధిలో శ్రీరాములుకు కుడి భుజంగా ఉండేవాడు. ప్రతి విషయంలో అతనితో కలిసి సమాలోచనలు చేసేవాడు. చక్కని సలహాలు ఇచ్చేవాడు.

ఇదిలా వుండగా చుట్టు పక్కల ఊళ్ళలో కొంతకాలంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలు తాగునీటికి, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బతుకుదెరువు కోసం వేరే ప్రాంతాలకు వలస వెళ్ళారు. అదంతా గమనించిన శ్రీరాములు తమ గ్రామంలో అటువంటి పరిస్థితులు లేనందుకు ఆనందపడ్డాడు. కానీ అలాంటి విపత్కర పరిస్థితులు తమకు కూడా ఎదురైతే ఎలా ఎదుర్కోవాలన్న ఆలోచన అతడిని బాగా వెంటాడింది. ఈ విషయం గురించి యాదగిరితో చర్చించాడు. "భవిష్యత్‌లో కరువు రాకుండా ఉండేందుకు ఇప్పుడు మనం చేయవలసిన పనులు రెండే రెండు! ఒకటి విరివిగా మొక్కలు నాటడం, రెండవది నీటి వనరులు వృథా కాకుండా చూసుకోవడం!" అని చెప్పాడు యాదగిరి. అందుకు శ్రీరాములు "ఇవి కేవలం మన వలన మాత్రమే జరిగే పనులు కావు. ప్రజలంతా చిత్తశుద్ధితో పూనుకుంటేనే విజయవంతమౌతాయి. నీటి విషయంలో ఆరంభ శూరత్వం పనికిరాదు. నిరంతరం ఈ కార్యక్రమాలు కొనసాగుతూనే ఉండాలి" అన్నాడు దీర్ఘాలోచన చేస్తూ. కాసేపటి తర్వాత యాదగిరి "నాదొక ఆలోచన!" అంటూ ఒక పథకాన్ని వివరించాడు. అది విన్న శ్రీరాములు ఆనందంతో "మిత్రమా! మంచి ఆలోచన చెప్పావు. దీన్ని వెంటనే అమలుపరచుదాం!" అంటూ అతడిని అభినందించాడు.

మరునాడు ఊరంతటా దండోరా వేయించాడు. "మన గ్రామ స్వరంచ్ గారి ప్రకటన మేరకు సమస్త ప్రజానీకానికి తెలియజేయునదేమనగా! మన గ్రామంలో వీలున్న చోటల్లా మొక్కలు నాటాలి. చుక్కనీటిని కూడా వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలి. వీటిని సక్రమంగా నిర్వహించిన వారికి త్వరలో భారీ మొత్తంలో నగదు బహుమతి అందుతుంది!" అంటూ దండోరా వేయించబడింది.

జనంలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఆసక్తి కలిగింది. మొక్కలు పెంచితే బహుమతులా అని ఆశ్చర్యపోయారు. సర్పంచ్ గారు ఇచ్చే బహుమతి గురించి అనేక అంచనాలు వేసుకున్నారు. బహుమతిని అందుకోవాలన్న కోరిక ప్రతి ఒక్కరిలో బలంగా పెరిగిపోయింది. ప్రజలు వెంటనే తమ పెరళ్ళలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలను పెంచడం మొదలు పెట్టారు. ఇంటి ముందు, వీధుల్లో, ఇంకా అవకాశమున్న చోటల్లా రకరకాల మొక్కలు నాటారు. బీడు భూములన్నీ మొక్కలతో నింపేశారు. ఆఖరికి కొండ ప్రాంతాలను కూడా వదల్లేదు. నాటి వదలడమే కాకుండా వాటికి నీటి సౌకర్యం

కల్పిస్తూ సంరక్షణ చర్యలు చేపట్టారు. కొంతమంది ఆయా చెట్లకు తామే సంరక్షకులమంటూ వాటి మీద తమ పేర్లు రాసి పెట్టుకున్నారు. తమ ఇళ్ళల్లో వాడుకున్న నీరు, వర్షపు నీరు ఇంటి ఆవరణలోనే ఇంకిపోయేలా ఇంకుడు గుంతలు తవ్వుకున్నారు. ఇదంతా శ్రీరాములు, యాదగిరి ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్నారు.

అలా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. ఊరంతా పచ్చదనంతో కళకళలాడిపోయింది. బావులు, చెరువులు, జలకళతో నిండు కుండలా కనిపించాయి. కరువు అనే మాట వినిపించకుండా పోయింది. జనం తరచూ బహుమతి గురించి చర్చించుకోసాగారు. కొంతమంది గ్రామపంచాయతి కార్యాలయానికి వెళ్ళి బహుమతి ఇంకెప్పుడిస్తారంటూ వాకబు చేయసాగారు.

ఇదిలా ఉండగా ఓరోజు శ్రీరాములు ప్రజలందరూ గత ఐదారు సంవత్సరాలకు సంబంధించిన తమ ఆదాయ వ్యయాలను కచ్చితమైన వివరాలతో నివేదిక సమర్పించాలని దండోరా వేయించాడు. ఆ వెంటనే ప్రజల నుండి నివేదికలు అందాయి. యాదగిరితో కలసి వాటన్నింటిని పరిశీలించిన శ్రీరాములు తమ ఆలోచన ఫలించిందని ఆనందించాడు. వెనువెంటనే ఒక పెద్దసభను ఏర్పాటు చేసి ప్రజలందరినీ పాల్గొనవలసిందిగా ఆహ్వానించాడు.

శ్రీరాములు సభలో ప్రసంగిస్తూ "నా ప్రకటన మేరకు చెట్లను పెంచి, నీటిని సద్వినియోగం చేసిన మీకందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. నేను ఇస్తానన్న బహుమతి ఈపాటికే మీకు అందింది!" అన్నాడు. జనమంతా అయోమయంతో ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

శ్రీరాములు తిరిగి "కరువు పరిస్థితులకు కారణం ప్రకృతి వనరులు తగ్గుముఖం పట్టడం, ఉన్న వాటిని సరిగ్గా వినియోగించుకోకపోవడమేనని గుర్తించిన మేము ఆ దిశగా కొన్నిచర్యలు చేపట్టాలనుకున్నాం. అందులో భాగంగానే బహుమతి అంటూ ప్రకటన చేశాం. బహుమతి పొందాలన్న కోరికతో మీరంతా చాలా శ్రమ తీసుకుని మొక్కల పెంపకం మొదలుపెట్టారు. భూగర్భ జలాన్ని పెంచుకునే చర్యలు చేపట్టారు. తద్వారా పర్యావరణ సమతుల్యం ఏర్పడింది. వర్షాలు బాగా కురిశాయి. పంటలు బాగా పండాయి కూరగాయలు, పండ్లు, ధాన్యాలు మొదలైన రోజువారి ఆహార పదార్థాలు మీరు పెంచిన చెట్ల ద్వారానే లభ్యమయ్యి కొనుక్కునే అవసరం లేకుండా పోయింది. స్వచ్ఛమైన వాతావరణ పరిస్థితులు మీరంతా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండేందుకు దోహదం చేశాయి. తద్వారా మీకు వైద్య ఖర్చులు కూడా తగ్గాయి. మొత్తంగా చూస్తే ఆదాయం పెరిగి ఖర్చులు తగ్గాయి. మీరిచ్చిన నివేదికలను గమనిస్తే ఈ విషయం అవగతమైంది. ఇతంతా జరిగింది మీరు మొక్కలను, నీటిని సంరక్షించడం వల్లే! ఇప్పుడు చెప్పండి. ప్రకృతి ప్రసాదించిన ఈ బహుమతి కంటే విలువైన బహుమతి ఇంకేమైనా ఉంటుందా?" అని ముగించాడు. అది విని జనమంతా ఆనందంతో చప్పట్లు చరిచారు. తమకు అత్యంత విలువైన బహుమతిని అందేలా చేసిన శ్రీరాములు, యాదగిరిల తెలివితేటలను అభినందించారు. ఆ తరువాత మీదట కూడా ఆ పచ్చదనాన్ని అలాగే కొనసాగించి ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా జీవించారు.

కవిపరిచయం : శ్రీ పెండెం జగదీశ్వర్ ఈయన సత్యమ్మ, నరసింహ అను పుణ్యదంపతులకు తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా, రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామంలో 1976 జూన్ 28న జన్మించారు. బాలజ్యోతి, బాలమిత్ర, బుజ్జాయి వీరి రచనలు.

ప్రస్తుత పాఠ్యభాగం పక్షులు, జంతువులకు సబంధించిన వినోదాత్మక, సందేశాత్మక కథలతోపాటు పర్యావరణస్పృహను కలిగించే 'ఆనందవృక్షము' అను పుస్తకం నుండి గ్రహించబడింది. ప్రజాసం క్షేమం కోసం కరువు రక్కసిని ప్రారదోలుటకు ఏం చేయాలో గ్రామస్థులకు కవి వివరించెను.

I **చదవండి – ఆలోచించండి – చెప్పండి.**

పదజాలాన్ని పెంపొందించుకుందాం.

ప్రజాసంక్షేమం = ప్రజల అభివృద్ధి; వర్షాభావం – వర్షాలు కురవకపోవడం; వర్షాలు లేకపోవుట.

II **చర్చించండి – రాయండి.**

నీ మిత్రులతో చర్చించి సమాధానాలు రాయండి.

1. వర్షాభావం వల్ల చుట్టు ప్రక్కల గ్రామాల్లో ఏర్పడిన పరిస్థితి.
2. గ్రామాభివృద్ధి కార్యక్రమాలు విజయవంతమవాలంటే
3. విపత్కర పరిస్థితులు ఎదుర్కోవడానికి శ్రీరాములు, యాదగిరి కలిసి చేసిన ఆలోచన.
4. సర్పంచ్ ప్రకటన విన్న ప్రజల ప్రతిస్పందన
5. సర్పంచ్ ప్రజలకు బహుమతి ప్రకటించిన విధము.

III **కృత్యం:**

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదం చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ **ఆకృతిని పూరించండి.**

కరువు పరిస్థితులకు కారణాలు

→ [ ] → [ ]

పాఠంలోని చివరి పరిచ్ఛేదం "శ్రీరాములు తిరిగి .... ఆనందంగా జీవించారు" వరకు.

ఆ **కింది వాక్యాలు తప్పొప్పులుగా రాయండి.**

1. ఆ దిశగా కొన్ని చర్యలు చేపట్టాలను కోలేదు. ( )
2. భూగర్భ జలాన్ని పెంచుకునే చర్యలు చేపట్టారు. ( )
3. పంటలు బాగా పండలేదు. ( )
4. ఆదాయం పెరిగి ఖర్చులు తగ్గాయి. ( )

ఇ **కింద గీతగీసిన ప్రత్యయాలు ఏ విభక్తులో రాయండి.**

1. ఉన్నవాటి<u>ని</u> సరిగ్గా వినియోగించు కోవడమే.
2. బహుమతి పొందాలన్న కోరిక<u>తో</u> మొక్కల పెంపకం మొదలు పెట్టారు.

ఈ **స్వీయాభిప్రాయం**

● దేశాభివృద్ధి ఏ విధంగా జరుగుతుందని అభిప్రాయ పడుతున్నావో నీ సొంత మాటల్లో రాయండి.

IV **భాషావగాహన**

1. **పట్టికను చూసి అడిగిన విధంగా రాయండి.**

పదం	విడదీయుట	సంధిపేరు
1. గ్రామాభివృద్ధి		
2. చేపట్టాలన్న		
3. అవకాశమున్న		
4.	సమర్పించాలి + అని	

2. విగ్రహవాక్యం రాసి ఏ సమాసమో రాయండి.

పదం	విగ్రహ వాక్యం	సమాసం
1. వర్షపు నీరు		
2. ఆరు సంవత్సరాలు		
3. కూరగాయలు		
4. పెద్దసభ		

3. కింది వాక్యాలలో సామాన్య సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను గుర్తించండి.

1. యాదగిరి చక్కని సలహాలు ఇచ్చేవాడు.
2. ప్రజలు తాగే నీటికీ, సాగునీటికీ తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
3. సర్పంచ్ ప్రజలందరూ నివేదిక సమర్పించాలని దండోరా వేయించాడు.
4. ప్రజలు కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచడం మొదలు పెట్టారు.
5. ప్రకటన మేరకు చెట్లను పెంచి, నీటిని సద్వినియోగం చేశారు.

N1KGR4

4. గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో గుర్తించండి.

<u>యాదగిరితో</u> కలిసి శ్రీరాములు ప్రజల నుండి వచ్చిన నివేదికలు పరిశీలించాడు. <u>తమ</u> ఆలోచన ఫలించిందని <u>సంతోషించాడు</u>. వెనువెంటనే ఒక పెద్ద సభ ఏర్పాటు చేసాడు.

5. సొంత వాక్యాలలో ఉపయోగించండి.

1. చిత్తశుద్ధి ....
2. సద్వినియోగం ....
3. నివేదిక ....

V స్వీయవ్యక్తీకరణ

నీకు పరుగు పందెంలో స్వర్ణపతకం లభించింది. అప్పటి నీ మనోభావనను తెలియజేస్తూ నీ చెల్లెలికి లేఖ రాయి.

బహువ్రీహి సమాసము

అన్యపదము ప్రధానంగా కలిగినది బహువ్రీహి. సమాసములో ఉన్న పదాలు కాక వాటి చేత సూచింపబడే వేరొక పదం యొక్క అర్థం కలిగి ఉండడమే 'అన్యపదం'.

సూత్రం : 'అన్య పదార్థ ప్రాధాన్యం కలది బహువ్రీహి''

బహువ్రీహి సమాసములో విగ్రహవాక్యం చెప్పేటప్పుడు 'కలది, కలవాడు అనే రెండు పదాలు సమాస పదాలకు చివరన తెలుగులో వచ్చి చేరతాయి.

ఉదాహరణకు : ముక్కంటి – మూడుకన్నులు కలవాడు (శివుడు), ఇందులో మూడు అన్న పదానికి గాని, కన్నులు అన్న పదానికి గాని ప్రాముఖ్యత లేదు. మూడు కన్నులు కలిగిన 'శివుడు' అన్న పదానికే ప్రాముఖ్యత వుంది.

ముక్కంటి తాండవం చేసెను. అనగా శివుడు తాండవం చేసెను అని సమాసములో చూపని అన్యపదాన్ని తెచ్చి ''శివుడు'' అని అర్థం చెప్పుట జరుగుచున్నది. ఇదియే అన్య పదార్థ ప్రాధాన్యం కలది బహువ్రీహి అనుటకు అర్థం.

- మీనాక్షి – మీనముల వంటి అక్షులు కలది. (స్త్రీ)
- చతుర్ముఖుడు – నాలుగు ముఖాలు కలవాడు (బ్రహ్మ)

భాషా కౌశల్యాలు (మౌఖికం) ప్రకాశ పఠనం

విద్యార్థులు స్పష్టమైన ఉచ్ఛారణతో, బిగ్గరగా లయతో చదవవలెను.

శ్రీరాములు సభలో ప్రసంగిస్తూ "నా ప్రకటన మేరకు చెట్లను పెంచి, నీటిని సద్వినియోగం చేసిన మీకందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. నేను ఇస్తానన్న బహుమతి ఈ పాటికే మీకు అందింది!" అన్నాడు. జనమంతా ఆయోమయంతో ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

శ్రీరాములు తిరిగి "కరువు పరిస్థితులకు కారణం ప్రకృతి వనరులు తగ్గుముఖం పట్టడం, ఉన్నవాటిని సరిగా వినియోగించుకోక పోవడమేనని గుర్తించిన మేము ఆ దిశగా కొన్ని చర్యలు చేపట్టాలనుకున్నాం. అందులో భాగం గానే బహుమతి అంటూ ప్రకటన చేశాం. బహుమతి పొందాలన్న కోరికతో మీరంతా చాలా శ్రమ తీసుకుని మొక్కల పెంపకం మొదలు పెట్టారు. భూగర్భ జలాన్ని పెంచుకునే చర్యలు చేపట్టారు. తద్వారా పర్యావరణ సమతుల్యం ఏర్పడింది. వర్షాలు బాగా కురిశాయి. పంటలు బాగా పండాయి.

భాషాకౌశల్యాలు – మౌఖికం (శ్రవణం మరియు లేఖనం)

కింది పరిచ్ఛేదాన్ని విని ప్రశ్నలకు జవాబులు రాయండి.

బదరికా వనంలో ఓ పెద్దసరస్సువుండేది. రకరకాల జలచరాలు ఆ సరస్సులో సుఖంగా వాసం చేస్తూండేవి. అక్కడే ఓ కొంగ కూడా కాలక్షేపం చేసేది. దానికి వయస్సు పైబడింది. శక్తి ఉడిగి పోయింది. కాబట్టి యుక్తిని నమ్ముకుంటే తప్ప ఆకలినుంచి ముక్తి లేదన్న ఆలోచన కలిగింది.

ఒక రోజు ఆ కొంగ, సరసు అంచుమీద నిలబడి పెద్దగా రోదిస్తూ, బొటబొట కన్నీళ్ళు కారుస్తోంది. ఓ ఎండ్రిక మిత్రుడైన మీన సమేతంగా వచ్చి కొంగపైన సానుభూతి కురిపిస్తూ, "బాబాయ్, కుశలమేనా? చాలాకాలంగా నిన్నెరుగుదుం. ఎప్పుడూ నిర్విచారంగా వుండేవాడివి. అలాంటి నీవు కంట నీరుపెట్టుకోవడానికి కారణమేమిటి? ఆ నిట్టూర్పు లేమిటి?" అనడిగింది.

ప్రశ్నలు :

(1) ఎండ్రిక కొంగను ఏమని అడిగింది? (2) కొంగకు కలిగిన ఆలోచన ఏది? (3) కొంగ, ఎండ్రిక ఎక్కడ వాసం చేస్తుండేవి?

3 వీల్ చైర్ నుండి విజయాలు

నేపథ్యం :

- ఒక నాణేనికి బొమ్మ-బొరుసు అని రెండు పార్శ్వాలు ఉన్నట్లే జీవితం కూడా ఒకే విధంగా సాగకపోవచ్చు. ఒడుదుడుకులు ఏర్పడినప్పుడు వాటినే తలుచుకొని కృంగి పోతే లాభంలేదు. ఆత్మస్థైర్యంతో వాటిని అధిగమించి అనుకున్నది సాధించడమే గొప్ప. దీనిని ఋజువు చేశారు దీపామలిక్.

కాళ్ళు కదపలేక పోతే నేమి ఆత్మస్థైర్యంతో నిండిన చేతులు ఇనుప గుండు (షాట్‌పుట్)ను అల్లంత దూరానికి విసిరి భారతదేశానికి వెండి వెలుగులను అందించాయి.

నడుము కింది భాగం చచ్చుబడిపోయి చక్రాలకుర్చీ (వీల్‌ఛైర్)కే పరిమితమై పోయిన 46 ఏళ్ళ మహిళ అథ్లెటిక్స్, స్విమ్మింగ్ సాహసంతో కూడిన ఆటలు మొదలగు అంశాల్లో అసాధారణ ప్రతిభ చూపడాన్ని కనీసం మనం ఊహించగలమా!

రియో పారాలింపిక్స్‌లో మహిళల షాట్‌పుట్ ఎఫ్-53లో రజత పతకాన్ని కైవసం చేసుకొని భారతదేశ జాతీయ పతాకాన్ని సగర్వంగా రెపరెప లాడించిన స్ఫూర్తి ప్రదాత మన దీపామలిక్.

దీప హరియాణాలోని సోనిపట్ జిల్లాలో 30 సెప్టెంబరు 1970లో జన్మించారు. తండ్రి బీ.కె. నాగ్‌పాల్ ఆర్మీలో ఉన్నతాధికారి. ఆడుతూ పాడుతూ సరదాగా గడపవలసిన బాల్యంలో పారాప్లెజిక్ (డిసెబిలిటి)తో దీప కాళ్ళూ, చేతులూ ఒక్క సారిగా బలహీన పడిపోయాయి. అప్పుడు దీప వయస్సు ఐదేళ్ళు మాత్రమే. వెన్నెముక సమస్య అని తేల్చిన డాక్టర్లు మూడేళ్ళపాటు వైద్యం చేసారు. చివరకు కోలుకున్న దీప నడక మొదలు పెట్టారు.

చిన్నతనం నుండి దీపకు మోటారు బైకులు అంటే ఎంతోఇష్టం. ఇంటర్ పూర్తయ్యే సరికి అన్ని రకాల బైక్‌లను నడిపేసారు. దీప బైక్‌ల మీద చేసే సాహసోపేత విన్యాసాలుచూసి కల్నల్ విక్రం సింగ్ మలిక్ ఆమెను తన భార్యగా చేసుకున్నాడు. దీప ఆరోగ్య పరిస్థితి ఇది అని చెప్పినా ఆ సైనికుడు వెనుక డుగు వేయలేదు.

ఆమె మొదటి కుమార్తె దేవిక 13నెలల వయసులో తల్లిలాగానే అనారోగ్యం పాలైంది. ఇది చూసిన దీప మనస్సు తల్లడిల్లింది. అయితే చివరకు ఆ చిన్నారి కోలుకొని ఆరోగ్యం పుంజుకుంది. అనంతరం రెండవపాప

> "ఇదినేనెంతో గర్వపడుతున్న క్షణం. ఎందుకంటే వైకల్యంతో బాధపడుతున్న స్త్రీలకు నా విజయం స్ఫూర్తి నిస్తుందని నా నమ్మకం. ఈ వయసులో కూడా నా దేశానికి పతకం సంపాదించడం నాకెంతో సంతృప్తిఇచ్చింది. ఇందులో నా కుటుంబం మొత్తం నాకు తోడుగా నిలిచింది---"
>
> దీపామలిక్

అంబిక పుట్టడంతో కుటుంబంలో సంతోష సంబరాలు అంబరాన్నంటాయి.

అది 1999వ సంవత్సరం..... కార్గిల్ యుద్ధ సమయం. భర్త విక్రంసింగ్ యుద్ధ భూమిలో పోరాడుతున్నారు. ఇక్కడ అదే సమయంలో దీప మరలా చిన్నప్పటి సమస్యను ఎదుర్కొన్నారు. ఆపరేషన్ చేస్తామని వైద్యులు చెప్పారు. అయితే ఆమె జీవితంలో నడవగలదని హామీ ఇవ్వలేదు. పిడుగులాంటి ఈ వార్త విన్న ఆమె కళ్ళు సెలయేళ్ళై, జలపాతాలయినాయి. భర్తతో శాటిలైట్ ఫోన్‌లో మాట్లాడారు. అచ్చమైన సైనికుడిలా "నీకు నేనున్నాను. మరేం భయం లేదంటూ" విక్రం ధైర్యం నూరిపోసాడు ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళేముందు దీపామలిక్ డాక్టర్‌తో "చివరిసారిగా నడుస్తాను" అని చెప్పినడుచుకుంటూ అక్కడి వరకు వెళ్ళారు.

తనకు ఇలా జరిగి నందుకు దీప దేవుణ్ణి తిట్టలేదు. కృంగి పోలేదు. ఒక ఆర్మీ అధికారికి కూతురు మరో ఆర్మి అధికారి భార్యకూడా అయిన దీపా మలిక్ ధైర్యంగా, స్థైర్యంగా, పట్టుదలతో తన జీవితాన్ని ముందుకు కొనసాగించారు.

తన కుటుంబ సభ్యుల సహకారంతో ఒక రెస్టారెంట్ నడిపి, విజయాన్ని తనదిగా చేసుకున్నారు. ఎంతో పట్టుదలతో ఈత నేర్చుకొని యమునా నదిలో ఏటికి ఎదురీది చూపించారు. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలో హిమాలయాల వద్ద రైడింగ్ చేసారు. అథ్లెటిక్స్‌లోకి వచ్చి రియోలో షాట్‌పుట్ 4.61 మీటర్ల దూరం విసిరి రజతపతకాన్ని తన సొంతం చేసుకున్నారు.

షాట్‌పుట్‌తో పాటు, జావెలిన్‌త్రో, స్విమ్మింగ్‌లో ప్రవేశమున్న దీప 2010లో ఆసియా పారాగేమ్స్‌లో జావెలిన్‌త్రోలో కాంస్యపతకం సాధించారు. 2011లో ప్రపంచ ఛాంపియన్ షిప్ షాట్‌పుట్‌లో రజతపతకం గెలిచారు. 2012 లో కేంద్రప్రభుత్వం నుంచి 'అర్జున' పురస్కారం అందుకొన్నారు.

రియో పారా ఒలింపిక్స్‌లో రజతం నెగ్గినందుకు హరియాణా రాష్ట్ర ప్రభుత్వ క్రీడా పథకం నింబంధనల ప్రకారం 4 కోట్లు, కేంద్రప్రభుత్వం 50 లక్షలు, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 1 కోటి రూపాయలు బహుమతిగా ప్రకటించారు. 46 ఏళ్ళ వయసులో పారాఒలింపిక్స్ చరిత్రలో భారత్‌కు పతకం అందించిన తొలి మహిళా క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించిన ఆమెను చూసి ప్రధాని మోదీ "దేశం మొత్తం నిన్ను చూసి గర్విస్తోంది' అని ట్విట్టర్ లో పేర్కొన్నారు. "దేశానికి స్ఫూర్తి అందించే పతకం ఇది" అని అభినవ్ భింద్రా అభినందనలు తెల్పాడు.

వీల్‌ఛైర్ లోనే జీవితమంతా ముగిసిపోదని, జీవిత మంటే ప్రతిరోజూ ఒక పండుగ లాంటిదని నమ్మిన దీపామలిక్ తనలాంటి వారికోసం "విల్ ఇన్ వీల్స్" అనే సంస్థను నడుపుతున్నారు.

I చదవండి – చర్చించండి – రాయండి.

1. దీప జన్మించిన స్థలం .... [ ]
2. దీప నడుపుతున్న సంస్థ .... [ ]
3. దీపామలిక్‌పొందిన వివిధ బహుమతులు [ ]
4. అల్లిక పూర్తి చేయండి.



II కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ కింది వాక్యాలను సరైన క్రమంలో అమర్చండి.

1. తనకు ఇలా జరిగినందుకు దీప దేవుణ్ణి తిట్టలేదు.
2. కేంద్ర ప్రభుత్వం నుంచి అర్జున పురస్కారం అందుకున్నారు.
3. పట్టుదలతో తన జీవితాన్ని ముందుకు కొనసాగించారు.
4. ఆపరేషన్ చేస్తామని వైద్యులు చెప్పారు.

పుట సంఖ్య 54 లోని "అది 1999వ సంవత్సరం..... నుంచి 'అర్జున' పురస్కారం అందుకొన్నారు.

ఆ దీపామలిక్ జీవితంలో జరిగిన విశేషాలు

విశేషం	సంవత్సరం
1. అర్జున పురస్కారం	
2. రజతపతకం	
3. కార్గిల్ యుద్ధం	
4. కాంస్య పతకం	

ఇ గీతగీసిన పదాలు ఏభాషాభాగానికి చెందినవో రాయండి.

1. యమునానదిలో ఏటికి ఎదురీది చూపించారు ...
2. రజత పతకాన్ని తన సొంతం చేసుకున్నారు...
3. అయితే ఆమె మళ్ళీ జీవితంలో నడవగలదని హామీ ఇవ్వలేదు.
4. విక్రమ్ ధైర్యం నూరి పోసాడు .....

ఈ స్వీయాభిప్రాయం

"దీపా మలిక్ కళ్ళు సెలయేళ్ళై, జలపాతాలైనాయి" ఎందుకో మీ సొంత మాటల్లో రాయండి.

III భాషావగాహన

1. కింది విడదీసిన సంధుల సంధినామము రాయండి.

1. ఐదు + ఏళ్ళు
2. పూర్తి + అయ్యేసరికి
3. ఉన్నత + అధికారి
4. సాహస + ఉపేతము

2. విగ్రహ వాక్యాలను, సమాసనామముతో జతపరచండి.

1. వెండివైన వెలుగు	అ) సంభావన పూర్వపద కర్మధారయ సమాసము
2. కాళ్ళూ మరియు చేతులు	ఆ) ద్విగుసమాసము
3. ఆరోగ్యం యొక్క పరిస్థితి	ఇ) తృతీయా తత్పురుష సమాసము
4. సంతోషంతో కూడిన సంబరాలు	ఈ) విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము
5. యమున అనెడి పేరు గల నది	ఉ) అవ్యయీ భావ సమాసము
6. కోటి సంఖ్యగల రూపాయలు	ఊ) షష్ఠీ తత్పురుష సమాసము
7. రోజూ రోజూ	ఋ) ద్వంద్వ సమాసము

3. **సామాన్య, సంయుక్త వాక్యాలను గుర్తించండి.**

1) దీప కాళ్ళూ, చేతులు ఒక్కసారిగా బలహీన పడి పోయాయి.
2) ఇది నేనెంతో గర్వపడుతున్న క్షణం.
3) ఆమె ఒక రెస్టారెంట్‌ని నడిపి, విజయాన్ని తన దిగా చేసుకున్నారు.
4) ఆమె కళ్ళు సెలయేళ్ళై, జలపాతాలైనాయి.
5) దేశం నిన్ను చూచి గర్విస్తోంది.

4 **గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో గుర్తించండి.**

1. ఇంటర్ పూర్తయ్యే సరికి అన్నిరకాల బైక్‌లను <u>నడిపేసారు</u>.
2. <u>ఆమె</u> మొదటి కుమార్తె <u>దేవిక</u>.
3. <u>అయితే</u> ఆమె మళ్ళీ జీవితంలో నడవగలదని హామీ ఇవ్వలేదు.

5 **విభక్తులు రాయండి.**

1. ఇనుపగుండు<u>ను</u> అల్లంత దూరానికి విసిరింది.
2. భర్త<u>తో</u> శాటిలైట్ ఫోన్<u>లో</u> మాట్లాడింది.

భాషాగమ్మత్తు

వంగతోటనుండు వరి మళ్ళలోనుండు
జొన్నచేలనుండు చోద్యముగను
తలుపుమూలనుండు తలమీదనుండు
దీనిభావ మిదియె తిరుమలేశా!

పై పద్యాన్ని చదివారు కదా! మీకేమని అర్థమయ్యింది?

ఇప్పుడు దానినే విరిచి చదవండి. అసలు అర్థం బోధపడుతుంది.

వంగ, తోటనుండు. వరి, మళ్ళలోనుండు.
జొన్న,చేలనుండు. చోద్యముగను.
తలుపు, మూలనుండు. తల,మీదనుండు.
దీనిభావ మిదియె తిరుమలేశా!

IV సృజనాత్మకత

1. నోబెల్ బహుమానం అందుకున్న భారతీయుల వివరాలు అంతర్జాలం ద్వారా సేకరించి ఆల్బమ్ తయారు చేయండి.
2. తరగతిలోని విద్యార్థులను పి.టి. ఉష, కరణం మల్లీశ్వరి, సానియా మీర్జా, పి.వి. సింధు అను నాలుగు గ్రూపులుగా విభజించి, ఆటల క్విజ్ కార్యక్రమం నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రకటించండి.

రూపక సమాసము

అవధారణా పూర్వపద కర్మధారయ సమాసమునే "రూపక సమాసము" అందురు.

"అవధారణ" అంటే నిర్ధారించడం. ఇలా నిర్ధారింపబడిన పదం పూర్వపదంగా వుండి తరువాత నామవాచకం వుంటే అది 'అవధారణా పూర్వపద కర్మధారయం' అని పిలువబడుతుంది. దీనినే రూపకం అంటారు. రూపకం అంటే రూపాన్ని ఆరోపించుట. లేని లక్షణాన్ని ఉన్నట్లు ఆరోపించి చూపుట.

ఉదా:- సంసార సాగరము – సంసార మనెడి సాగరము – సాగర ధర్మాన్ని సంసార మందు ఆరోపించుటచే – రూపకం.

గానామృతము – గానమనెడి అమృతము – అమృత ధర్మాన్ని గానమునకు ఆరోపించుట – రూపకం.

ఇదే విధంగా **కోపాగ్ని – స్వప్న వీధి** –

N1UCSR

లేఖననైపుణ్యాలు - సామెత

పెద్దలు అనుభవంతో అలంకారికంగా చెప్పిన మాటలే సామెతలు. విషయాన్ని తక్కువ మాటలలో చమత్కారంగా, మనస్సుకు సూటిగా తాకేలా చెబుతుంది సామెత.

ఇప్పుడు ఇచ్చిన సామెతను సూచనల ఆధారంగా సోదాహరణంగా ఎలా వివరించి రాయాలో చూద్దామా!

ఆరోగ్యమే మహాభాగ్యం

సూచనలు :

❖ ఇచ్చిన సామెత ఏ విషయాన్ని తెలియజేస్తుంది. ❖ సామెత అర్థవివరణ ❖ ముగింపు

మాదిరి :

ఇహలోక సౌఖ్యానికి పాడిపంటలు, ధనధాన్యాలు ఎంత అవసరమో ఆరోగ్య పరిరక్షణ అంతకన్నా అవసరం అన్న విషయాన్ని ఈ సామెత తెలియ జేస్తుంది.

అనారోగ్యం అన్నది రోగిని మాత్రమే కాక ఆ కుటుంబ సభ్యులనందరను కృంగదీస్తుంది ఒక్కొక్కసారి అనారోగ్యం అంటూ వ్యాధి రూపందాల్చి ఇంటివారినే కాక చుట్టు పక్కలవారికి కూడా ప్రమాదం తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఇదికేవలం మనుషులకే కాక ఇతర పశువులు కూడా అనారోగ్యానికి గురిఅవుతాయి. ధనం ఎంత వ్యయం చేసినా వాటిని కాపాడు కోవటం కష్టతరమే అవుతుంది. కనుక పెద్దలు ఆరోగ్యం కలిగి ఉండటమన్నది భాగ్యత్వాన్ని కలిగి వుండటంతో సమానమని, తృప్తి, ఆనందం, ఉత్సాహం అన్నవి ఆరోగ్యం వల్లనే సాధ్యమని నిర్వచించారు.

అభ్యాసాలు :

1) **"దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టు కోవాలి."**

2) **"పులిని చూచి నక్క వాతలు పెట్టుకున్నట్లు."**

అంశాలు :

- ఇచ్చిన సామెత ఏ విషయాన్ని తెలియజేస్తుంది.
- సామెత అర్థం - వివరణ
- ముగింపు

భాషాకౌశల్యాలు - మౌఖికం (శ్రవణం, లేఖనం)

- **నల్లబల్లపై రాసిన ప్రశ్నలను విద్యార్థులు ముందుగా రాసుకోవలెను.**
- **ఉపాధ్యాయులు పరిచ్ఛేదాన్ని బిగ్గరగా, స్పష్టంగా చదివి వినిపించవలెను.**
- **విద్యార్థులు శ్రద్ధగా అవగాహనతో వినవలెను. ఇచ్చిన ప్రశ్నలకు తగిన జవాబులు రాసుకొనవలెను.**
- **ఉపాధ్యాయులు రెండవసారి పరిచ్ఛేదాన్ని చదవవలెను.**
- **విద్యార్థులు సమాధానములు రాయుట పూర్తిచేయవలెను.**

దీప హరియాణాలోని సోనిపట్ జిల్లాలో 30 సెప్టెంబరు 1970లో జన్మించారు. తండ్రి బి.కె. నాగ్‌పాల్ ఆర్మీలో ఉన్నతాధికారి. ఆడుతూపాడుతూ సరదాగా గడపవలసిన బాల్యంలో పారాప్లెజిక్ (డిసెబిలిటి)తో దీప కాళ్ళూ, చేతులూ ఒక్కసారిగా బలహీనపడిపోయాయి. అప్పుడు దీప వయస్సు ఐదేళ్ళు మాత్రమే. వెన్నెముక సమస్య అని తేల్చిన డాక్టర్లు మూడేళ్ళపాటు వైద్యం చేసారు. చివరకు కోలుకున్న దీప నడక మొదలుపెట్టారు.

ప్రశ్నలు :

1) దీపకు ఎందుకు డాక్టర్లు వైద్యం చేసారు? (2) దీప ఎక్కడ జన్మించారు? (3) దీప తండ్రి ఎవరు?

వార్తావని

పఠనం

1

హైదరాబాద్, న్యూస్‌టుడే : హైదరాబాద్‌కు చెందిన తొమ్మిదేళ్ళ చిన్నారి కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి ఘనమైన లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాకారం చేసుకునేందుకు యత్నించాలన్న అబ్దుల్ కలాం మాటను నిజం చేసింది. హైదరాబాద్ వనస్థలిపురంలోని కమలా నగర్‌లో నివాసముంటున్న వినీల్‌సాగర్(21) ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అతని సోదరి మద్దెల వినీల(9)... స్పుత్నిక్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. పర్వాతారోహణపై అభిలాషతో ఇద్దరూ గతేడు సిక్కింలోని హిమాలయ మౌంటెనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నెల రోజులపాటు శిక్షణ పొందారు. ముందుగా ఆఫ్రికాలోని కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించాలని నిర్ణయించుకుని జనవరి 6న ఇక్కణ్నుంచి బయల్దేరి వెళ్లారు. 8వ తేదీన పర్వతారోహణను ప్రారంభించారు.

అడ్డంకిని అధిగమించారిలా

పదేళ్ళు నిండిన వారే శిఖరాన్ని అధిరోహించేందుకు అర్హులన్న నిబంధన వినీల పర్వతారోహణ లక్ష్యానికి అడ్డంకిగా మారింది. చివరికి బాలిక తల్లి ప్రమాణ పత్రం ఆధారంగా కిలిమంజారో జాతీయ ఉద్యానవన అధికారులు చిన్నారికి అనుమతిచ్చారు. ఎట్టకేలకు పర్వతారోహణను ప్రారంభించినవారు ఆరు రోజులపాటు ప్రయాణించి జనవరి 12న పర్వత శిఖరాన్ని చేరుకుని లక్ష్యాన్ని సాకారం చేసుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌కు తిరిగి చేరుకున్నారు. 5,895 మీటర్ల ఎత్తయిన పర్వతంపై భారత జాతీయపతాకం ఎగురవేయడం సంతోషంగా ఉందని వారిరువురూ పేర్కొంటున్నారు. భవిష్యత్తులో హిమాలయ పర్వత శిఖరాలను అధిరోహించడమే తన లక్ష్యమని వినీల్ సాగర్ పేర్కొన్నారు.

అ) 104 ఉపగ్రహాలతో ఇస్రో రికార్డ్-ఖగోళ చరిత్రను తిరగరాసిన భారత్

ఆ) జల్‌గావ్ బాలలకు జాతీయ సాహస బాలల పురస్కారం

ఇ) వయస్సు చిన్నది - ఘనత పెద్దది

(తొమ్మిదేళ్ళ వయస్సులోనే కిలిమాంజారోను అధిరోహించిన హైదరాబాద్ బాలిక)

1		
2		
3		

2

ముంబయి: మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాకు చెందిన నీషా పాటిల్‌కు జాతీయ సాహస బాలల పురస్కారం దక్కింది. దేశవ్యాప్తంగా 25మందిని సాహస బాలుర పురస్కారాలకు ఎంపిక చేయగా మహారాష్ట్ర వాసి నీషా పాటిల్‌కు చోటు లభించినట్లు జాతీయ బాలకల్యాణ్ పరిషత్ అధ్యక్షురాలు గీతా సిద్ధార్థ్ ప్రకటించారు. ఎంపికైన ఇరవై అయిదు మందిని ఈనెల 23న ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతులమీదుగా సాహస పురస్కారాలు అందజేసి సన్మానించనున్నారు. నీషా పాటిల్ బడ్‌గావ్‌లోని ఆదర్శ్ బాలికల కళాశాలలో 12వ తరగతి చదుతోంది. 2015 జనవరి 14న ఉదయం 10గంటల సమయంలో నీషా పాటిల్ స్నేహితురాలు ఇంటికెళ్ళింది. ఆ సమయలోనే పక్కింట్లో అకస్మాత్‌గా దట్టమైన పొగతో మంటలంటుకోవడం, చిన్న పాప రోదిస్తున్న శబ్దం గమనించింది. ఆ వెంటనే వెనుకా ముందు ఆలోచించకుండా ప్రాణాలు పణంగాపెట్టి చిన్నారిని కాపాడింది. దీంతో నీషా సాహస బాలుర పురస్కారానికి ఎంపికైంది.

3

శ్రీహరికోట (ప్రతినిధి): ఇస్రోరూపొందించిన పి.ఎస్.ఎల్.వి-సీ37 ఉపగ్రహవాహకనౌక చరిత్రను సృష్టించింది. ఫిబ్రవరి 15, 2017 బుధవారం 104 ఉపగ్రహాలను ఒకేసారి అంతరిక్షంలోకి ప్రణాళిక ప్రకారం ప్రవేశపెట్టింది. ఈ అద్భుతఘట్టానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా శ్రీహరి కోటలో ఉన్న సతీష్‌ధావన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం వేదికయింది. ఈ ప్రయోగానికి సంబంధించి మంగళవారం తెల్లవారుజామున 5.28 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. బుధవారం ఉదయం సరిగ్గా 9.28 గంటలకు పి.ఎస్.ఎల్.వి-సీ37 రాకెట్ 104 శాటలైట్లతో అంతరిక్షంలోకి దూసుకెళ్ళింది ఈ అద్భుత ఘట్టాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు చుట్టు పక్కల ఊళ్ళ నుండి తల్లిదండ్రులు తమ పిల్లలను వెంటబెట్టుకొని శ్రీహరికోటకు తరలివచ్చారు. ప్రపంచమంతా ఉత్కంఠతో దూరదర్శన్‌ల ముందు కూర్చొని తిలకించింది.

అభ్యాసం:

1. **'వార్తావని'లోని వార్తలను శ్రద్ధగా చదవండి. ఆ వార్తలను వాటి శీర్షికలు మరియు చిత్రాలు/ఛాయా చిత్రాలలో జతపరచండి.**
2. భారతదేశ అంతరిక్ష పరిశోధనల సమాచారాన్ని వార్తా పత్రికలు అంతర్జాలం మొదలగు వాటిద్వారా సేకరించండి.
3. ఈ సంవత్సరం జాతీయ సాహసబాలల పురస్కారాల నందుకున్న బాలబాలికల వివరాలను పట్టికలో రాయండి.

క్రమ సంఖ్య	పేరు	సాహస కృత్యం వివరాలు

4. ఏదేని ఒక ముఖ్య సమాచారాన్ని వివిధ ప్రసార మాధ్యమాలు, అంతర్జాలం ద్వారా సేకరించండి. ఒకే వార్తను వివిధ మాధ్యమాలు ఎలా వెల్లడించాయో గమనించండి. దానిని తులనాత్మకంగా పరిశీలించి ఒక 'వార్తావిశేషం' వలె (పత్రికా భాషలో) రాయండి. శీర్షిక పెట్టండి.

4 పరిష్కారం

నేపథ్యం:

- ఏదైనా ఒక విషయాన్ని మనసులో నాటుకొనే విధంగా చెప్పాలంటే ఒక ఉదాహరణ సహితంగా చెబుతాం. ఆ విషయాన్ని ఎదుటివారు ఇంకా ఆసక్తితో వినాలి. గుర్తుంచుకోవాలనుకుంటే కథారూపంలో చెబితే ఆశించిన ఫలితం లభిస్తుంది. అందుకే ఏ భాషా వాఙ్మయం లోనైనా కథా సాహిత్యం అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుంది.
- ఆ కోవకు చెందినవే మహా పండితుడు విష్ణుశర్మ పంచతంత్రకథలు. పంచతంత్రమంతా ఒక్క కథ కాదు కథల్లో కథలు, ఉపకథలు, ఉపకథల్లో మరలా కథలు. ఇందులో అసంఖ్యాకంగా పాత్రలు వస్తుంటాయి, పోతుంటాయి. దాదాపుగా ప్రతి పాత్రతోనూ కథ చెప్పించాడు. ఆలకింపచేశాడు విష్ణుశర్మ. ఒక్కొక్క జంతువుకి ఒక్కొక్క స్వభావాన్ని ఆపాదించాడు. కథలను తెలుగు భాషా మాధుర్యాన్ని చవిచూపే విధంగా సహవాసి గారు అనువదించారు. ఇందులో ఒక కథను ఇప్పుడు చదువుదామా!

బదరికా వనంలో ఓ పెద్ద సరస్సు వుండేది. రకరకాల జలచరాలు ఆ సరస్సులో సుఖంగా వాసం చేస్తూండేవి. అక్కడే ఓ కొంగ కూడా కాలక్షేపం చేసేది. దానికి వయస్సు పైబడింది. శక్తి ఉడిగిపోయింది. కాబట్టి యుక్తిని నమ్ముకుంటే తప్ప ఆకలి నుంచి విముక్తి లేదన్న ఆలోచన కలిగింది.

ఒక రోజు ఆ కొంగ సరస్సు అంచుమీద నిలబడి పెద్దగా రోదిస్తూ, బొటబొట కన్నీళ్లు కారుస్తోంది. ఓ ఎండ్రిక మిత్రులైన మీన సమేతంగా వచ్చి కొంగపైన సానుభూతి కురిపిస్తూ, "బాబాయ్, కుశలమేనా? చాలా కాలంగా నిన్నెరుగుదుం. ఎప్పుడూ నిర్విచారంగా వుండేవాడివి. అలాంటి నీవు కంట నీరు పెట్టుకోవడానికి కారణమేమిటి? ఆ నిట్టూర్పు లేమిటి?" అనడిగింది.

ఆ టక్కరి కొక్కెర దుఃఖం పొర్లుతున్న గొంతుతో, "బిడ్డా, సంసార బంధాలను పరిత్యజించి సన్యసించదల్చు కున్నాను. ఇకపై ప్రాణాలు పోయినా సరే నా బిడ్డల్లాంటి చేపల్ని ఆహారంగా తీసుకోను. నేటినుంచి ఆమరణ నిరాహార దీక్ష పూనాను" అన్నది.

బాబాయ్, నీ నిరాహారదీక్షకు కారణమేమిటి?" అనడిగింది ఎండ్రి. మీకొక ఆపద రానున్నదని నా మనస్సు తల్లడిల్లిపోతున్నది. ఈ చెరువు ప్రక్కనుండి నగరం వైపుగా నడుస్తూ జాలర్లు కొందరు చెప్పుకుంటూ పోతున్న మాటలు నా చెవిన పడ్డాయి. 'ఇది చాలా పెద్ద చెరువు. నిండా చేపలు. ఇంకా కొంత నీరింకేదాకా ఆగుదాం. తరువాత మన అదృష్టమే అదృష్టం'. ఈ మాటలకు నా గుండెలు బద్ధలయ్యాయి. ఆహారం మీద ధ్యాస లేదు" అంటూ కల్లబొల్లి మాటలతో చెరువులోని సమస్త జలచరాల గుండెల్లో అల్లకల్లోలం లేపింది.

విరుచుకుపడబోతున్న విపత్తును విన్నవాడివి నువ్వే కాబట్టి విరుగుడూ నువ్వే చెప్పాలి. ప్రాణాపాయం నుంచి మమ్మల్ని కాపాడు!" అని ఎండ్రి, చేపలు, ఇతర జలచరాలు వేడుకొన్నాయి.

బకం కొంచెంసేపు ఆలోచిస్తున్నట్లుగా నటించి, "నేనా పక్షిని. మనుషులతో పోటీపడి నెగ్గుకు రాలేను. రెక్కలున్నాయి కాబట్టి ఒక్క మేలు చేయగలను. మిమ్మల్ని ఈ చెరువు నుంచి ఎప్పటికీ ఎండని నిండు చెరువుకు మార్చగలను" అని నమ్మించింది.

ముందుగా మమ్మల్ని, ముందుగా మమ్మల్ని అంటూ చేపలు దొంగమాటల కొంగమీదకి తోసుకొచ్చాయి.

"ఆగండి, ఆగండి! ఒక్కరోజులో అక్కడ దింపి వచ్చేటంత సత్తువ వున్నవాణ్ణి కాదు. సాధ్యమైన మేరకు దినదినం మిమ్మల్ని దింపేసి వస్తాను" అని పైకి నమ్మబలికింది కొంగ.

అది మొదలు ప్రతిరోజు ముక్కున కరుచుకుని పోగలిగినన్ని చేపల్ని కొంగబాబాయి మోసుకెళ్లి అక్కడికి కొంత దూరంలో వున్న కొండ బండమీద పెట్టుకొని నిక్షేపంగా భక్షింపసాగింది. కొద్ది రోజులకల్లా కొలను

దాదాపుగా ఖాళీ అయిపోయింది. ఎండ్రి మిగిలిపోయింది. "బాబాయ్, చేపలన్నిటినీ అపాయం నుంచి కాపాడావు. అలాగే నా మీద దయచూపవా?" అని వేడుకొంది ఎండ్రి.

ఎండ్రకాయ తింటే కొత్తరకంగానూ, కొత్త రుచి చూసి నట్లుగానూ వుంటుంది, భేష్! అని మనస్సులో అనుకుని లొట్టలు వేసింది కొంగ.

కొంగ ఎండ్రిని ముక్కున కరచుకొని కొండ వైపు ఎగిరిపోతూనే వుంది. ఎండ్రికి అనుమానం వచ్చింది. 'ఎన్నటికీ ఎండని నిండు చెరువని చెప్పాడు కొంగబాబాయి, ఈ ప్రాంతంలో ఎక్కడా నీళ్ళే లేవని మిత్రులు చెప్పగా విన్నాను. ఇందులో ఏదో మోసం వుంది' అనుకుని, "నువ్వు చెప్పిన చెరువెక్కడ బాబాయ్?" అనడిగింది ఎండ్రి.

కొంగ నవ్వి, "ఓసి పిచ్చిదానా, ఆ కొండవార బండరాయిని చూడు, నీ మిత్రులందర్నీ హాయిగా భోంచేశాను. ఇప్పుడు నీవంతు వచ్చింది" అని చెప్పింది.

ఎండ్రి కిందికి చూసింది. కొంగ తిని పారేయగా మిగిలిన చేపల ముళ్ళు, తోకలు, తలభాగాలు గుట్టలుగా పడున్నాయి. రాగల ప్రమాదం గుర్తించిన ఎండ్రి చప్పున తన నాలుగు గిట్టలతో కొంగ మెడను కటుక్కున కొరికి త్రెంచివేసింది. కొంగ గిలగిల కొట్టుకుని నేలకూలింది. బ్రతుకుజీవుడా అని ఎండ్రి సమయస్ఫూర్తితో ప్రాణాలు దక్కించుకుని చెరువుకు మరలి వచ్చింది.

కవిపరిచయం : శ్రీ జంపాల ఉమామహేశ్వరరావు గారు శిరోమణి సహవాసిగా పేరొందారు. ఈయన గుంటూరు జిల్లా తెనాలి సమీపమున గల దుగ్గిరాల గ్రామంలో 1933 డిశంబరు 23న జన్మించారు. వీరు విష్ణుశర్మగారు సంస్కృతంలో రచించిన 'పంచతంత్రం' గ్రంథాన్ని సులభశైలితో తెలుగులోకి స్వేచ్ఛానువాదం గావించారు. విష్ణుశర్మ 'పంచతంత్రం' లోని కథలలో ఒక్కొక్క జంతువుకి ఒక్కొక్క స్వభావాన్ని ఆపాదించాడు. అందులోని ఒక కథ 'పరిష్కారం'. ఈ పాఠ్యభాగంలో కవి ఆషాఢభూతులను నమ్మగూడదని, ఆపద సమయాల్లో సమయ స్ఫూర్తి ఎలాపాటించాలో చక్కగా వివరించెను.

I చదవండి - ఆలోచించండి - రాయండి.

పదజాలాన్ని పెంపొందించుకుందాం.

వాసం = నివాసం, కాపురం; ఉడిగి పోవు = చిక్కిపోవు, తగ్గిపోవు; జలచరాలు = నీటిలో నివసించు ప్రాణులు; రోదించు = ఏడ్చు; పరిత్యజించి = విడిచి, సన్యసించి; విపత్తు=ఆపద; భక్షించు = తిను

II చర్చించండి - రాయండి.

అ) 1. జలచరాలు కొంగను వేడుకొన్న విధం.

2. కొలను ఖాళీ అయిపోయినవైనం.

3. ఎండ్రి తప్పించు కొన్న విధం.

4. చేపలకు వచ్చిన ఆపద గురించి కొంగ చెప్పిన విధం.

5. టక్కరి కొక్కెర మీన సమేతమై వచ్చిన ఎండ్రికి బదులిచ్చినవైనం.

6. ఎండ్రికి వచ్చిన అనుమానం.

ఆ) ఎవరు ఎవరితో అనిరి.

1. "చాలా కాలంగా నిన్నెరుగుదుం."

2. "నా బిడ్డల్లాంటి చేపల్ని ఆహారంగా తీసుకోను."

3. "ప్రాణాపాయం నుంచి మమ్మల్ని కాపాడు."

4. "మనుషులతో పోటీపడి నెగ్గుకు రాలేను."

వేసవిలో పక్షులు నీటికై అలమటిస్తున్నాయి. దానికి 'మీనా-రాజు' కనుగొన్న పరిష్కారమే పై ఛాయాచిత్రంలోని 'నీటి ఉట్టి'. మరి మీరేంచేయగలరో ఆలోచించండి.

ఇ) అర్థవంతమైన పదాలతో పూరించి పూర్తి వాక్యంగా రాయండి.

1. బదరికా వనంలో ఓపెద్ద .... ఉండేది.
2. నేటినుంచి ఆమరణ .... పూనాను.
3. సాధ్యమైనంత మేరకు .... మిమ్మల్ని దింపేసి వస్తాను.
4. ఈ ప్రాంతంలో ఎక్కడా .... లేవని మిత్రులు చెప్పగా విన్నాను.

III కృత్యం:

పాఠ్యభాగంలోని పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారంగా కృత్యాలు చేయండి.

అ పట్టికను పూరించండి.

కొంగ, ఎండ్రికి చెప్పిన జవాబులు	1.
	2.
	3.
	4.

పుటసంఖ్య 60 లోని "బదరికా వనంలో .... నుండి నిరాహార దీక్షపూనాను అన్నది" .... వరకు

ఆ కింది వాక్యాలను క్రమానుసారంగా అమర్చి రాయండి.

1 నేటి నుంచి ఆమరణ నిరాహార దీక్ష పూనాను.
2. బదరికావనంలో ఓ పెద్ద సరస్సు ఉండేది.
3. ఓ కొంగ కూడా కాలక్షేపం చేసేది.
4. చాలా కాలంగా నిన్నెరుగుదుం.

ఇ కింది వాక్యాలు ఏ కాలంలో ఉన్నాయో రాయండి.

1. సంసార బంధాలు పరిత్యజించి సన్యసించదలచుకున్నాను.
2. శక్తి ఉడిగిపోయింది.

ఈ స్వీయాభిప్రాయం.

కొంగ జలచరాలను నమ్మించిన విధం మీ సొంత మాటల్లో రాయండి.

IV భాషావ గాహన

1 పదాలను విడదీసి సంధినామం రాయండి.

పదం	విడదీయుట	సంధినామం
1. మిత్రులైన		
2. ప్రాణాపాయం		
3. పోగలిగినన్ని		

2 కింది విగ్రహవాక్యాలకు సమాస నామం రాయండి.

విగ్రహవాక్యం	సమాసనామం
1. జలమందలి చరాలు	
2. టక్కరిదైన కొక్కెర	
3. నాలుగు సంఖ్యగల గిట్టలు	
4. చేపలయొక్క ముళ్ళు	

3 సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను గుర్తించండి.

1. మీకొక ఆపద రానున్నదని నామనస్సు తల్లడిల్లి పోతున్నది.
2. రెక్కలున్నాయి కాబట్టి ఒక్కమేలు చేయగలను.
3. నీ మిత్రులందర్ని హాయిగా భోంచేశాను .
4. విపత్తును విన్నవాడివి నువ్వే కాబట్టి విరుగుడూ నువ్వే చెప్పాలి.

4 కొంగకు గల పర్యాయపదాలు

V సృజనాత్మకత :

అ కింది గద్యాన్ని వాడుక భాషలోకి మార్చి రాయండి.

విక్రమార్కుడు బ్రాహ్మణుని దుఃఖమునుజూచి కలవరమంది చిత్తము కరిగి ఒక్కింత యోచించెను. పిదప అతనితో'' మహీసురోత్తమా! దుఃఖము నడంచుకొని నా పలుకులు వినుము. మీ పుత్రుని మకరము మ్రింగినది కదా! దీనికై మీరు వగవ వలదు. అనతి కాలమున భవన్నందనుని దెచ్చి మీ కప్పగించెదనని పలికెను.

శబ్దాలంకారాలు

యమకము : ఉపయోగించిన పదాలనే అర్థ భేదము కలుగునట్లు మరల మరల ప్రయోగించుట.

ఉదా : మన సుభద్ర సుకృతి మహిమ ఏమనవచ్చు

మనసు భద్రమయ్యె మనకు నెల్ల –

ఈ పద్యపాదంలో ''మన సుభద్ర'' అనునపుడు మన యొక్క సుభద్ర అని అర్థము చెప్పుకొందుము.

రెండవ పాదమందు ''మనసు భద్రమయ్యె'' అనగా మనందరి మనసు కుదుటపడెను అని అర్థ భేదమును చెప్పుకొందుము.

''మనసుభద్ర'', ''మనసుభద్ర'' అని రెండు మార్లు అవే పదాలను ఉపయోగించినను ఆ పద విభజనలో మార్పువల్ల అర్థ భేదం కలుగుతున్నది. (మన సుభద్ర – మనసు భద్ర)

అదే విధంగా

లేమా దనుజుల గెలువగ
లేమా నీవేల కడగి లేచితి విటురా
లేమాను మానవేనిన్
లేమా! విల్లందు కొనుము లేలంగేలన్

పై పద్యంలో 'లేమా' అనే అక్షరద్వయం ''లేమా! లేమా? లే–మాను, లే–మాను (ఆవు అనే అర్థంలోను–వాడబడి అర్థం భేదంగా ఉన్నందున' యమకాలంకారం' అయింది.

ముక్త పదగ్రస్తం :

విడిచిన పదాన్నే అవ్యవధానంగా మరల మరల ప్రయోగించుట

ఉదా : **సుదతీ నూతన మదనా**

మదనాగ తురంగ పూర్ణ మణిమయ సదనా
సదనా మయ గజ రదనా
రదనాగేంద్ర నిభకీర్తి రస నరసింహా!

ఈ పద్యము నందు మొదటిపాదము ''మదనా'' అను పదముతో ముగియుచుండగా రెండవ పాదములో మొదటి పదం 'మదనా'తో ప్రారంభింపబడింది. అట్లే రెండవ పాదం చివరి పదం 'సదనా' తో ముగియగా, మూడవ పాదము మొదటిపదం 'సదనా తో ప్రారంభించబడింది. ఈ విధంగా విడిచిన పదాన్ని తిరిగి స్వీకరించుటనే 'ముక్త పదగ్రస్తము' అందురు.

సమాచార మార్పిడి :

(సూచన: సమాచారమార్పిడి గురించిన వివరాలకు చూడుము పుట సంఖ్య : 102)

వాస్తవాల జాబితా (ఫేక్ట్‌ఫైల్)ను పరిచ్ఛేదంగా మార్చుట.

దిగువనిచ్చిన వాస్తవాల జాబితాను ఆధారంగా చేసుకొని ఒక పరిచ్ఛేదం తయారు చేయండి.

హైదరాబాదు నగరం :

- **ప్రాంతం :** చారిత్రక ప్రసిద్ధిగాంచిన నగరం హైదరాబాదు.
- **చూడవలసిన ప్రాంతాలు :** గోల్కొండ, చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, హుస్సేన్‌సాగర్ చెరువు, టాంక్‌బండ్, రామోజీ ఫిల్మ్‌సిటీ.
- **ముఖ్యమైన పండుగలు :** సంక్రాతి, ఉగాది, వినాయక చవితి, బతుకమ్మ, రంజాన్ మరియు దీపావళి.
- **సందర్శించడానికి అనువైన కాలం :** అక్టోబరు నుండి మార్చి
- **ఇతర ముఖ్యాంశాలు :** దీనిని భాగ్యనగర్ అనేవాళ్ళు.

నమూనా :

హైదరాబాదు చారిత్రక ప్రసిద్ధిగాంచిన నగరం, ఈ నగరంలో గోల్కొండ కోట చూడదగ్గది. ఈ నగరంలో చారిత్రక ప్రసిద్ధి గాంచిన చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం ఉన్నాయి. హైదరాబాదు నగరంలో సుందరమైన హుస్సేన్‌సాగర్ చెరువు కలదు. దానిని వినాయక్ సాగర్ అనికూడా పిలుస్తున్నారు. అందమైన దృశ్యాలు, జాతిరత్నాలనదగిన మహామహుల శిలావిగ్రహాలు గల దీని ఒడ్డును 'టాంక్‌బండ్' అని పిలుస్తారు. ఈ నగరంలోనే ప్రపంచ ప్రసిద్ధిగాంచి గిన్నీస్‌బుక్‌లో చోటు సంపాదించుకున్న రామోజీ ఫిల్మ్‌సిటీ నెలకొని యున్నది.

ఈ నగరంలో జరుపుకునే ప్రసిద్ధ పండుగలు సంక్రాంతి, ఉగాది, వినాయక చవితి, బతుకమ్మ, రంజాన్ మరియు దీపావళి. అక్టోబరు నుండి మార్చ్ వరకు ఇక్కడ వాతావరణం చాలా అనుకూలంగా ఉంటుంది. కాబట్టి ఈ నగరాన్ని సందర్శించడానికి ఇది తగిన కాలం, ఒకప్పుడు ఈ నగరాన్ని భాగ్యనగరం అనేవాళ్ళు.

అభ్యాసం :

దిగువనిచ్చిన వాస్తవాల జాబితాను ఆధారంగా చేసుకొని ఒక పరిచ్ఛేదం తయారుచేయండి.

థానె నగరం

- **ప్రాంతం :** మహారాష్ట్రంలో ముంబయి మహానగరానికి దగ్గరలో ఉన్న నగరం.
- **చూడవలసిన ప్రాంతాలు :** థానెకోట, చారిత్రక ప్రసిద్ధి చెందిన చర్చ్‌ల్, సుమారు 23 సరస్సులు, దానిలో ఒకటి సుందరమైన మసుందా చెఱువు (తలావ్‌పాలీ), యోవూరు కొండలు (సంజయ్‌గాంధీ వన్యమృగ సంరక్షణ కేంద్రానికి వెనుక ఉన్న అరణ్య ప్రాంతం), ఉల్హాస్ మరియు వైతరణ నదులు.
- **ముఖ్యమైన పండుగలు :** వినాయక చవితి, దసరా నవరాత్రులు, దీపావళి, ఉగాది.
- **సందర్శించడానికి అనువైనకాలం :** నవంబరు నుండి మార్చి

5 శిష్యవత్సలులు మా గురువులు

నేపథ్యం :

విద్యనభ్యసించే విధానము గురించి.....

విద్యార్థులు మర్కట కిశోర న్యాయం అనుసరించాలని. ఉపాధ్యాయులు మార్జాల కిశోర న్యాయం పాటించాలని అంటారు. అనగా వానరం ఒక కొమ్మ మీద నుండి ఇంకొక కొమ్మ మీదికి గెంతుతున్నా దాని పిల్ల మాత్రం తల్లి కోతిని గట్టిగా పట్టుకొనే ఉంటుంది. ఆ విధంగా విద్యార్థులు జ్ఞానసముపార్జన విషయంలో గురువులను వీడక సందేహ నివృత్తి గావించుకోవాలి.

అట్లే గురువులు కూడా పిల్లి తన కూనలను నోటకరచుకొని స్థలాలు మార్చుతూ సంరక్షణ గావిస్తుందో ఆ విధంగా విద్యార్థులకు బోధించాలి. ఇప్పుడు తిరుమల రామచంద్ర గారు తమ గురువుల గురించి ఏమి చెప్తున్నారో చూద్దాం.

సత్యం, తపస్సు, జ్ఞానం, అహింసాగుణం, విద్వాంసులను సేవించడం ఉత్తమ శీలం–ఈ గుణాలున్న వాడే విద్వాంసుడు. వట్టి చదువుతో విద్వాంసుడు కాడు.

మాకు పాఠ్య విషయంగా ఉన్న మనుస్మృతి, గౌతమ ధర్మసూత్రాలలో గురువులు శిష్యులను ఎలా చూచుకోవాలో చాలా చెప్పారు. అలాగే శిష్యుల ప్రవర్తనను గురించీని. శిష్యుణ్ని తన పుత్రుని వలె చూస్తూ ఏ విషయాన్నీ కప్పిపెట్టకుండా శ్రద్ధతో విద్యనేర్పాలి అంటాడు. శిష్యుణ్ని అతని చదువుకు విఘ్నం కలిగించేట్టు తన పనులకు ఉపయోగించరాదు. మా గురువులు మాతో ప్రవర్తించిన తీరు, వారి వాత్సల్యం ఎంతటి దుష్ట చిత్తుణ్ణయినా శిష్టుణ్ని చేసేది. వారి బోధన విధానం ఎంత మూర్ఖుణ్నయినా ప్రబుద్ధుణ్ని చేసేది.

మొదట తరగతులలో గురువు గారికి మాత్రం ఎత్తయిన పీఠం, విద్యార్థులకు పొడుగాటి ఏక ఖండమయిన పీటలు ఉండేవి. క్రమంగా గురువులకు కుర్చీలు, విద్యార్థులకు పీటలతో పాటు పాతకాలపు సందూకు బల్లలు వచ్చాయి. ఆయుర్వేదం తరగతులు పెట్టిన తర్వాత విద్యార్థులకూ బెంచీలు వచ్చాయి.

మాకు తెలుగు–సంస్కృత అనువాదం ఒక పీరియడ్. దీనికి శఠగోపాలాచార్యులు గారనే వారు ఉపాధ్యాయులు. పురిశై కృష్ణమాచార్యుల వారు న్యాయ వేదాంతాలంకార శాస్త్రాల్లో గొప్ప విద్వాంసులు. ఉత్తర భారతం నుండి రామానుజుల శ్రీ భాష్యం సేవించడానికి (అధ్యయనం చేయడానికి) ఎందరో ఏటా వచ్చేవారు. భాష్యశాంతి అయి నప్పుడల్లా విద్యార్థులకు విందు. ఆయన తర్కప్రకరణ గ్రంథం ముక్తావళి చెప్పారు మాకు. తేజోభావ ఏవతమః చీకటి అనేది ఒక పదార్థం కాదు. వెలుతురు లేకపోవడమే చీకటి అంటూ ఉపన్యసిస్తుంటే, ఆశ్చర్యకరంగా ఉండేది. వాటిని నేను శ్లోక రూపంలో రాస్తున్నాను. "అబ్బాయి! ఏమి వ్రాస్తున్నావు?" అనడిగారు. చూపాను. ఇది తర్కం తరగతి కవిత్వం తరగతికాదు – అని నవ్వేవారు.

కపిస్థలం కృష్ణమాచార్యులుగారు మాకు నాటకాలే కాక సంస్కృత సాహిత్య చరిత్ర, తులనాత్మక భాషా చరిత్ర (కంపేరిటివ్ ఫైలాలజీ) చెప్పేవారు. ఆయన కవి. గోవిందరాజస్వామి రథోత్సవం వస్తువుగా ఒక సంస్కృత భాణం కూడా రచించారు.

మాకు ఒక పీరియడ్ ఇంగ్లీష్, ఒక పీరియడ్ ఆయుర్వేదం, ఒక పీరియడ్ వేదపాఠం. కొంత కాలం జ్యోతిషం కూడా ఉండేది. ఇంగ్లీష్ ఉపాధ్యాయులు వెంకాస్వామి రావుగారు. ఆయన గొప్ప దేశభక్తుడు. రవీంద్రాభిమాని, ఈ పీరియడ్‌లోను తెలుగు వ్యాసరచన ఉండేది. ఆంగ్లానువాదమూ ఉండేది. ఆయన రవీంద్రుని గీతాంజలి ఉదహరిస్తూ తిలక్, గాంధీల వాక్యాల వివరిస్తూ పరోక్షంగా దేశభక్తి ప్రబోధించేవారు. వ్యాసం రాస్తే, దాని విషయానికి ఆకరాలు అధస్సూచికలలో సూచించాలనేవారు. వ్యాసరచనా విధానానికి ఆంగ్లరచయితల రచనలు చెప్పేవారు. ఒకమారు సౌందర్యం అంటే ఏమిటి? అనే విషయంపై మూడు పుటల వ్యాసం వ్రాయమన్నారు

ఆయన. నేను అప్పుడే చదివిన పానుగంటి వారి 'సాక్షి' వ్యాసంలోని విషయాలు గ్రహించి వ్యాసం వ్రాశాను. ఆయన అందరి వ్యాసాలు పరిశీలిస్తూ, నాది చేత్తో పుచ్చుకొని 'ఇది చాలా బాగుంది, కాని మార్కులు తక్కువ. ఎందుకంటే, తనకు తెలియని విషయాలు ఎక్కడి నుంచైనా గ్రహించినపుడు అధస్సూచికలలోగాని, చివరనగాని ఆ ఆకరాలను సూచించలేదు కాబట్టి'. అంటూ చెప్పి, "ఇంకెప్పుడూ ఇలా చేయకు, జీవితమంతా ఈ విషయం పాటించాలి. ఎవరూ పుట్టుకతోనే సర్వజ్ఞుడు కాడు. ఇతరుల నుంచి నేర్చుకోవలసిందే. కాని విశిష్టమయిన విషయం గ్రహించినపుడు ఆకరం తెలుపడం రచయిత కనిష్ఠ ధర్మం, దీనివల్ల మన ప్రామాణికత, నిజాయితీ పెరుగుతాయి. నీదేఫస్ట్‌మార్కు బాగా వ్రాశావు గనుక" అన్నారు. అదీ ఆయన నాకు ప్రసాదించిన యావజ్జీవ పాథేయామృతం.

కవిపరిచయం : డా।। తిరుమల రామచంద్రగారు 1913 జూన్ 17న జానకమ్మ, శేషాచార్యులు అను పుణ్యదంపతులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అనంతపురం జిల్లా, రేగటి పల్లిలో జన్మించారు. పత్రికా శిరోమణి, మహామహోపాధ్యాయ, ఏకతా అవార్డు గ్రహీతలు, మనవి మాటలు, కాటమరాజు కథ, ధర్మదీక్ష మొ.నవి వీరి ఇతర రచనలు.

ప్రస్తుత పాఠ్యభాగం 'హంపీ నుండి హరప్పాదాక' అను గ్రంథం నుండి గ్రహించబడినది. ఈ గ్రంథమునకు కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

I చదవండి – ఆలోచించండి – రాయండి.

పదజాలం పెంపొందించుకుందాం.

వత్సలులు = ప్రేమగలవారు; విద్వాంసులు = పండితులు; మనుస్మృతి = మనుధర్మశాస్త్రం; విఘ్నం = ఆటంకం; దుష్టచిత్తుడు = చెడ్డమనస్సుగలవాడు; మూర్ఖుడు = అవివేకి; ప్రబుద్ధుడు = మేలుకొన్నవాడు; ఏటా = ప్రతి సంవత్సరం; తర్కశాస్త్రం = న్యాయశాస్త్రం, మీమాంసాశాస్త్రం; ఆకరం = మూలం; సర్వజ్ఞుడు = సమస్తం తెలిసినవాడు; విశిష్ఠము = శ్రేష్ఠమైనది; ప్రామాణికత = శాస్త్ర సిద్ధమైన, ప్రమాణంలో ఏర్పడిన.

II అ) చర్చించండి రాయండి.

1. వట్టి చదువుతో విద్వాంసుడు కాడు
2. విద్వాంసుని లక్షణాలు
3. గురువులు శిష్యులను చూచుకోవలసిన విధం.
4. ఇంగ్లీషు ఉపాధ్యాయులు రచయితకు ఇచ్చిన సందేశం.

ఆ) ఎవరు, ఎవరితో అనిరి.

1. "అబ్బాయి! ఏమి వ్రాస్తున్నావు?"
2. "ఇది చాలా బాగుంది కాని మార్కులు తక్కువ."
3. "ఎవరూ పుట్టుకతోనే సర్వజ్ఞుడు కాడు. ఇతరుల నుంచి నేర్చుకోవలసిందే"

ఇ) అర్థవంతమైన పదాలతో పూరించి వాక్యాలు తిరిగి రాయండి.

(ప్రబుద్ధుణ్ని, విద్వాంసుడు, రాత్రి, పాథేయామృతం)

1. వట్టి చదువుతో .... కాడు.
2. వారి బోధన విధానం ఎంత మూర్ఖుణ్నయినా .... చేసేది.
3. వెలుతురు లేక పోవడమే ....
4. అదీ ఆయన నాకు ప్రసాదించిన యావజ్జీవ ....

II కృత్యం :

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ **కింది వాక్యాలను తప్పొప్పులుగా గుర్తించి రాయండి.**

1. మాకు తెలుగు-సంస్కృత అనువాదం కొరకు రెండు పీరియడ్లు ఉండేవి. ( )
2. చీకటి అనేది ఒక పదార్థం కాదు. వెలుతురు లేక పోవడమే చీకటి. ( )
3. పురిశై కృష్ణమాచార్యులవారు ఛందోశాస్త్రంలో గొప్ప విద్వాంసులు. ( )
4. ఆయుర్వేదం తరగతులు పెట్టిన తర్వాత విద్యార్థులకూ బెంచీలు వచ్చాయి. ( )

పుటసంఖ్య 65 లోని "మొదటి తరగతులలో .... ఒక సంస్కృతభాణం కూడా రచించారు" వరకు

ఆ మొదటి తరగతులలో గురువు గారికి .... ఉండేది

విద్యార్థులకు .... ఉండేది

కపిస్థ కృష్ణమాచార్యులు ఇవి చేప్పేవారు 1) ....

2) ....

ఇ **కింది వాక్యంలో గుర్తింప బడిన పదాలు ఏ భాషాభాగాలకు చెందినవో రాయండి.**

ఆయన తర్కప్రకరణ గ్రంథం ముక్తావళి చెప్పారు.

ఆయన : చెప్పారు :

ఈ **స్వీయాభిప్రాయం**

పూర్వకాలపు విద్యావిధానాన్ని గూర్చి మీ సొంత మాటల్లో రాయండి.

2. కృత్యం

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ **విద్యార్థులకు నాలుగు పీరియడ్లలో బోధించే నాలుగు విషయాలపేర్లు రాయండి.**

పీరియడ్లు

పుటసంఖ్య 65 లోని "మాకు ఒక పీరియడ్ ఇంగ్లీష్ ..... నుండి .... యావజ్జీవ పాథేయామృతం" .... వరకు.

ఆ **అర్థవంతమైన పదాలతో పూరించి వాక్యాన్ని తిరిగి రాయండి.**

1. ఎవరూ పుట్టుక తోనే .... కాడు.
2. వ్యాస రచనా విధానానికి .... రచనలు చెప్పేవారు.
3. ఇది చాలా బాగుంది, కాని .... తక్కువ.
4. విశిష్టమయిన విషయం గ్రహించినప్పుడు .... తెలుపడం రచయిత కనిష్ఠ ధర్మం.

ఇ **కింది అర్థాలకు సరైన పదాలను మీ పరిచ్ఛేదం నుండి వెదకి రాయండి.**

1. మూలం : ____ 2. శ్రేష్ఠమైన : ____

3. సమస్తం తెలిసిన వాడు : ____ 4. శాస్త్ర సిద్ధమైన : ____

ఈ **స్వీయ వ్యక్తీకరణ :**

గురువుల ప్రోత్సాహంతో విద్యార్థులకు గురువులపై ఎటువంటి భక్తి భావం పెంపొందునో మీ అభిప్రాయాన్ని రాయండి.

IV భాషావగాహన

1. కింది పదాలకు సంధికార్యాలు రాయండి.

1. రథోత్సవం : ______ + ______ = ______
2. ఆంగ్లాను వాదము = ______ + ______ = ______
3. గీతాంజలి : ______ + ______ = ______
4. ఎందుకంటే ______ + ______ = ______

2. విగ్రహవాక్యాలు రాసి, ఏ సమాసమో రాయండి.

1. రవీంద్రాభిమాని =
2. దేశభక్తి =
3. మూడుపుటలు =

N2D4M2

3. కిందివాక్యాలలో సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను గుర్తించుము.

1. ఆయన మాకు తర్కప్రకరణ, గ్రంథ ముక్తావళి చెప్పారు ______
2. వాటిని నేను శ్లోక రూపంలో రాస్తున్నాను. ______
3. ఆయన తిలక్, గాంధీల వాక్యాలను వివరిస్తూ, పరోక్షంగా దేశభక్తి ప్రబోధించేవారు. ______
4. దీనివల్ల మన ప్రామాణికత, నిజాయితీ పెరుగుతాయి. ______

అర్థాలంకారములు – (ఉపమా, ఉత్ప్రేక్షాలంకారాలు)

ఉపమాలంకారం : ఉపమాన, ఉపమేయాలకు పోలికను చెప్పుటను ఉపమాలంకారము అందురు. ఇందు నాలుగు భాగాలుండును.

ఉపమానం : పోలికకై స్వీకరించిన వస్తువు

ఉపమేయం : పోల్చదగిన వస్తువు

ఉపమా వాచకం : వలె

సమానధర్మం : ఉపమాన, ఉపమేయాల మధ్యనుండు పోలిక.

ఉదా: భూమి బంతి వలెనున్నది.

ఇందు వర్ణించ దలచిన వస్తువు "భూమి" కనుక ఇది ఉపమేయం. పోలికకై స్వీకరించిన వస్తువు 'బంతి'. కనుక 'బంతి' ఉపమానం. ఈ రెండింటి మధ్య ఉన్న సమానమైన ధర్మము 'గుండ్రంగా వుండుట, తిరుగుట' – కావున భూమిని బంతితో పోల్చుట జరిగినది. దీనినే ఉపమాలంకారం అందురు.

ఇటువంటివే –

"అక్షరములు ముత్యముల వలెనున్నవి."

'కన్నులు కలువల వలెనున్నవి' మొదలగునవి.

ఉత్ప్రేక్షాలంకారము : ఉపమాన ధర్మ సంబంధం చేత ఉపమేయాన్ని ఉపమానంగా ఊహించుట.

ఉదా: తాడు పాము అని భ్రమించితిని. ఇందు వర్ణింప దలచిన వస్తువు తాడు. కావున ఇది ఉపమేయం. పోలికకై స్వీకరించిన వస్తువు పాము. కనుక ఇది ఉపమానం. ఉపమానం యొక్క ధర్మం "పొడవుగా నుండుట, కదలుట. ఈ

రెండు ధర్మాలు తాడు యందు చూచుటచే తాడును పాముని భ్రమించుట జరిగెను. ఈ విధంగా ఉపమాన ధర్మ సంబంధం చేత ఉపమేయాన్ని ఉపమానంగా ఊహించుటను – భ్రాంతి చెందుటను ఉత్ప్రేక్షాలంకారము అందురు. అట్లే

"ఆకాశము కాటుకను వర్షించు చున్నదా అన్నట్లున్నది."

కాటుక యొక్క నల్లని ధర్మాన్ని చీకటి యందు కవి ఊహించుచున్నాడు.

కింది ప్రవాహాకృతి ఆధారంగా మీ పాఠశాలలో జరుపుకొన్న ఉపాధ్యాయ దినోత్సవంపై ఒక పరిచ్ఛేదం రాయండి.



లేఖననైపుణ్యాలు :

కింది గద్యమును చదివి, 5 ప్రశ్నలను తయారు చేయండి.

శ్రీమతి లక్ష్మీబాయమ్మ హైదరాబాదు నగరంలో తన నివాస గృహంలో 'ఇందిరాసేవా సదనం' అనే పేరుతో ఒక సాంఘిక సేవా సంస్థ నెలకొల్పారు. అనాథస్త్రీల సంక్షేమానికి, శిశు సముద్ధరణకు ఈ సంస్థ ఎంతో కృషి జరిపింది. ఈ సంస్థ అనేక నిస్సయులైన స్త్రీలకు ఆశ్రయం కలిగించింది. వారికి చేతివృత్తులలో శిక్షణఇచ్చి, విద్యావంతులను చేసింది. తమ కాళ్ళపై తాము నిల్చొని జీవయాత్ర సాగించే మార్గాన్ని చూపించింది. లక్ష్మీ బాయమ్మగారు బాలికోన్నత పాఠశాలకూడ నెలకొల్పారు. ఆమె తుది ఘడియ వరకూ దీనజనోద్ధరణకే తమ అమూల్య జీవితాన్ని అంకితం చేసినారు.

అనాథలైన స్త్రీలకు, బాలికలకు చేతిపనులు, వ్యవసాయం, తోటల పెంపకం నేర్పేవారు. అంతేగాక సంగీతం, నృత్యం, చిత్ర లేఖనం వంటి కళలు కూడా అభ్యసించటానికి ఈ సంస్థలో అవకాశం కలిగించారు. అనేక మంది నిరాశ్రయులైన మహిళలకు జీవనభృతి కలిగించిన దీనజనబాంధవి శ్రీమతి లక్ష్మీబాయమ్మ. భారతప్రభుత్వం ఆమెకు తామ్రపత్రం బహూకరించి సత్కరించింది.

ప్రశ్నలు :

1) ....

2) ....

3) ....

4) ....

5) ....

6 విశ్వాసం

నేపథ్యం

మబ్బులేమొ నీరు నిచ్చు – నీరు తిరిగి మబ్బులిచ్చు.
పంటలేమొ గింజలిచ్చు – గింజలేమొ పంటలిచ్చు.
ఒకరికొకరు సాయము ఇదే లోక న్యాయము.
ఇచ్చి పుచ్చు కొనుటలోనే ఉంది మహానందము.
అను విధముగా చీమ, సీతాకోకచిలుక ఏం చేశాయో చూద్దాం॥

అన్ని సంవత్సరాలకన్నా, ఈ ఏడాది ఎండలెక్కువగా ఉన్నాయి. ఉగాది వెళ్ళి ఇంకా మూడునాలుగు వారాలన్న కాలేదు. అప్పుడే సూర్యుడు చిటపటలాడేస్తున్నాడు. చిన్నా పెద్దా చెరువులు క్రమంగా ఎండిపోతున్నాయి. ఉదయంపూటా, సాయంకాలం పూటా తప్ప మధ్యాహ్నం వేళ – అలా బయటికి కాలు బెట్టాలన్నా భయంగానే ఉంది. పచ్చిక మీది నించి వస్తున్న గాలులయినా సరే – వెచ్చగానే ఉన్నాయి.

అప్పటికే మధ్యాహ్నమయింది!

ఎండ నిప్పులు చెరగడం ప్రారంభించింది.

ఆ వేడిని భరించలేని నీడలు కూడా చెట్లకింది కొచ్చాయి, కాసేపన్నా తల దాచుకొందామని!

మొన్న మొన్నటి దాకా పచ్చగా ఉన్న ఆ మైదానం – ఎండదెబ్బకు వెండిలాగా తెల్లబడిపోయింది.

గలగల్లాడుతూ ఉండే చెరువు, ఇప్పుడు వెలవెల బోతూఉంది! దూరంగా పశువుల కాపరి పశువులు కాస్తున్నాడు.

ఆ కుర్రవాణ్ణీ, వాడు కాస్తున్న పశువుల్నీ, చూస్తూ వాడి చుట్టుతా, ఆ పశువుల చుట్టూతా తిరిగి తిరిగి అలసిపోయి, ఆ చెట్టుకిందికి వచ్చిందో సీతాకోక చిలుక, వస్తూనే చిక్కని నీడ పరచుకొన్న ఓ మర్రిచెట్టుమీద మెల్లగా వాలింది.

"కాలం మారిపోయింది. కిందటేడాదికీ ఈ ఏడాదికీ సాపత్యమే లేదు. ఇంకా వైశాఖ మాసం మొదటి వారమన్నా రాలేదు. అప్పుడే ఎండలు చంపేస్తున్నాయి. ఈ ఎండలకు తట్టుకోవడం కష్టంగా ఉంది" అనుకొన్నదా సీతాకోకచిలుక.

ఎండలో తిరిగి తిరిగి రావడం వల్లా, ఒక్కసారే నీడకు చేరడం వల్లా, దాని కళ్ళకు బయర్లు కమ్మినట్టయి పోయింది.

కాస్సేపు కళ్ళు మూసుకొని తెరిచాక గానీ, తన పరిసరాల్లో ఏం జరుగుతున్నదీ దానికి బోధ పడలేదు.

నెర్రెలిచ్చిపోయిన సన్నని బాటమీంచి, ఆపసోపాలు పడుతూ, నడవలేక నడవలేక నడుస్తోన్న గండు చీమను చూసి, జాలి పడింది సీతాకోకచిలుక.

ఆ చీమకూడ ఆ మర్రిచెట్టు దగ్గరికే వచ్చింది. దాన్ని ఆనుకొని అలసట తీర్చుకొంటోంది. సీతాకోకచిలుక రెక్కలను అల్లార్చుతూ, చీమకు దగ్గరగా జరిగింది. "ఎండలు భగ్గుమంటున్నాయి. మనలాంటి సన్న కారు ప్రాణులు బతకడమే కష్టంగా ఉంది." అన్నది సీతాకోకచిలుక.

ఓసారి – వొంటినిండా దిగజారిపోతున్న చెమటను తుడుచుకొన్నాక – 'నిజమే' అన్నట్టు తల పంకించింది.

"అడుగు తీసి అడుగు బయటపెట్టడమే కష్టంగా ఉంది గదా! ఈ మిడసరి లగ్నంలో బయలుదేరారెందుకూ?

మరీ పీకలమీది కొస్తే తప్ప – ఉదయ సాయంకాలాల్లో మినహా – బయటికి రాకూడదు... బాగా అలసి పోయారు. చాలా దూరం నించి గానీ వస్తున్నారా?'' అన్నది సీతాకోక చిలుక రెక్కలాడిస్తూ. ''అవునండి! చాలాదూరంనుంచే వస్తున్నాను'' అన్నది చీమ. ఆ మాటలంటున్నప్పుడు దాని కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి. సీతాకోకచిలుక దాని కన్నీరు తుడిచి ఓదార్చింది.

''క్షమించండి చీమగారు! పిచ్చి పిచ్చి ప్రశ్నలన్నీ అడిగి, మిమ్మల్ని నొప్పించినట్టు ఉన్నాను. నేను మిమ్మల్ని అడిగింది కూడా – చేతనయితే సాయం చేద్దామన్న సదుద్దేశంతోనే గానీ – మరో అభిప్రాయంతో కాదండీ!'' అన్నది సీతా కోకచిలుక నొచ్చుకుంటూ.

చీమ–మరోసారి కన్నీరు తుడుచుకొంది. ఓ పొడి దగ్గు దగ్గి, గొంతుకను సరిచేసుకొంది. ''మీరు మంచివారు. అంచేతనే నా యోగక్షేమాలడిగారు. నేనా చెరువుకు అవతలి వేపుగా ఉన్న పొలం దగ్గర్నించీ వస్తున్నాను. అక్కణ్ణించి ఇక్కడిదాకా, నన్నెరిగినవారూ, నేనెరిగినవారూ చాలామంది నాకెదురయ్యారు. కానీ ఎవ్వరూ నన్ను పలకరించింది లేదు.'' అన్నది చీమ.

''ఇంతకీ – మీరా పొలందాకా ఎందుకెళ్ళింది నేనడగనే లేదు'' అన్నది సీతాకోకచిలుక.

తరువాత మెల్లగా తలెత్తింది. ఆ తరువాత ఓ గుటక వేసింది. ''అక్కడ తిండి గింజలు పుష్కలంగా దొరుకుతాయని ఎవరో చెప్పారు. వారి మాటలు విని – అంతదూరమూ వెళ్ళాను.... 'అని ఆగి పోయింది చీమ.

''మీరు విన్నది అబద్ధమా? కొంత కొంతమందికి – ఓ పాడుగుణం ఉంటుంది. చీమగారూ! ఎదుటి వారికి లేనిపోని ఆశలు కల్పిస్తారు. వాళ్ళ ఆశల వెంట పరుగులు తీస్తూ ఉంటే, వెనకనించి నవ్వుతారు. వారికదొక రాక్షసానందం. బహుశ – మీకీ కబురు చేరవేసిన వారు కూడా ఈ కోవకు చెందిన వారే అయి ఉంటారు. అవునా?'' అన్నది సీతాకోకచిలుక.

''కాదండీ!'' అన్నది చీమ సీతాకోకచిలుకను వారిస్తూ ''వారన్నది అక్షరాలా నిజం. అక్కడ చాలా తిండి గింజలున్నాయి.''

''మరి – మీరు ఉత్తిగానే వచ్చారేం? ఏమీ తెచ్చుకో లేదేం? ఆలస్యంగా వెళ్ళారా?'' అన్నది సీతాకోకచిలుక.

''లేదండీ! సకాలంలోనే వెళ్లాను. కానీ నాకన్నా ముందుగానే ఈ సంగతి పసికట్టిన ఓ పెద్ద చీమలదండు ఎక్కడినుంచి పడిందోగాని – నే వెళ్ళే సరికే గింజ మిగలకుండా దోచుకుపోయింది. ఆఖరుకు పొల్లూ నెల్లూ కూడా నాకు మిగల్లేదు. అని మళ్ళా ఏడ్చింది చీమ.

సీతాకోకచిలుక – మరో అడుగుముందుకు వేసి చీమను ఆలింగనం చేసుకొంది.

''ఊరుకోండి చీమగారూ! కష్టాలైన అందరకూ రావు; భరించగలికిన వారికే వస్తాయి.'' అన్నది సీతాకోక చిలుక.

''నాగురించి నా కెప్పుడూబాధలేదు చిలకమ్మ గారూ! నేనేదో తెస్తాననీ కడుపారా తిందామనీ, నా పిల్లలందరూ ఎదురు చూస్తూ ఉంటారు. ఉత్త చేతులతో వాళ్ళ దగ్గరకెలా వెళ్లను? ఈ పాడు ముఖం వాళ్లకెలా చూపించను?

ఆ మాటలు విన్న సీతాకోకచిలుక సన్నగా నిట్టూర్చింది.

''చీమమ్మా! కబుర్లలో పడి అసలు సంగతి అడగడం మరిచిపోయాను. ఇంతసేపణ్ణించీ మీరు, మీ గురించే చెబుతున్నారు. అసలీ గొడవలన్నీ పడవలసింది మగవారు గదా! వారిని గురించి మీరు మాట మాత్రంగానన్నా ప్రస్తావించరే?

ఆయనకీమధ్య సుస్తీ చేసింది. అంచేత ఎక్కడికీ కదల్లేకపోతున్నారు. ఆయనగారి ఆరోగ్యమే బావుంటే, నాకీ బాధలు ఉండేవేకావు. దాచుకొన్న కాసిని గింజలూ అయిపోయాయి.

''నాకోసం ఆయనగారూ, పిల్లలూ ఎదురు చూస్తూ ఉంటారు. అన్నది చీమ బొంగురు పోయిన గొంతుతో.

''కన్న బిడ్డలకోసం తల్లి పడే బాధలేమిటో నాకూ తెలుసు. మీరేమీ అనుకోకండి! నా పిల్లల కోసమని, నేను కొంచెం పుప్పొడి తీసుకు పోతున్నాను. అదీ – అవసరమయి కాదు నాకు – మా ఇంట్లో చాలా పుప్పొడి

ఉంది. అయినా – అప్రయత్నంగా దొరికింది గదాని తీసు కెడుతున్నాను. దాన్ని మీకిస్తాను. పట్టుకెళ్ళండి. మీరూ, మీవారూ, మీ పిల్లలూ పుచ్చుకోండి. నా కింత పుణ్యమన్నా దక్కుతుంది!'' అన్నది సీతాకోకచిలుక.

చీమ మౌనంగా ఉండి పోయింది.

ఆ మౌనాన్నే అంగీకారంగా భావించిన సీతాకోకచిలుక, తనదగ్గరున్న పుప్పొడినంతా చీమకిచ్చేసింది!

''మీకెలా కృతజ్ఞతలు చెప్పాలో బోధపడడం లేదు. నేనూ, మావారూ, మా పిల్లలందరూ మీకు కలకాలం ఋణపడి ఉంటారు.'' అన్నది చీమ పుప్పొడిని అందుకొంటూ.

సరిగ్గా –

ఆ జరగకూడనిదేదో – అప్పుడు జరిగింది!

చీమగారూ, సీతాకోకచిలుకగారూ మాటల్లోపడి, తమచుట్టూ ఏం జరుగుచున్నదో గమనించలేదు. ఏ మాత్రం పసిగట్టినా అవి ముందుగానే జాగ్రత్తపడేవి పశువుల కాపరి ఒకడు కాస్సేపు కునుకు తీద్దామని, చెట్టు కిందికొచ్చాడు.

మట్టిబెడ్డ పక్కగా నుంచుని రెక్కలూపుతున్న సీతాకోక చిలుకను చూశాడు. చడీ చప్పుడూ లేకుండా వెనగ్గావచ్చి, సీతాకోకచిలుక రెండురెక్కలూ పట్టుకొన్నాడు.

సీతాకోకచిలుక ఉలిక్కిపడింది?

''ఇది అనుకోని సంఘటన, నాదురదృష్టం మిమ్మల్ని కూడా ముసురుకొంటున్నదని అనుకొంటున్నాను. నన్ను ఓదారుద్దామనీ, నాకేదో ఇంత సాయం చేద్దామన్న మంచి మనసుతో మీరు నా దగ్గర ఉండి పోయారు. నా కింత సహాయం చేయాలన్న ఆలోచన మీకు రాకపోతే, ఈ ఆపద తటస్థ పడేదే కాదు చిలకమ్మ గారూ!'' అన్నది చీమ, బాధతో మెలికలు తిరిగిపోతూ.

సీతాకోకచిలుక ఆశ్చర్యపోతూన్నట్టుగ కళ్ళు పెద్దవి చేసి, చీమవేపు చూసింది.

''నేను విచారిస్తున్నది, నాకొచ్చి పడిన ఆపదను గురించి కాదు చీమగారు! ఎంతో దూరంనించీ నడిచి నడిచి అలసిపోయి వచ్చారు. మీ ఒంటిచెమట ఆరేదాకానన్నా, మీకు విసరలేకపోయినందుకు బాధపడు తున్నాను. గానీ, నా గురించి కాదండీ! బాధపడినా తప్పని వాటిని గురించి ఆలోచించడం అనవసరమని ఎవరో చెప్పగా విన్నాను. నా కది నచ్చింది. అందుకనే – అలాంటి వాటిని గురించి, నేను ఆలోచించడం మానేశాను.'' అన్నది సీతాకోకచిలుక.

ఆ సమాధానం విని;

చీమ ఆశ్చర్య పోయింది.

ఓ నిమిషమయ్యాక ఆశ్చర్యం నుండి తేరుకొంది. తేరుకొన్నాక ఆలోచించింది. ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాక – కొద్దిగా తలపంకించింది.

''చిలకమ్మగారూ! ఇప్పుడే నాకో ఉపాయం తోచింది. మీరు కదలకుండా, మెదలకుండా మధ్య అలానే ఉండండి. నేనీలోగా మెల్లగా వాణ్ని సమీపించి, కండలూడి పోయేలాగా కుడతాను. వాడు ఆ నొప్పిని భరించలేక 'అమ్మా!' అని అరుస్తూ మిమ్మల్ని వదిలేస్తాడు. మీరు రివ్వున ఎగిరిపోండి'' అన్నది చీమ.

''మీ ఉపాయం బాగానే ఉంది!'' అని ఫక్కున నవ్వింది సీతాకోక చిలుక.''

''అందులో దాక్కున్న ప్రమాదం మీకు తెలుసునో లేదో మరి – తెలిసి కూడా జ్ఞాపకం చేయకపోతే నేను నేరం చేసి నట్లవుతుంది. నన్ను కాపాడదామన్న సత్సంకల్పంతో, మీరతన్ని కుడతారు. అతనో గావు కేకపెట్టి, నన్ను విడిచిపెడతాడు. అంతవరకూ ఖచ్చితంగా జరుగుతుంది. ఆ తరువాత మరోటి కూడా జరుగుతుంది చీమగారూ!

మీరు కుట్టంగానే, అతగాడు ఊరుకోడు. మిమ్మల్ని – ఇలా నలిపి – అలా చంపేస్తాడు. సుస్తీగా ఉన్న మీవారూ, నోరూ వాయీ లేని మీపిల్లలూ అన్యాయమయి పోతారు. దయచేసి – నా ఒక్క ప్రాణం కోసం ఇంత మందిని ఉసురు పెట్టకండి! మీరు ఆ మాట అనడమే నాభాగ్యం'' అన్నది సీతాకోక చిలుక.

తన చేతుల్లో ఉన్న పుప్పొడిని, మట్టె బెడ్డకు పక్కగా

ఉంచి, సీతాకోకచిలుకకు సాష్టాంగ నమస్కారం చేసింది చీమ.

"చిలకమ్మగారూ! నేనెవరో తెలీదు. నా పేరేమిటో, ఊరేమిటో కూడా తెలీదు. నేను నిజమే చెప్పానో అబద్ధమే చెప్పానో కూడా మీకు తెలీదు.

అయినా! – నా బాధలను గురించి సూక్ష్మంగా మీకు చెప్పీ చెప్పక ముందే మీరు కరిగిపోయారు. మీ బిడ్డల కోసం తీసుకెడుతున్న పుప్పొడిని, నా బిడ్డలకు దానం చేసిన దయా హృదయం మీది. మీ వంటి ఉత్తములకోసం – ఒకసారికాదు – ఎన్నిసార్లు మరణించడానికయినా నాకభ్యంతరంలేదు!" అన్నదా చీమ, ఆ పశువుల కాపరిని కుట్టడానికి మెల్లగా ముందుకు సాగుతూ.

కవిపరిచయం : డా|| రావూరి భరద్వాజగారు అవిభక్త హైదరాబాద్ సంస్థానపు పరిటాల జాగీరులోని మోగులూరు గ్రామంలో 1927లో జన్మించారు. తండ్రిపేరు కోటయ్య, తల్లిపేరు మల్లికాంబ. ఈయన 17వ ఏట నుండే రచనలు ప్రారంభించాడు. ఈయన రాగిణి, దైవరాజకీయాలు, జీవనసమరం, పాకుడురాళ్ళు మొదలగునవి రచించాడు. మూడు విశ్వవిద్యాలయాలు వీరికి గౌరవడాక్టరేట్ పట్టాలు ఇచ్చి సత్కరించాయి. 2012 సంవత్సరానికి "పాకుడురాళ్ళు" నవలకు జ్ఞానపీఠ పురస్కారం లభించింది.

ప్రస్తుత పాఠ్యభాగం వీరి 'ఉడతమ్మ ఉపదేశం అనే పుస్తకం నుండి గ్రహించబడింది. జాలి, దయ, కరుణ, మానవత్వం మొదలగు గుణాలు కలిగి ఉండవలెనని ఈ పాఠం ద్వారా రచయిత వివరించారు.

I చదవండి – ఆలోచించండి – రాయండి.

పదజాలం పెంపొందించుకుందాం.

సాపత్యం = పోలిక; బయర్లు కమ్ముట = చీకట్లు కలుగుట; నెర్రె లిచ్చుట – పగులుట, బీటలువారుట; సన్నకారు = బలహీన, కృశించిన; మిడసరి లగ్నం = మధ్యాహ్నకాలం; పీకల మీదకు వచ్చుట = అత్యంత అవసరము; పుష్కలంగా = అధికంగా; తటస్థపడుట = ఎదురుపడు, తారసపడు, కలుగుట; సమీపించుట; సత్సంకల్పము = మంచి నిర్ణయం.

II చర్చించండి – రాయండి.

అ) 1. సీతాకోక చిలుక కున్న సదుద్దేశం.

2. 'ఎండ నిప్పులు చెరుగు తున్నది' – కవి భావం.

3. గలగల పారే చెఱువు వెలవెల బోయింది.

4. చీమ ఇంటికి తిరిగి వెళ్ళటానికి కారణం.

5. చీమ తిండిగింజలు తెచ్చుకోలేక పోవడానికి కారణం.

6. చీమ కన్నీళ్ళు చూసి సీతాకోకచిలుక స్పందించిన విధం.

ఆ) ఎవరు ఎవరితో అనిరి.

1. "మీరు మంచివారు"

2. "అక్కడ తిండిగింజలు పుష్కలంగా దొరుకుతాయని ఎవరో చెప్పారు."

3. "ఏమీ తెచ్చు కోలేదేం"

III 1. కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ కింది వాటికి జవాబులు రాయండి.

కళ్ళు బయర్లు కమ్మడానికి కారణాలు	వేసవిలో బయటకు రాదగిన సమయాలు

పుటసంఖ్య 70 లోని "దూరంగా పశువుల కాపరి" ..... నుంచి ...... "సీతాకోక చిలుక రెక్కలాడిస్తూ" .... వరకు.

ఆ) కుండలీకరణంలోని సరియైన పదాలతో పూరించి వాక్యాన్ని తిరిగి రాయండి.
(మిడసరి లగ్నం, బక్క, బయర్లు, సాపత్యమే, సన్నకారు)

1. కిందటేడాదికి ఈ ఏడాదికి .... లేదు.
2. దాని కళ్ళకు .... కమ్మినట్టయి పోయింది.
3. మనలాంటి .... ప్రాణులు బతకటమే కష్టంగా ఉంది.
4. ఈ .... లో బయలు దేరారెందుకు.

ఇ) కింది పదాలను సొంతవాక్యాల్లో ప్రయోగించండి.

1. ఆపసోపాలు పడు ....
2. దిగజారిపోతున్న ....

ఈ) స్వీయాభిప్రాయం:

చీమపట్ల సీతాకోక చిలుక చూపిన అభిమానాన్ని మీ సొంత మాటల్లో రాయండి.

2. కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ కింది వాక్యాలను వరుస క్రమంలో అమర్చి రాయండి.

1. మీ ఉపాయం బాగానే వుంది.
2. బాధపడినా తప్పని వాటి గురించి ఆలోచించటం అనవసరం.
3. నా ఒక్క ప్రాణం కోసం ఇంతమందిని ఉసురుపెట్టకండి.
4. చిలకమ్మగారూ! ఇప్పుడే నాకో ఉపాయం తోచింది.

పుటసంఖ్య 72 లోని "నేను విచారిస్తున్నది" ...... నుండి .... "అన్నది సీతాకోకచిలుక" వరకు

ఆ అల్లిక పూరించండి

చీమకు తోచిన ఉపాయం

ఇ. కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

1. ఆలోచన × ______ 2) అనవసరం × ______

3. దూరం × ______ 4) అన్యాయం × ______

ఈ. స్వీయాభిప్రాయం

"చీమ చేయదలచిన సహాయాన్ని సీతాకోకచిలుక నిరాకరించడం ఎంత వరకు సబబు" – మీ అభిప్రాయాన్ని తెలియ జేయండి.

IV భాషావగాహన

1. పట్టికలో అడిగిన విధంగా పూరించండి.

పదము	పదాన్ని విడదీయుట	సంధి పేరు
1)	ఎండలు + ఎక్కువ	
2) తలెత్తింది		
3)	రాక్షస + ఆనందము	
4) దొరుకుతాయని		

2. 'ఉకార సంధి' ఉన్న పదాలను మీ పాఠ్యభాగం నుంచి ఎంపిక చేసి రాయండి.

కాసేపు + అన్ని

ఉకార సంధి

3. కింది సమాసాలలో సరియైన జవాబును గుర్తించి రాయండి.

1. మధ్యాహ్నం

అ) ప్రథమా తత్పురుష సమాసము ఆ) షష్ఠీ తత్పురుష సమాసము ఇ) పంచమీ తత్పురుష సమాసము

2. నాలుగు వారాలు

అ) కర్మధారయ సమాసము ఆ) ద్విగు సమాసము ఇ) తృతీయా తత్పురుష

3. యోగ క్షేమాలు

అ) షష్ఠీ తత్పురుష సమాసము ఆ) ద్వంద్వ సమాసము ఇ) ద్విగు సమాసము

4. మంచి మనసు

అ) ద్వంద్వ సమాసము ఆ షష్ఠీ తత్పురుష సమాసము ఇ) విశేషణ పూర్వ పదకర్మ ధారయం.

4. కింది వాక్యాలలో గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో గుర్తించండి.

1. మన లాంటి సన్నకారు ప్రాణులు బ్రతకడమే కష్టం.

మన

నామవాచకం

విశేషణం

సర్వనామం

2. చాలా దూరం నుండే <u>వస్తున్నాను</u>.

వస్తున్నాను → క్రియావిశేషణం / విశేషణం / క్రియ → [ ]

3. చీమ <u>మెల్లగా</u> తలెత్తింది.

మెల్లగా → నామవాచకం / సర్వనామం / విశేషణం → [ ]

5. **కింది వాక్యంలో ఉన్న అలంకారాన్ని గుర్తించండి.**

"ఆ మైదానం ఎండదెబ్బకు వెండిలాగా తెల్లబడి పోయింది."

V సృజనాత్మకత

1. 1. "తిరిగి తిరిగి", 2. "నడవలేక నడవలేక" – అని కవి ఒకే పదాన్ని మళ్ళీ చెప్పడంలో గల ఆంతర్యమేమిటి? సహాధ్యాయులతో చర్చించి రాయండి.

2. నీవు పొదుపు చేసి దాచిన ధనాన్ని అనాథాశ్రమానికి విరాళంగా అందజేసినట్లు నీ మిత్రునికి లేఖ రాయుము.

రూపకాలంకారము

ఉపమేయంనందు ఉపమాన ధర్మమును ఆరోపించుట.

"రూపారోపాత్తు రూపకం" లేదా ఉపమాన ఉపమేయాలకు అభేదమును చెప్పుట.

ఉదా: ఆమె ముఖ చంద్రుడు మనకు నేత్రానందం కలిగించుచున్నాడు.

ముఖం – ఉపమేయం; చంద్రుడు – ఉపమానం.

చంద్రధర్మం కాంతి కలిగియుండుట, నేత్రములకు ఆనందం కలిగించుట అన్న విషయాలను కవి ఆమె ముఖంనందు ఆరోపించు చున్నాడు. ముఖానికి చంద్రధర్మం ఆరోపించుటచే రూపకాలంకారం అందురు.

భాషా కౌశల్యాలు – మౌఖికం (శ్రవణం, ఉక్తలేఖనం)

- వాక్యాలను తగిన విరామ చిహ్నాలతో రాయవలెను.
- గుండ్రంగా, శుభ్రంగా, కొట్టివేతలు లేకుండా రాయవలెను.
  1. నేనూ, మావారూ, మా పిల్లలందరూ మీకు కలకాలం ఋణపడి ఉంటారు.
  2. చిలకమ్మగారూ! నేనెవరో తెలీదు.

పోటీల సమయము:

ఉపాధ్యాయులు విద్యార్థుచే పాఠాన్ని ప్రకాశపఠనము చేయించుట మరియు పద్యాలు, గేయాలు రాగయుక్తంగా పాడే పోటీలను నిర్వహించుట.

7 ఆనందవనం ఆదరించేవనం

(ఛాయా చిత్రాల సౌజన్యం : డా॥ శీతల్ ఆమ్టే-కరాజ్‌గీ)

బాబా ఆమ్టే – సాధనాతాయి ఆమ్టే

డా॥ వికాస్ ఆమ్టే (కుమారుడు) – డా॥ భారతి (కోడలు)

డా॥ ప్రకాశ్ ఆమ్టే (కుమారుడు) – డా॥ మందాకిని (కోడలు)

రేణుక, బిజిలీలను బాబా మరియు సాధనాతాయి దత్తత తీసుకున్నారు. కుష్ఠువ్యాధిగ్రస్థులకు పుట్టిన వీరిని సొంతబిడ్డల్లాగా పెంచుకున్నారు. శ్రీమతి రేణుక మొదట హేమల్‌కసాలో నర్సుగాను పిదప LBP పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. శ్రీమతి బిజిలీ బధిరుల పాఠశాలలో పనిచేసి సేవానివృత్తులయ్యారు.

పూర్తి పేరు	:	మురళీధర్ దేవిదాస్ ఆమ్టే
జననం	:	26-12-1914
జన్మస్థలం	:	హింగన్ ఘాట్, వరోరా, మహారాష్ట్ర
తల్లి	:	లక్ష్మీబాయ్ ఆమ్టే
తండ్రి	:	దేవిదాస్ ఆమ్టే
బిరుదులు/పురస్కారాలు	:	పద్మశ్రీ, రమన్ మెగ్‌సెసే అవార్డ్, పద్మ విభూషణ్ గాంధీ శాంతి పురస్కారం మొదలగునవి మరెన్నో
వెబ్‌సైట్	:	http://www.anandwan.in

మురళీధర్ దేవిదాస్ ఆమ్టే గారు వృత్తి రీత్యా న్యాయవాది. భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న జాతీయనేతల తరఫున వాదించేవాడు. మహాత్మాగాంధీ వైపు ఆకర్షితుడై అతని సిద్ధాంతాలను అనుసరించేవాడు.

ఒక వర్షాకాలపు సాయంత్రం ఇంటికి వెళుతూ దారిలో చిందరవందరగా ఉన్న ఒక ప్రోగువంటి దానిని చూశాడు. నిశితంగా పరిశీలించి తీవ్రమైన కుష్ఠు వ్యాధితో ఘోరమైన స్థితిలోనున్న ఒక మనిషిగా గ్రహించాడు. అంతేకాదు అతడు ప్రాణంతో ఉన్నట్టుగా ఆనవాళ్ళు కనపడ్డాయి. అతని ముఖం లోని చాలా భాగం క్షీణించిపోయింది. శరీరమంతా కుళ్ళి పురుగులు తొంగి చూస్తున్నాయి. చేతి వేళ్ళు, కాళ్ళవేళ్ళు, పూర్తిగా నశించిపోయాయి. అతడు నేలమీద పడి ఊపిరి పీల్చు కోవడానికి తపిస్తూ ఉన్నాడు. ఆ సన్నివేశం చూసి ఆయనకు కడుపులో త్రిప్పింది. భయభ్రాంతుడయ్యాడు. అతనిపై ఒక వస్త్రాన్ని విసిరి తప్పుకొని వెళ్ళిపోయాడు. కానీ తన అంతరాత్మను మాత్రం తప్పించుకోలేకపోయాడు. ఆ దయనీయ సన్నివేశం అతనిని వెంటాడింది. "నిర్భయుడినని భావించిన నేను గాంధీగారిచే **అభయ్‌సాధక్** అని పిలువబడిన నేను ఇలా వెన్నుచూపి మానవత్వంలేకుండా ప్రవర్తించడమా!" అని ప్రశ్నించుకొని తనను తానే ఏవగించుకున్నాడు. అవసానస్థితిలోనున్న తులసీరామ్ వద్దకు తిరిగి వెళ్ళాడు. వానపడకుండా వెదురు కర్రలతో పందిరి వేశాడు. ఆహారం అందించాడు. గాయాలకు మందురాసి సపర్యలు చేశాడు. కానీ మూడు రోజుల తరువాత తులసీరామ్ బాబా బాహువులలో కన్నుమూశాడు. ఈ సన్నివేశం మురళీధర్ జీవితాన్ని క్రొత్త మలుపు త్రిప్పింది. కుటుంబంలోని వ్యక్తులే భయపడి, అసహ్యించుకొని అనాథలుగా వదలివేయడానికి కారణమైన ఈ కుష్ఠు వ్యాధిని అరికట్టాలి. ఆ వ్యాధిపీడితులకు ఆశ్రయమివ్వాలి. వారి జీవితాన్ని మరల చిగురింపజేయాలనే సంకల్పంతో నడుంకట్టాడు. కానీ బంధుమిత్రాదులు మురళీధర్‌ను ఏవగించుకున్నారు. సమాజం ఏవగించుకొన్నా తమను తండ్రిలా ఆదరించిన ఆయనను కుష్ఠురోగులు బాబా అంటూ ఆశ్రయించారు. బాబా కుష్ఠురోగుల గురించి, ఆ వ్యాధిని గురించి తెలుసుకోవడానికి కోల్‌కతాలోని వైద్య కళాశాలలో చేరాడు.

అడ్డంకులు మరచి ఆనందంగా సాగుతాం

చేతికి అందిన పంట

నూతనోత్సాహం మా వెంట

ప్రతి దినము ఉపచారం మాకందే సహకారం

ఆకాశమంటే ఆనందం

'జంతువుల దేహంలో కుష్ఠురోగ జీవాణువులను పెంచడం సాధ్యం కాదు-మానవదేహం అందుకు ఉపయోగపడగలదు.' - అని ఒక అధ్యాపకుడు చెప్పిన విషయం ఆమ్టే గారిని బాగా ప్రభావితం చేసింది. రెండు రోజుల తరువాత "కుష్ఠువ్యాధి జీవాణువులను నా శరీరంలోకి ఎక్కించుకున్నాను." - అని వెల్లడించి సంచలనం సృష్టించారు. తన దేహాన్నే ఒక ప్రయోగశాల చేయాలనుకున్నారు. ప్రతికార శక్తి కారణంగా ఆయన దేహంలో ఆ రోగ జీవాణువులు ఎదగలేదు. కానీ రోగ నివారణ మార్గాలన్నీ తెలుసుకున్నారు.

సంపదలు వదలుకొని భార్యతో చంద్రపూర్ జిల్లాలో ఆశ్రమం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం నాగపూర్ సమీపంలో కొంత ప్రదేశాన్ని కేటాయించింది. దానిని అమిత కష్టంతో అభివృద్ధిపరచి, దానికి 'ఆనంద్‌వన్' FOREST OF JOY అని పేరు పెట్టారు. బాబా కేవలం కుష్ఠురోగుల వ్యాధిని నయం చేయాలనే కాదు, సొంత కుటుంబీకుల చేతనే అవమానింపబడి వారు కోల్పోయిన ఆత్మగౌరవాన్ని తిరిగి ఇవ్వాలని కలలుగన్నారు. అది అంత సులభసాధ్యం కాకపోయినా బాబాకు అట్టి సవాళ్ళు చాలా ఇష్టం.

బాబా, సాధనాతాయి, ఇద్దరుకుమారులు ఆరుగురు కుష్ఠురోగులు, చేతిలో పదునారు రూపాయలు, ఒక కుంటి ఎద్దుతో ప్రారంభమైన ఈ మహారోగిసేవా సంస్థ క్రమంగా పెరిగింది. దీనికి నిష్ప్రయోజకులుగా పరిగణింపబడిన కుష్ఠురోగులు పండించిన పంటలు కూడా ఆలంబనగా నిలిచాయి.

క్రీస్తు, గాంధీ, సానెగురుజీల బోధనలచే ప్రభావితులైన బాబా ఆమ్టే పొట్టి అరచేతుల చొక్కా, ఖాదీ నిక్కర్ ధరించి గుడిశెలో నివసిస్తూ సాధించినదేమి? అని ప్రశ్నిస్తే దానికి సమాధానం-అక్కడున్న సంస్థలు, వ్యక్తులు సాక్షులు. అచ్చటి పోస్ట్‌మన్, ఆనంద్‌వన్‌లోని ప్రధానోపాధ్యాయులు ఒకప్పటి కుష్ఠురోగులే.

ఆనందవన్ కేవలం మహారోగులకే కాదు. అన్ని రకాల దివ్యాంగులకు ఆశ్రయమిస్తుంది. ఇది బాబా కన్న కల. కని సాకారం చేసిన కల. దానిని అదే స్ఫూర్తితో కొన సాగిస్తున్నారు. ఆయన కుమారులు, కోడళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు మరెందరో సహచరులు.

కాదేదీ ఆటంకం కళాతృష్ణకు

చేనేత మగ్గాల చిత్ర వర్ణాలు

బాబా సాన్నిధ్యం - బాలలకు సంతోషం


ఆనందవనంలో ఆమ్టే సోదరులు

తన చేతిని తానే తయారు చేసికొని పని కొనసాగిస్తున్న మిస్త్రీ చంద్రమణి

ఆనంద్‌వన్‌లో ఎటువంటి యూనిఫాం లేదు. బయటి ప్రపంచంలో వలెనే సర్వసాధారణం (నార్మల్)గా జీవిస్తారు. కానీ బయట ప్రపంచంకన్నా మిన్నగా. ఆనందంగా. కమ్యూనిటీ కిచన్‌లో వంటలు–భోజనాలు. వారికి వచ్చిన, నచ్చిన పనిని చేస్తారు. కొందరు వ్యవసాయం, మరికొందరు నేత, ఇంకొందరు వడ్రంగం, ఇలా వివిధ రకాల వృత్తులను నిర్వహిస్తూ 'దానమివ్వవద్దు–దారిచూపు' అంటూ బాబా నొక్కివక్కాణించిన సిద్ధాంతాన్ని చెక్కు చెదరినివ్వటంలేదు.

తోడు - నీడ

- ఆరోగ్య రక్షణ – పునరావాసం
- విద్య – నియత విద్య
  వృత్తి విద్యలు
- జీవనోపాధి
- స్థిర వ్యవసాయ తర్ఫీదు
- గ్రామీణ అభివృద్ధి
- యువజన సాధికారత
- ప్రింటింగ్ ప్రెస్
- ఆసుపత్రి
- పాల కేంద్రం
- నర్సరీ
- లెదర్ వర్క్
- చేనేత

లోక్ బిరాదరీ ప్రాజెక్ట్ (హేమల్ కసా)

ఆకలి, అనారోగ్యం, మూఢ నమ్మకాల సంకెళ్ళలో చిక్కుకున్న మదియాగోండ్‌ల అభివృద్ధికై బాబా 'లోక్ బిరాదరీ ప్రాజెక్ట్' ప్రారంభించారు. గడ్చిరోలి జిల్లాలోని బామ్రాగడ్ అడవులు తప్ప బయటి ప్రపంచం ఎరుగని వారీ గోండ్‌లు. ప్రస్తుతం వీరి విద్య, ఆరోగ్యాల కొరకై బాబా ఆమ్టే కుమారుడు డా॥ ప్రకాశ్ ఆమ్టే అతని భార్య డా॥ మందాకినీ వారి సంతానం కృషిచేస్తున్నారు.

వికాస్ ఆమ్టే ఇలా అన్నారు – ''ఒకసారి కుష్ఠురోగులలో కొందరు సినిమా చూడాలనే అభిలాషతో బోలెడు దూరం నడచి వెళ్ళడం – అనుమతింపబడని కారణంగా వెనుదిరగడం జరిగింది ఇది తెలిసిన బాబా టెంట్ వారితో ప్రస్తావించడం, టెంట్ యజమాని వారికొరకు ప్రత్యేక షో ఏర్పాటు చేయడంకూడా జరిగింది. కానీ షో అయ్యీ అవ్వకముందే కడగడానికి చీపుర్లు, బాల్టీలతో పనివాళ్ళు తయారుగా ఉండడం చూచి బాబా 'ఇక ఇలాంటివి మన కొద్ద'నుకున్నారట. కానీ...

స్వరాలు కలుపుతున్న డా. వికాస్–భారతీ ఆమ్టేలు

ఆనాడు వారు ప్రదర్శించే వారు–వీరు ప్రేక్షకులు – ఈనాడు వీరు ఇటువైపు–వారు అటువైపు

'స్వరానంద్‌వన్'

'ది ఆర్కెస్ట్రా ఆఫ్ ది ఏబుల్డ్ – డిసేబుల్‌డ్ ఆఫ్ ఆనంద్‌వన్' పేరుతో ప్రదర్శనలిస్తున్నారు ఆనంద్‌వన్ సహవాసులు.

I పదజాలం పెంపొందించుకుందాం:

జీవచ్ఛవం = ప్రాణంలేని;

ఏవగించుకొనుట = అసహ్యించుకొనుట

II చర్చించండి – రాయండి.

1. ఆమ్టే వీరి బోధనలచే ప్రభావితులైనారు.
2. ఆమ్టే గారిని ప్రభావితం చేసిన విషయం.
3. ఆనంద్‌వన్ సంస్థ ఆవిర్భావం.
4. లోక్ బిరాదరీ ప్రాజెక్ట్.
5. పాఠ్యభాగం ఆధారంగా అల్లిక పూర్తి చేయండి.

ఆమ్టే గారి బిరుదులు

6. http://www.anandwan.in లో మరిన్ని విశేషాలు తెలుసుకోండి.

III క్రింది గద్యాన్ని చదివి, దానిసారాంశాన్ని మూడవ వంతునకు కుదించి రాయండి.

రాజారావుకు ఇద్దరు కొడుకులు, వారిలో ఒకరికి తన వ్యాపార బాధ్యతలు అప్పగించాలని వారికో పరీక్ష పెట్టాడు. అందులో ఎవరు నెగ్గితే వారికి తన వ్యాపార బాధ్యతులు అప్పగించుటకు నిర్ణయించుకున్నాడు. ఇద్దరికి కొంత డబ్బు ఇచ్చి "ఈ ఇంటిని పూర్తిగా నింపగల వస్తువులు ఈ ధనంతో కొనండి" అని వారితో చెప్పాడు.

పెద్దకొడుకు డబ్బు తీసుకొని ఉన్నపళంగా మార్కెట్ వైపుకు వేగంగా వెళ్ళాడు. మార్కెట్టులో ఉన్న వస్తువులలో గడ్డి చాలా చౌకైన వస్తువని అతడు తెలుసుకున్నాడు. తండ్రి ఇచ్చిన మొత్తం డబ్బుతో గడ్డి కొన్నాడు. అయినా మొత్తం ఇంటిని నింపేందుకు అది సరిపోలేదు.

రెండవ కొడుకు తన తండ్రి అప్పజెప్పిన పని ఎంతో తెలివి తేటలతో పూర్తి చేయాలి అని మనసులో అనుకుని దాన్ని గురించి బాగా ఆలోచించాడు. ఆ తరువాత తండ్రి ఇచ్చిన డబ్బులో ఒక్క రూపాయితో క్రొవ్వొత్తిని ఇంటికి తీసుకొని పోయి గదిలో క్రొవ్వొత్తి వెలిగించాడు. చూస్తుండగానే క్రొవ్వొత్తి వెలుగు ఇంటి మొత్తాన్ని నింపేసింది.

రాజారావు తన చిన్న కొడుకు తెలివితేటలకు సంతృప్తి చెంది చిన్న కొడుకుకు వ్యాపార బాధ్యతులు అప్పగించి అతనికి తోడుగా సహాయ సహకారాలు అందించమని పెద్దకొడుకుకు చెప్పాడు.

N2LZXP

సాయం చేస్తున్న చిన్నారి వికాస్

స్వయంగా నినాదాలు తయారు చేయండి.

– ధైర్యమే విజయానికి ....

– పట్టుదలతో కుందేటి .... నైనా సాధించవచ్చు.

8 సచ్ఛీలత

నేపథ్యం:

"జీవితంలో ధనాన్ని కోల్పోతే ఏమీ కోల్పోనట్లు
ఆరోగ్యం కోల్పోతే కొంత కోల్పోయినట్లు
కానీ వ్యక్తిత్వాన్ని కోల్పోతే సర్వస్వం కోల్పోయినట్లు"

పై ఉద్గార వాక్యాన్ని చదివారు కదా! వ్యక్తిత్వానికి (శీలం లేదా కారెక్టర్) అంతటి విలువ ఉంది. మనుష్యులందరూ సమానమే. అయినా అందులో మహనీయులైన వ్యక్తులు చిరస్మరణీయులుగా నిలిచి పోతారు. దానికి కారణం వారి 'సచ్ఛీలత'.

ఇప్పుడు శ్రీ బుడ్డిగ సుబ్బరాయన్‌గారు సచ్ఛీలతను గురించి చెప్పిన విషయాలను తెలుసుకుందాం, ఆచరిద్దాం.

ఐశ్వర్యానికి మంచితనమూ, శౌర్యానికి అసంబద్ధ ప్రలాపాలాడకుండా మిత భాషిత్వమూ, జ్ఞానానికి శబ్దాది విషయాల్లో రక్తిలేమియూ, శాస్త్రాల్లో మహాపండితులైన వారికి వినయమూ, ధనానికి సత్పాత్ర వినియోగమూ, సమర్థుడైన వానికి జ్ఞాపిక-సహనశీలత్వమూ, ధర్మానికి వ్యాజం లేకుండుటయూ అలంకారాలు. సచ్ఛీలత అనేది ఐశ్వర్యం మొదలయిన వాటికన్నిటికిని మూలం కనుక సకల పురుషులకు వరుసగా సౌజన్యమూ మొదలయిన ఆయా గుణాలు భూషణాలు.

ఉత్తమ నాయకత్వానికి అవసరమైన చతుర్దశ గుణగణాల్లోనూ 'సచ్ఛీలత' ఒక ప్రముఖ సద్గుణం. మనిషి గుణగణాలన్నిటిలోనూ సచ్ఛీలతను పాటించేవాడు సుగుణ సంపన్నుడుగా పరిగణింపబడతాడు. అందులో చిత్తశుద్ధి, నిజాయితీ, పెద్దమనిషితనం, నీతిగా ఉండటం, ముక్కుకు సూటిగా పోవడం, సత్యసంధత, సద్భక్తి, నిష్కాపట్యం, సజ్జనత ఇవన్నీ గాని, కొన్నైనాగాని లేదా ఏ ఒకటయినాగాని వ్యక్తిత్వంలో చోటుచేసుకున్నట్టయితే ఆ వ్యక్తి 'సచ్ఛీలత' గల నాయకుడనిపించుకుంటాడు. శీలసంపన్నతకు ఇవి పునాదిరాళ్ళు వంటివి. జీవితంలో కష్టాలు, దుర్భర పరిస్థితులు సంభవించినప్పుడు కూడ నీటిని విడనాడనప్పుడే మనిషిలో శీలనిర్మాణం జరుగుతుంది సాధారణంగా శీలనిర్మాణానికి, పరిసరాలు కొంతవరకూ కారణమయినా జీవితంలో వ్యక్తి తాను అప్పుడప్పుడు చేసే నిర్ణయాల ఫలితమే అది – అంటే 'తప్పు' అని తెలిసినదానిని విడనాడి 'ఒప్పు' అన్నదానిని స్వీకరించినప్పుడే శీలనిర్మాణం జరుగుతుందని స్థూలంగా చెప్పవచ్చు. 'మంచిని గ్రహించడానికి వ్యక్తి దృఢ సంకల్పుడయి ఉండా' లంటాడు అబ్రహాం లింకన్. అటువంటి దృఢసంకల్పమే ఒక సాధారణ వ్యక్తి అయిన లింకన్‌ను ఒక సుప్రసిద్ధ అమెరికన్ ప్రెసిడెంటుగా తీర్చిదిద్దిందని చెబుతారు. నలుగురూ నవ్విపోతారనీ, విమర్శిస్తారనీ లెక్క చెయ్యకుండా తన దృఢ సంకల్పాన్ని నెరవేర్చుకుంటానికి చేసిన కృషి వల్లనే అంత సుప్రసిద్ధుడయ్యాడు, మరి!

రాజుగారు – గంగాళం పాలు :

ఈ సందర్భంలో చిన్న కథ జ్ఞప్తికి వస్తున్నది. పూర్వం మహీపాలుడు అనే చక్రవర్తి అవంతి సామ్రాజ్యాన్ని ప్రజాభీష్టంగా పరిపాలిస్తూ ఉండేవాడు. అతనికి ప్రజల ప్రవర్తనను పరీక్షించాలనే కోరిక కలిగింది. మహామంత్రి హేమంతునికి మహారాజావారు తన మనస్సులో ఉన్న మాటను చెప్పుతాడు. యువరాజా గిరిపాలుని వారి 12వ జన్మదినోత్సవ సందర్భంలో మహారాజావారు అనుకుంటున్న పరీక్ష జరిపించడానికి మంచి సమయమని మహామంత్రి సలహా ఇస్తాడు. ఈ లోపున హేమంతుడు ఒక యుక్తిపన్ని గిరిపాలుని జన్మదినోత్సవానికి ప్రతి ఇంటివాడు ఉత్సవ సమయంలో ఒక చెంబుడు (తపేలా) మంచి పాలు తీసుకొని వచ్చి, అందులకై ఏర్పరచిన పెద్ద గంగాళంలో పోయవలసిందిగా తన రాజ్యంలో చాటింపువేయిస్తాడు. యువరాజావారి జన్మదినోత్సవం రానే వచ్చింది. పెద్దపెద్ద గంగాళాలు వరుసగా అమర్చారు. ప్రజలు తలొక మూసిన చెంబూ చేతితో పట్టుకొని కోటకు బయలుదేరారు.

ప్రతివాడూ తెచ్చిన ద్రవాన్ని ఆ గంగాళాల్లో వంపి ఇంటికి తిరిగి వస్తున్నాడు. మహామంత్రి గంగాళాల్లో పాలుతీసి, పరమాన్నం వండి ఆహ్వానితులకూ, అతిథులకూ వడ్డించమని సేవకులకు పురమాయిస్తాడు. సేవకులు ఒక్కొక్క గంగాళం పంపడానికి ప్రయత్నిస్తే ఏ గంగాళంలోనూ పాలు లేవు సరికదా! అన్ని గంగాళాల్లోనూ నీళ్లే ఉన్నాయి!!! ప్రజల సంగతి తెలిసి అంతకు ముందే మహామంత్రి వేరే ఏర్పాట్లు చేసేడనుకోండి!!!

అప్పుడు మహామంత్రి ప్రజలను పిలిచి ఒక్కొక్కరిని విచారించగా ప్రతి ఒక్కడూ ఒకవిధమైన కథను ఇలా చెప్పసాగాడు. ''అందరూ మంచిపాలే పోస్తారు గదా, నేను ఒకణ్ణే చెంబుడు నీళ్ళు పోస్తే ఎవరికి తెలుస్తుందనీ, కక్కుర్తి పనిచేశా'' నని ఒప్పుకుంటూ లెంపలు వేసుకొని వెళ్ళిపోజొచ్చారు.

ఈ కథ సారాంశమేమంటే రాజ్యంలోన ప్రతిపౌరుడు సచ్ఛీలత లోపించి నిజాయితీని తుంగలో తొక్కి అవినీతిగా ప్రవర్తించడం ప్రారంభించేడన్నమాట! అసలు నేటి ప్రజా స్వామ్యం (డెమోక్రసీ)లో ఇటువంటి యదార్థ పరిస్థితియే కానవస్తున్నదని ప్రముఖ జాతీయవాదీ స్వాతంత్ర్య సమర యోధుడూ అయిన అచ్యుత్ పట్వర్ధన్ ఇటీవల వాపోయాడు. దీనికి కారణం ప్రజా ప్రతినిధుల్ని ఎన్నుకునే ప్రజల్లోనే సత్యపాలన, ధర్మపాలన అడుగంటి స్వార్థంలో ఎటువంటి ఆకృత్యానికైన పాల్పడడం వల్లనే దేశంలోని స్థితిగతులు అప్పుడప్పుడు అధోగతికి చేరుకుంటూ ఉంటాయి. అలాగే పైనుదహరించిన 'రాజుగారూ–గంగాళం పాలు' కథలో చెప్పినట్లుగా ప్రతి ఒక్కరూ తన ఒక్క చెంబు (నీళ్ళుగాక) పాలు మాత్రమే పోసి ఉంటే రాజుగారి మాట అందరూ మన్నించినట్లు అవుతుంది. ఎవరికి వారు తాము చేయవలసిన విధి తాము తెలుసుకొని తమ కర్తవ్యాన్ని సంతోషంగా నిర్వహించ గలిగిననాడు దేశం సుభిక్షమై రామరాజ్యంగా వర్ధిల్లుతుంది. దేశపాలకులలో సచ్ఛీలత వర్ధిల్లిననాడు ప్రజలలో కూడా నీతి, నిజాయితీలు ఇనుమడిస్తాయి. యథారాజా తథా ప్రజా! కదా. కాగా, ప్రజాస్వామ్యం (డెమోక్రసీ) లో రాజ్యాంగం (కాన్స్టిట్యూషన్) ప్రకారం దేశాధిపతిని ప్రజలే ఎన్నికద్వారా ఎంపిక చేస్తారు కాబట్టి, ప్రజలు నీతిమంతులయినప్పుడే దేశానికి ఉత్తమ నాయకత్వం లభించగా సంప్రదాయ ఆర్యోక్తి ఇలా మారుతుంది. 'యథా ప్రజా తథా రాజా'. అంచేత ప్రజా స్వామ్యంలో ప్రజలదే పైచేయి. వారు సచ్ఛీలురై ఉన్నప్పుడే దేశం రాణింపుకు వస్తుంది.

తెలుగునాట – వావిలాలవారు :

సచ్ఛీలత అనే సత్సంప్రదాయాన్ని వాడుకలోనికి తీసుకవచ్చిన మహనీయుడు ప్రముఖ గాంధేయవాది వావిలాల గోపాలకృష్ణయ్య. ఇది నా స్వానుభవం.

అది 1974వ సంవత్సరం. అప్పుడే ఆయన వెంగళరావు ప్రభుత్వంలో అధికార భాషా సంఘా (అఫిషియల్ లాంగ్వేజ్ కమీషన్) నికి ప్రప్రథమ అధ్యక్షులుగా నియమితులయ్యారు. పదవి కాబినెట్ స్థాయి. పదవీ బాధ్యతను స్వీకరించిన తర్వాత తమిళనాడు ప్రభుత్వంలో అధికార భాషను ఏలాగు అమలుచేస్తున్నారో అధ్యయనం చెయ్యడానికి మద్రాసు వచ్చారు. అప్పుడు నేను మద్రాసులో ఉన్న తెలుగు భాషా సమితిలో విజ్ఞాన సర్వస్వ కార్యాలయంలోన సంపాదక వర్గంలో పనిచేస్తూ ఉండేవాడిని. వారి విడిది చేపాక్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేశారు. అర కిలోమీటరు దూరంలో మద్రాసు యూనివర్శిటీ బిల్డింగ్స్‌లో మా సమితి ఉంది. వావిలాలగారితో ఉన్న పూర్వ పరిచయం కొద్దీ మా కార్యాలయానికి విచ్చేయవల్సిందిగా కోరారు. ఇంకా తమిళనాడు ప్రభుత్వవాహనంలో వస్తారేమో అని ఎదురుచూడగా ఆయన శైలిలోనే చేతిలో గాంధీసంచి ఊపుకుంటూ మా కార్యాలయానికి వచ్చి కాసేపు గడిపి వెళ్లాడు. మాకు చాలా ఆశ్చర్యం వేసింది. వావిలాల గోపాల కృష్ణయ్య నిరాడంబరత, నీతీ నిజాయితీ, సచ్ఛీలత వంటి సత్సంప్రదాయాలెన్నింటినో ఆయన రాజకీయ జీవితంలో తానే స్వయంగా పాటించి ఇతరులకు మార్గదర్శకుడయ్యాడు.

లాల్ బహదూర్ శాస్త్రి :

ఆధునిక కాలంలో కూడ సచ్ఛీలతను ధర్మాన్ని పాటించి సత్సాంప్రదాయాన్ని నెలకొల్పిన ధీమంతులు కొందరు మన మనసులోకి వస్తారు. అట్టివారిలో జవహర్‌లాల్ నెహ్రూ 1964లో దివంగతుడైనప్పుడూ దేశానికి ప్రధానికి సారథ్యం వహించిన లాల్ బహదూర్ శాస్త్రి (1904–1966)

ఒకరు. కార్మిక సంక్షేమం రంగంలో కాకలు తీరి ఎనిమిది సార్లు జైలుకు వెళ్లిన శాస్త్రి, పదవి పట్ల ఆసక్తిలేని నిరాడంబరుడుగా కీర్తిప్రతిష్ఠల నందుకున్నాడు. రాజనీతిజ్ఞుడు, శాంతికాముకుడు. 1952లో నెహ్రూ మంత్రివర్గంలో చేరి రైల్వేశాఖను చేపట్టి కడు సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉండగా, ఎక్కడో తమిళనాడులోని అరియాలూర్‌లో రైలుప్రమాదం జరిగినందున రైల్వేమంత్రిగా తాను నైతిక బాధ్యత వహించి శాస్త్రి తన మంత్రిపదవికి రాజీనామా చేసిన వెనువెంటనే ఆ సాయంత్రమే, ప్రభుత్వం తనకు ఇచ్చిన మోటారు వాహనాన్ని ప్రభుత్వ గరాజుకు పంపివేసి తాను మాత్రం సిటీ బస్సులో ఇంటికి వెళ్లిన ఉదంతం చాలమంది రాజకీయ నాయకుల్నే కాదు సామాన్యుల్ని కూడ ఆశ్చర్యసముద్రంలో ముంచివేసింది. వారి సచ్ఛీలత, శీలనిర్మాణస్థాయి అంత ఉదాత్తమైంది. మరి!

కవిపరిచయం : బుడ్డిగ సుబ్బరాయన్‌గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో 1928 మే 2న జన్మించారు. ఆంధ్రప్రదేశ్ ఆల్మానక్, బాలల విజ్ఞాన సర్వస్వం వీరి ఇతర రచనలు.

ప్రస్తుత పాఠ్యభాగం వీరి 'ఉత్తమనాయకత్వం' అనే గ్రంథం నుండి గ్రహించబడింది. సచ్ఛీలత అనే సుగుణం గురించి ఈ పాఠ్యభాగంలో వివరించబడినది.

I చదవండి - ఆలోచించండి - రాయండి.

పదజాలం పెంపొందించు కుందాం.

సచ్ఛీలత = మంచి ప్రవర్తన; శౌర్యం = పరాక్రమం; అసంబద్ధప్రలాపాలు = అనవసరమైన మాటలు; మిత భాషిత్వం = తక్కువగా మాట్లాడుట; రక్తి = వలపు, అనురాగం; వ్యాజం = కపటం, మోసం; సౌజన్యం = మంచితనం; చతుర్దశ = పదునాల్గు, చిత్తశుద్ధి = స్వచ్ఛమైన మనసు; సత్యసంధత = నిజంపలుకుట; నిష్కాపట్యం = కపటం లేకుండుట; సజ్జనిత = మంచితనం; దృఢ సంకల్పం = గట్టి నిర్ణయము.

II చర్చించండి - రాయండి.

1. రాజుగారు - గంగాళం పాలుకథ
2. వావిలాల వారి సచ్ఛీలత
3. లాల్‌బహదూర్ శాస్త్రిగారి శీల నిర్మాణస్థాయి.

III 1. కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ కింది అల్లికను పూరించండి.

వేటికి ఏవి అలంకారాలు

పుటసంఖ్య 83 లోని "ఐశ్వర్యానికి, మంచితనం .... నుండి .... అంత సుప్రసిద్ధుడయ్యాడు" వరకు ...

ఆ **జతపరచండి :**

1. సుప్రసిద్ధ అమెరికన్ ప్రసిడెంట్ [ ] అ) విడనాడాలి
2. ఒక ప్రముఖ సద్గుణ [ ] ఆ) స్వీకరించండి
3. తప్పును [ ] ఇ) సచ్ఛీలత
4. ఒప్పును [ ] ఈ) అబ్రహామ్‌లింకన్

ఉ) వాస్కోడిగామా

ఇ **వ్యతిరేక పదాలు రాయండి.**

1) సద్గుణం × [ ] 2) నీతి × [ ]

3) కష్టము × [ ] 4) సాధారణం × [ ]

ఈ **స్వీయాభిప్రాయం**

'సచ్ఛీలత'ను గురించి మీ సొంత మాటల్లో రాయండి.

2. కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ **అర్థవంతమైన పదాలతో పూరించి వాక్యాన్ని తిరిగి రాయండి.**

1. మహీపాలునకు ప్రజల ప్రవర్తనను .... కోరిక కలిగింది.
2. పెద్ద పెద్ద .... వరుసగా అమర్చారు.
3. యువరాజావారి .... రానే వచ్చింది.
4. ప్రజల సంగతి తెలిసి అంతకు ముందే .... వేరే ఏర్పాట్లు చేసేడు.

పుటసంఖ్య 83 లోని "పూర్వం మహీపాలుడు" .... నుండి ప్రారంభిచేడన్నమాట!" – వరకు

ఆ **ఎవరు ఎవరితో అనిరి.**

1. "నేను ఒక్కణ్ణే చెంబుడు నీళ్ళు పోస్తే ఎవరికి తెలుస్తుంది."
2. "పరమాన్నం వండి, ఆహ్వానితులకూ అతిథులకూ వడ్డించమని సేవకులకు పురమాయిస్తాడు."

ఇ. **గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.**

<u>అతనికి</u> ప్రజల ప్రవర్తనను పరీక్షించాలనే కోరిక <u>కలిగింది</u>.

అతనికి = కలిగింది =

ఈ **స్వీయాభిప్రాయం**

అవినీతి నిర్మూలనకు ఏ విధంగా సహాయ పడగలరో సొంత వాక్యాలలో రాయండి.

IV భాషావగాహన

1. కింది పదాలను పట్టికలో అడిగిన విధంగా సంధి కార్యాలను రాయండి.

క్ర.సం.	పదం	విడదీయుట	సంధి కార్యం
1		శబ్ద + ఆది	
2	ఆర్యోక్తి		
3		ప్రజ + అభీష్టము	
4	ఒక్కొక్క		
5		దేశ + అధిపతి	
6	జన్మదినోత్సవం		

2. పట్టికలో అడిగిన విధంగా రాయండి.

క్ర.సం.	పదం	విగ్రహ వాక్యం	సమాసం
1	ఉత్తమ నాయకత్వం		
2		కృత్యము కానిది	
3	ప్రజా భీష్టము		
4	చతుర్దశ గుణగణాలు		
5		కపటం లేనిది	
6	అవినీతి		

3. కింది వాక్యాలు సామాన్య, సంశ్లిష్ట, సంయుక్తములలో ఏ రకానికి చెందినవో రాయండి.

1. అతనికి ప్రజల ప్రవర్తనను పరీక్షించాలనే కోరిక కలిగింది.
2. శాస్త్రిగారి సచ్ఛీలత, శీలనిర్మాణస్థాయి ఉదాత్తమైంది.
3. మంత్రిగారు ప్రజలను పిలిచి ఒక్కొక్కరిని విచారించెను.

V సృజనాత్మకత

1. సచ్ఛీలత గురించి నీ అభిప్రాయం .... వివరించు
2. వ్యావహారిక భాషలోనికి మార్చి రాయండి.

లోకమందు మాతాపితలు, మిత్రుడను ముగ్గురే హితులు. నాకు మిత్రుడొకడున్నాడు. అతడు హిరణ్యకుడను మూషికరాజు. గండకీ తీరమందు విచిత్రవనమాతని నివాసస్థానము. అతడు పండ్ల బలిమిచేత వలత్రాళ్ళు తెగంగొఱికి మన యాపద బాపగలడు. అక్కడికి మనము పోవుదమని చిత్రగ్రీవుడను కపోతము తన మిత్రులతో పలికెను.

3. నేస్తంతో చర్చించండి. కానీ మీ సొంత అభిప్రాయం ప్రకారం పూరించండి. మిమ్మల్ని ఎవరెవరు ప్రభావితం చేశారో.

వ్యక్తులు	ప్రేరణ
తల్లిదండ్రులు	
ఉపాధ్యాయులు	
స్నేహితులు	
బంధువులు	
ఇతరులు	

N2S98F

భాషా కౌశల్యాలు – మౌనపఠనం

కింది అంశాలను అవగాహనతో మౌనపఠనం చేయండి.

పఠనంలో కూడా అనేక పద్ధతులుంటాయి. వాటిలో 'స్కిమ్మింగ్' మరియు 'స్కానింగ్' అనునవి ప్రధానమైనవి. ఆయా సందర్భాలు, అవసరాలను బట్టి తగిన పద్ధతిని ఎంపిక చేసుకోవాలి.

స్కిమ్మింగ్ : ప్రధానాంశాలు లేదా ముఖ్యభాగాన్ని అందులోని సారాంశాన్ని మాత్రమే గ్రహించాడానికి చదివే విధానం–దీనికి కింది పద్ధతులు అనుసరించాలి.

- ప్రధాన శీర్షికను చదవాలి.
- మొదటి పరిచ్ఛేదం లేదా ఉపోద్ఘాతం చదవాలి.
- ప్రతి పరిచ్ఛేదంలోని మొదటి వాక్యాన్ని చదవాలి.
- శీర్షికలు, ఉపశీర్షికలన్నింటిని చదవాలి.
- ఏవేని చిత్రాలు, చార్టులు, గ్రాఫ్‌లు ఉంటే వాటిని గమనించాలి.
- లావుపాటి అక్షరాలతో ఆటైఈ, రంగులలో చూపిన పదాలు, వాక్యాలను గమనించాలి.
- చివరి పరిచ్ఛేదంలోని సారాంశాన్ని చదవాలి.

స్కానింగ్: నిర్దిష్ట సమాచారము కొరకు త్వరిత గతిని గాలిస్తూ చదివే విధానం. దీనికి ఈ కింది పద్ధతులు అనుసరించాలి.

- వెదకదలచుకున్న సమాచారాన్ని నిశ్చయించుకొనుట.
- వెదకదలచుకున్న విషయం ఎలా కనబడుతుందో దానిని వెదకి పట్టుకోడానికి ఏ విధమైన జాడలను (clues) ఉపయోగించాలో ముందుగా ఊహించుకోవాలి. ఉదాహరణకు ఒక నిర్దిష్టమైన తేదీని వెదకాలంటే మీరు త్వరత్వరగా అంకెలవైపు దృష్టిసారిస్తూ ఆపరిచ్ఛేదాన్ని శోధించాలి.
- ఏ భాగంలో మీకు కావలసిన సమాచారం లభించగలదో గుర్తించడానికి విషయసూచిక, శీర్షికలు మొదలగు వాటిని వెదకాలి.
- పరిచ్ఛేదాలను, భాగాలను దాటవేస్తూ ఎంపికనుసరించి చదువుతూ పోవాలి.

ఒకానొక ట్రక్కుపైన వ్రాసిన ఈ నినాదాన్ని తెలుగులోకి అనువదించండి. దానిని గురించి చర్చావేదిక నిర్వహించండి.

____

9 తెలుగు వైభవం (బుర్రకథ)

నేపథ్యం :

పూర్వం ప్రజలకు మనోరంజకాన్ని కలిగించేవి జానపద కళారూపాలే. వీటిలో బుర్రకథ ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇది చదవడానికి, పాడటానికి అనువైంది. ఇందులో ఇద్దరు కథ చెప్తుంటే మరో ఇద్దరు వంత పాడుతూ వుంటారు. కథ చెప్పే వ్యక్తిని కథకుడు అని, అతనికి ఇరుప్రక్కల నిలబడి గొంతు కలిపే వాళ్ళను వంతలు అని అంటారు. ఈ ఇరువురిలో రాజకీయవంత మధ్యమధ్యలో రాజకీయ ప్రశ్నలడిగితే హాస్యవంత హాస్యాలు వల్లిస్తాడు. కథకుని మాటలకు వీరిరువురు తందానా! తానతందనాలు పలుకుతారు. కథకుడు తంబూర వాయిస్తాడు. కాబట్టి దీనికి బుర్రకథ అనిపేరు వచ్చింది. ఇందులో సాహిత్యాల మేళవింపు మనోహరంగా ఉంటుంది. సాధారణంగా దీనిలో పురాణగాథ, ఒకానొక వీరగాథ లేదా సాంఘిక సమస్య ఇతివృత్తంగా ఉంటుంది.

కథకుడు : జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి – అన్నదార్యోక్తి అనగా పుట్టించిన తల్లి, పెంచి పోషించిన పల్లె స్వర్గం కన్నా మిన్నయన్నది పెద్దల సూక్తి. అట్టి సూక్తి ఆచరణకు నిలువెత్తు సాక్షులై మన సంస్కృతికి అద్దం పడుతున్న మహారాష్ట్రలోని తెలుగు సోదరులకు ముందుగా నమస్కరిస్తూ

వినరా భారత తెలుగు కుమారా
విజయం మనదేరా || తందాన తాన||
కనరా తెలుగు భాష వైభవం
కథలుగ మనసారా || తందాన తాన||
ప్రవాస మందలి సోదరులారా || తందాన తానె తందాన ||
మహారాష్ట్ర తెలుగు బాలల్లారా || తందాన తానె తందాన ||
తెలుగు సంస్కృతి సభలకు జైయని || తందాన తానె తందాన ||
తెలుగు భాషకు జై జై జై యని || తందాన తానె తందాన ||
వెలుగుతూ సాగాలిరా || తందాన తానె తందాన ||
వెన్నలైపోవాలిరా
థరిగిట్ట తత్తరిథా

హాస్యవంత : అన్నా! మన కథకుడు తెలుగు భాష, సంస్కృతి వైభవం అంటూ అర్థంకాని సంస్కృతంలో చెబుతున్నాడు. నేనసలే తెలుగులో వీకు"

రాజకీయ వంత :ఏంటి తెలుగులో వీకా! ఇప్పటికిప్పుడు ఎలా వీకయ్యావు?

హాస్య : తెలుగోళ్ళందరూ ఇంగ్లీషు దోవబట్టి ఇంగ్లీషే మాట్లాడు తుంటేను విని, విని తెలుగు మర్చిపోయా.

రాజకీయ: సోదరా! ఇంగ్లీషు మాట్లాడుటవిని తెలుగు మరిచావంటున్నావు. మరి ఎన్నో ఏళ్ళక్రితం మహారాష్ట్రకు వలస వచ్చినా మన తెలుగును మరవక తెలుగుభాషను అభ్యసిస్తూ ఏటేటా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్న మన ప్రవాస సోదరులకు నిజంగా ధన్యవాదాలు తెల్పాలి. ముందుగా వారికి తెలిపే కృతజ్ఞతలు ఏమిటయ్యా **అంటే......**

తెలుగు భాషయె మీకడ తేనెలూర
వెలుగు జూచెగ ఎల్లెడ వేడ్కమీర
కొసరి జానపదాలిట కొలువు దీర

వాసిగాంచు మహారాష్ట్ర వాసులార

తెలుగు తల్లి కంఠాభరణంలో మెరిసే ఆణిముత్యాల్లాంటి కవులు ఎవరయ్యా అంటే .

కథకుడు: భారతమిచ్చెను నన్నయ, తిక్కన ॥ తందాన తాన॥
కమ్మని భాగవతమల్లెను పోతన ॥ తందాన తాన॥
నీతి శతకములందించె వేమన ॥ తందాన తాన॥
ప్రబంధాలను భువన విజయంతో ॥ తందాన తాన॥
ప్రసాదించెను ఆంధ్రభోజుడన్నా ॥ తందాన తాన॥

రాజకీయవంత : ఆంధ్రభోజుడు అంటే శ్రీ కృష్ణదేవరాయలు – ఆయన కత్తి పట్టి రాజ్యాన్ని పాలించడమే కాక గంటం పట్టి కావ్యాల్ని పాలించిన సాహిత్య సమరాంగణ సార్వభౌముడు ఎలాగంటే.

కథకుడు : కత్తిడాల్ చేపట్టితే సై
కాలరుద్రుడే రాయలు సై
బాకు బల్లెం విసిరితే సై
వీరభద్రుడే రాయలు సై
గంటం పట్టిన రాయలు సై
గ్రంథా లిట్టే రాయు రా సై
గ్రంథాలందున పద్యాలే సై
అందంగా నాట్యం చేయురా సై
భళానంటి భాయీ తమ్ముడా సై
మేలు భలానోయ్ తమ్ముడా సై
ధరిగిట్ట తత్తారిధా

హాస్య : మరయితే కత్తి పట్టిన రాజుకి, కవితల్లడం, ఎట్లొస్తదే.

రాజ : అదా నీ అనుమానం! శ్రీరాయల వారు 'ఆముక్తమాల్యద' కావ్యంతో పాటు స్వహస్తాలతో లిఖించిన స్వచ్ఛమైన తెలుగు పద్యాన్ని మచ్చుగా వినిపిస్తా విను.

తెలుగదేలయన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ తెలుగొకండ
ఎల్లనృపులు గొలువ ఎరుగవే బాసాడి
దేశభాషలందు తెలుగు లెస్స.

హాస్య : అయ్యబాబోయ్! అంత మంచిగ రాసేవాడా ఆంధ్రభోజుడంటే.

రాజ : రాయలవారేగాక పాశ్చాత్యులు కూడా పసందైన మన తెలుగును ''ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అన్నారు. బ్రిటిషువాడైన బ్రౌన్ దొర మన తాళపత్ర గ్రంథాలెన్నో భద్రపరచడమే గాక తెలుగు నిఘంటువులు ఏర్పరిచారు.

హాస్య : ఎట్టెట్టా

రాజ : నీలాంటి వారి కోసం తెలుగులో ఓ సామెతుంది. అదే తెలివి తక్కువ – ఆకలెక్కువ అని .....

హాస్య : నాకు తెల్సిన సామెత ఒకే ఒకటుంది.

రాజ : ఏంటది?

హాస్య : తిండి కలిగితే కండ కలదోయ్, కండకలవాడేను మనిషోయ్.

రాజ : కనీసం అది వ్రాసిందెవరో తెలుసా?

హాస్య : ఆయనతో నాకేంపని.

రాజ : అవును వినడమే నీపనిగాని, ఆయన ఎవ్వరో చెపుతాను. విను.

కథ : **అరరే అతడు గురజాడ**
కనరే తెలుగు వెలుగు జాడ ॥ అరరే॥
కన్యాశుల్కం నాటకంతో
సంఘం కళ్ళు తెరిపించాడు
దేశభక్తి గేయాలను వ్రాసి
భాషను మార్చి, భవితను తీర్చాడు.
దేశమంటే మట్టి కాదని
దేశమంటే మనుషులేనని
బోధనలెన్నో చేశాడు
భేదం లేక మసల మన్నాడు ॥అరరే॥
దరిగిట్ట తత్తారిధా

హాస్య : అలాగా! మరి మన తెలుగు సంతకాలనదగిన వారు ఇంకా ఎవరైనా ఉన్నారా?

రాజ : ఆ...... వున్నారు. నీలాంటి అజ్ఞానులకు కూడా అర్థమవ్వాలనే వ్యావహారిక భాషోద్యమంతో ముందుకు నడిపించాడు గిడుగు రామ్మూర్తి పంతులు. వాడుక భాషకు పట్టం కట్టించాడు కాళోజీ నారాయణరావు. చెయ్యెత్తి జై కొట్టించాడు. వేములపల్లి శ్రీకృష్ణ. ఎలాగంటే.....

కథకుడు : **చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడ**
గతమెంతో ఘనకీర్తి కలవోడ ॥ చెయ్యెత్తి॥
కాకతీరుద్రమ్మ, మల్లమాంబ, మొల్ల,
మగువమాంచాల నీ తోడబుట్టిన వాళ్ళె ॥ చెయ్యెత్తి॥
వీర వనితలు గన్న తల్లేరా
ధీర మాతల జన్మభూమేరా ॥ చెయ్యెత్తి॥
ధిరగిట్ట తత్తరి తా

రాజ : ఇట్టి కవి పుంగవులే గాక తెలుగు తల్లి స్వర్ణమకుటంలో మెరిసే మణిమాణిక్యాలే మన స్వాతంత్ర్య సమర యోధులు వారే స్వరాజ్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగ మూర్తులు.

కథకుడు: **సత్యాగ్రహమే ఆయుధమ్ముగా**
శాంతి సమరమే గాంధీ చేయగా **తందాన తానె తందనాన**
మూడు రంగుల సమైక్య పరచి
పింగళి వెంకయ్య జెండా తీర్చెర ॥భళాభళి॥

వంతలు : వినర వినర వినర

స్వరాజ్య సమరం చరిత

కనర కనర కనర

తెలుగు తేజాల ఘనత తందాన తానె తందనాన

కథకుడు: తెల్ల దొరల తుపాకి గుండుకు తందాన తందనా

గుండెను చూపెను ఆంధ్రకేసరి తందాన తందనా

నిజాంనే ఎదిరించి నిలిచెను తందాన తందనా

పద్య విద్యతో దాశరథి తందాన తందనా

ఆత్మత్యాగముతో ఆంధ్రను తెచ్చెను తందాన తందనా

అమరజీవి పొట్టి శ్రీరాములు తానె తందనానా

ఇలా స్వరాజ్యం సాధించిన తదుపరి తెలుగు భాష సుసంపన్నమై, ఎదగసాగింది. మన తెలుగు వెలుగులతో

రాజ : డబ్బుపెట్టి కొనలేనిది, జారిపోతే తిరిగి రానివి రెండేరెండు. అవి తరతరాల సంప్రదాయాలతో కూడిన మన భాష, సంస్కృతి ఇక్కడ చూడు వలసవచ్చిన ముత్తాతల తరం నుండి నేటి తరం వరకు మన తెలుగు వాళ్ళ పండుగల సంప్రదాయాలు చెక్కుచెదరలేదు.

హాస్య : అసలు మంచి ప్రతిభ, మనసున్న తెలుగు వాళ్ళు యింతింత దూరమెందుకు వచ్చారు? ఏం చేస్తున్నారు?

రాజ : అదే ప్రగతిని సాధిస్తున్నారు. తెలుగు సంస్థలు స్థాపిస్తున్నారు.

కథకుడు : బ్రతుకు తెరువుకై వచ్చి ॥భళాభళీ॥

పెద్ద చదువులే చదివి ॥భళాభళీ॥

మేధా శక్తిని పెంచి ॥భళాభళీ॥

ప్రపంచాన్నా కర్షించి ॥భళాభళీ॥

రేయింబవళ్ళు చెమటోడ్చి ॥భళాభళీ॥

ఐకమత్యమే నేర్చి ॥భళాభళీ॥

శ్రమనే నమ్ముకొని ॥భళాభళీ॥

తమదే విజయమని ॥భళాభళీ॥

తెలుగు సంస్థలు ఏటేటా ॥భళాభళీ॥

ఆటపాటలతో ప్రతిచోటా ॥భళాభళీ॥

తెలుగును రక్షిస్తుంటే ॥భళాభళీ॥

తెలుగు తల్లికి జై జై ॥ జై జై ॥

తెలుగు మాటకు జై జై ॥ జై జై ॥

తెలుగు భాషకు జై జై ॥ జై జై ॥

తెలుగు ప్రజలకు జైజై

కవిపరిచయం : డా॥ వద్దెపల్లి కృష్ణగారు లక్ష్మమ్మ-లింగయ్య అను పుణ్యదంపతులకు 1948 ఆగష్టు 5న తెలంగాణ రాష్ట్రంలోని సిరిసిల్లలో జన్మించారు. వీరి 'చిరుగజ్జెలు' బాలసాహిత్య రచనల పోటీలో రాష్ట్ర స్థాయిలో పేరుగాంచింది, లలితశ్రీ, కవన ప్రజ్ఞ బాలల సాహిత్యరత్న బిరుదాంకితులు.

ప్రస్తుత పాఠ్యభాగం 'తెలుగువైభవం' 'బాలల బుర్రకథ' అనే గ్రంథం నుండి గ్రహించబడినది.

ఈ పాఠ్యభాగం తెలుగు భాష, సంస్కృతిని తేటతెల్లం చేస్తూ, తెలుగు ప్రముఖుల్ని రాష్ట్రేతర తెలుగు బాల-బాలికలకు పరిచయం చేస్తున్న జానపద కళారూపము.

I చదవండి - ఆలోచించండి - రాయండి.

అ) పదజాలం పెంపొందించు కుందాం.

1. ప్రవాసము అంటే ...
   - అ) ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వచ్చుట.
   - ఆ) ఒకే ప్రాంతంలో స్థిరంగా ఉండుట.
   - ఇ) ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సంచారం - చేయుట.
2. పాశ్చాత్యులు అంటే ...
   - అ) స్వదేశీయులు ఆ) భారతీయులు ఇ) విదేశీయులు
3. ఆంధ్రభోజుడంటే ....
   - అ) బుక్క రాయలు ఆ) శ్రీకృష్ణ దేవరాయలు ఇ) హరిహరరాయలు

II అ) చర్చించండి - రాయండి.

1. కథకుడు ప్రారంభంలో తెలుగు భాషా వైభవాన్ని తెలియజేసిన విధం.
2. తెలుగు సంతకాలు .....
3. "తెలుగు భాషయే మీకడ తేనెలూర" అన్న పద్యంలో రాజకీయ వంత చెప్పదలచిన విషయం.
4. కథకుడు వలస వచ్చిన తెలుగువారి విశిష్టత తెలియజేసిన విధం

ఆ) ఎవరు ఎవరితో అనిరి.

1. మరయితే కత్తి పట్టిన రాజుకి కవితలల్లటం ఎట్లొస్తది.
2. మన పింగళి వెంకయ్య జెండా తీర్చెరా.

ఇ) అర్థవంతమైన పదాలతో పూరించి వాక్యాన్ని తిరిగి రాయండి.

1. .... సాగాలిరా తందాన తానె తందాన.
2. తెలుగదేల యన్న .... తెలుగేను.
3. తెలివి .... ఆకలి ఎక్కువ.
4. మన తెలుగువాళ్ళ పండుగల .... చెక్కు చెదర లేదు.

కథాకథన సమయం

ఎనలేని పట్టుదల, శౌర్య పరాక్రమాలతో 'స్వరాజ్యాన్ని' స్థాపించిన శివఛత్రపతి వీరగాథను చర్చించండి.

ఆ గాథను చక్కని ఉచ్చారణ, అభినయంతో 'కథాకథనం' కార్యక్రమంలో 'బుర్రకథగా' చెప్పండి.

III కృత్యం :

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ సరియైన సమాధానాన్ని గుర్తించండి.

1. నేనసలే .... లో వీకు

   అ) తెలుగు ఆ) ఆంగ్లం ఇ) సంస్కృతం ఈ) ఉర్దూ

2. ఇంగ్లీషు .... విని తెలుగు మరిచాను.

   అ) వినడం ఆ) రాయడం ఇ) మాట్లాడటం ఈ) చదవడం

3. ప్రవాస సోదరులకు నిజంగా .... తెల్పాలి.

   అ) ఆశీస్సులు ఆ) కృతజ్ఞతలు ఇ) ధన్యవాదాలు ఈ) అభినందనలు.

4. .... జూచెగ ఎల్లెడ వేడ్క మీర

   అ) చీకటి ఆ) కాంతి ఇ) వెలుగు ఈ) మెరుపు

పుట సంఖ్య 90 లోని "అన్నా! ..... మన కథకుడు .... కత్తిపట్టిన రాజుకి కవితల్లడం ఎట్లాస్తదే" వరకు.

ఆ కింది వాక్యాలను తప్పొప్పులుగా గుర్తించి రాయండి.

1. తెలుగు వారు ఎన్నో ఏళ్ళ క్రితం మహారాష్ట్రకు వలస వచ్చారు. (   )
2. ఏంటీ తెలుగులో స్ట్రాంగా (   )
3. మన కథకుడు తెలుగుభాష, సంస్కృతి వైభవం అంటూ అర్థంగాని సంస్కృతంలో చెబుతున్నాడు. (   )
4. మహారాష్ట్రకు వలస వచ్చిన తెలుగు వారు ఏ కార్యక్రమాలు చేపట్టుట లేదు. (   )

ఇ వచనం మార్చి రాయండి.

1. కార్యక్రమాలు = ______ 2. సోదరుడు = ______
3. రాజ్యాలు = ______ 4. పత్తి = ______

ఈ స్వీయాభిప్రాయం

కృష్ణదేవరాయల గొప్పదనం మీ సొంత మాటల్లో వివరించండి.

IV భాషావగాహన

1 జతపరచండి.

1. ఏటేట ______ సరళాదేశ సంధి
2. కొలువు దీర ______ ఆమ్రేడిత సంధి
3. భాషోద్యమము ______ అకార సంధి
4. చెమటోడ్చి ______ గుణసంధి

2. కింది పదాలకు విగ్రహ వాక్యం, సమాస నామం రాయండి.

1. కంఠాభరణం : ______ ______
2. కమ్మని భాగవతం : ______ ______
3. రేయింబవళ్ళు : ______ ______
4. స్వహస్తాలు ______ ______
5. మూడు రంగులు : ______ ______

3. కింది వాక్యాల్లో సామాన్య, సంశ్లిష్ట సంయుక్త వాక్యాలను గుర్తించి రాయండి.

1. ప్రవాసాంధ్రులు తెలుగుభాషను అభ్యసిస్తున్నారు. అంతేగాక ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్నారు.
2. శ్రీకృష్ణ దేవరాయలు ఆముక్త మాల్యద రచించారు.
3. బ్రౌన్‌దొర మన తాళపత్ర గ్రంథాలెన్నో భద్రపరచడమేగాక తెలుగు నిఘంటువులు ఏర్పరిచాడు.
4. గాంధీజీ శాంతి, సత్యా గ్రహాలను ఆయుధాలుగా చేసికొనెను.

లేఖననైపుణ్యాలు - స్వీయాభిప్రాయం

ఏదైనా ప్రదేశం, ఉత్సవం, సంఘటన మొదలగు వాటిని చూచినపుడు ఒక విధమైన అనుభూతిని పొందడం సహజం. దానిని మన అభిప్రాయాన్ని స్పష్టంగా ఆత్మవిశ్వాసంతో చెప్పగలగడం, రాయగలగడమే స్వీయ అభిప్రాయ వ్యక్తీకరణ. ఇది జీవితంలో ఎంతో ఉపయోగపడుతుంది.

ఇప్పుడు అంశాల ఆధారంగా స్వీయభిప్రాయం రాసి చూద్దామా!

1) "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అన్న విషయాన్ని గురించి మీ స్వీయాభిప్రాయం వ్యక్తం చేయండి.

అంశాలు :

- దేశభక్తి అంటే .
- కొందరు దేశభక్తులు
- దేశభక్తునికి ఉండవలసిన లక్షణాలు.
- దేశభక్తిని పెంపొందించు కోవలసిన ఆవశ్యకత.
- నీ దేశభక్తిని ఏ విధంగా చూపిస్తావు?

మాదిరి:

"దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" అని గురజాడ వారు చెప్పిన మాటలను బట్టి తోటి మానవులకు సేవచేస్తే దేశానికి సేవచేసినట్లేనని అర్థమవుతుంది. జన్మభూమి, కన్నతల్లి వంటిది. తల్లిపట్ల దేశంపట్ల కూడా ప్రేమ, అభిమానం ఉండాలి. ప్రతిఫలాపేక్ష లేకుండా, దేశక్షేమం కోసం పాటుబడటం నిజమైన 'దేశభక్తి'. మనదేశం దేశ భక్తులకు పుట్టినిల్లు. వీరపాండ్య కట్టబ్రహ్మన, ఝాన్సీ లక్ష్మీబాయీ, రాణిరుద్రమదేవి, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, మహాత్మాగాంధీ, నెహ్రూ, తిలక్, సుభాష్‌చంద్రబోస్, టంగుటూరి ప్రకాశం పంతులు, పొట్టి శ్రీరాములు ఇత్యాది దేశభక్తులు దేశంకోసం సర్వస్వాన్ని తృణప్రాయంగా విసర్జించారు. అమరజీవులయినారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని అసువులు బాసిన దేశభక్తులు అసంఖ్యాకంగా ఉన్నారు.

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అని ఆర్యోక్తి అంటే జనని, జన్మభూమి, స్వర్గం కంటె మిన్న. జన్మభూమి పట్ల భక్తి గౌరవాలు కలిగియుండటం ప్రతి మనిషి కనీసధర్మం. దేశం కోసం ప్రాణాలర్పించడానికైనా సిద్ధపడియుండాలి 'ఈ దేశం నాకేమిచ్చిందని కాదు, నేను దేశానికేం చేశాను, ఏమేరకు సేవలందించాను అనేది ప్రతి మనిషి ఆలోచించాలి.

దేశసమైక్యతకు కృషి చేస్తూ 'మానసేవే మాధవసేవ' అని తలచి నిస్వార్థంగా దేశానికి సేవ చేయాలి.

నేను పాఠశాలలోని స్కౌట్‌గైడ్, N.S.S., N.C.C. లలో పాల్గొని, వివిధ మారుమూల ప్రాంతాలకు వెళ్ళి, చదువురాని వారికి చదువునేర్పుతాను. స్వచ్ఛభారత్‌ను ప్రచారం చేస్తాను. ఈ విధంగా నాదేశ భక్తిని ప్రకటిస్తాను.

అభ్యాసాలు :

1. "హెల్మెట్ ధరించడం వల్ల కలుగు లాభాలు" – గురించి కింది అంశాల ఆధారంగా నీ అభిప్రాయాన్ని వ్యక్తం చేయి.

అంశాలు : ● **తలకు గాయాలు కాకుండుట** ● **ప్రాణాపాయం కలగకుండ** ● **రోడ్డు ప్రమాదాలు తప్పించుకొనుట** ● **భద్రత**

10 తుమ్మచెట్టు

నేపథ్యం:

- "ఉడతను పెంచాను పారిపోయింది.
  చిలుకను పెంచాను ఎగిరిపోయింది.
  మొక్కను పెంచాను .....
  ప్రస్తుతం అవి రెండూ వచ్చి చేరాయి"... అన్నారు.....
  కీ.శే.డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం. దీనిని గురించి, మీ అనుభవాన్ని జోడిస్తూ తరగతిలో చర్చించండి.
- ఒక వ్యక్తి లేదా వస్తువు తన జీవితాన్ని గురించి తానే చెప్పుకోవడాన్ని **"ఆత్మకథ"** లేదా **"స్వీయచరిత్ర"** అంటారు. వేరొక వ్యక్తి లేదా వస్తువు యొక్క జీవితాన్ని గురించి మరొక వ్యక్తి చెప్పడాన్ని **"జీవిత చరిత్ర"** అంటారు.
  ఇప్పుడు తుమ్మచెట్టు తన ఆత్మకథను చెప్పుకున్న వైనం పరిశీలిద్దామా!

నన్ను చూస్తే మీకు నవ్వుగా వుంది. 'తుమ్మచెట్టు కేమిటి? స్వగతం ఏమిటి' అనుకుంటున్నారు మీరు. మీరు కుర్రవాళ్ళు. అలాగే అనిపిస్తుంది మరి. తాతలను చూస్తే వాళ్ళిప్పుడు వున్నట్టే ఎప్పుడూ వున్నారు అనిపిస్తుంది మనుమలకు. తాతల అనుభవాలు మనుమలకేం తెలుస్తాయి? పిల్లకాకి కేం తెలుస్తుంది వుండేలు దెబ్బ! అందుకని నన్ను చూస్తే మీకు ఎగతాళిగానే వుంటుంది. అందులో నేను వట్టి తుమ్మచెట్టును.

మీరు పాత సంగతులన్నింటినీ మరిచి పోతారు. కొత్త సంగతులు నేర్చుకోవద్దని నేను అనను. కాని పాతను మరిచి పోవలసిన అవసరం ఏముంది? కొత్త మాత్రం ఎక్కడనుండి వచ్చిందేమిటి? పాతనుంచేగా! మనం వూరికినే అనుకుంటాం కానీ, పాత తెలియని వాళ్ళకు కొత్త తెలియదు.

నన్ను గురించి తెలుసుకోవాలంటే మీ తాతలనూ, అమ్మమ్మలనూ అడిగి చూడండి. నా ఘనత వారికి తెలుసు. మాజాతిని వారు ఏరి కోరి తీసుకువచ్చి పొలం గట్లమీద నాటేవారు. నేను లేని చేనేది వుండేదా ఆ రోజుల్లో! పొలానికి ధర కట్టేటప్పుడు మేము వున్న పొలాలు ధర హెచ్చు. లేని పొలాలు ధర తక్కువ. రైతులు ప్రాణాలనైనా వదులుకునేవారు కానీ, మమ్మల్ని వదులుకునేవారు కారు.

నావి ఆడంబరంలేని అలవాట్లు. నాకు ఎక్కువ నీరు గానీ, ఎరువుగానీ అక్కరలేదు. కాస్త స్థలం చూపించి, వదిలి పెడితే నా బ్రతుకు నేను బ్రతుకగలను. నన్ను రక్షించడానికి ఎవ్వరూ నా చుట్టూ కంచెను నాటి శ్రమపడవలసిన అవసరం లేదు. పశువులు మొదలైన వాటినుండి నన్ను నేనే రక్షించుకోగలను! చూస్తున్నారుగదా! శరీరంమీద నేను పెంచుకున్న ఈ ముండ్లను. ఇవే నన్ను అనేక అపాయాల నుండి రక్షించగలవు. నాజోలికి ఎవ్వరూ రాకుండా చూడగలవు.

నా యీ ముండ్లవల్ల రైతులకు అప్పుడప్పుడూ బాధ కలిగేమాట నిజమే. బాధేమిటి? వారి పాదాల్లో నేను విరుగని చోటనేది వుండదు. అయినా వారు నన్ను విడిచి పెట్టరు. నేనంటే వారికి యిష్టమే. ఎందుకో తెలుసా? నా విలువ వారికి తెలుసు. నేను వారి శ్రేయస్సు కాంక్షించే దానినని వారికి తెలుసు.

నావల్ల రైతులకు అనేక లాభాలు వున్నాయి. చాలా మొక్కలు, వృక్షాలు భూసారాన్ని పీల్చి భూమిని గుల్లచేసి తాము జీవిస్తాయి. నేను అటువంటిదాన్ని కాదు. నాభూమికి సత్తువ ఎక్కువ అవుతుంది. ఎందుకలా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటారు? నామాట నమ్మలేకుండా వున్నారా? నామాట నిజం. కావాలంటే తెలిసిన వారిని అడిగి చూడండి. మీరు నాకంటే పెద్ద పెద్ద వృక్షాలను చూసి వుంటారు. పెద్ద పెద్ద ఆకులతో, పూగుత్తులతో తమను చూచుకుని తామే మురిసిపోయే అనేక చెట్లను చూసి వుంటారు. రైతులకు మాత్రం వాటి మీద కంటే నామీదే ఎక్కువ మమకారం. పెద్ద పెద్ద ఆకులు వేసే చెట్లక్రింద యింకేదీ బ్రతుకదు. నేను అటువంటిదాన్ని

కాను. నా ఆకులు చిన్న చిన్నవి. కావాలనే నేను చిన్న చిన్న ఆకులు వేస్తాను. అందువల్ల నన్ను ఏ చేనుగట్టుమీద వేసినా వేయవచ్చు. నా నీడ పడి ఏ పంటా చెడదు. మీకీ సంగతులు తెలియవు. భూదేవికీ మీకూ వున్న సంబంధం పూర్తిగా తెగిపోయింది.

అయితే నీకంటే నిరపాయం అయిన చెట్లు లేవా – అని మీరడుగవచ్చు. ఎందుకు లేవు? వున్నాయి. కానీ రైతును, ఇబ్బంది పెట్టకుండా పెరగుతూ, నేను ఉపయోగ పడేటట్లు ఉపయోగపడే చెట్టు ఇంకొకటి లేదని మాత్రం గట్టిగా చెప్పగలను. కుర్రవాళ్ళు, మీకు తెలియకపోవచ్చు. మీ తాతలను అడిగి చూడండి. నాలో వుపయోగపడని భాగం ఒక్కటి కూడా లేదు. నా కలప రైతుల బండ్లకు వుపయోగపడుతుంది. రైతులు వుపయోగించే కొడవళ్ళు మొదలైన వాటికి పిడులుగా వుపయోగ పడుతుంది. నాలోనుంచి వచ్చే జిగురు మీరు చూసేవుంటారు. **'తుమ్మజిగురు'** అనేమాట విననివారు ఎవరుంటారు? ఈ జిగురు అంటించుకోవటానికి వినియోగ పడుతుందని మీకు తెలుసు. కానీ, మందులకు అనేకరీతుల నా జిగురు వినియోగపడుతుంది. నా కాయలు పశువులకు మంచి మేత. బాగా పుష్టిని చేకూరుస్తాయి. పశువులు నా కాయల కోసం ఎంత ఆరాటపడతవో, ఈనాడు మీకు తెలియక పోవచ్చు. పశుల కాపర్లను అడిగి చూడండి. లేకపోతే ఒక మేకను పెంచి చూడండి. ఆ మరచిపోయాను, నా బెరడు కూడా నిరుపయోగంకాదు. తోళ్ళ పరిశ్రమకు ఎంతగానో సహాయపడుతుంది. తోళ్ళను పరిశుభ్రపరచడానికి, పదును ఎక్కించడానికి నా బెరడు తోడ్పడినట్లు తోడ్పడే వస్తువే లేదు.

అయితే నేను కంటికి యింపుగాకనిపించను – అంటారు మీరు. నిజమే! కావచ్చు. ఆడంబరం లేని ఆకారం నాది. నా అలవాట్లు కూడా అటువంటివే. కాని నా పువ్వులను ఎప్పుడైనా చూశారా? యాదాలాపంగా చూసివుంటారు. పరీక్షగా చూసివుండరు. నామీద మక్కువ లేకపోవడం అనేది నా పువ్వులమీదకు కూడా పాకి వుంటుంది. ఈసారి నేను కనుపించినప్పుడు నన్ను మరచి నా పువ్వులను చూడండి. అవి పసుపుఛాయతో నక్షత్రాలు మెరసినట్లు మెరసి పోతుంటాయి. మీ మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించే సువాసన వెదజల్లుతూ వుంటాయి.

నాయీ పువ్వులను బట్టే నన్ను సంస్కృత కవులు **స్వర్ణపుష్ప** అని వర్ణించారు. అంటే బంగారు పువ్వులుగలదానినన్న మాట నేను. అలా ఆశ్చర్యంగా చూస్తున్నారేం? చిట్టి చిట్టి ఆకులతో, ముళ్ళతో, కొక్కిరి కాయలతో పొగచూరిన దానికి మల్లే వుండే నే నేమిటి? స్వర్ణపుష్ప నేమిటి? అని ఆశ్చర్య పడుతున్నారు కదూ! బహుశా నాకీ పేరిచ్చిన సంస్కృత కవులకు వృద్ధాప్యం వల్ల, మతి చెడి వుంటుందని కూడ మీరు అనుకుంటూ వుండి వుంటారు. దృష్టి మారినప్పుడు అట్లాగే అనిపిస్తుంది మరి!

నేను యిక్కడే కాదు, మనదేశంలో అన్ని చోట్లా వున్నాను. నన్ను మహారాష్ట్రలో బామళీ, పంజాబ్‌లో ''కికార్'' అని పిలుస్తారు. తమిళదేశంలో ''కరువేళం'' అంటారు. కన్నడదేశంలో నన్ను రెండు పేర్లతో వ్యవహరిస్తారు – అందులో మొదటిది 'గొబ్లి' రెండవది 'బాల్'. అన్ని తావులలోను పూర్వులు నన్ను అస్తారబతంగా పెంచేవారు. నేను వారికి అనేక విధాల తోడ్పడి నా కృతజ్ఞతలను తెల్పుకుంటూ వుండేదాన్ని.

నా జీవితం నాకున్న మాట నిజమే. నాకుండే ప్రేమలు నాకున్నాయి. నాకుండే కష్టసుఖాలు నాకున్నాయి. నా వంశం వృద్ధి చెందాలనే ఆశ నాకూ వుంటుంది. ఎన్ని వున్నా నన్ను ఆదరించే రైతులకోసం ఏం చేయడానికైనా ఎప్పుడూ సిద్ధంగానే వుంటాను. నా ప్రత్యేకతను చంపుకుని ఏ కంచెరూపంలోనో, ఇతర జీవాలను రక్షించడానికి కూడా పూనుకుంటానంటే యిక వేరుగా చెప్పవలసింది ఏముంది? మీకు యిన్ని విధాల తోడ్పడుతున్న నేను మీనుంచి కోరే దేముంది? ఒక మంచిమాట, ఒక చల్లనిచూపు! అదే నేడు కరువైంది.

సహజంగా నన్నుగురించి నేను చెప్పుకునే స్వభావం కాదునాది. గొప్పలు చెప్పుకోవడం నాకు గిట్టదు. కానీ, యిప్పుడు తప్పనిసరైంది. నన్ను యిన్నాళ్ళనుంచీ సొంత బిడ్డలాగా చూసుకుంటూ వచ్చిన రైతు ఇటీవల మరణించాడు. అది హఠాన్మరణం. ఆ సాయంకాలం పొలంపని చూసుకుని, గొడ్లను పాలేరుతో ఇంటికి తోలి, కాసేపు గట్టు మీద కూర్చుని ముఖమార్జనకు పనికివచ్చే నాలుగు పుల్లలు నానుంచి విరుచుకుని ఇంటికి వెళ్ళాడు.

తెల్లవారి ఆయన రాత్రే కాలధర్మంచేశాడని నాకు తెలిసింది. భోజనం చేసుకుని పడుకుని, పడుకున్నవాడు పడుకున్నట్టుగా మరణించాడట! నా గుండె బేజారెత్తింది. ఏమెత్తి చేసేది ఏముంది? శోకం దిగమింగి వూరుకున్నాను.

నా ఖామందుకు ఒక్క కుమార్తె మాత్రమే వుంది. ఆమెను నేను చిన్నతనంలో ఎరుగుదును. నా ఖామందు ఆ రోజుల్లో ఆమెను అప్పుడప్పుడూ పొలం తీసుకువస్తూ వుండేవాడు. ఆమెకు నా పువ్వులన్నా, జిగురన్నా ఇష్టం. నాకు ఆమెను చూస్తే చిన్న చెల్లెల్ని చూసినట్లే వుండేది. ఆమె పెరిగి పెద్దదయింతరువాత ఇటుప్రక్కకు రావడమే మానుకుంది. నిరుడే ఆమెకు వివాహం అయింది. ఇవాళ ఉదయం ఆమెభర్త పొలం వచ్చాడు. ఎంత గర్వంగా అడుగులు వేసుకుంటూ వచ్చాడనుకున్నారు? ఆయన వైఖరి చూస్తే ఎన్నడూ పొలం దిక్కుకు వచ్చిన మనిషిగా కనపడలేదు. నా ఖామందు తను కూతుర్ని ఉద్యోగం చేసుకునే ఆయనకు యిచ్చాడు. ఆయన పొలం గట్టుమీద నిలబడి నన్ను కాసేపు ఎగాదిగా చూశాడు.

"ఎందు కీ మోడు, యిక్కడ?" అన్నాడు. ఆ మాటలకు నా గుండెల్లో బాకు దింపినంత పనయింది.

ప్రక్కనున్న పాలేరు నా అవుసరాన్ని చెప్పాడు.

"అవన్నీ పాతకాలం మాటలు. ఇప్పుడు ఏరకం కలప కావాలన్నా ఎక్కడపడితే అక్కడ దొరుకుతుంది" అన్నాడు కొత్త ఖామందు.

ఈ చెట్లువల్ల భూమికి బలం వస్తూందట "చెట్టువల్ల భూమికి బలం రావడమేమిటి?" అని నవ్వాడు కొత్త ఖామందు "ఎరువుల కంటేనా?" అన్నాడు.

"వచ్చే సంవత్సరానికి కొత్త గిత్తలను కట్టడానికి బండి చేయిద్దాం అనుకుంటూ వుండేవాడు దొర" అన్నాడు పాలేరు.

"అంతగా బండికి కావాలంటే టేకు కర్రలు తెప్పించవచ్చు – ముందీ మోడుని వేళ్ళతోసహా కొట్టిపారేయండి" అన్నాడు ఖామందు.

ఎంత నిర్లక్ష్యం! ఇతర జీవాలంటే కాస్త కాకపోయినా, కాస్తయినా కరుణలేదుకదా? పైకి పెద్ద పెద్ద కబుర్లు చెపుతారు. పూర్వీకులకు తెలియని అనేక విషయాలు కనిపెట్టాం అంటారు. చెట్లకూ ప్రాణం వుందనీ, చెట్లూ నిద్ర పోతాయని ఇటీవల శాస్త్రజ్ఞులు కనిపెట్టారని, చెపుతుంటారు. పూర్వీకులకు ఈ సంగతి తెలియదనీ, ఈ సంగతి నవీన యుగంలో కనిపెట్టబడిందనీ చెపుతారు. పూర్వులకు ఈ సంగతి తెలియకపోయినా, మేమూ తమ కుటుంబంలో ఒకరిమే అన్నట్లు ప్రవర్తించేవారు. ఇప్పుడో, సమస్త జీవకోటిలోనూ ప్రాణం వున్నదని చెబుతారు. కానీ, ప్రాణం తియ్యడానికి మాత్రం ఏమాత్రం తడబడరు.

విన్నారు కదా నా కథ! మీరైనా మీకు ఎంతో ఉపయోగపడే మమ్మల్ని జాగ్రత్తగా చూచుకుంటారు కదూ!

కవిపరిచయం : శ్రీత్రిపురనేని గోపీచంద్ 1910 సెప్టెంబరు 8న కృష్ణాజిల్లా అంగలూరు గ్రామంలో జన్మించారు. తండ్రి త్రిపురనేని రామస్వామి చౌదరి. అసమర్థుని జీవయాత్ర, చీకటిగదులు, పరివర్తన, యమపాశం, శిథిలాలయం మొదలగునవి. కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత. ఈయన శతజయంతి సందర్భమున భారతప్రభుత్వం తపాలా బిళ్ళను విడుదల చేసింది.

ప్రస్తుత పాఠ్యభాగం 'మాకూ ఉన్నాయి స్వగతాలు' అను గ్రంథం నుంచి గ్రహించబడినది.

I చదవండి – ఆలోచించండి – రాయండి.

1. పదజాలం పెంపొందించుకుందాం.

స్వగతం = ఆత్మగతం; ఘనత = గొప్పతనం; హెచ్చు = ఎక్కువ, అధికం; మమకారం=ప్రేమ; మోడు = కొమ్మలులేని చెట్టు, ఎండిన చెట్టు; శ్రేయస్సు = మేలు, క్షేమం, శుభం; కాంక్షించుట = కోరుట; సత్తువ = శక్తి; మురిసిపోవుట = సంతోషించుట; కరుడు కట్టిన = జాలీ, దయ లేకుండా హింసాత్మక చర్యలకు పాల్పడే; చాదస్తులు = వెర్రివాళ్ళు, లోకజ్ఞానం లేనివాళ్ళు; ఈసడించుకొనుట = నిందించుకొనుట, అసహ్యించుకొనుట; పుష్టి = బలం, శక్తి; బెరడు = పైపొర; ఆహ్లాదం = సంతోషం; ఖామందు = యజమాని, నాయకుడు; వైఖరి = విధం, రీతి; ముఖ మార్జన = పళ్ళుతోమకోవడాం దంథధావనం.

II అ) చర్చించండి – రాయండి.

1. తుమ్మ చెట్టు ఘనత.
2. తుమ్మ చెట్టు అలవాటు.
3. తుమ్మ చెట్టు వల్ల రైతులకు కలిగే లాభాలు.
4. కొత్త ఖామందు ప్రవర్తన.

ప్రకృతిని నిశితంగా గమనించండి, తెలుసుకోండి.

- మర్రి చెట్టుకు ఊడలెందుకు.
- బాతుకాళ్ళ మధ్య చర్మమెందుకు
- ఎడారి మొక్కల ఆకులు నీటిబుగ్గల్లా ఉంటాయెందుకు.

ఆ) కింది వాక్యాలను ఎవరు ఎవరితో పలికిరి.

1. "ఎందుకీ మోడు, యిక్కడ?"
2. "ఈ చెట్టు వల్ల భూమికి బలం వస్తుందట"
3. "ఆమెకు నా పువ్వులన్నా, జిగురన్నా ఇష్టం"
4. "ముందీ మోడుని వేళ్ళతో సహా కొట్టి పారేయండి."



ఇ) అర్థవంతమైన పదాలతో పూరించి వాక్యాన్ని తిరిగి రాయండి.
(పొలాలు, అనుభవాలు, శ్రేయస్సు, కంచెను)

1. తాతల .... మనుమలకేల తెలుస్తుంది?
2. మేము ఉన్న .... ధర హెచ్చు.
3. నా చుట్టూ .... నాటి శ్రమ పడవలసిన అవసరం లేదు.
4. నేను వారి .... కాంక్షించేదాన్ని.

III 1. కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు రాయండి.

అ తుమ్మ చెట్టు వలన రైతులకు కలుగు నాలుగు లాభాలు.

1. ....
2. ....
3. ....
4. ....

పుటసంఖ్య 96 లోని 'నా వల్ల రైతులకు అనేక లాభాలున్నాయి.... నుండి ... కొడవళ్ళు మొదలైన వాటికి పిడులుగా వుపయోగపడుతుంది" ...వరకు ....

ఆ అర్థవంతమైన పదాలతో పూరించి వాక్యాన్ని తిరిగి రాయండి.

1. నా భూమికి .... ఎక్కువ అవుతుంది.
2. కావాలనే నేను చిన్న చిన్న .... వేస్తాను.
3. నా నీడపడి ఏ .... చెడదు.
4. నా కలప .... బండ్లకు ఉపయోగపడుతుంది.

ఇ. కింది వాక్యంలో గీతగీయబడిన ప్రత్యయాలు ఏ విభక్తులకు చెందినవో రాయండి.

మీరు నా కంటే పెద్ద పెద్ద వృక్షాలను చూసివుంటారు.

కంటే : .... ను :

ఈ. స్వీయాభిప్రాయం:

తుమ్మచెట్టు ఆకులు వాటి ఉపయోగాలను మీ సొంతమాటల్లో రాయండి.

2 కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ వివిధ రాష్ట్రాల్లో తుమ్మ చెట్టుకు గల పేర్లను కింది ఆకృతిలో రాయండి.

పుటసంఖ్య 97 లోని : "నాయీ పువ్వును బట్టీ నన్ను సంస్కృత కవులు" నుంచి .... చల్లని చూపు! అదే నేడు కరువైంది" వరకు

ఆ కింది వాక్యాలను సరైన వరుసక్రమంలో అమర్చి రాయండి.

1. అన్ని తావులలోనూ పూర్వులు నన్ను అస్త్రారబతంగా పెంచేవారు.
2. నన్ను సంస్కృత కవులు స్వర్ణపుష్ప అని వర్ణించారు.
3. మీకు యిన్ని విధాల తోడ్పడుతున్న నేను మీ నుంచి కోరేదేముంది?
4. రైతుల కోసం ఏం చేయడానికైనా ఎప్పుడూ సిద్ధంగానే వుంటాను.

ఇ. కింది పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించి రాయండి.

1. ఆదరించు : ....
2. చల్లని చూపు : ....

ఈ స్వీయాభిప్రాయం :

తుమ్మచెట్టును గూర్చి నీవు తెలుసుకొన్న దేమిటో నీ సొంత మాటల్లో రాయి.

IV భాషావగాహన

1. అడిగిన విధంగా పట్టికను పూరించండి.

పదం	విడదీయుట	సంధిపేరు
1.	వాళ్ళు + అప్పుడు	
2. కావాలంటే		
3.	నాకు + అంటే	
4.	ప్రతి + ఏకత	
5. ఏమంది		

2. కింది విగ్రహ వాక్యాలను, సమాసాలతో జతపరచండి.

విగ్రహవాక్యం		సమాస నామం
1. లక్ష్యము లేనిది		అ) విశేషణ పూర్వపద కర్మ ధారయం
2. కొత్తవైన సంగతులు		ఆ) ద్విగుసమాసం
3. నాలుగైన పుల్లలు		ఇ) నఞ్ తత్పురుష సమాసము
4. నల్లతుమ్మ అను పేరుగల చెట్టు		ఈ) ద్వంద్వ సమాసము
5. కష్టమును, సుఖమును		ఉ) సంభావన పూర్వపద కర్మధారయం
		ఊ) షష్ఠీ తత్పురుష సమాసము

3. కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

1. పాత × ______ 2. నిరపాయం × ______

3. సంతోషం × ______ 4. సుఖము × ______

5. ఆడంబరం × ______

V సృజనాత్మకత

అంతర్జాలం సహాయంతో కింది పట్టికను పూరించండి.

చెట్టు	వర్ణన/ఆకారం	ఉపయోగాలు
వేపచెట్టు		
తులసి చెట్టు		
మునగ చెట్టు		
కొబ్బరి చెట్టు	కొమ్మలుండవు, పొడవైన కాండం	కాయలు-ఆహారం, ఆకులు ఇండ్ల కప్పులు, చీపుర్లు .....
తాటి చెట్టు		

లేఖన నైపుణ్యాలు - అనువాదం

కింది పరిచ్ఛేదాన్ని తెలుగు భాషలోకి అనువదించండి.

Go Green - Gift Green

Green Gifts are Unique and less expensive. At the same time it gives lot of satisfaction to the person who gives as well as the person receives.

1. **Potted Plants:** You can grow herbs like Mint, Curry Leaf, Basil or flowering plants like Rose, Merrygold etc in eco - friendly pots and give them as gifts.
2. **Cloth / Paper bags :** One can easily stitch or make simple fabric / Paper bags, decorate them with creative craft ideas and present them as gifts to you near and dear one.

అనుబంధం : సమాచార మార్పిడి

సమాచార మార్పిడి/వినిమయం (ఇన్ఫర్మేషన్ ట్రాన్స్ఫర్) అనునది రెండురకాలు.

I. రేఖా చిత్రం/ఆకృతి రూపం (గ్రాఫులు, చార్టులు, పట్టికలు మొదలగునవి) నుండి లిఖిత రూపానికి.

సూచనలు :

1) విషయం క్లుప్తంగా పట్టిక (టేబుల్), గ్రాఫులు, పైచార్టులు ప్రవాహ, కృతి, ఫేక్ట్ఫైలు, అల్లిక మొదలగు వాటి రూపంలో ఇవ్వబడుతాయి.

2) పరిచ్ఛేదం రాయడానికి సహాయకారిగా ఇవ్వబడిన పదాలను ఉపయోగిస్తూ వాక్యాలు తయారు చేయాలి. ఇవ్వబడిన పదాలను సరైన క్రమంలో అమరుస్తూ చక్కగా రాయాలి.

3) మీరు రాసే పరిచ్ఛేదంలో గ్రాఫుల్లో/ఆకృతులలో ఇచ్చిన అంశాలన్నీ రావాలి. అదనపు అంశాలు అవసరం లేదు. అవసరమయితే జాతీయాలు. నుడికారాలు, చేర్చవచ్చు. అలాచేస్తే మీరు రాస్తున్న పరిచ్ఛేదం ఆసక్తికరంగా తయారవుతుంది.

4) విషయానికి సంబంధించిన శీర్షిక (టైటిల్) సాధారణంగా ఇవ్వబడుతుంది. లేకుంటే మీరు పరిచ్ఛేదం ఆధారంగా చేసుకొని పేరు సూచించండి.

II లిఖితరూపం నుండి రేఖాచిత్రం/ఆకృతి రూపాలకు మార్చుట.

సూచనలు :

1) ఇచ్చిన సమాచారాన్ని ఏ విధమైన రేఖా చిత్రం/ఆకృతికి మార్చమన్నారో దానిని ఒకసారి ఊహించుకోవాలి.

2) ఆ ఆకృతి ప్రకారం పరిచ్ఛేదంలోని ముఖ్యాంశాలను క్రోడీకరించుకోవాలి.

3) ఆ అంశాలను క్లుప్తంగా ఆకృతిననుసరించి పూరించాలి. లేదా రేఖాచిత్రం/ఆకృతినిగీయాలి

ప్రవాహాకృతిని పరిచ్ఛేదంగా మార్చిరాయుట.

సమూనా : కింద సీతాకోకచిలుక జీవితదశలు ప్రవాహాకృతిగా ఇవ్వబడింది. దానిని పరిచ్ఛేదంగా రాయండి.

పరిచ్ఛేదం : సీతాకోక చిలుక ఆకులపై గుడ్లు పెడుతుంది. కొన్నాళ్ళకు ఆ గుడ్లనుండి లార్వాలు పుడతాయి. అవి ఆకులను తిని బలంగా పెరుగుతాయి. ఆ తరువాత వాటి చుట్టూఒక కవచంలాంటి ప్యూపా ఏర్పడుతుంది. కొన్ని రోజులపాటు పురుగు నిద్రావస్థలో ఉంటుంది. ఆ తరువాత ప్యూపానుంచి రంగుల సీతాకోక చిలుక వెలువడుతుంది.



1. పట్టికను పరిచ్ఛేదంగా మార్చుట :

నమూనా : దిగువనీయబడిన పట్టికలో పి.వి. సింధు 'బాడ్మింటన్' క్రీడావిభాగంలో సాధించిన విజయాల గురించిన సమాచారం ఇవ్వబడింది. దాని ఆధారంగా ఒక పరిచ్ఛేదాన్ని రాయండి.

క్ర. సం.	పేరు	ఆట	కోచ్	సాధించిన పతకాలు	అవార్డులు, పురస్కారాలు
1.	పి.వి. సింధు (పుసర్ల వెంకట సింధు)	బ్యాడ్మింటన్	పుల్లెల గోపీచంద్	• 2013, 2016 సం॥లో మలేషియా మాస్టర్ గ్రాండ్‌ప్రిక్స్ 2 బంగారు పతకాలు • మకావ్ ఓపెన్ గ్రాండ్ ప్రిక్స్ 2013, 2014, 2015 3-బంగారు పతకాలు • రియో ఒలంపిక్స్-2016 రజతపతకం	2015-పద్మశ్రీ

పరిచ్ఛేదం : పి.వి. సింధు పూర్తి పేరు పుసర్ల వెంకటసింధు. ఈమె బ్యాడ్మింటన్ విభాగంలో ఒలిపింక్స్ పోటీల్లో రజతపతకం సాధించిన తొలి భారత మహిళ. పుల్లెల గోపీచంద్ ఈమె శిక్షకుడు (కోచ్). సింధు మలేషియా మాస్టర్ గ్రాండ్‌ప్రిక్స్‌లో (2013 మరియు 2016) 2 బంగారు పతకాలు, రియో ఒలింపిక్స్ (2016)లో రజతపతకం సాధించింది. భారతప్రభుత్వం నుండి 2015లో 'పద్మశ్రీ' పురస్కారం పొందింది.

2. పరిచ్ఛేదాన్ని పట్టికగా మార్చుట:

నమూనా: దిగువ నీయబడిన సమాచారాన్ని చదివి, పట్టికను పూర్తి చేయండి.

ఇంటి పెరటిలో తప్పని సరిగా పెంచాల్సిన ఔషధవృక్షం వేపచెట్టు. దీని శాస్త్రీయనామం "అజాదిరచ్టా ఇండికా" ఇది కల్పవృక్షం అనుటలో అతిశయోక్తి లేదు. ఎందుకంటారా వేప ఆకులు, బెరడులో లెక్కలేనన్ని ఔషధ గుణాలు గలిగిన పూత, వేప పుల్లలు ఇలా వేప చెట్టులోని ప్రతీభాగం ఉపయోగకరమైనదే కదా! వేపాకులు జెర్మీసైడ్‌గా పని చేయుట వలన వాటిని నీటిలో వేసి పొడిచేసి రోగులకు స్నానం చేయిస్తారు. తట్టు పోసిన వారికి చల్లదనం కొరకు వారి పడకపై వేపాకులు పరచి పడుకోబెడతారు. ఉగాది పచ్చడిలో వేప పూతను, లేత ఆకులను వేయడంలో వాటి ఔషధగుణాలే కారణం, ధాన్యం నిలువ చేయుటకు వేపాకులను ఉపయోగిస్తారు. స్నానం సబ్బుల తయారీలోను ఇవి ఉపయోగపడతాయి. వేపగింజలు పంటలకు ఎరువుగా వాడబడతాయి. పండ్లు తోముకోడానికి వేపపుల్లలు ఉపయోగిస్తారు. వేపచెట్టు గాలి ఆరోగ్యానికి ఎంతో మంచిది. వేపచెట్టు వస్తుసామాగ్రి తయారీకి మరియు ఎండిన చెట్టు వంట చెరకుగా ఉపయోగపడుతుంది.

మనకు కలిగే చుండ్రు, మొటిమలు, చర్మవ్యాధులు, జీర్ణకోశ వ్యాధులు, కడుపులోని క్రిమి దోషాలు, మలేరియా, డయాబిటిస్ వంటివి నయం చేయడంలోను, శరీరంలోని మలినాలను బయటకి పంపుటలోను వేపకు సాటిలేనిదని చెప్పవచ్చును.

ఇప్పుడు చెప్పండి వేపచెట్టు కల్ప వృక్షమే కదా!

విషయం	వివరణ
1. చెట్టు పేరు	
2 శాస్త్రీయ నామం	
3 ఈ పరిచ్ఛేదానికి మీరు పెట్టిన పేరు	
4 ఆకులు	
5 పూలు	
6 కాయలు / గింజలు	
7 కొమ్మలు / రెమ్మలు / బెరడు	
8 ఎండిన చెట్టు	
9 నయం చేసే జబ్బులు / బాధలు	

3. సమాచారాన్ని గ్రాఫ్‌గా మార్చుట.

నమూనా : కింది సమాచారం చదివి అడిగిన విధంగా కమ్మీరేఖా చిత్రం (బార్‌గ్రాఫ్)లో సూచించండి.

ఒక మొక్కల పెంపక కేంద్రంలోని వివిధ రకాల మొక్కల సంఖ్య ఈ విధంగా ఉన్నది. మల్లెమొక్కలు 70, జాజిమొక్కలు 50, మందార మొక్కలు 45, చామంతి మొక్కలు 80, ఈ వివరాలు ఆధారంగా చేసికొని ఒక 'కమ్మీరేఖా చిత్రం (బార్‌గ్రాఫ్) తయారు చేయండి.



పై ఉదాహరణలో Y అక్షంపై వేరే ప్రమాణంనుపయోగించి కమ్మీ చిత్రాన్ని గీయండి. దానిని పై కమ్మీచిత్రంతో పోల్చి చూడండి. (స్కేలు: 1 సెం.మీ. = 5 మొక్కలు)

అభ్యాసం :

కింది సమాచారం చదివి, అడిగిన విధంగా బార్‌గ్రాఫ్‌లో సూచించండి.

గత కొన్ని సంవత్సరాలుగా జనతా కంపెనీలో స్త్రీల ఉద్యోగ నియామకాలు ఈవిధంగా వున్నాయి. కంపెనీ ప్రారంభంలో ఎక్కువ మంది స్త్రీలు ఉద్యోగాలలో చేరకున్నా 2009-2010 సంవత్సరంలో 30-40% వరకు చేరారు. ఆ మరుసటి సంవత్సరం అది 30-30%గా అతిస్వల్ప ప్రమాణంలో తగ్గింది. అయితే 2011-2012లో ఎన్నో దరఖాస్తులు రాగా వాటిలో 31-60% స్త్రీలు మాత్రమే ఎంపికైనారు. ఆ తరువాతి సంవత్సరం ఈ శాతం 32-40% గా మారింది.

4. సమాచారాన్ని - పైచార్టుగా మార్చుట.

కింది సమాచారం చదివి, అడిగిన విధంగా పైచార్టు రూపంలో సూచించండి.

మీ ఊరి గ్రంథాలయంలో వివిధ భాషా పుస్తకాలు ఉన్నాయి. వాటి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

తెలుగు పుస్తకాలు 25%, హిందీ పుస్తకాలు 13% ఉన్నాయి. కన్నడ భాషలో 12% ఉండగా ఇంగ్లీషు పుస్తకాలు 20% ఉన్నాయి. సంస్కృత భాషా పుస్తకాలు 10%, మరాఠీ పుస్తకాలు 20% ఉన్నాయి.



అభ్యాసం :

అంతర్జాతీయ క్రికెట్ టెస్ట్‌మ్యాచ్ చూడడానికి -

బుధవారం నాడు 12% గురువారం 14%, శుక్రవారం 16%, శనివారం 25%, ఆదివారం 33% ప్రేక్షకులు హాజరయ్యారు. ఈ సమాచారాన్ని పై చార్టులో చూపండి.

5. వాస్తవాల జాబితా (ఫేక్ట్‌ఫైల్) ను - పరిచ్ఛేదంగా మార్చుట.

(చూడుము పుట సంఖ్య - 64)

6. అంశాలను విజ్ఞప్తిగా మార్చుట

(చూడుము పుట సంఖ్య - 31)

ఉపవాచకం

1. బారిష్టర్ పార్వతీశం-I

(శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రిగారు బారిస్టర్ పార్వతీశం అనే సుప్రసిద్ధ హాస్యగ్రంథం రచించారు. బారిష్టరు కోర్సు చదవడానికి ప్రయాణమైన పార్వతీశం పాట్లను రచయిత సున్నితమైన హాస్యలతో మనల్ని కడుపుబ్బ నవ్విస్తారు. చదవండి-ఆనందించండి.)

మొగలితుర్రు, నర్సాపురము, ఇంకా చుట్టుపట్ల గ్రామములు రెండు వ యాడు తప్ప ఎప్పుడూ పడవనైనా ఎక్కవలసిన అవసరము లేకపోయింది. ఇవ్వాళ పడవలో కూర్చుని వెళ్ళుతూ ఉంటే మహాసరదాగా వుంది. స్టీమరు మీద వెళ్ళడమన్నా యింతే కదా అనుకొన్నాను. రాత్రి దారిలో మినపరొట్టె, సాతాళించిన సెనగలూ, కొనుక్కుతింటూ ఇంగ్లండులో మినపరొట్టె ఉంటుందా, ఉండదా అని ఆలోచిస్తూ ఇంగ్లండు నుంచి తిరిగివచ్చిన తరువాత ఏవిధంగా దేశోప కారము చేద్దామా అనుకుంటూ, నిద్రపోయినాను. తెల్లవారే సరికి పడవ నిడదవోలు చేరింది.

మెళుకువ రావడముతోటే నేను తలపెట్టిన మహత్కార్యము జ్ఞప్తికి తెచ్చుకొని దీర్ఘ నిశ్వాసము విడిచి, పడవ దిగి, త్వరగా స్టేషనుకు వెళ్ళి అక్కడ నిలబడ్డ ఒక పెద్దమనిషిని సంబోధించి 'టిక్కెట్టు ఇవ్వండి త్వరగా' అన్నాను.

'ఏమిటూ హడావిడి! ఎక్కడికి? ఏ రైలుకు?' అని ఆరంభించాడు ఆయన.

నేనెక్కడికి వెళ్ళితే ఎందుకాయనకు? నా వ్యవహారమంతా ఆయన తోటి చెప్పితే గుట్టు బయలు పడుతుందనా?

'సరే అదంతా ఎందుకులెండి ఇప్పుడు --- టిక్కెట్టు త్వరగా ఇప్పించండి' అన్నాను.

నన్ను ఎగాదిగా చూసి 'టిక్కట్టు ఇచ్చే ఆయన ఇంకా రాలేదు. కాసేపు ఉండ' మన్నాడు.

కొంచంసేపైన తరవాత ఆయన వచ్చినట్లు తెలుసుకొని వెళ్ళి టిక్కట్టు ఇమ్మన్నాను. ఆయన కూడా 'ఎక్కడికి' అన్నాడు.

'చెపుతాలెండి, టిక్కట్టు ఇవ్వండి.'

'ఏమయ్యా ఈ అళవు! యావూరు పోతావయ్యా?''

'నే నేవూరు వెళ్ళితే. మీకెందుకు? టిక్కట్టు ఇవ్వండి.' దగ్గిర ఉన్న వాళ్ళందరూ నవ్వడము మొదలుపెట్టారు.

'ఇది ఎక్కడయ్యా! వట్టి నాటుపురము మాదిరి ఉండావే! నీవు ఎక్కడ పూడ్చేదీ చెప్పకపోతే టిక్కట్టు ఏష్టదా ఇచ్చేదయ్యా? పో అయ్యా, బుద్ధి లేదువలే ఉంది. వాండ్లంతా కాచుకున్నారు' అని కేకలు వేశాడు.

దగ్గిర ఉన్న వాళ్ళంతా నన్ను మందలించారు.

'ఈ రైలు చాలా దూరము వెడుతుందండి; చాలా చోట్ల ఆగుతుంది. అందుచేత ఏ వూరు మీరు వెళ్ళాలో చెపితే ఆ వూరుకి టిక్కెట్టు ఇస్తారు' అని ఒక పెద్దమనిషి నిమ్మళంగా హితోపదేశము చేశాడు.

ఆయన చెప్పిన మాటలు నాకు సబబుగానే ఉన్నట్లు తోచింది. అందుచేత టిక్కట్టు యిచ్చే ఆయనతోటి 'చెన్నపట్టణము వెళ్ళాలి' అని చెప్పాను.

అనేసరికి కండ్లెర్రజేసి 'ఎన్న అయ్యా యిది, ఈ పొద్దు ఎక్కడ వచ్చావయ్యా, వట్టి జంతువులవలె వుండావు! పో

అయ్యా! జల్దీ పో అయ్యా! వాళ్ళంతా కాసుకొన్నారు. పొమ్మంటే ఏందయ్యా అట్లా మూతిపెట్టి సూస్తావు? పట్నం బండి సాయంకాలం వరకూ రాదయ్యా, అప్పుడుదాకా యెక్కడనైనా పండుకొని తొంగు అయ్యా' అన్నాడు.

నా దగ్గర వాళ్ళంతా నన్నవతలకి తోసేశారు. పోనీ కొంచెము సమ్మర్ధము తగ్గిన తరువాత మళ్ళీ వెళ్ళి 'పట్నం బండి ఎప్పుడు వస్తుందండీ' అన్నాను.

'సాయంకాలము' అన్నాడు ఆయన.

'అలాగా, సాయంత్రము దాకా వుండాలా! నాకు తొందర పని ఉందే!'

అప్పుడు నా ముఖము కేసి చూచి 'ఓ! తిరిగి వస్తివా! తొందర పని ఉంటే నడిచిపో' అని కిటికీ తలుపు వేసుకొని చక్కాపోయినాడు మాష్టరు.

నా మీద కోపము చేత ఇలా అంటున్నాడేమో, ఈసారి నెమ్మదిగా అడిగి నిజము తెలుసుకొందామని ముందుకు వెళ్ళి ఎదురుగా నిలబడి మాట్లాడుదామని నోరు తెరచేసరికి ఆయనే, 'వస్తివా, పట్నం బండి ఎప్పుడు వచ్చేదీ తెలుసుకొనే దానికి వస్తివా! ఒకసారి చెపితే నీకు బుద్ధిలేదూ!' అని ఆరంభించాడు. నాకు కోపం వచ్చింది. నేను ఇంగ్లండు వెడుతున్నాను జాగ్రత్త!' అని చెపుదామనుకొన్నాను. కాని ఆయనను ఇంతకంటే ఏడిపిస్తే బాగుండదని తోచింది.

అక్కడనుంచి తిన్నగా దగ్గిర వున్న హోటలుకు వెళ్లి భోజనము చేసి కాస్సేపు పడుకున్నాను. లేచి ఒకసారి బజారు చూసి వద్దామని వెళ్ళాను. అక్కడ అటూయిటూ తిరుగుతూ ఉండగా అవసరమైన వస్తువులు రెండు మరిచిపోయినట్లు జ్ఞాపకము వచ్చింది. అవేమిటంటే, గదికి తాళమువేసుకోవడానికి చిన్న ఇత్తడి తాళమూ, స్నానాంతరము బట్టలు ఆరవేసుకోడానికి కొబ్బరిపీచు చేంతాడూ, బట్టలు తగిలించుకోవడానికి నాలుగు పెద్ద మేకులూ. ఈ మూడు వస్తువులూ కొనుక్కోని మళ్ళీ బసకు చేరుకుని సాయంకాలము కాగానే పెందలాడే భోజనము చేసి స్టేషనుకు వచ్చాను. టిక్కట్లు వేళ అయింది.

నేను వెళ్ళి చెన్నపట్నానికి టిక్కట్టు పుచ్చుకొన్నాను. ఇవతలకు వచ్చేటప్పటికి ఒక రైలు వచ్చింది. అక్కడ నౌకరు ఉంటే అతన్ని ఈ రైలు ఎక్కవచ్చునా? అన్నాను.

'మీరే ఊరు వెడతారు?' అన్నాడు వాడు.

'నీ కెందుకా ప్రశంస?' అని చక్కాపోయాను.

అక్కడొక పెద్దమనిషి ఉంటే, ఆయన్నే అడిగాను. 'ఈ రైలు ఎక్కవచ్చునా?'' అని. ఆయనా అదే ప్రశ్న వేశాడు. మీరే ఊరికి వెళ్ళతారని. నాకు ఒళ్ళుమండి మాట్లాడకుండా తిన్నగా స్టేషన్ మాష్టరుగారి దగ్గిరకు వెళ్ళి ఆయన్ని అడిగాను. ఆయన కూడా 'ఎక్కడికి వెళ్ళా' లన్నారు. టిక్కెట్టు ఇవ్వడానికంటే ఊరు పేరు చెపితేనే కాని ఇవ్వడానికి వీలులేదంటే చెప్పాను. టిక్కెట్టు కొన్న తరువాత కూడా వీళ్ళకీ పరీక్షలన్నీ ఎందుకూ? వీళ్ళ రోగము కుదురుద్దామని 'రాజమహేంద్రవరాని' కన్నాను. అయితే 'ఎక్కవచ్చు' నన్నాడు. ఎక్కాను. రైలు కదలబోతూ ఉన్నది. స్టేషన్ మాష్టరు అక్కడే ఉన్నాడు. రైలు కదలింది.

ఆయన్ని పిలిచి 'ఏమండోయ్', మీకు తగిన శాస్తి చేశాలెండి. నేను రాజమహేంద్రవరం వెళ్ళడం లేదు, చెన్నపట్నం వెళ్ళుతున్నాను' అని నవ్వుతూ చెప్పాను.

ఆయన ఆపాళంగా ఈలవేసి రైలు ఆపి నన్ను దిగమన్నాడు.

'త్వరగా దిగవయ్యా, ఆలస్యమవుతున్నది.'

'నేనెందుకు దిగాలి?'

'ఈ రైలు చెన్నపట్నం వెళ్ళదు, వేరే వస్తుంది. వట్టి ఫూల్‌లాగా ఉన్నావు దిగు.' అంటూ నన్ను రైల్లోంచి దింపేశాడు.

I చదవండి – ఆలోచించండి – రాయండి.

అ ఒక్కవాక్యంలో కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. పార్వతీశానికి మహాసరదా కలిగించిన విషయమేది?
2. 'టిక్కెట్టివ్వండి' అని అడిగిన పార్వతీశాన్ని చూసి దగ్గర ఉన్నవారు ఎందుకు నవ్వారు?
3. పెద్ద మనిషి పార్వతీశానికి ఏమని హితోపదేశం చేశాడు?
4. రైలు కదులుతుండగా పార్వతీశం స్టేషన్ మాష్టరుతో ఏమన్నాడు?

ఆ లఘుటీక రాయండి.

1. టిక్కట్ మాష్టరు పార్వతీశంపై విసుక్కోవటానికి కారణం ....
2. స్టేషన్ మాష్టరు పార్వతీశాన్ని రైల్లోంచి దింపిన విధం ....

N3B1EQ

II కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ ఖాళీలను పూరించండి.

1. ఒక పెద్ద మనిషి నిమ్మళంగా .... చేశాడు.
2. పట్నంబండి .... వరకు రాదయ్య.

పరిచ్ఛేదం : 'నే నేవూరు వెళ్ళితే మీకెందుకు'' .... నుంచి .... ''కిటకీ తలుపు వేసుకొని చక్కాపోయినాడు, మాష్టరు'' వరకు.

ఆ ఎవరు ఎవరితో పలికిరి.

1. ''టిక్కెట్టు ఏష్టదా ఇచ్చేదయ్యా?''
2. ''నాకు తొందర పని వుందే!''

ఇ స్వీయ వ్యక్తీ కరణ.

టిక్కెట్టు మాష్టరుతో పార్వతీశం గొడవపడిన విధం – మీ సొంత మాటల్లో రాయండి.

2. బారిష్టర్ పార్వతీశం-II

స్టేషన్ మాష్టరు కొంచెం చీవాట్లు వేసి పట్నంబండీ యింకొక పావుగంటలో వస్తుందని ధైర్యం చెప్పాడు. కొంచెమించుమించులో ఆయన చెప్పినట్టుగానే రైలు వచ్చింది. ఆగీ ఆగడంతో ఎదురుగుండా వున్న పెట్టెలోకి నా సామాను నెత్తిన పెట్టుకుని ఎక్కబోయాను. ఒక మెట్టు ఎక్కి రెండవ మెట్టు మీద కాలు వెయ్యబోతూ వుంటే వెనక నుంచి ఎవరో తోశారు. ఆ అదురుకు నా నెత్తిమీద ఉన్న సామాను, నా వెనుక ఉన్నవాడి నెత్తిమీద పడి అక్కడైన ఆగకుండా కింద ఎవళ్ళ కాళ్ళమీదో దభీమని పడ్డది. నేను సామాను కోసం వెనుక్కు తిరిగి చూశాను. ఆపళంగా చెయ్యిజారి నా వెనుక వాడి మీద నేనూ, నా వెనుకవాడు నా సహితంగా వాడి వెనుక వాళ్ళమీద విరుచుకు పడ్డాం. మేము కింద పడ్డామని జాలిపడడానికి బదులు మమ్మల్ని తిట్టడము మొదలుపెట్టారు. నేను లేచి నిమ్మళంగా సామాను సర్దుకుని ఎక్కడెక్కడ దెబ్బలు తగిలినవో సావకాశంగా రైలు ఎక్కిన తరువాత చూసుకోవచ్చునని ముందు రైలెక్కాను.

రైలెక్కి సామాను పైన పెట్టుకుంటున్నా. హఠాత్తుగా రైలు కదిలింది. నా ఎదుట బల్లమీద సుఖంగా అరమోడ్పు కన్నులతో ఆనందపరవశుడై ఉన్న కాపుమీద పడ్డాను. నేను మొఱ్ఱో అన్నాను. ఆనంద సమాధిలో నుంచి కొంచెం మెలుకువ తెచ్చుకుని, అతను ఆనందం ఇంత బరువెక్కిందేమో అని చూశాడు కాబోలు, కెవ్వుమని కేకవేసి ఏ పామో మీదపడితే తోసి వేసినట్టు నన్ను తోసివేశాడు.

పై బల్ల మీద నా పెట్టె దాని మీద మడత మంచమూ, చాపా, పెట్టి ఇవన్నీ కలిపి పైన గొలుసు కనబడితే, దానికీ వీట్లకీ, సాయంత్రము కొన్న చేంతాడు వేసి, లాగి, బిగించి కట్టాను. ఇంక సామాన్లకి ఫరవాలేదు గదా అని సుఖంగా కూర్చున్నాను.

ఇంతట్లోకే ఎందుకో రైలు ఆగింది. అంతా తొంగి చూశారు. ఇంకొక క్షణానికి గార్డులు ఇద్దరూ మా పెట్టెలోకి వచ్చి గొలుసు ఎవరు లాగారన్నారు.

ఎవ్వరూ మాట్లాడలేదు. పైకి చూశారు. నా సామానుకేసి చూపించి 'ఈ సామానెవరిది' అన్నారు. మళ్ళీ ఏమి పుట్టిమునిగిందో అని హడలుతో, 'నాదేను' అన్నాను.

'ఎందుకలా గొలుసుకు కట్టావు?'

'సామాను రైలు కుదుపునకు కింద పడిపోకుండాను, జాగ్రత్తగా ఉంటుందని అలా కట్టా'.

పెట్టలో వాళ్ళంతా ఊరికే నవ్వడమారంభించారు. గార్డు యాభైరూపాయలు జరిమానా ఇవ్వమన్నాడు. 'నా దగ్గిరేమీ లేదు, ఇచ్చుకోలేను. క్షమించమని ప్రాధేయపడ్డాను. ఆఖరుకు ఎలాగైతేనేమి నా సామాను గొలుసుని విప్పివేయమని వాళ్ళు చక్కాపోయినారు. వాళ్ళు వెళ్లిన తరువాత నా అపరాధమేమిటని పక్కన ఉన్న వాళ్ళ నడిగి తెలుసుకున్నాను. అక్కడ గొలు సుకాస్త లాగితే రైలు అలా ఆగుతుందా అనుకున్నాను. యింక కాసేపటికి రైలు మళ్ళీ ఆగింది. నా పెట్టెలో కొందరు దిగారు. మరికొందరెక్కారు. కాస్సేపు ఉండి మళ్ళీ బండి బయలుదేరింది. మన దేశ దారిద్ర్యం, ప్రజల అజ్ఞానం ఇత్యాది విషయాలను గురించి ఆలోచిస్తూ, ఈ దేశం ఎప్పుడు ఏరీతిని బాగుపడుతుందా అనుకుంటూ అయినా మంచికాలం సమీ పిస్తున్నది. నేను మూడునాలుగు సంవత్సరాలలో స్వదేశానికి తిరిగి వచ్చి ఈ కష్టాలను తొలగిస్తాననుకుంటూ నిద్రపోయాన ు. రకరకాల కలలు వచ్చినవి. కొంతసేపటికి మెళుకువ వచ్చింది.

నేను లఘుశంకకు వెళ్ళవలసి వచ్చింది. ఎక్కడికి వెళ్ళడానికీ, ఏమి చేయడానికి తోచింది కాదు. ఒక్క మాటు రైలు ఆపితే బాగుండును. దిగి వెళ్ళి రావచ్చుననుకొన్నాను. గొలుసు లాగుదామా అనుకొని, ఏభైరూపాయలు జరిమానా మాట జ్ఞాపకం వచ్చి తిన్నగా కిటికీ దగ్గరికి వెళ్ళి రైలు ఒక్క మాటు ఆపమని గార్డుగారిని కేకవేశాను. నా కేక ఎవళ్ళకీ వినపడలేదు. కడుపు ఉబ్బుకి వస్తోంది. ఏమి తోచింది కాదు. అక్కడ కూర్చున్న పెద్దమనిషి నొకాయన్ని పలకరించి, నా అవస్థ చెప్పి 'ఇలా కేక వేశాను. ఎవళ్ళూ పలకలేదు. ఎలాగు' అని అడిగాను. ఆయన నవ్వి 'అబ్బాయీ, వట్టి వెర్రివాడివలె వున్నావు. మనకు కావలసిన చోటల్లా రైలు ఆపరు, ఇక్కడే గది ఉంది. ఒకటికి వెళ్ళవలసి వచ్చినా, రెంటికి వెళ్ళవలసి వచ్చినా ఆ గదిలోనికి వెళ్ళవచ్చునని' చెప్పి గది చూపించారు.

వెళ్ళి, వచ్చి కూర్చుని కాస్సేపు కునికిపాట్లు పడేసరికి తెల్లవారింది.

ఉదయం తొమ్మిది గంటలయేసరికి బేసిన్‌బ్రిడ్జి అనే స్టేషన్‌లో దిగే జనాన్ని చూస్తూ నిలబడ్డాను. ఒకాయన నల్లదొర నా దగ్గరికి వచ్చి టిక్కట్టు ఇమ్మన్నాడు. ఇదేమిటిరా టిక్కట్టు తీసుకుపోతున్నాడు ఏమన్నా గట్టిగా అడగడానికైన – నల్లగా ఉన్నా – దొర కూడాను! నా గతి ఏమికాను? ఎలాగని హడలిపోయి వాడి వెంబడి పడ్డాను. నా టిక్కట్టు నాకిమ్మని ప్రాధేయపడ్డాను. వాడు నన్ను కోపంతో పొమ్మన్నాడు. వాడు పొమ్మన్నంత మాత్రన ఎంత అభిమానంగా ఉన్నా ఎలా

పోను? టిక్కట్టు వాడి చేతిలో చిక్కుపడిపోయింది. మీరెన్ని తిట్టినా పడతాను. నా టిక్కట్టు ఇవ్వరు, పైగా తిడతారేమండీ' అన్నాను. ఒళ్ళుమండి. రైలు కూసింది.

'గెట్ ఇన్ మాన్. యు హావ్ నో బ్లడీ ఫియర్. నో బడీ విల్ ఆస్క్ యు'' అని నన్ను రైలులోకి తోశారు.

రైలు కదిలింది – ఏమి చెయ్యడానికి గత్యంతరం తోచలేదు. స్టేషన్‌లో ఆ దొరలంతా కడుపులు పట్టుకుని నవ్వుకుంటున్నారు. నేను దిగుదామా అని ప్రయత్నం చేశాను – నాపక్కనున్నాయన – నన్ను ఆపి, ఏమిటి సంగతి అని అడిగాను. ఆయనతోటి చెప్పాను, ఇలా టిక్కట్టు తీసుకుపోయి ఇవ్వలేదని. అప్పుడాయన నవ్వి, వచ్చే స్టేషన్ చెన్నపట్నం. అక్కడే అంతా దిగిపోవడం – అందుకని అక్కడ కంగారుగా ఉంటుందని, టిక్కట్లన్నీ ఇక్కడే వసూలు చేస్తారు. నీకే భయమూ లేదని అభయమిచ్చాడు. గనుక వారికి లేని భయం నా కెందుకని ధైర్యం తెచ్చుకుని కూర్చున్నాను. ఇంతలోనే చెన్నపట్నం చేరాము.

I చదవండి – ఆలోచించండి – రాయండి.

అ ఒక్కవాక్యంలో కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. రైలు ఎందుకు ఆగింది?
2. రైలు పెట్టెలోని వాళ్ళు ఎందుకు నవ్వటం మొదలు పెట్టారు?
3. పార్వతీశం దగ్గర నుంచి టిక్కట్టు ఎవరు తీసుకున్నారు?

ఆ లఘుటీక రాయండి.

1. రైలెక్కబోతూ పార్వతీశం కిందపడ్డ విధం.
2. తన సామాను పైన పెడుతూ పార్వతీశం పడ్డ అవస్థ.
3. గార్డు యాభైరూపాయల జరిమానా విధించడానికి కారణం.

N3JHGO

II కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ కింది వాక్యాలను వరుస క్రమంలో రాయండి.

1. క్షమించమని ప్రాధేయపడ్డాను.
2. కడుపు ఉబ్బుకు వస్తోంది.
3. స్వదేశానికి తిరిగి వచ్చి ఈ కష్టాలు తొలగిస్తా.....
4. ఎందుకలా గొలుసుకు కట్టావు....

పరిచ్ఛేదం : ''ఇంతట్లోకే ఎందుకోరైలు ఆగింది'' ... నుంచి ... ''ఆగదిలోకి వెళ్ళవచ్చునని చెప్పిగది చూపించారు.'' వరకు

ఆ స్వీయ వ్యక్తీకరణ.

1. నీవు చేసిన రైలు ప్రయాణం అనుభవాలను వివరించు .
2. పార్వతీశం చేసిన రైలు ప్రయాణం పట్ల నీ స్పందన తెలియజేయి.

గ్రంథాలయ సమయం

- బారిష్టరు పార్వతీశం నవలను మొక్కపాటి వారు రెండు భాగాలుగా రచించారు. ఈ రెండు భాగాలను సేకరించి చదవండి.

3. మర్యాదరామన్న-I

మర్యాదరామన్న మర్యాదకు, విజ్ఞతకు పెట్టింది పేరు. ఎటువంటి వ్యాజ్యం తన దగ్గరికి వచ్చినా సునిశితబుద్ధి, తెలివి తేటలతో దానికి పరిష్కారం చెప్పడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. ఈ కథలు చదవండి. మీ బుద్ధికి పదును పెట్టండి.

ఒక ఊళ్ళో రంగమ్మ, గంగమ్మ అనే ఇద్దరు ఆడవాళ్ళు ప్రక్క ప్రక్కనే కాపురం వుంటున్నారు. రంగమ్మకు రెండు గేదెలున్నాయి. నెయ్యి వ్యాపారం చేస్తూ వుంది. గంగమ్మకు ఎనిమిది గేదెలు వున్నాయి. పాలు అమ్ముకుని జీవిస్తుంది ఆమె.

ఇలా వుండగా వొకసారి గంగమ్మ, రంగమ్మ దగ్గిర వీశెడు నెయ్యి అప్పు తీసుకున్నది. ఎన్ని రోజులు గడిచినా బాకీ తీర్చలేదు. గంగమ్మ గయ్యాళి గంప. ఎప్పుడూ ఇరుగుపొరుగు వాళ్ళతో నిష్కారణంగా తగువులాడుతూ వుంటుంది. ఆమె నోటికి భయపడి అందరూ ఏమి అనలేక ఊరుకునేవారు. ఇలాంటి మనిషిని నెయ్యి బాకీ తీర్చమని ఎలా అడిగేది భగవంతుడా అని బుద్ధిమంతురాలయిన రంగమ్మ లోలోపల మథనపడింది. చివరకు ఎలాగో ధైర్యం చేసి.

"గంగమ్మక్కా! నా దగ్గిర వీశెడు నెయ్యి అప్పు తీసుకున్నావు. నీవే బాకి తీరుస్తావని వూరుకున్నాను. కాని నెలలు గడిచిపోయినా నీవు ఆ ప్రస్తావనే చేయలేదు. మరిచిపోయావేమోనని ఇప్పుడు గుర్తుచేస్తున్నాను. ఇప్పుడు నాకు ఇంట్లో చుట్టాలొచ్చారు! నెయ్యి లేదు. అప్పు తీరుస్తావా అక్కా!" అని యెంతో మర్యాదగా అడిగింది.

అది విని గంగమ్మ గంగవెర్రులెత్తినట్లు బిగ్గరగా అరుస్తూ పోట్లాటకు దిగింది.

"ఆహా! చోద్యంగా వుందే! నేనేమిటి, నీ దగ్గర నెయ్యి అప్పు తీసుకోడమేమిటి? ఎనిమిది గేదెల పాడిచేస్తున్న నేను ముష్టి రెండు గేదెలతో బతుకుతున్న నీ దగ్గర వీశెడు నెయ్యి అప్పు తీసుకున్నానంటే ఎవరైనా నమ్మే విషయమేనా? ఎవరైనా వింటే నవ్విపోతారు!" అని గంగమ్మ రంగమ్మపై విరుచుకుపడింది.

ఆమెతో పోట్లాడే శక్తిలేక రంగమ్మ అప్పటికి ఏమీ మాట్లాడకుండా వూరుకుని తరువాత మర్యాదరామన్న దగ్గిరికి వెళ్ళి విషయమంతా వివరించి గంగమ్మపై ఫిర్యాదుచేసింది.

మర్యాదరామన్న ఒకనాడు గంగమ్మను న్యాయసభకు పిలిపించాడు. సభలో అడుగు పెడుతూనే గంగమ్మ గణాచారిలా చేతులు తిప్పుకుంటూ పెద్దగా అరవటం మొదలు పెట్టింది.

"అయ్యా! ఇదేనా మీ ధర్మం? నన్ను సభకు పిలిపించడం న్యాయమేనా? నాకు ఎనిమిది గేదెల పాడి వుంది. ఈ రంగమ్మ రెండు గేదెలు పెట్టుకుని బ్రతుకుతున్నది. అలాంటిది నేను ఆమె దగ్గరికి పోయి నెయ్యి అప్పు అడిగే అవసరం ఏముంటుంది? ఎవరినైనా చెప్పమనండి - ఇది నమ్మదగిన విషయమేనా? వినడానికే వింతగా లేదూ? నాపై గిట్టక ఆ రంగమ్మ లేనిపోని అబద్ధాలు కల్పించి, నా మీద ఫిర్యాదు చేసింది. మీరు ఆలోచించి రంగమ్మకు తగినవిధంగా బుద్ధి చెప్పండి" అని అన్నది గంగమ్మ.

మర్యాదరామన్న ఆమె మాటల ధోరణి గమనించాడు. ఆమె మాటలలోని కపటం గ్రహించాడు. తీర్పు వాయిదావేసి మరునాడు రంగమ్మను, గంగమ్మను ఇద్దర్నీ సభకు రావలసినదిగా ఆదేశించాడు.

మరునాడు రామన్న తన న్యాయస్థానం ముందు భాగమంతా అడుసుపోయించి అంత బురదగా వుండేటట్టు వేయించాడు. సభ ప్రారంభమయ్యే సమయానికి రంగమ్మ, గంగమ్మ వచ్చారు. వారిద్దరూ ఆ బురదలోనుంచే నడుస్తు న్యాయసభ దగ్గరికి రావలసి వుంది. అలాగే కడుక్కోడానికి రాజభటులచేత రెండు చెంబులతో నీళ్ళు తెప్పించాడు.

రంగమ్మ చెంబెడు నీళ్ళలో సగం నీళ్ళతోనే శుభ్రంగా బురద కడుక్కుని ఇంకా సగం నీళ్ళు మిగిల్చింది. కాని గంగమ్మ చెంబెడు నీళ్ళు ఖర్చు చేసినా కాళ్ళ బురద పోలేదు. మరో చెంబు నీళ్ళు అందించారు భటులు రామన్న ఆజ్ఞ ప్రకారం. అలా రెండు చెంబుల నీళ్ళు ఖర్చు చేసినా గంగమ్మ కాళ్ళకు బురద పూర్తిగా పోలేదు.

అది చూచి రామన్న గంగమ్మతో "ఏవమ్మా! రెండు చెంబులు నీళ్ళు ఇచ్చినా నీవు నీ కాళ్ళ బురద వదలించుకోలేక పోయావు. కాని రంగమ్మ సగం చెంబు నీళ్ళతోనే శుభ్రంగా బురద కడిగేసుకున్నది. దీన్ని బట్టి నీవు ఎంతటి దుబారా మనిషివో తెలిపోతున్నది. నీకు వుండటానికి ఎనిమిది గేదెలున్నా, నెయ్యి తీసి పొదుపు చేయడం నీకు చేతకాదు. దుబారాగా ఖర్చుచేయడం నీకు అలవాటు. నీవు రంగమ్మ దగ్గిర వీశెడు నెయ్యి అప్పు తీసుకున్నమాట వాస్తవమే! రంగమ్మకు రెండు గేదెలున్నా పొదుపుగా వాడుకునే మనిషి. కాబట్టి నీవు వెంటనే వీశెడు నెయ్యి రంగమ్మకు యివ్వు. లేకపోతే నీకు శిక్ష పడుతుంది" అని అన్నాడు.

గంగమ్మ మారుమాట చెప్పలేకపోయింది. చేసిన తప్పు మర్యాదగా వొప్పుకుని వీశెడు నెయ్యి రంగమ్మకు ఇచ్చివేసింది.

ఒక మనిషి ప్రవర్తన తెలుసుకోడానికి, నిజం రాబట్టడానికి మర్యాద రామన్న పన్నిన యుక్తికి అందరూ ఆశ్చర్యపోయారు. సభాసదులు జయజయ ధ్వానాలతో రామన్నను ప్రస్తుతించారు.

I చదవండి - ఆలోచించండి - రాయండి.

అ ఒక్కవాక్యంలో కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. గంగమ్మ స్వభావం ఎట్టిది?
2. రంగమ్మ ఎవరి వద్దకు వెళ్ళి ఫిర్యాదు చేసింది?
3. రామన్న రంగమ్మ, గంగమ్మలను ఏమని ఆదేశించాడు?

ఆ లఘుటీక రాయండి.

1. గంగమ్మకు గంగవెర్రులెత్తడానికి కారణం.
2. రామన్న వద్ద గంగమ్మ తనవాదన వినిపించిన విధం.
3. రామన్న వినిపించిన తీర్పు.

II కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ కింది వాక్యాలను వరుస క్రమంలో రాయండి.

1. రెండు చెంబులతో నీళ్ళు తెప్పించాడు.
2. మర్యాదరామన్న ఆమె మాటల ధోరణి గమనించాడు.
3. మీరు ఆలోచించి రంగమ్మకు తగిన విధంగా బుద్ధి చెప్పండి.
4. నన్ను సభకు పిలిపించడం న్యాయమేనా?

పరిచ్ఛేదం : "మర్యాదరామన్న ఒకనాడు" ... నుంచి ... "కాళ్ళకు బురద పూర్తిగా పోలేదు." వరకు

ఆ స్వీయ వ్యక్తీకరణ.

1. రామన్న గంగమ్మ మాటల్లోని కపటం ఎలా గ్రహించ గలిగిందీ మీ సొంత మాటల్లో రాయండి.
2. గంగమ్మ రామన్నను వేసిన ప్రశ్నలు.

4. మర్యాదరామన్న-II

అనగనగా ఒక గ్రామం. దాని పేరు రామాపురం. ఆ గ్రామంలో నలుగురు అన్నదమ్ములుండేవారు. వారు ప్రత్తి వ్యాపారము చేయుచుండెడివారు. వారు నలుగురు కలిసి ఒక పిల్లిని పెంచుకొనుచుండిరి. ఆ పిల్లి కాళ్ళను ఒక్కొక్కరు ఒక్కొక్కటి పంచుకొని, ఎవరి వాటా కాలికి వారు అలంకారం చేయుచుండిరి. కొంత కాలమిట్లు సాగిపోయింది. ఒకనాడు వారు నలుగురు కలిసి ఒక వింత తగవును తీసుకొని మర్యాద రామన్న వద్దకు వచ్చిరి.

వారిలో మొదటి ముగ్గురు రామన్నతో "అయ్యా! మేము పిల్లిని పెంచుకొనుచుంటిమి. మా చిన్నవాడి వాటాకు వచ్చిన కాలికి గాయమగుట వలన పిల్లి కుంటుచుండెను. అందువలన అతడు ఆ పిల్లి కాలికి మందు పూసి నూనెతో తడిపిన గుడ్డతో కట్టుకట్టెను. ఎలుకను వెంబడించుచు రాత్రి అది దీపము ప్రక్కగా వెళ్ళినది. అప్పుడు దాని కాలికున్న నూనెగుడ్డకు మంట అంటుకొనినది. ఆ పిల్లి భయముతో పరుగెత్తుచు ప్రత్తి కొట్టములోనికి ప్రవేశించినది. దూది అంతయు అంటుకొని తగులబడిపోయినది. మా చిన్నవాడి వాటా పిల్లి కాలివలన మాకు నష్టము జరిగినది. కావున మాకు నష్టపరిహారమును ఇప్పించవలసినది" అని ప్రాధేయపడిరి.

ఆ తరువాత చిన్నవాడు ముందుకు వచ్చి "అయ్యా! తగులబడిన ప్రత్తిలో నా వాటా కూడ ఉన్నది మరి దానికి నష్టపరిహారము ఎవరిచ్చెదరు? అయినా పిల్లి వెళ్ళినందుకు నేనేమి చేయగలను? నష్టపరిహారము ఇచ్చుటకు నా వద్ద అంత ధనము లేదు" అనెను. సభలోని వారందరికి పై ముగ్గురి వాదమే నచ్చినది. వారుకూడ చిన్నవాడే నష్టపరిహారమును చెల్లించవలెనని పలికిరి.

అంతట రామన్నగారు వారి మాటలను పాటించక, అయ్యా! ప్రత్తి కాలిపోవుట నిజమే, కాని మీ తమ్ముని వాటా పిల్లి కాలు వలన ప్రత్తి కాలిపోలేదు. మీ తమ్ముని వాటా పిల్లి కాలు గాయపడినది. ఆ కాలితో అది కొట్టమువరకు వెళ్ళజాలదు. మీ వాటాకు చెందిన మూడు కాళ్ళతోనే పిల్లి కొట్టములోనికి వెళ్ళినది. గనుక నష్టము మీ వాటా పిల్లి కాళ్ళ వలననే కలిగినది. అందువలన మీరే మీ తమ్మునికి నష్టపరిహారమును ఇయ్యవలయును." అని తీర్పు ఇచ్చెను. చేయునది లేక ముగ్గురు అన్నలు చిన్నవాడికి నష్టపరిహారమును చెల్లించిరి.

ఈ తీర్పు విని సభలోని వారందరు రామన్న తీర్పు తగిన తీర్పు అని పొగడిరి. చిన్నవాడు రామన్నగారికి తన కృతజ్ఞతను తెలుపుకొనెను.

I చదవండి – ఆలోచించండి – రాయండి.

అ ఒక్కవాక్యంలో కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. అన్నదమ్ములు ఏ వ్యాపారం చేసేవారు?
2. అన్నదమ్ములు పిల్లిని ఎలా పంచుకున్నారు?
3. చిన్నవాడు పిల్లి కాలుకు కట్టు కట్టుటకు కారణమేమి?
4. ప్రత్తి తగుల బడుటకు కారణమేమి?

ఆ లఘుటీక రాయండి.

1. అన్నలు ముగ్గురు రామన్నకు చేసిన ఫిర్యాదు.
2. చిన్నవాడు రామన్నకు తనవాదన వినిపించిన విధం.
3. రామన్న వినిపించిన తీర్పు.

II కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ కింది వాక్యాలలోని తప్పు, ఒప్పులను గుర్తించండి.

1. అన్నదమ్ములు టెంకాయల వ్యాపారం చేసేవారు. ( )
2. చిన్నవాడి వాటాకు వచ్చిన కాలికి గాయమయ్యింది. ( )
3. పిల్లి భయంతో పరుగెత్తింది. ( )
4. పిల్లి కాలు వలన మాకు ప్రమాదం జరిగింది. ( )

పరిచ్ఛేదం : "అనగనగా ఒక గ్రామం" ... నుంచి ... "అని ప్రాధేయపడిరి." వరకు

ఆ స్వీయ వ్యక్తీకరణ.

1. పిల్లిని అన్నదమ్ములు పంచుకొన్న విధం పట్ల నీ అభిప్రాయం.
2. అన్నలు రామన్న వద్దకు వెళ్ళటం ఎంత వరకు సబబు – మీ అభిప్రాయం తెలియజేయండి.

N43NJN



- మర్యాద రామన్న కథలను చదవండి.
- ఒకరితో ఒకరు చెప్పుకొని ఆనందించండి.
- ప్రదర్శనకు వీలుగా ఉన్న కథలను తరగతిలో పాఠశాల వార్షికోత్సవంలో ప్రదర్శించండి.
- గ్రంథాలయ సమయంలో చదివిన పుస్తకాల జాబితాను తయారు చేయండి.

5. తెనాలి రామకృష్ణుడు-I

తెనాలి రామలింగడు శ్రీ కృష్ణ దేవరాయల భువనవిజయ సభను అలంకరించిన అష్టదిగ్గజ కవులలో ఒకరు. ఆయన కథలు మీరు కొన్ని చదివే వుంటారు. ఇప్పుడు ఇవి చదవండి. ఆనందించండి.

ఒక రోజు శ్రీ కృష్ణదేవరాయలు తన ఆస్థానంలో కొలువు దీరారు. కొలువంతా మంత్రులతో, సేనాపతులతో, పండితులతో, కవులతో కిటకిటలాడు తోంది. రాయలు కవులవైపు చూచారు. వాళ్ళకేదైనా మంచి పరీక్ష పెట్టాలనుకున్నారు.

"నేను ఒక ప్రశ్న వేస్తాను. దీనికి ఎవరు జవాబు చెపుతారో వాళ్ళని కవుల్లోకెల్లా గొప్పవాడని గుర్తించి సభలో సన్మానము చేస్తాము." అన్నారు.

సన్మానం అనగానే కవులందరికీ ఆశపుట్టింది. అంతలోనే రాజుగారు ఎలాంటి ప్రశ్నవేస్తారో, దానికి జవాబు చెప్పలేక పోతే పరువెక్కడ పోతుందోనని భయం కూడా పట్టుకుంది.

రాయలవారు వేసిన ప్రశ్న ఇది :

ఒక వాక్యం ఉండాలి. అందులో అయిదు అక్షరాలు ఉండాలి. విడివిడిగా చూస్తే ప్రతి అక్షరానికి అర్థం ఉండాలి. అది

ఒకే అర్థమై ఉండాలి. ఆ అయిదు అక్షరాలు అయిదు భాషల్లో ఉండాలి. అన్ని అక్షరాలు కలిపి చదివితే మరొక అర్థం రావాలి. సభలోని కవులందరికీ మతిపోయినట్లయింది.

అయిదక్షరాలుంటే ప్రతి అక్షరానికి అర్థం ఉంటుందా? అది కూడా ఒకే అర్థం ఉంటుందా? ఇది చాలక అయిదు భాషలా? అంతా తికమకగా ఉంది. ఎవ్వరికీ ఏ ఆలోచనా తోచలేదు.

'సరే, ఈ రోజు చెప్పలేకుంటే వారం రోజుల తర్వాత చెప్పండి' అన్నారు రాయలవారు. కవులందరు రాత్రింబవళ్ళు దీన్ని గురించే ఆలోచించడం ప్రారంభించారు. ఎక్కడెక్కడి గ్రంథాలు తిరగేశారు. రకరకాల భాషా పండితుల్ని అడిగారు. తలబాదు కున్నారు. అయినా జవాబు చిక్కలేదు.

రామలింగడికి దీనికి జవాబు చెప్పి ఎలాగైనా సన్మానం కొట్టెయ్యాలని ఉంది. అతడు ప్రతి క్షణం దీన్నే ఆలోచించసాగాడు. ఎవరు ఏం మాట్లాడినా ప్రతి అక్షరాన్నీ పరిశీలించసాగాడు. రాత్రంతా అదే ఆలోచనలో ఉన్నాడు. ఇంట్లో అయితే ఎవరో ఒకరు వచ్చి ఆటంక పరుస్తారు. అందుకని పశువుల పాకలో మంచం వేసుకుని ఆలోచించసాగాడు.

ఒకరోజు అర్థరాత్రి కావచ్చింది. ఆ సమయంలో పాకలో ఒక ఆవు ఈనింది. ఆవుకు మంచి కోడెదూడ పుట్టింది. చూడముచ్చటగా ఉంది.

రామలింగడు సంతోషంతో తన బావమరిదికి చెపుదామనుకున్నాడు. 'బావా! బావా!' ఆవు ఈనిందిరా' అని కేక వేశాడు.

రామలింగడి బావమరిది మంచి నిద్రలో ఉన్నాడు. బావగారి అరుపులకు ఉన్నట్లుండి నిద్రలేచాడు. నిద్ర మత్తులోనే కళ్ళు నలుపుకొంటూ 'ఏ ఆవ్‌రా బావా' అన్నాడు. అంటే 'ఏ ఆవు ఈనిందిరా' అని అతని ఉద్దేశం.

రామలింగడికి ఈ వాక్యంలో ఏదో తమాషా ఉన్నట్లనిపించింది. అతనికి కావల్సింది ఇందులో దొరికిందనిపించింది. దానినే మననం చెయ్యసాగాడు.

ఇందులో అయిదు అక్షరాలున్నాయి. ఏ, ఆవ్, రా, బా, వా.

వీటిలో రామలింగడికి కావాల్సినవి ఉన్నాయి. ఇంకేం? రామలింగడు పొద్దున్నే నిద్రలేచాడు. తొందరగా కాలకృత్యాలు తీర్చుకున్నాడు. హుషారుగా కొలువుకు బయల్దేరాడు. కొలువు ఎప్పటి లాగే కిటకిటలాడుతోంది.

రాయలవారు కవులవైపు చూశారు. ''ఈ రోజైనా జవాబు చెపుతారా? అందరూ సిద్ధమా? అని ప్రశ్నించారు. కవులెవ్వరూ ఉలకలేదు, పలకలేదు. రామలింగడు మాత్రం లేచి నిలబడ్డాడు. నేను జవాబు చెపుతానన్నాడు.

'చమత్కారం చేసి సరిపెట్టడంగాదు, సరేనా?' అన్నారు రాయలవారు. ''లేదు రాజా! అయిదు భాషల్నీ చిలికి పారేశాను. అందులోంచి వెన్న తీశాను. చూస్తారుగా'' అన్నాడు. జనం అందరూ 'ఇతగాడు ఏం చమత్కారం చేస్తాడో' అని రామలింగడి వైపు చూస్తున్నారు.

రామలింగడు ''మీ ప్రశ్నకు 'ఏ ఆవ్ రా బావా' అనేది జవాబు'' అన్నాడు. అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. 'ఇందులో ఏముంది? ఆవులు, బావలు తప్ప' అని గొణుక్కోసాగారు.

రామలింగడు దానికి వివరణ ఇచ్చాడు.

'ఏ' కు మరాఠీ భాషలో 'రా' అని అర్థం.

'ఆవ్' కు హిందీ భాషలో 'రా' అని అర్థం.

'రా'కు తెలుగు భాషలో 'రా' అని అర్థం.

'బా'కు కన్నడ భాషలో 'రా' అని అర్థం.

'వా' కు తమిళ భాషలో 'రా' అని అర్థం.

"ఈ అయిదు అక్షరాలు అయిదు భాషలవి. అన్నిటికి 'రా' అనే అర్థం. అన్నిటినీ కలిపితే 'ఏ ఆవురా బావా' అని తెలుగులో అర్థం ఉండనే ఉంది."

రామలింగడి వివరణకు జనం ఆశ్చర్యంతో ఆనందంతో కొట్టిన చప్పట్లతో సభ మారుమోగింది. రాయల వారికి కూడా పట్టరాని సంతోషం కలిగింది. తన కొలువులో ఇంతటి కవి పండితులున్నారని ఆయన మురిసిపోయారు. రామలింగడిని ఘనంగా సన్మానించారు.

I చదవండి – ఆలోచించండి – రాయండి.

అ ఒక్కవాక్యంలో కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. రాయలు సభలో ఏమని పలికిరి?
2. రాయలు తన ప్రశ్నకు జవాబు చెప్పుటకు ఎన్ని రోజులు సమయమిచ్చెను?
3. రామలింగడు బావమరిదితో ఏమని పలికెను?
4. రామలింగడి బావమరిది పలికిన మాటల్లో ఏయే అక్షరాలున్నాయి?
5. రామలింగడి జవాబులు విని కవులు ఏమని గొణగసాగిరి?

ఆ లఘుటీక రాయండి.

1. రాయలవారి ప్రశ్న విన్న కవుల మనోభావాలు.
2. రామలింగడికి అతని బావమరిదికి మధ్య జరిగిన సంభాషణ.
3. 'ఏ ఆవ్ రా బావా' అను వాక్యాన్ని రామలింగడు వివరించిన విధము.

II కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ కింది వాక్యాలలోని తప్పు, ఒప్పులను గుర్తించండి.

1. ఒక వాక్యం ఉండాలి. అందులో ఐదు అక్షరాలుండాలి. ( )
2. నేను ఒక ప్రశ్న వేస్తాను. ( )
3. ఆ అయిదు అక్షరాలు ఏడు భాషల్లో ఉండాలి. ( )
4. రాయలు కవుల వైపు తిరిగారు. ( )

పరిచ్ఛేదం : "ఒక రోజు శ్రీ కృష్ణ దేవరాయలు" ... నుంచి ... "ఎవ్వరికీ ఏ ఆలోచనా తోచలేదు" వరకు

ఆ స్వీయవ్యక్తీకరణ

1. రాయల వారు కవులను అడిగిన ప్రశ్నపై మీ అభిప్రాయాన్ని వ్యక్త పరచండి.
2. కవుల భయానికి కారణం.

6. తెనాలి రామకృష్ణుడు-II

ఒకసారి భైరవభట్టు అనే కాశ్మీర బ్రాహ్మణుడు రాయలవారి ఆస్థానానికి విచ్చేశాడు. అతడు వేదవేదాంగాలను అభ్యసించిన వాడు. దేశదేశాలు పర్యటిస్తూ ఆయాదేశ ఆస్థానకవులను తన పాండిత్య ప్రతిభతో ఓడించి జయ పతాకాలను అందుకొనినవాడు.

రాయలవారి కొలువులో పండితులున్నారని తెలుసుకొని వాళ్లను శాస్త్ర వాదంలో ఓడించాలని వచ్చినాడు. అందుకే తన కోరికను మెల్లగా రాయలవారి ముందు పెట్టాడు. 'నాతో వాదించడానికి మీ ఆస్థాన పండితులు ముందుకు రానట్లయితే నాకు విజయ పత్రికను ఇప్పించండి' అని సగర్వంగా రాజుతో పలికాడు.

నిండు సభలో కలకలం మొదలైంది. గుసగుసలాడు కొంటున్న పండితుల మధ్య నుంచి రామకృష్ణుడు లేచాడు. భైరవిభట్టు వైపు, రాయలవారి వైపు, సభవైపూ కలయజూశాడు.

'శాస్త్ర వాదాలు జరగకుండా విజయ పత్రికను ఊరకనే ఇచ్చే ఆచారమేదీ ఈ సంస్థానానికి లేదు కాబట్టి వాదనకు నేను సిద్ధమే' అని ప్రకటించాడు. సభను రాజుగారు మరునాటికి వాయిదా వేశారు.

రామకృష్ణుడు భైరవభట్టు బస ఎక్కడో తెలుసుకున్నాడు. మారువేషం వేసుకొని చంకన మూటతో అతనిని దర్శించడానికి వెళ్లాడు.

'కాశ్మీరం నుంచి ఎవరో మహా పండితులు విచ్చేశారని తెలిసి ఆ మహానుభావుని దర్శించి తరించాలని వచ్చాను. ఆ పండితులు తమరేనా? తమ నామధేయం' అని నమస్కరించాడు.

'అయ్యా ఆ వచ్చిన పండితుడను నేనే. నా పేరు భైరవభట్టు. నీవెవరవు? ఆ చంకన మూటేమిటి? అని అడిగాడు పండితుడు.

'అయ్యా స్వామీ ముందు మీకు నమస్కరించ నివ్వండి' అంటూ మూటతో సహా సాష్టాంగ పడ్డాడు రామకృష్ణుడు.

గర్వంగా చెక్కిళ్ళు నిమురుకుంటూ, చేతి ఉంగరాలను, కడియాలను సరిచేసుకుంటూ 'నీవెవరవో చెప్పవయ్యా' అంటూ రెట్టించాడా పండితుడు.

'అయ్యా నాపేరు విశ్వకర్మ. కాలక్షేపంకోసం కావ్యాలు చదువుతుంటాను. తెనాలి రామకృష్ణులు మా గురువుగారు. వారినడిగి ఈ గ్రంథాన్ని తెచ్చుకున్నాను. ఈ మూట అదే' అన్నాడు. అతి వినయంగా.

'ఆ గ్రంథం పేరు?' అడిగాడు భైరవభట్టు.

'తిలకాష్ఠ మహిష బంధం' చెప్పాడు మారు వేషంలో వున్న రామకృష్ణుడు.

'ఆః.' అని నివ్వెరపోయాడా పండితుడు.

'ఔను. తిలకాష్ఠ మహిష బంధమే నన్నాశీర్వదించండి. సెలవు తీసుకుంటాను' అని అతనితో ఆశీర్వాదాలందుకొని వెళ్లిపోయాడు రామకృష్ణుడు.

ఆ కాశ్మీరు పండితునికి ఏమీ తోచలేదు. తిలకాష్ఠ మహిష బంధమనే గ్రంథమున్నట్లే తనకు తెలియదు. అంతే కాదు. ఒక సాధారణ విశ్వకర్మ ఇంతటి అసాధారణమైన కావ్యాన్ని కేవలం కాలక్షేపం కోసం చదువుతున్నాడంటే రాయలవారి

ఆస్థానంలో ఎంతటి ఉద్దండులైన కవులున్నారో' ఈ విశ్వకర్మకు గురువైన ఆ రామకృష్ణులు ఇంకెంతటి మహాపండితులో! అలాంటివారితో వాదనకు దిగితే నేను ఖచ్చితంగా పరాభవాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. ఎందుకొచ్చిన ఖర్మ? అనుకుంటూ ఆ రాత్రికి రాత్రే ఎవరికీ తెలియకుండా ఆ ఊరి నుంచి ఉడాయించేశాడు.

మరునాడు రాయలవారు సభతీర్చాడు. 'సమయం దాటిపోతున్నది భైరవభట్టును పిలిపించండి' అని భటులకు ఆదేశాలిచ్చాడు. వెళ్లబోతున్న భటులను ఆగమన్నాడు రామకృష్ణుడు.

'ఇంకెక్కడి భైరవభట్టు ఎప్పుడో ఎవరికీ తెలియకుండా ఇక్కడి నుంచి జారుకున్నాడు' అని సభాముఖంగా జరిగిందంతా చెప్పాడు.

అది విన్న రాయల వారికేగాక సభికులందరికీ తిలకాష్ఠ మహిష బంధమనే గ్రంథం గురించి తెలుసు కోవాలన్పించింది.

'ఆ గ్రంథం గురించి చెప్పు' అని అడిగారు రాయలవారు.

'ఇది గ్రంథం కాదు ప్రభూ. అసలు అలాంటి గ్రంథమేలేదు. తిలలంటే నువ్వులు. కాష్ఠమంటే కర్రలు. మహిషమంటే దున్నపోతు. బంధం అంటే కట్టే తాడు. తిలకాష్ఠ మహిష బంధమంటే నువ్వుల కట్టెకు దున్నపోతును కట్టే తాడు. ఈ మాటలో ఉండేది అదే' అని విన్నవించాడు రామకృష్ణుడు.

రాయలవారితో సహా సభలోని వాళ్లందరూ పెల్లుబికి వస్తున్న నవ్వును ఆపుకోలేక పోయారు. ముఖ్యంగా అంతటి పండితుడు ఇంత చిన్న విషయానికి భయపడి పారిపోవడం గుర్తొచ్చి తెరలు తెరలుగా వస్తున్న నవ్వుకు ఆనకట్ట వెయ్యలేక పోయారు.

I చదవండి – ఆలోచించండి – రాయండి.

అ ఒక్కవాక్యంలో కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. భైరవభట్టు రాయల ఆస్థానానికి ఎందుకు వచ్చాడు?
2. భైరవభట్టు రాయల వారితో ఏమన్నాడు?
3. విశ్వకర్మ తన చేతిలోని గ్రంథం పేరు ఏమని తెలిపాడు?

ఆ లఘుటీక రాయండి.

1. సభలో కలకలం రేగటానికి కారణం.
2. తిలకాష్ఠ మహిష బంధం.
3. భైరవభట్టు పలాయనం.

II కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ ఎవరు, ఎవరితో అన్నారు.

1. "ఆ పండితులు తమరేనా?"
2. "ఆ చంకన మూటేమిటి?"
3. "సెలవు తీసుకుంటున్నాను."
4. "నీవెవరవో చెప్పవయ్యా"

పరిచ్ఛేదం : "రామకృష్ణుడు భైరవభట్టు" ... నుంచి ... "ఆ! అని నివ్వెర పోయాడా పండితుడు" వరకు

ఆ. స్వీయవ్యక్తీకరణ.

1. రామకృష్ణుడు భైరవభట్టును నివ్వెర పరచిన విధం నీ సొంత మాటల్లో రాయండి.
2. విశ్వకర్మకు, భైరవభట్టుకు మధ్య జరిగిన సంభాషణ మీ సొంత మాటల్లో రాయండి.

వ్యాకరణము

భాషాభాగాలు : (1) నామ వాచకము (2) సర్వనామము (3) విశేషణము (4) క్రియ (5) అవ్యయము.
ఈ ఐదింటిని భాషాభాగములు అంటారు.

నామవాచకము : పేర్లను తెలియజేయునది. ఉదా., కమల

సర్వనామము : నామవాచకమునకు, బదులుగా వాడబడునది. ఉదా., అతడు, ఆమె, వాడు

విశేషణము: నామవాచకములోని విశేష విషయమును (రంగు, స్వభావము, గుణము) తెలియజేయునది. ఉదా., తెల్లని గుఱ్ఱము.

క్రియ : పనిని తెలియజేయునది. ఉదా., చదువుచున్నాడు

అవ్యయము : లింగ, వచన, విభక్తులు లేని పదములు. ఉదా., ఆహా! ఔరా! అక్కటా!

వాక్యరకములు : వాక్యములు మూడు విధములు.

సామాన్యవాక్యము : ఒకే సమాపక క్రియ కలిగినవాక్యము. ఉదా., రఘు బడికి వెళ్ళెను.

సంశ్లిష్ట వాక్యము : అసమాపక క్రియతో కూడి యుండు వాక్యము. ఉదా., రఘు బడికి వెళ్లి, పరీక్ష రాసెను.

సంయుక్త వాక్యము : రెండు లేక అంతకంటే ఎక్కువ వాక్యములు కలిసి ఏక వాక్యముగా ఏర్పడుట. ఉదా., శాంతి బాగా చదివింది అందువలన మంచి మార్కులు పొందినది.

విభక్తి ప్రత్యయాలు :

1. ప్రథమా విభక్తి – డు, ము, వు, లు
2. ద్వితీయా విభక్తి – నిన్, నున్, లన్, కూర్చి, గురించి.
3. తృతీయావిభక్తి – చేతన్, చేన్, తోడన్, తోన్
4. చతుర్థీ విభక్తి – కొఱకున్, కై
5. పంచమీ విభక్తి – వలనన్, కంటెన్, పట్టి
6. షష్ఠీ విభక్తి – కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్
7. సప్తమీ విభక్తి – అందున్, నన్
8. సంబోధన ప్రథమా విభక్తి – ఓ, ఓయి, ఓరి, ఓసి

వాక్యాంగములు : కర్త, కర్మ, క్రియ అనునవి వాక్యాంగములు.

కర్త – పనిచేయువాడు. నేను పూలను కోశాను.

కర్మ – ఫలితము పొందువాడు – ఎవరిని, దేనిని అని ప్రశ్నించగా వచ్చు సమాధానము కర్మ. ఉదా., వాడు పాట పాడెను.

క్రియ – పనిని తెలుపునది. ఉదా., అతడు వ్రాయుచున్నాడు.

తెలుగు సంధులు

ఉకారసంధి: ఉత్తునకు అచ్చు పరమగునపుడు సంధి నిత్యము. ఉదా., నీవు + ఎక్కడ = నీవెక్కడ

ఇకారసంధి: ఇత్తునకు అచ్చు పరమగునపుడు సంధి వైకల్పికము. వైకల్పికము అనగా సంధి జరుగవచ్చు, జరుగకపోవచ్చు. రెండు అచ్చుల మధ్య సంధి జరుగునపుడు 'య్' ఆగమముగా వచ్చును. ఉదా., ఏమి + అంటివి – ఏమంటివి, ఏమియంటివి.

అకారసంధి : అత్తునకు సంధి బహుళము. బహుళము అనగా నిత్య, నిషేధ, వైకల్పిక, అన్యకార్యము. ఉదా., రామ + అయ్య = రామయ్య; అమ్మ + ఇచ్చెను = అమ్మయిచ్చెను; మేన + అత్త = మేనత్త, మేనయత్త; ఒక + ఒక = ఒకొనొక.

గసడదవాదేశ సంధి : ప్రథమ మీది పరుషములకు గ–స–డ–ద–వ–లు బహుళముగానగు. ఉదా., వారు + పోరు = వారువోరు

సరళాదేశము : ద్రుత ప్రకృతికము మీది పరుషములకు సరళములగును. ఉదా., పూచెను + కలువలు = పూచెనుగలువలు

ఆమ్రేడిత సంధి : (చూడుము పుటసంఖ్య – 20)

త్రిక సంధి : (చూడుము పుట సంఖ్య – 31)

సంస్కృతసంధులు

సవర్ణదీర్ఘసంధి : అ, ఇ, ఉ, ఋ లకు అవియే అచ్చులు పరమైన దీర్ఘము ఏకాదేశ మగును. ఉదా., రామ + ఆలయము = రామాలయము.

గుణసంధి : అకారమునకు ఇ, ఉ, ఋ లు పరమైన క్రమముగా ఏ, ఓ, అర్ లు ఆదేశమగును. ఉదా., దేవ + ఇంద్రుడు = దేవేంద్రుడు.

వృద్ధి సంధి : (చూడుము పుట సంఖ్య–8)

యణాదేశ సంధి : (చూడుము పుట సంఖ్య–14)

సమాసములు

సమర్థ వంతమైన పదములు కలిసి ఏకపదమగుట సమాసము.

తత్పురుషసమాసము – ఇది ఉత్తరపద ప్రాధాన్యతకలది.

ప్రథమాతత్పురుష – కడ కన్ను – కంటి యొక్క కడ

ద్వితీయాతత్పురుష – కృష్ణాశ్రితుడు – కృష్ణుని ఆశ్రయించినవాడు.

తృతీయాతత్పురుష – రాజపూజితుడు – రాజు చేత పూజితుడు

చతుర్థీతత్పురుష – గ్రంథాలయము – గ్రంథముల కొఱకు ఆలయం

పంచమీతత్పురుష – చోరభయము – చోరుని వలన భయము.

షష్ఠీతత్పురుష – తండ్రిమాట – తండ్రి యొక్క మాట

సప్తమీతత్పురుష – శాస్త్రనిపుణుడు – శాస్త్రము నందునిపుణుడు

నఞ్ తత్పురుష – అసత్యము – సత్యము కానిది.

కర్మధారయసమాసము : విశేషణ, విశేష్యముతోడి సమాసము – వృద్ధకపోతము–వృద్ధమైన కపోతము. విశేషణము ఇందు మొదటి పదముగా ఉన్నది కనుక విశేషణ పూర్వపద కర్మధారయం.

కపోత వృద్ధము – వృద్ధమైన కపోతము – ఇందు విశేషణము రెండవ పదముగా వున్నది కనుక విశేషణ ఉత్తరపద కర్మధారయము.

మృదుమధురము – మృదువైనది, మధురమైనది ఈ సమాసమందు రెండు పదాలు విశేషణములు కనుక విశేషణ ఉభయపద కర్మధారయము.

ద్విగుసమాసము : సంఖ్యాపూర్వకమైన కర్మధారయమే ద్విగువు. త్రిలోకములు – మూడు లోకములు.

ద్వంద్వసమాసము: ఉభయపద ప్రాధాన్యత కలది ద్వంద్వసమాసము. తల్లిదండ్రులు – తల్లియును, తండ్రియును.

బహువ్రీహిసమాసము : (చూడుము పుట సంఖ్య–51)

రూపకసమాసము : దీనినే అవధారణా పూర్వపద కర్మధారయ సమాసము అందురు. ఉదా., కవికోకిల – కవియనెడి కోకిల

అలంకారములు

శబ్దాలంకారములు :

1) **వృత్త్యనుప్రాస :** ఒకటి, రెండక్షరములు పలుమార్లు ఆ వృత్తి అగుట. ఉదా., ఆనంద, బిందు బృందస్యందన. బిందు పూర్వక'ద'కారము పలుమార్లు ఆవృతమైనది – సుందరము.

2) **ఛేకాను ప్రాస :** రెండు హల్లులు అవ్యవధానముగా వచ్చుట – అర్థములో మార్పు వుండుట. ఉదా., నీ సుందర దరహాసము – దర, దర అను పదములు వెంట వెంటనే వచ్చినవి కాని సుందర – అనునపుడు అందమైన అని, దరహాసము అనగా చిరునవ్వు అని అర్థము చెప్పుకొందుము.

లాటానుప్రాస : తాత్పర్య భేదముతో శబ్దార్థములు పునరుక్తములగుట.

కమలాక్షు నర్చించు కరములు కరములు

ఇందు కరములు అన్న పదం రెండుసార్లు కవి ప్రయోగించారు. కరములు అనగా చేతులు. విష్ణువును పూజించునట్టి చేతులే సార్థకత కలిగిన చేతులు అని తాత్పర్యమునందు భేదమును తెలుపు చున్నాము.

అంత్యానుప్రాస : పదాంతములందుకాని, పాదాంతము లందు కాని, వాక్యాంతములందు కాని వర్ణములు పునరుక్తములగుట.

ఉదా., విశ్వదాభిరామ వినురవేమ

ఇందు పదాంతములందు రామ, వేమ అను ప్రాస పదములు ఉపయోగింపబడినవి.

యమకము : (చూడుము పుట సంఖ్య–63)

ఉపమాలంకారము, ఉత్ప్రేక్షాలంకారము : (చూడుము పుటసంఖ్య–68)

రూపకారంకారము : (చూడుము పుటసంఖ్య–76)

ఛందస్సు

అక్షరములు లఘువులు, గురువులు అని ముఖ్యంగా రెండు విధములు. ఒక మాత్రాకాలములో ఉచ్చరింప బడునవి లఘువులు, రెండు మాత్రల కాలములో ఉచ్చరింప బడునవి గురువులు హ్రస్వాక్షరములన్నియు లఘువులు. ఈ క్రిందివి గురువులు.

1) దీర్ఘాక్షరములు (ఆ, ఈ, కా మొ॥) — U U U

2) ఐ, ఔ లు–వానితో కూడిన హల్లులు (కై క, ఔరసుడు, కౌరవులు) — U I U I I I

3) నిండుసున్నతో కూడిన అక్షరములు (అందము, గంప) — U I I U I

4) విసర్గతో కూడిన అక్షరములు (దుఃఖము, తపఃఫలము) — U I I I U I I I

5) పొల్లు హల్లులతో కూడిన అక్షరములు (నిన్, లన్, చేతన్) — U U U U

6) ద్విత్వ, సంయుక్తాక్షరములకు ముందున్న అక్షరములు (అత్త, పద్మము) — U I U I I

(లఘువునకు I, గరువునకు U గుర్తులు)

గణము అనగా సమూహము, కొన్ని అక్షరములు కలిసి గణము అగును.

య గణము - IUU	**మ** గణము - UUU	**త** గణము - UUI	**ర** గణము - UIU
జ గణము - IUI	**భ** గణము - UII	**న** గణము - III	**స** గణము - IIU

I U U U I U I I I U

య మా తా రా జ బా న స ల గం – దీనిని గుర్తించుము. ఏగణమునందలి గురు, లఘువులు కావలెనో ఆ అక్షరము నుండి మూడక్షరములు గ్రహించినచో ఆ గణము తెలియును. ఉదా., భగణము కావలెనన్న భానస వరకు – గుర్తించిన గణములు చూసిన UII అని తెలియును.

యతి : పద్యపాదము మొదటి అక్షరమునకు 'యతి' అనిపేరు. పాదాది అక్షరముకాని దానితో మైత్రికల అక్షరముకాని నియమిత స్థలమున పునరుక్తమగుటయే యతిమైత్రి.

ప్రాస : పాద ద్వితీయాక్షరము ప్రాసము. ఇందు హల్లు ప్రధానము. పద్య మొదటి పాదము నందు ద్వితీయాక్షరము ఏ హల్లు వుండునో మిగిలిన మూడు పాదములందు అదే హల్లు వుండుట ప్రాస.

1. ఉత్పలమాల : గణములు : భ, ర, న, భ, భ, ర, వ.

యతి : 1 – 10 అక్షరములకు చెల్లును ప్రాసనియమం కలదు.

	U I I	U I U	I I I	U i I	U I I	U I U	I U
ఉదా.,	తమ్ముని	గూడి పు	ణ్య గుణ	ధాముడు	రాముడు	వచ్చిమా	ల్యవం
	భ	ర	న	భ	భ	ర	వ

2. చంపకమాల – గణములు : న, జ, భ, జ, జ, జ, ర.

యతి 1 –11 అక్షరములకు చెల్లును. ప్రాస నియమం కలదు.

	I I I	I U I	U I I	I U I	I U I	I U I	I U
ఉదా.	పాదవె	డునుప్పు	లేకరు	చిప్పుట్ట	గనేర్చు	నటయ్యు	భాస్కరా
	న	జ	భ	జ	జ	జ	ర

శార్దులము, మత్తేభము : (చూడుము పుట సంఖ్య–41), **కందము :** (చూడుము పుట సంఖ్య–8)









- पाठ्यपुस्तक मंडळाची वैशिष्ट्यपूर्ण पाठ्येत्तर प्रकाशने.
- नामवंत लेखक, कवी, विचारवंत यांच्या साहित्याचा समावेश.
- शालेय स्तरावर पूरक वाचनासाठी उपयुक्त.

पुस्तक मागणीसाठी www.ebalbharati.in, www.balbharati.in संकेत स्थळावर भेट द्या.

साहित्य पाठ्यपुस्तक मंडळाच्या विभागीय भांडारांमध्ये विक्रीसाठी उपलब्ध आहे.

ebalbharati

विभागीय भांडारे संपर्क क्रमांक : पुणे - ☎ २५६५९४६५, कोल्हापूर- ☎ २४६८५७६, मुंबई (गोरेगाव) - ☎ २८७७१८४२, पनवेल - ☎ २७४६२६४६५, नाशिक - ☎ २३९१५११, औरंगाबाद - ☎ २३३२१७१, नागपूर - ☎ २५४७७१६/२५२३०७८, लातूर - ☎ २२०९३०, अमरावती - ☎ २५३०९६५

మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411 004.

तेलुगु कुमारभारती इयत्ता ९ वी (तेलुगु माध्यम)

₹ 65.00